బుధవారం 31-7-2024

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16 సంచిక: 318

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'

మను.. చరిత్రను లిఖించింది

12 లో

పారిస్ ఒలింపిక్స్‌లో మంగళవారం భారత మహిళా షూటర్ మనూ భాకర్ కొత్త చరిత్ర సృష్టించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత సాధించింది. 'పారిస్' గేమ్స్‌లో ఇప్పటికే మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం గెలిచిన మనూ భాకర్... 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో మనూ–సరబ్‌జోత్ ద్వయం 16–10 పాయింట్ల తేడాతో జిన్ ఓయె–లీ వన్‌హో (దక్షిణ కొరియా) జోడీపై గెలిచింది. రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్–కాంస్యం; 2012 లండన్–రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో–రజతం; 2020 టోక్యో–కాంస్యం) తర్వాత రెండు ఒలింపిక్ పతకాలు గెలిచిన మూడో భారత ప్లేయర్‌గా మనూ భాకర్ గుర్తింపు పొందింది. మంగళవారం భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఇద్దరు భారత బాక్సర్లు అమిత్ పంఘాల్, జైస్మిన్ లంబోరియా తమ తొలి బౌట్‌లలోనే ఓడిపోయారు. బ్యాడ్మింటన్‌లో సాత్విక్ –చిరాగ్ జోడీ రెండో విజయంతో గ్రూప్ 'టాపర్'గా నిలిచింది. ఐర్లాండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు 2–0తో గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరువైంది.


మువ్వన్నెల పతాకంతో మనూ భాకర్, సరబ్‌జోత్ సింగ్

ముంచెత్తిన మృత్యువు

నడిరాత్రి వేళ కేరళలో జలప్రళయం.. విరిగిపడ్డ కొండచరియలు

బురదలో కొట్టుకుపోయిన ఊళ్లు.. వందల్లో మృతులు!

123

మృతదేహాల వెలికితీత

- నిద్రలోనే బురద, మట్టిదిబ్బల కింద పలువురి కన్నుమూత
- జాడతెలియని 600 మంది వలస కూలీలు.. శవాలదిబ్బగా మారిన మెప్పడి ప్రాంతం
- ఊడ్చుకుపోయిన ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ గ్రామాలు
- హుటాహుటిన సహాయ చర్యలు
- ప్రధాని మోదీ దిగ్భ్రాంతి


ఓ గ్రామాన్ని ముంచెత్తిన బురద (ఇన్‌సెట్) చిన్నారితో కలిసి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్న మహిళ

ప్రకృతి ప్రకోపించింది. కొండచరియల రూపంలో విరిగిపడింది. వరద ప్రవాహమై విరుచుకుపడింది. ఊళ్లకు ఊళ్లనే ముంచెత్తింది. తెల్లవారుజామున ఆదమరచి నిద్రిస్తున్న అమాయకులను అమాంతంగా బలి తీసుకుంది. కేరళలోని వయనాడ్ జిల్లా కొండ ప్రాంతాల్లో సోమవారం అర్ధరాత్రి దాటాక జరిగిన మాటలకందని విషాదమిది. ఈ ఘోర కలికి బలైన వారి సంఖ్య ఇప్పటికే 123 దాటింది. బురద, శిథిలాల కింద కూరుకుపోయి ఇంకా వందలాది మంది మరణించి ఉంటారన్న ఆందోళన వ్యక్తమవుతోంది. రోడ్లు తదితరాలన్నీ పూర్తిగా ధ్వంసం కావడంతో కేంద్ర, రాష్ట్ర సహాయక బృందాలు, సైన్యం బాధిత ప్రాంతాలకు వెళ్లలేకపోతున్నాయి.

6 లో

'ఆరోగ్యశ్రీ' ఆపేస్తాం..!

15లోగా పెండింగ్ బిల్లులు చెల్లించకుంటే సేవలు నిలిపివేస్తాం

ప్రభుత్వానికి ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ లేఖ

- రూ.1,600 కోట్లకుపైగా బకాయిలు ఆస్పత్రులకు చెల్లించకుండా పెండింగ్‌లో..
- పేదల ఆరోగ్యంతో కూటమి ప్రభుత్వం చెలగాటం



సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ) పెండింగ్ బిల్లులను ఆగస్టు 15వ తేదీలోగా చెల్లించకుంటే వైద్య సేవలను నిలిపివేస్తామని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆశా) స్పష్టం చేసింది. ఈ మేరకు వైద్య సేవ ట్రస్ట్ సీఈవోకు మంగళవారం లేఖ రాసింది. తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వైద్య సేవలు నిలిపివేయడం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని పేర్కొంది. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ బిల్లులను చెల్లించడంతో పాటు పథకం ఆర్థిక నిర్వహణపై దృష్టి పెట్టాలని కోరింది. పెండింగ్ బిల్లుల అంశాన్ని వైద్య శాఖమంత్రి దృష్టికి తెచ్చినప్పటికీ తమకు ఎలాంటి హామీ లభించలేదని తెలిపింది.

బకాయిలు ఎప్పటికప్పుడు క్లియర్ చేసిన వైఎస్ జగన్

ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు బిల్లులు రాకపోవడంతో రోగులకు చికిత్సలు అందని పరిస్థితి నెలకొందని, కేంద్ర ప్రభుత్వ పథకంతో

మిగతా 3వ పేజీలో ▶

నాలుగు నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు నేడు ఆర్డినెన్స్!

- ఆన్‌లైన్‌లో ఆమోదం తెలిపిన మంత్రులు.. గవర్నర్‌కు పంపిన సర్కారు.. ఆమోదించగానే ఆర్డినెన్స్ జారీ
- అంతకుముందు.. అసెంబ్లీ, 'మండలి' ప్రొరోగ్
- సమావేశాలు జరిగినా పూర్తి బడ్జెట్ పెట్టకుండా ప్రభుత్వం ఎగనామం
- బడ్జెట్ పెడితే డొల్లతనం బయటపడుతుందని భయం
- హామీల అమలును ఎగ్గొట్టేందుకే ఆర్డినెన్స్ ఎత్తుగడ

2 లో

'ఏసీ' భారం.. జనరల్ 'ఘోరం'

అధిక రాబడే ధ్యేయం.. సామాన్యుల గోడు పట్టని రైల్వే శాఖ


హౌరా ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలో కిక్కిరిసిన ప్రయాణికులు

- వందే భారత్ రైళ్లు, ఏసీ కోచ్‌లకే ప్రాధాన్యత
- స్లీపర్, జనరల్ కోచ్‌లను పట్టించుకోని వైనం
- స్లీపర్ కోచ్‌లో రిజర్వేషన్ దొరకడం గగనం
- జనరల్ కోచ్‌లో నిలబడేందుకూ చోటుండదు
- సీట్లకంటే రెండింతలు ప్రయాణికులతో కిటకిట
- ఏసీ కోచ్‌ల ఉత్పత్తి మూడింతలు పెరుగుదల
- స్లీపర్, జనరల్ కోచ్‌ల ఉత్పత్తిలో 50 శాతం కోత
- రైల్వే శాఖ తీరుపై సర్వత్రా ఆగ్రహం



2 లో

కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి

గిరిజన పథకాలకు నిధులు సాధించే ప్రణాళికలతో రండి

- గిరిజన సంక్షేమ శాఖపై సమీక్షలో అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- ఫీడర్ అంబులెన్స్‌లు తిరిగి ప్రవేశపెట్టాలి
- గర్భిణి వసతి గృహాలు మళ్లీ ప్రారంభించాలి
- వచ్చే నెలలో అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని ఘనంగా జరపాలి



సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం గిరిజనుల కోసం అమలు చేసే పథకాలపై కసరత్తు చేసి రాష్ట్రానికి నిధులు సాధించే ప్రణాళికలతో రావాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం గిరిజన సంక్షేమ శాఖ సమీక్షలో గిరిజనులకు విద్యా, వైద్యం, సంక్షేమ పథకాల అమలుపై సీఎం సమీక్షించారు. గిరిజనులు సాగుచేస్తున్న భూములు, ఆయా పంటలకు వస్తున్న ఆదాయం, గిరిజన ఉత్పత్తులు..

మిగతా 2వ పేజీలో ▶





గ్లోబల్ ఇన్వెస్టర్ల చూపు..

భారత్ వైపు!

వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేలా భారత్ పరుగులు తీస్తోంది. దీంతో ప్రపంచ స్థాయి దిగ్గజ ఇన్వెస్టర్లందరూ భారత్‌లో పెట్టుబడులకు ఉవ్విళ్లూరుతున్నారు. భారత కార్పొరేట్లు ఈ 'వికసిత్ భారత్' ప్రస్థానంలో సువర్ణావకాశాన్ని అందిపుచ్చుకోండి. భారత పారిశ్రామిక రంగానికి ఇదో సువర్ణావకాశం, దీన్ని మనం వదులుకోకూడదు.

– భారత పరిశ్రమల సమాఖ్య సదస్సులో ప్రధాని మోదీ

13 లో

'పుట్టా' పాపం.. 'సీమ'కు శాపం

టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నిర్వాకంతో హంద్రీ-నీవా నీటి విడుదలకు బ్రేక్

- కృష్ణమ్మ కరుణిస్తున్నా కరువు సీమకు అందని నీళ్లు.. పుట్టా సంస్థకు కర్నూలు-గుంటూరు హైవే నిర్మాణ పనులు
- గార్గేయపురం - బ్రాహ్మణకొట్కూరు మధ్య వంతెన కోసం హంద్రీ-నీవా కాలువను పూడ్చివేసిన పుట్టా సంస్థ
- పైపులు అమర్చకుండా రోడ్డు వేయడంతో నీటి విడుదలకు ఆటంకం.. జలాశయాలు, చెరువులకు నీరు నింపే ఏకైక మార్గం బంద్
- 'సీమ'లో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు అందని దుస్థితి.. పల్లెల్లో 30 లక్షల మందికి తాగునీటి ఇక్కట్లు
- కాంట్రాక్టు సంస్థ అధికార పార్టీ ఎమ్మెల్యేది కావడంతో రైతుల ఇక్కట్లను పట్టించుకోని అధికారులు, ప్రభుత్వం

10 లో


గార్గేయపురం - బ్రాహ్మణకొట్కూరు మధ్య హంద్రీ-నీవా కాలువకు అడ్డంగా నిర్మించిన రహదారి (ఇన్‌సెట్)లో టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



వైఎస్ జగన్ పిటిషన్‌పై స్పందించిన హైకోర్టు

- శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శికి నోటీసులు
- ప్రతిపక్ష నేత హోదాపై పూర్తి వివరాలు కోర్టు ముందుంచాలని ఆదేశం
- ప్రతిపక్ష నేత హోదా కోసం స్పీకర్‌కు వినతి పత్రం ఇచ్చారా?
- ఇచ్చి ఉంటే, స్పీకర్ ఏం నిర్ణయం తీసుకున్నారన్నదే ముఖ్యం
- అందుకే ఇద్దరు కార్యదర్శులకు నోటీసులు ఇస్తున్నామని స్పష్టీకరణ

3 లో

‘ఏసీ’భారం.. జనరల్ ‘ఘోరం’

అధిక రాబడే ధ్యేయం.. సామాన్యుల గోడు పట్టని రైల్వే శాఖ ■ రైల్వే శాఖ తీరుపై సర్వత్రా ఆగ్రహం

ఏ దేశంలో అయినా ఆయా ప్రభుత్వాలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తాయి. ఆదాయం దృష్టితో కాకుండా బాధ్యతతో వ్యవహరిస్తాయి. ప్రధానంగా మన దేశంలో పేదలు, దిగువ మధ్య తరగతి వర్గాల ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఎక్కువగా ప్రయాణించేది రైళ్ల లోనే. అదీ స్లీపర్, జనరల్ కోచ్‌ల్లోనే. తక్కువ చార్జీతో గమ్యస్థానం చేరొచ్చనేదే పేదల ఆశ. అయితే కొంత కాలంగా రైల్వే శాఖ వారి ఆశలపై నీళ్లు చల్లుతూ.. జనరల్, స్లీపర్ కోచ్‌లను తగ్గించేస్తూ.. ఏసీ కోచ్‌లను పెంచేస్తూ ‘పక్కా వ్యాపారం’ చేస్తోంది. పర్యవసానంగా ఏ రైలులోని జనరల్ కోచ్‌ల్లో చూసినా పరిస్థితి అత్యంత దయనీయంగా కనిపిస్తోంది. ఒకరిపై ఒకరు పడిపోయి.. ఒంటి కాలిపై నిల్చొని.. టాయ్‌లెట్స్ ముందు ఇరుక్కుని.. మెట్లపై వేలాడుతూ.. చెమటలు కార్చుకుంటూ.. చిన్నారుల ఏడుపుల మధ్య ప్రయాణం సాగించాల్సి వస్తోంది. 70-80 మంది ప్రయాణించాల్సిన కోచ్‌లో దాదాపు 500 మంది వెళుతున్నారంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహిస్తేనే భయమేస్తుంది. హౌరా, పూరి, గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్, వివేక్ ఎక్స్‌ప్రెస్, గోదావరి ఎక్స్‌ప్రెస్.. ఇలా ఒక్కటేమిటి రైళ్లన్నింటిలోనూ ఇదే దుస్థితి. ‘ఊరికి ఎలా వెళ్లాలి దేవుడా..’ అంటూ పేదలు వణికిపోతున్నారు.






హౌరా ఎక్స్‌ప్రెస్ జనరల్ బోగీలోని బాత్రూం వద్ద కూర్చొని ఉన్న ప్రయాణికులు.. జనరల్ బోగీలో పైన కూర్చొన్న ప్రయాణికుల అవస్థలు

సాక్షి, అమరావతి/ సాక్షి నెట్‌వర్క్: ఇల్లు కట్టిచూడు.. పెళ్లి చేసి చూడు.. అనే నానుడికి ఇప్పుడు రైల్లో జనరల్ బోగీ ఎక్కిచూడు.. అనే వాక్యం కలుపుకోవాలి. రైలు ఎక్కాలంటే జేబులు గుల్ల చేసుకోవాల్సిందేనని సామాన్యులు హడలి పోతుండటం నేటి వాస్తవం. ఏసీ కోచ్‌లో వెళ్లాలంటే ఆర్థిక భారం.. స్లీపర్ కోచ్‌లు అందుబాటులో ఉండవు.. జనరల్ కోచ్‌లలో కాలు పెట్టేందుకే చోటుండదు.. ఇదీ సగటు రైల్వే ప్రయాణికుల దుస్థితి. రైల్వేల ఆధునికీకరణ, మెరుగైన సౌకర్యాల పేరుతో రైల్వే శాఖ పన్నిన మాయోపాయం పేద, దిగువ మధ్యతరగతి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ధనిక, ఎగువ మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండేలా రైళ్లను తీర్చిదిద్దడమే ఆధునికీకరణని రైల్వే శాఖ వక్ర భాష్యం చెబుతోంది. సామాన్య, పేద, దిగువ మధ్య తరగతి ప్రయాణికులకు అందుబాటులో ఉండటం.. వారికి మెరుగైన వసతులు సమకూర్చడం అనే వాస్తవాన్ని విస్మరిస్తోంది. దాదాపు అయిదేళ్లుగా పక్కా పన్నాగంతో జనరల్, స్లీపర్ కోచ్‌ల సంఖ్యను తగ్గిస్తూ ఏసీ కోచ్‌ల సంఖ్యను పెంచుతోంది. కోచ్‌ల సంఖ్యే కాకుండా ఏకంగా దేశంలో జనరల్, స్లీపర్ కోచ్‌ల ఉత్పత్తిని కూడా తగ్గిస్తూ... రాబోయే కాలమంతా ఏసీ రైలు ప్రయాణమేనని తేల్చి చెబుతోంది. కేవలం ఏసీ కోచ్‌లే అందుబాటులో ఉండేలా చేసి భారీగా టికెట్ల రాబడి పెంచుకోవాలన్న ఉద్దేశంతో సామాన్య ప్రయాణికులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. దేశ వ్యాప్తంగా సామాన్య ప్రజానీకం నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న ఈ అంశంపై ‘సాక్షి’ దృష్టి సారించింది. రాష్ట్రంలో శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు అన్ని జిల్లా కేంద్రాల మీదుగా ప్రయాణించే ప్రధాన రైళ్లలో పరిస్థితిని పరిశీలించింది. యశ్వంత్‌పూర్, వాస్కోడిగామా, కోరమండల్, హౌరా-చెన్నై మెయిల్, గౌతమి, శేషాద్రి, పద్మావతి, ఎల్‌టీటీ, అల్లెప్పి-ధన్‌బాద్, తిరుపతి-పూరి, నవ జీవన్, తిరుపతి -హౌరా, ప్రశాంతి.. ఇలా ఏ రైలు చూసినా ఏమున్నది గర్వ కారణం.. సమస్త రైళ్లలో తీవ్ర అవస్థల మయం.. అన్నట్లుంది జనరల్, స్లీపర్ కోచ్‌లలో ప్రయాణికుల పరిస్థితి.

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

జనరల్, స్లీపర్ కోచ్‌ల కోత

రైల్వే శాఖ ఓ ప్రణాళిక ప్రకారం నాలుగేళ్లుగా వందే భారత్ వంటి ఏసీ రైళ్లు, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఏసీ కోచ్‌ల సంఖ్యను క్రమంగా పెంచుతోంది. తద్వారా అధిక చార్జీలు ఉండే ఏసీ కోచ్‌ల వైపు ప్రయాణికులను మళ్లించడం ద్వారా అధిక ఆదాయ సముపార్జనకే పెద్దపీట వేస్తోంది. మరోవైపు దిగువ మధ్య తరగతి, పేద ప్రయాణికులు ప్రయాణించే స్లీపర్, జనరల్ కోచ్‌ల సంఖ్యను క్రమంగా తగ్గిస్తోంది. 2019లో మొదలుపెట్టిన ఈ ప్రక్రియను మూడేళ్లుగా వేగవంతం చేసింది. సాధారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రయాణికుల కోసం సగటున 22 కోచ్‌లతో నిర్వహిస్తున్నారు. గతంలో రైళ్లలో జనరల్ కోచ్‌లు నాలుగు, స్లీపర్ కోచ్‌లు 12 వరకు ఉండగా.. థర్డ్ ఏసీ కోచ్‌లు మూడు, సెకండ్ ఏసీ కోచ్‌లు రెండు, ఒక ఫస్ట్ ఏసీ కోచ్ ఉండేవి. కానీ మూడేళ్లుగా రైలు కోచ్‌ల కూర్పును రైల్వే శాఖ అమాంతం మార్చేసింది. ప్రస్తుతం జనరల్ కోచ్‌లు రెండు, స్లీపర్ కోచ్‌లు 10కి తగ్గించింది. థర్డ్ ఏసీ కోచ్‌లు ఆరు, సెకండ్ ఏసీ కోచ్‌లు మూడు, ఫస్ట్ ఏసీ కోచ్ ఒకటిగా చేసింది. దాంతో ఒక్కో రైలులో స్లీపర్ కోచ్‌లలో దాదాపు 150 బెర్త్‌లు, జనరల్ కోచ్‌లలో 150 వరకు సీట్లు తగ్గిపోయాయి. పేద, మధ్య తరగతి ప్రయాణికులు ఆధారపడే 300 సీట్లలో కోత పడింది. మరోవైపు ఏసీ కోచ్‌ల సంఖ్య పెరగడంతో వాటిలో 280 నుంచి 300 బెర్త్‌లు పెరిగాయి. ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే దసరా, దీపావళి, సంక్రాంతి, వేసవి సెలవుల స్పెషల్ రైళ్లలో అయితే స్లీపర్ కోచ్‌ల సంఖ్య కేవలం ఆరింటికే పరిమితం చేస్తూ థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ కోచ్‌ల సంఖ్యను రెట్టింపు చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇటీవల ప్రధానమైన 40 రైళ్లలో ఏకంగా 100 ఏసీ కోచ్‌లను పెంచింది. వాటిలో థర్డ్ ఏసీ కోచ్‌లు 75, సెకండ్ ఏసీ కోచ్‌లు 20, ఫస్ట్ ఏసీ కోచ్‌లు 5 ఉన్నాయి. కొత్తగా ఎల్‌హెచ్‌బీ సాంకేతిక విధానంతో ఉత్పత్తి చేస్తున్న కోచ్‌లను ప్రవేశపెడుతున్నామనే సాకుతో స్లీపర్ కోచ్‌లను తగ్గిస్తూ ఏసీ కోచ్‌ల సంఖ్యను పెంచుతోంది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది.



కోచ్‌ల ఉత్పత్తిలోనూ అదే వివక్ష

కొత్త రైల్వే కోచ్‌ల ఉత్పత్తిలోనూ కేంద్ర ప్రభుత్వం పేద, సామాన్య ప్రయాణికుల పట్ల వివక్ష కనబరుస్తోంది. అయిదేళ్లుగా రైల్వే శాఖ ఉత్పత్తి చేస్తున్న కోచ్‌ల విధానమే ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. దేశంలోని చెన్నై, కపుర్తలా, రాయ్‌బరేలీలోని కోచ్ ఫ్యాక్టరీలలో జనరల్, స్లీపర్ కోచ్‌ల ఉత్పత్తిని రైల్వే శాఖ క్రమంగా తగ్గిస్తూ... ఏసీ కోచ్‌ల ఉత్పత్తిని పెంచుతోంది. ఆ మూడు ఫ్యాక్టరీలలో 2019-20లో 997 ఏసీ కోచ్‌లను ఉత్పత్తి చేశారు. కాగా 2024-25లో ఏకంగా 2,571 ఏసీ కోచ్‌లను ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. మరోవైపు ఆ ఫ్యాక్టరీలలో 20219-20లో 1,925 జనరల్, స్లీపర్ కోచ్‌లను ఉత్పత్తి చేశారు. ఆ ఉత్పత్తిలో 85 శాతం కోత విధించి 2024-25లో కేవలం 278 కోచ్‌లే ఉత్పత్తి చేయాలని నిర్ణయించడం గమనార్హం. అంటే జనరల్, స్లీపర్ కోచ్‌ల స్థానంలో క్రమంగా ఏసీ కోచ్‌లను ప్రవేశపెట్టాలనే కార్యచరణ అమలు చేస్తోంది. 22 కోచ్‌లు ఉన్న రైళ్లలో కనీసం 18 ఏసీ కోచ్‌లే ఉండేట్టుగా చేయాలన్నది రైల్వే శాఖ అంతిమ లక్ష్యమని రైల్వే వర్గాలు చెప్పడం గమనార్హం.

‘స్లీపర్’లో దొరకదు.. ‘జనరల్’లో చోటు ఉండదు

రైల్లో ప్రయాణం అంటేనే పేదలు, సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. స్లీపర్ కోచ్‌లో ప్రయాణం చేద్దామంటే రిజర్వేషన్లు దొరకడం లేదు. బెర్త్‌లు తగ్గిపోవడంతో రెండు నెలల ముందే రిజర్వేషన్ చేసుకోవాలి. లేదంటే రిజర్వేషన్ దొరకదు. తత్కాల్, ప్రీమియం తత్కాల్ విధానంలో రిజర్వేషన్ చేసుకుంటే టికెట్ ధర తడిసి మోపెడవుతోంది. జనరల్ కోచ్‌లో వెళ్లడం అంటే ప్రాణాలకు తెగించి సాహసం చేసినట్టే. ఒక జనరల్ కోచ్‌లో 72 నుంచి 80 వరకు సీట్లు ఉంటాయి. కానీ ఏ సమయంలో ఏ రైలులో జనరల్ కోచ్ చూసినా కనీసం 100 నుంచి 150 మంది వరకు ఉంటారు. ముగ్గురు కూర్చునే బెర్త్‌లో ఆరుగురు కూర్చోవడమే కాదు.. సీట్ల మధ్య ఖాళీల్లోనూ చివరికి లగేజీ పెట్టే రాక్‌ల మీద కూడా కూర్చొని కనిపిస్తారు. టాయిలెట్ల పక్కన ఒకరిని నెట్టుకుంటూ ఒకరు కూర్చోనో, నిలబడో పరస్పరం ఘర్షణ పడుతూ ప్రయాణిస్తుండటం అన్నది మన రైళ్లలో సర్వసాధారణమైంది. కనీసం నీళ్లు తాగుదామన్నా అవ్వదు.. టాయిలెట్‌కు వెళ్దామంటే కుదరదు.. కాలు కదుపుదామన్నా సాధ్యం కాదు.. మెట్లపైన సైతం వేలాడుతూ ప్రాణాలకు తెగించి ప్రయాణించే ప్రయాణికుల దృశ్యాలు మన రైళ్లలో నిత్యం ప్రతి రైల్వే స్టేషన్‌లోనూ కనిపిస్తాయి.

అధిక రాబడే రైల్వే శాఖ లక్ష్యం

అధిక రాబడే లక్ష్యంగా రైల్వే శాఖ ఏసీ కోచ్‌లకు పరిమితికి మించి ప్రాధాన్యమిస్తోంది. జనరల్, స్లీపర్ కోచ్‌లను తగ్గించి ఏసీ కోచ్‌లను పెంచితే అధిక రాబడి వస్తుందన్నది రైల్వే శాఖ ఉద్దేశం. ఉదాహరణకు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి విశాఖపట్నంకు స్లీపర్ కోచ్‌లో టికెట్ రూ.255. అదే థర్డ్ ఏసీ అయితే 660, సెకండ్ ఏసీ అయితే 910, ఫస్ట్ ఏసీ అయితే రూ.1,551. ఈ లెక్కన స్లీపర్ కోచ్ కంటే థర్డ్ ఏసీ 100 శాతానికి పైగా, సెకండ్ ఏసీ 200 శాతంపైగా, ఫస్ట్ ఏసీ ఏకంగా 400-500 శాతం అధికం. రైల్వే శాఖ స్లీపర్ కోచ్‌లను తగ్గిస్తూ ఏసీ కోచ్‌లను పెంచడం వెనుక లోగుట్టు అధిక రాబడే అని ఈ గణాంకాలు బట్టబయలు చేస్తున్నాయి. రైల్వే శాఖ దేశ వ్యాప్తంగా 22 వేల రైళ్లను నిర్వహిస్తుండగా వాటిలో రోజుకు సగటున 13,500 రైళ్లు నిర్వహిస్తోంది. వాటిలో రోజూ 2.4 కోట్ల మంది ప్రయాణిస్తున్నారు. ఆ లెక్కన జనరల్, స్లీపర్ కోచ్‌లను తగ్గించి ఏసీ కోచ్‌లు మాత్రమే అందుబాటులో ఉండేట్టు చేస్తే టికెట్ల ద్వారా భారీ రాబడి సాధించవచ్చన్నది రైల్వే శాఖ ఉద్దేశం. అంటే కేంద్ర ప్రభుత్వానికి లాభం.. సామాన్య ప్రయాణికులకు భారం. ఇదే రైల్వే శాఖ లెక్క.

కాళ్లు కింద మోపలేం

విశాఖపట్నం మీదుగా రాకపోకలు సాగించే గౌహతి-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ మంగళవారం కిక్కిరిసి విశాఖపట్నం చేరుకుంది. ఈ రైలులో జనరల్, స్లీపర్‌క్లాస్‌లలో కనీసం కాలు మోపేందుకు కూడా ఖాళీ లేదు. ఈ రైలులో జనరల్4, స్లీపర్7, ఏసీ కోచ్‌లు 8 ఉన్నాయి. జనరల్ కోచ్‌లలో 200 మంది చొప్పున ఉన్నారు. స్లీపర్ కోచ్‌లో కేవలం 78 బెర్తుల చొప్పున మాత్రమే ఉన్నప్పటికీ రెట్టింపు ప్రయాణికులు కనిపించారు. డిబ్రూగఢ్-కన్యాకుమారి వివేక్ ఎక్స్‌ప్రెస్ కూడా ఇదే విధంగా కిక్కిరిసి వెళ్లింది. ఈ రైలులో జనరల్ బోగీలు మూడు మాత్రమే ఉన్నాయి. ఉత్తరాంధ్ర వాసుల ప్రధాన రైలు గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు ఉన్న రెండు జనరల్ కోచ్‌లలో పరిస్థితి కనీసం కాలు మోపలేని విధంగా ఉంది.

రెండు బోగీల్లో వెయ్యి మంది!

ఆధ్యాత్మిక కేంద్రంగా పిలువబడే తిరుపతి నగరం మీదుగా రోజూ పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు నడుస్తుంటాయి. ఈ రైళ్లలోని జనరల్ బోగీలన్నీ కిక్కిరిసి ఉంటాయి. హౌరా ఎక్స్‌ప్రెస్ రైల్లోని జనరల్ బోగీలో అయితే ఒకరిపై ఒకరు కూర్చొని, నిల్చొని ప్రయాణిస్తుండటం రోజూ కనిపిస్తుంది. బెంగళూరు నుంచి కాట్పాడి, తిరుపతి, రేణిగుంట, ఒంగోలు, విజయవాడ, శ్రీకాకుళం, పలాస మీదుగా హౌరాకు చేరుకునే ఎక్స్‌ప్రెస్ రైలు మంగళవారం ప్రయాణికులతో కిక్కిరిసి నడిచింది. ఇందులో జనరల్ బోగీలు కేవలం రెండే ఉన్నాయి. ఈ రెండు బోగీల కెపాసిటీ 180 మంది. మంగళవారం సుమారు వెయ్యి మంది ప్రయాణించి ఉండొచ్చని అధికారుల అంచనా. అనేక మంది ఒంటి కాలుపై నిల్చుని ఉండటం కనిపించింది.

ఉన్న వాటికీ ఎసరు

ఏలూరులో మంగళవారం ఈస్ట్‌కోస్ట్ రైలు మధ్యాహ్నం 3.50 గంటలకు వచ్చింది. రెండే జనరల్ బోగీలున్నాయి. అప్పటికే ఆ బోగీ కిక్కిరిసి ఉంది. ఒక్క ఏలూరులోనే ఈ రెండు జనరల్ బోగీల్లో 60 మంది ఎక్కారు. ఒక్కో బోగీలో 150-200 మంది వరకు ప్రయాణికులు ఉన్నారు. బాత్‌రూమ్‌ల వద్ద, నడిచే మార్గంలో, వాకిట్లో కూర్చున్నారు. మరి కొంతమంది రెండు బోగీలను కలిపే మార్గంలో టాయిలెట్‌లను ఆనుకుని కూడా కూర్చోనుండటం కన్పించింది. కరోనా సమయంలో రద్దు చేసిన పలు ప్యాసింజర్ రైళ్లను నేటికీ పునరుద్ధరించలేదు. మహిళలు, దివ్యాంగులు ప్రయాణించేందుకు ప్రత్యేకంగా ఉండే బోగీ ఇప్పుడు కనిపించడం లేదు. ఉన్న రైళ్లనూ రద్దు చేస్తున్నారు.

గత కొన్నేళ్లలో దేశంలో ఏసీ కోచ్‌ల ఉత్పత్తి ఇలా..

సంవత్సరం	ఏసీ కోచ్‌ల ఉత్పత్తి
2019-20	997
2024-25	2,571
సంవత్సరం	**జనరల్, స్లీపర్ కోచ్‌ల ఉత్పత్తి**
2019-20	1,925
2024-25	278

అమ్మో వందే భారత్

అత్యధిక చార్జీలతో పూర్తిగా ఏసీ కోచ్‌లతో నిర్వహించే వందే భారత్ రైళ్లకే కేంద్రం అధిక ప్రాధాన్యమిస్తుండటం సామాన్యులకు భారంగా మారింది. దేశంలో కొత్తగా ప్రవేశపెట్టబోయే రైళ్లన్నీ వందేభారత్ రైళ్లేనని రైల్వే శాఖ వర్గాలు చెబుతున్నాయి. రైల్వే శాఖ ప్రస్తుతం దేశంలో 41 వందేభారత్ రైళ్లను నిర్వహిస్తోంది. వాటిలో ఏపీలో నాలుగు నిర్వహిస్తున్నారు. కాగా 2030 నాటికి 800 వందేభారత్ రైళ్లను పట్టాలు ఎక్కించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అంతేకాకుండా ఇతర ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని 40 వేల కోచ్‌లను కూడా వందేభారత్ కోచ్‌ల స్థాయికి ఆధునికీకరిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించడం గమనార్హం. కాగా, ఈ రైళ్లను నిర్దిష్ట సమయంలో నడిపేందుకు పలు రైళ్లను రద్దు చేస్తున్నారు.

ఇదీ లెక్క

రాష్ట్రంలో రోజూ సగటున ప్రయాణిస్తున్న రైళ్లు	340-350
ఇందులో విజయవాడ మీదుగా వెళ్తున్న రైళ్లు	280
విజయవాడ నుంచి రోజూ రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు	1,00,000
మొత్తం ప్రయాణికుల్లో జనరల్ బోగీల్లో ప్రయాణిస్తున్నవారు	40%
స్లీపర్ క్లాసులో ప్రయాణిస్తున్నవారు	20%
ఒక రైల్లో జనరల్ బోగీలు	10%

1న ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ


సీఎస్ ఆదేశం



సాక్షి, అమరావతి: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆగస్టు 1న ఉదయం ఆరు గంటలకే చేపట్టాలని, అదే రోజు 96 శాతంపైగా పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. మంగళవారం పింఛన్ల పంపిణీపై రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ ఆగస్టు నెలకు సంబంధించి 64.82 లక్షల మందికి 82,5200 వివిధ రకాల పింఛన్ల పంపిణీకిగాను రూ.2,737.41 కోట్లను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ మొత్తాన్ని బుధవారం మధ్యాహ్నం లోపు డ్రా చేసుకుని, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది 1వ తేదీ ఇంటింటికి వెళ్లి 96 శాతం పంపిణీ చేయాలన్నారు. 2న నూరుశాతం పూర్తి చేయాలని తెలిపారు.

ముంపు రైతులను ఆదుకుంటాం

వ్యవసాయశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్



తాడేపల్లిగూడెం రూరల్: ముంపు రైతులను ఆదుకుంటామని వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ అన్నారు. మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలోని నందమూరు, జగన్నాథపురం, మాధవరం గ్రామాల్లో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు, కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ఏటా పంట పొలాలు ముంపునకు గురికాకుండా శాశ్వత పరిష్కారానికి ఆలోచన చేస్తామన్నారు. ఎర్ర కాలువకు గండ్లు పడటం వల్ల పంట పొలాలు నీట మునుగుతున్నాయని, పంట అంచనాలను తయారు చేసి, త్వరలోనే రైతులకు నష్టపరిహారం అందజేస్తామన్నారు.

నాలుగు నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు నేడు ఆర్డినెన్స్!

- ఆన్‌లైన్‌లో ఆమోదం తెలిపిన మంత్రులు.. గవర్నర్‌కు పంపిన సర్కారు
- ఆయన ఆమోదించగానే ఆర్డినెన్స్ జారీ
- అంతకుముందు.. అసెంబ్లీ, ‘మండలి’ ప్రొరోగ్
- సమావేశాలు జరిగినా పూర్తి బడ్జెట్ పెట్టకుండా ప్రభుత్వం ఎగనామం



సాక్షి, అమరావతి: నాలుగు నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు చంద్రబాబు ప్రభుత్వం బుధవారం ఆర్డినెన్స్ జారీచేయనుంది. మంత్రుల ఆమోదం కోసం మంగళవారం వారికి సర్క్యులేషన్‌లో పంపగా వారు ఆన్‌లైన్‌లో దానికి ఆమోదం తెలిపారు. దీంతో.. దీనిని గవర్నర్‌కు పంపారు. ఆయన ఆమోదించాక రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఆర్డినెన్స్‌ను జారీచేస్తుంది. ఇక ఈ నాలుగు నెలల అత్యవసర వ్యయానికే ఆర్డినెన్స్ జారీచేస్తున్నట్లు సమాచారం.

హామీలు ఎగ్గొట్టేందుకే..

ఎన్నికల ముందు సూపర్ సిక్స్, సూపర్ టెన్ అంటూ ప్రజలకిచ్చిన హామీల అమలును ఎగ్గొట్టేందుకే ఈ నాలుగు నెలల ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు చంద్రబాబు ప్రభుత్వం సంకల్పించింది. అంతకుముందు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టి నాలుగు నెలల వ్యయానికి సభ అనుమతి తీసుకుంది. ఈ గడువు ఈ నెలాఖరుతో (జూలై 31తో) ముగియనుంది. సాధారణంగా అయితే.. ఎన్నికల ఫలితాలు అనంతరం ఏర్పడే కొత్త ప్రభుత్వాలు తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ఈనెల 23న లోక్‌సభలో ప్రవేశపెట్టింది. చంద్రబాబు ప్రభుత్వం ఈనెల 22 నుంచి 26 వరకు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించినప్పటికీ పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేదు. పైగా.. శ్వేతపత్రాల పేరుతో ఆత్మస్తుతి పరనిందలతో గత ప్రభుత్వంపై ఆరోపణలకే అసెంబ్లీ సమావేశాలను ఉపయోగించుకుంది. గవర్నర్ ప్రసంగం ద్వారా అప్పులపై అవాస్తవాలను చెప్పించడంతో పాటు హామీలను తక్షణం అమలుచేయలేమని కూడా గవర్నర్‌తో చెప్పించింది. అంటే.. చంద్రబాబు నిజస్వరూపం ఇక్కడే బట్టబయలైంది. హామీలివ్వడమే తప్ప అమలుచేసే తత్వం తనది కాదని ఆయన రుజువు చేసుకున్నారు.

అప్పులపై వాస్తవాలు బయటపడతాయనే


వాస్తవానికి.. గవర్నర్ ప్రసంగం ఎన్నికల హామీలు అమలు అంశాలతో సాగడం రివాజు. కానీ, అందుకు పూర్తి భిన్నంగా చంద్రబాబు ప్రభుత్వం గవర్నర్ ప్రసంగాన్ని గత ప్రభుత్వంపై నిందలకే పరిమితం చేశారు. పూర్తిస్థాయి బడ్జెట్ పెడితే గత ప్రభుత్వం చేసిన అప్పుల వాస్తవాలను బడ్జెట్ డాక్యుమెంట్‌లో స్పష్టంచేయాల్సి వస్తుంది. అలాగే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు బడ్జెట్ కేటాయింపులు చేయాల్సి వస్తుంది. దీంతో శ్వేతపత్రాల ముసుగులో అవాస్తవ ఆరోపణలతో కాలయాపన చేశారు. అసలు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున మరో నాలుగు నెలల వ్యయానికి ఓటాన్ బడ్జెట్‌కు సభ ఆమోదం తీసుకోవచ్చు. అలా చేయకుండా అసెంబ్లీ, మండలి సమావేశాలను ముగించేశారు. అసెంబ్లీ, ‘మండలి’ని మంగళవారం ప్రొరోగ్ చేస్తూ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. దీంతో.. బుధవారం నాలుగు నెలల వ్యయానికి ఓటాన్ అకౌంట్ ఆర్డినెన్స్‌ను జారీచేయనుంది.

ఇది అసెంబ్లీని అవమానించడమే..

అసెంబ్లీ సమావేశాలను ముగించేసి, ఆర్డినెన్స్ ఇవ్వడం అంటే శాసనసభను అవమానించడమే అవుతుందని సీనియర్ రాజకీయవేత్తలు అంటున్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టలేనంత అసాధారణ పరిస్థితులేవీ రాష్ట్రంలో లేవని.. కేంద్ర, రాష్ట్ర ఆదాయాలు ఎంత వస్తాయో స్పష్టంగా ఉన్నాయని, అయినాసరే చంద్రబాబు పూర్తి బడ్జెట్ పెట్టకుండా ఆర్డినెన్స్ ఎత్తుగడ వేశారంటే హామీలకు ఎగనామం పెట్టడానికేననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల ప్రాధాన్యతల్లో సూపర్ సిక్స్ హామీలకు చోటులేదు. నాణ్యమైన లిక్కర్ బ్రాండ్స్, చెత్త తొలగింపు, నూతన ఇసుక విధానాలకే చోటుండటం గమనార్హం.

అప్పుల ద్వారా సంపద సృష్టి!

- 35 రోజుల్లో రూ.12 వేల కోట్ల అప్పు చేసిన చంద్రబాబు సర్కారు
- మంగళవారం 7.34 శాతం వడ్డీతో రూ.3,000 కోట్ల అప్పు
- సెక్యూరిటీల వేలం ద్వారా రుణాన్ని సమీకరించిన ఆర్‌బీఐ



సాక్షి, అమరావతి: అప్పులు చేయడం ద్వారా కాకుండా, సంపద సృష్టించడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తానంటూ ఎన్నికల ముందు పెద్ద పెద్ద మాటలు చెప్పిన చంద్రబాబు.. తీరా గద్దెనెక్కాక అందుకు విరుద్ధంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. కూటమి ప్రభుత్వం 35 రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ.12,000 కోట్లు అప్పు చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అప్పు చేసిన రోజల్లా ప్రతి మంగళవారం అప్పు చేయనిదే గడవదని తప్పు పడుతూ ఎల్లో మీడియా కథనాలను రాయడం, వాటి ఆధారంగా చంద్రబాబు అండ్ కో రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారంటూ ఆరోపణలు చేయడం తెలిసిందే. మరి ఇప్పుడు ఇదే చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం కేవలం 35 రోజుల వ్యవధిలోనే ఏకంగా రూ.12 వేల కోట్లు అప్పు చేసినా, మంగళవారాలు అప్పులు చేస్తున్నా ఎల్లో మీడియా ఒక్క ముక్క కూడా రాయడం లేదు ఎందుకో అని అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. గత నెల 25వ తేదీన రూ.2 వేల కోట్ల అప్పుతో చంద్రబాబు ప్రభుత్వం అప్పులు చేయడం ప్రారంభించింది. ఆ తర్వాత ఈ నెల 2వ తేదీన ఒకేసారి రూ.5,000 కోట్లు అప్పు చేసింది. 16వ తేదీన మరో రూ.2,000 కోట్లు అప్పు చేసింది. తాజాగా మంగళవారం (నిన్న) సెక్యూరిటీల వేలం ద్వారా ఆర్‌బీఐ రాష్ట్ర ప్రభుత్వానికి రూ.3,000 కోట్ల రుణాన్ని సమీకరించింది. ఇందులో రూ.1,000 కోట్లు 15 సంవత్సరాల కాల వ్యవధికి, మరో రూ.1,000 కోట్లు 20 సంవత్సరాల కాల వ్యవధికి, ఇంకో రూ.1,000 కోట్లు 25 సంవత్సరాల కాల వ్యవధికి 7.34 శాతం వడ్డీతో అప్పు చేసింది. ఈ లెక్కన నెల ఐదు రోజుల్లోనే కూటమి ప్రభుత్వం రూ.12 వేల కోట్లు అప్పు చేసింది. ఇంత అప్పు చేసినా ఒక్క పెన్షన్ పెంపు తప్ప మిగతా హామీల్లోని ఏ ఒక్కదాని అమలు ప్రారంభించలేదు. మరి ఈ అప్పులన్నీ దేనికి వ్యయం చేసినట్లో చంద్రబాబు అండ్ కో తో పాటు ఎల్లో మీడియా చెప్పాల్సి ఉందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిబంధనల మేరకు పరిమితికి లోబడే అప్పులు చేసినా రాష్ట్రాన్ని శ్రీలంక చేశారంటూ.. లేని అప్పులున్నట్లు దుష్ప్రచారం చేయడం ఎల్లో మీడియా పక్షపాత ధోరణికి అద్దం పడుతోందని విమర్శిస్తున్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఏం చెప్పారని, ఇప్పుడు ఏం చేస్తున్నారని ఆర్థిక వేత్తలు ప్రశ్నిస్తున్నారు. రూ.12 వేల కోట్లు అప్పు చేయడమే సంపద సృష్టించడంలా ఉందని ఎద్దేవా చేస్తున్నారు. ఇప్పటి వరకు చేసిన అప్పులను ఏ అభివృద్ధి పనులకు వెచ్చించారో చెప్పాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉంది.

కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఇతర పనుల ద్వారా తలసరి ఆదాయంపై సమగ్ర వివరాలతో రావాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో డోలీ మోతలు కనిపించకూడదని ఆదేశించారు. గర్భిణిల కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన గర్భిణీ వసతి గృహాలు మళ్లీ ప్రారంభించాలన్నారు. వచ్చే నెలలో జరిగే అంతర్జాతీయ గిరిజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు.

ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి

అరకు కాఫీని ప్రమోట్ చేసేందుకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామన్నారు. గిరిజన ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉందని, దాన్ని ఉపయోగించుకుంటే గిరిజనుల జీవితాల్లో మార్పులు తేవచ్చన్నారు. గిరిజన ప్రాంతాల్లో సారవంతమైన భూములున్నాయని, ఆ ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు.

దళితులకు ఆర్థిక భద్రత కల్పించాలి

దళిత వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించే కార్యక్రమాలు రూపొందించాలని సీఎం చంద్రబాబు సూచించారు. సాంఘిక సంక్షేమ శాఖపై ఆయన రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. విద్య, ఉపాధి అవకాశాల ద్వారా వారి జీవితాల్లో మార్పులు తేవచ్చని సీఎం అన్నారు.

ఆర్థికవేత్త మైఖేల్‌తో బాబు భేటీ

సీఎం చంద్రబాబు నోబెల్ గ్రహీత, అమెరికాకు చెందిన ఆర్థికవేత్త మైఖేల్ క్రిమర్‌తో సమావేశమై విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, నీటి సరఫరా రంగాలపై చర్చించినట్లు ఎక్స్‌లో సీఎంవో పోస్ట్ చేసింది.

మరింతగా సచివాలయాల వినియోగం

రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన, సత్వర సేవల కల్పన కోసం ఏర్పాటైన గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను మరింత సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలన్న దానిపై సమగ్ర ప్రణాళిక రూపొందించాలని సీఎం చంద్రబాబు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన సాంఘిక సంక్షేమ శాఖ కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ తీరుతెన్నులపై అధికారులు సీఎంకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సీఎం మాట్లాడుతూ.. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ సర్వీసులను సమర్థవంతంగా అమలు చేస్తూనే, క్షేత్ర స్థాయిలో సిబ్బంది సేవలను మరింతగా ఎలా వినియోగించుకోవచ్చన్న దానిపై దృష్టి పెట్టాలని సూచించారు.

టీడీపీ నేతల నుంచి మా ప్రాణాలు కాపాడండి

- మా ఆస్తులను బలవంతంగా లాక్కున్నారు
- సోషల్ మీడియా ద్వారా ఓ అర్చకురాలి వినతి


అయిలూరి సంతోషలక్ష్మి

కొత్తపేట: 'టీడీపీ నేతల నుంచి మా ప్రాణాలను కాపాడండి. మా ఆస్తులను హస్తగతం చేసుకున్నారు. గతంలో వారు నా చిన్న కుమార్తెపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు. ఇప్పుడు నా ఇద్దరు కుమార్తెలతోపాటు నన్ను చంపేస్తామని బెదిరిస్తున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని మాకు రక్షణ కల్పించాలి.' అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లి గ్రామానికి చెందిన అయిలూరి సంతోషలక్ష్మి అనే మహిళా అర్చకురాలు వేడుకున్నారు. ఈ మేరకు ఆమె తన ఆవేదనను వివరిస్తూ ఓ వీడియోను మంగళవారం సోషల్ మీడియాలో పెట్టారు. 'నా భర్త అయిలూరి శివకుమార్ మందపల్లి ఉమామందేశ్వర(శనైశ్చర) స్వామి వారి దేవస్థానం అర్చకుడిగా పనిచేసేవారు. ఆయన 2009లో అదృశ్యమయ్యారు. ఆ తర్వాత నేను వంశపారంపర్య వారసత్వ హక్కులు పొందాను. దేవస్థానం అర్చకత్వ బాధ్యతలను చూస్తూ నా ఇద్దరు కుమార్తెలతో కలిసి జీవిస్తున్నాను. మా గ్రామానికి చెందిన ఇద్దరు టీడీపీ నాయకులు నా ఆస్తులను ఆక్రమించుకున్నారు. నాకు ఉన్న అర్చకత్వ ఆధారాన్ని తప్పించాలని ప్రయత్నించారు. వంశపారపర్యం అర్చకత్వ హక్కును కొనసాగించేలా దేవదాయశాఖ నుంచి ఉత్తర్వులు తెచ్చుకున్నాను. నా ఆస్తులను కాపాడుకునేందుకు కోర్టుకు వెళ్లి 2018లో ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నాను. అయినా ఆ స్థలాల్లోనే నిర్మాణాలు చేస్తున్నారు. గతంలో వారు నా చిన్న కుమార్తె మైనర్‌గా ఉన్నప్పుడు అసభ్యకరంగా ప్రవర్తించగా, పోక్సో కేసు నమోదైంది. ఆ కేసును మేమే కొట్టేయించాలని బెదిరిస్తున్నారు. లేకపోతే చంపేస్తామని హెచ్చరిస్తున్నారు. బ్రాహ్మణ మహిళను అని కూడా చూడకుండా ఇంటికి వచ్చి అసభ్యకరంగా వేధిస్తున్నారు. వారి ఆగడాలపై నా కుమార్తె కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. పైగా మీపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఫిర్యాదు ఉందని మమ్మల్నే బెదిరిస్తున్నారు. చంద్రబాబు, పవన్, లోకేశ్ జోక్యం చేసుకుని మాకు రక్షణ కల్పించాలి. లేకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం' అని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, సంతోషలక్ష్మి, ఆమె కుమార్తె తమకు ఎటువంటి ఫిర్యాదు ఇవ్వలేదని, తాను వారిని బెదిరించలేదని కొత్తపేట ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు.

ఆదుకోండి మహాప్రభో..

ఎస్సీల జీవనోపాధిపై 'తమ్ముళ్ల' దుర్మార్గం

- వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల షాపుల నేలమట్టం
- ఇనుప చువ్వలు అమ్మి ఆ నగదుతో పార్టీ చేసుకున్న వైనం


దుకాణాలను కూల్చేస్తున్న దృశ్యం

సాక్షి టాస్క్‌ఫోర్స్: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా ఉన్న దళితుల షాపులను టీడీపీ నేతలు కూల్చేశారు. జీవనోపాధి లేకుండా చేయడంతో 3 ఎస్సీ కుటుంబాలు లబోదిబోమంటున్నాయి. కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలం తడకలూరిలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన రవికుమార్, చిట్టిబాబు, రాజ్‌కుమార్ గ్రామ పంచాయతీకి చెందిన 3 దుకాణాల్లో టిఫిన్, కూల్ డ్రింక్స్ విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. పంచాయతీకి అద్దెలు సకాలంలో చెల్లిస్తుంటారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆ పార్టీ నాయకులు గ్రామంలో రెచ్చిపోతున్నారు. సర్పంచ్ వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు కావడంతో ఆయనపై దాడి చేశారు. అలాగే, రవికుమార్, చిట్టిబాబు, రాజ్‌కుమార్ దుకాణాలు ఖాళీ చేయలేదని మంగళవారం సాయంత్రం దారుణానికి ఒడిగట్టారు. జేసీబీని తీసుకొచ్చి 3 షాపులను నేటమట్టం చేశారు. అప్పటికప్పుడే ట్రాక్టర్లలో మట్టిని తరలించేశారు. దుకాణాలు కూల్చేసిన అవశేషాలు అక్కడ లేకుండా చేశారు. షాపులు కూల్చగా వచ్చిన ఇనుప చువ్వలను అమ్మేసి ఆ నగదుతో మందు పార్టీ చేసుకున్నారు.

బరితెగించిన పసుపు గూండాలు

వ్యాపారి ఇంటిపై 20 మంది దాడి, ఇల్లు, సామగ్రి ధ్వంసం


వ్యాపారి భార్యను బెదిరిస్తున్న పూర్ణచంద్రరావు

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లా నరసరావుపేటలో టీడీపీ గూండాలు బరితెగించారు. ఆర్యవైశ్య వ్యాపారి ఇంటిపై 20 మంది టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడి ఇల్లు ధ్వంసం చేసి అడ్డు వచ్చిన మహిళలపై విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. పోలీసుల సమక్షంలోనే దాడి చేసి అధికార పార్టీ గూండాయిజాన్ని ప్రదర్శించారు. ప్రకాష్ నగర్ 60 అడుగుల రోడ్డు సమీపంలో శివసాయి ట్రేడర్స్ పేరిట నోముల మల్లికార్జునరావు సిగరెట్, పాన్‌మసాలా హోల్‌సేల్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరించే అల్లం పూర్ణచంద్రరావు రెండేళ్ల క్రితం మల్లికార్జునరావు వద్ద రూ.30 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. వ్యాపారంలో నష్టం వచ్చిందని సాకు చూపి పూర్ణచంద్రరావు డబ్బులు తిరిగి చెల్లించకపోవటంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. పూర్ణచంద్రరావు రూ.20 లక్షలు మల్లికార్జునరావుకు ఇచ్చేలా పెద్దల సమక్షంలో ఒప్పందం కుదుర్చుకొని డబ్బులు చెల్లించాడు. మనసులో అక్కసు పెంచుకున్న పూర్ణచంద్రరావు టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తన వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని మల్లికార్జునరావుపై బెదిరింపులకు పాల్పడ్డాడు. మంగళవారం 20 మంది అనుచరులతో పూర్ణచంద్రరావు కర్రలు తీసుకొని మల్లికార్జునరావు ఇంటిపై దాడి చేసి సామగ్రి, పూల కుండీలను ధ్వంసం చేసి సీసీ కెమెరాలను పగుల గొట్టారు. అనంతరం మల్లికార్జునరావు దంపతులపై విచక్షణారహితంగా దాడి చేశారు. అధికారం మాది.. ఊరు విడిచి వెళ్లిపోండి.. ఎమ్మెల్యే గారు వెళ్లి దాడి చేయమన్నాడు..అని చెప్పి దాడిలో పాల్గొన్న గూండాలు బెదిరింపులకు పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. దాడి చేస్తున్న వారిని అక్కడి నుంచి వెళ్లాలని సూచించినా పట్టించుకోకుండా పోలీసుల సమక్షంలోనే మరో మారు కర్రలతో మల్లికార్జునరావు కుటుంబ సభ్యులపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో పూర్ణచంద్రరావు, జుజ్జూరి సురేంద్రస్వామి, తమ్మిశెట్టి ధనరాజ్, సింహాద్రి గంగాధర్‌రావుతోపాటు మరో 20 మందిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి తెలిపారు. పూర్ణచంద్రరావు పలు అక్రమ గుట్కా కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గుట్కా వ్యాపారం అంతా తానే చేయాలని మిగిలిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మంత్రి లోకేశ్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు గోపీచంద్ విజ్ఞప్తి



నరసరావుపేట: రెడ్‌బుక్ మార్కు హత్యాకాండలు కొనసాగిస్తున్న అధికార కూటమి అగ్రనేతలు, మంత్రి నారా లోకేశ్‌పై రాష్ట్ర గవర్నర్, హైకోర్టు, సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి, చట్ట ప్రకారం శిక్షించాలని గాంధీ స్మారక సమితి అధ్యక్షుడు ఈదర గోపీచంద్ మంగళవారం ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మానవ హక్కుల సంఘం, బాలల హక్కుల కమిషన్, మహిళా కమిషన్ కూడా స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. యువగళం పాదయాత్రలో లోకేశ్ రెడ్‌బుక్ చూపించి, హెచ్చరించడమేకాక, గెలిచిన వెంటనే పలుచోట్ల అభ్యంతరకర ఫ్లెక్సీలు ప్రదర్శించి మరీ రాష్ట్రంలో హింసాకాండ సృష్టించడం అతిపెద్ద నేరమని ఆరోపించారు. బాధితులందరూ దళితులు, పేదలు, మైనార్టీలు, వైఎస్సార్‌సీపీ వారైనందున, మాజీ సీఎం వైఎస్ జగన్, ఇతర ప్రజాస్వామికవాదులు బాధితుల పక్షాన వెంటనే న్యాయ పోరాటం చేసి, దాడులకు అడ్డుకట్ట వేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కోడికి నాలుగు కాళ్లు



ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలం కోయరాజమండ్రిలో బానోతు బాబూరావుకు చెందిన కోడి పెట్టకు 4 కాళ్లతో కోడి పిల్ల పుట్టింది. దీనిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. దీనిపై పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు సాయిబుచ్చారావును వివరణ కోరగా కొన్ని జన్యుపరమైన లోపాల కారణంగా కోడి పిల్ల 4 కాళ్లతో జన్మించే అవకాశం ఉందని చెప్పారు.

– బుట్టాయగూడెం

ఇదేమి చోద్యం!

ఎస్పీ కార్యాలయంలో మీ కోసం బోర్డుకు పచ్చరంగు


మీకోసం కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ. వెనుక పచ్చ రంగుతో బోర్డు

అధికారంలోకి వచ్చాక టీడీపీ నేతలు అన్ని కార్యక్రమాల్లోనూ పచ్చరంగు పులిమేస్తున్నారు. పచ్చనేతల ఆదేశాలను శిరసావహిస్తున్న పోలీసులు మరో అడుగు ముందుకేసి ఏకంగా జిల్లా ఎస్పీ పాల్గొనే ప్రజా సమస్యల పరిష్కార వేదిక బోర్డును పచ్చరంగుతో నింపేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు ఈ బోర్డు చూసి ఇదేమి చోద్యం అని ముక్కున వేలేసుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

పరుగుల బుడతడు

ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం



చిత్తూరుకు చెందిన రెండేళ్ల బాలుడు శరణ్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అందర్నీ అబ్బురపరిచాడు. చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లికి చెందిన స్వరూప్, ప్రియాంక దంపతుల కుమారుడు శరణ్ (21 నెలలు). ఈ చిచ్చర పిడుగు 50 మీటర్ల పరుగు పందెం 28 సెకండ్లలో పూర్తి చేసి రికార్డు నమోదు చేశాడు. జూలైలో జరిగిన ఈ పందేనికి సంబంధించిన వీడియో రికార్డు చేసిన తల్లిదండ్రులు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారికి దరఖాస్తు కోసం పంపారు. దరఖాస్తు పరిశీలించిన ఆ సంస్థ బాలుడు రికార్డును నమోదు చేసినట్లు అందుకు సంబంధించిన పత్రాన్ని తల్లిదండ్రులకు పంపారు. రెండు రోజుల కిందట ఆ పత్రాన్ని వారు ఢిల్లీలో అందుకున్నారు.

– చిత్తూరు రూరల్

రాష్ట్రంలో దాడులపై జాతీయ మహిళా కమిషన్‌కు నివేదిక


రేఖ శర్మతో వెంకటలక్ష్మి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులపై జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖ శర్మకు ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి నివేదిక అందించారు. జాతీయ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీ వచ్చిన వెంకటలక్ష్మి మంగళవారం జాతీయ మహిళా కమిషన్ కార్యాలయంలో రేఖ శర్మను కలుసుకుని పలు అంశాలను వివరించారు.


'కిక్కు'దిగేలా రగడ!

పంపకాల విషయంలో 'తమ్ముళ్ల' వాగ్వాదం

సాక్షి టాస్క్‌ఫోర్స్: పంపకాల విషయంలో తేడా వచ్చి 'తమ్ముళ్లు' తన్ను కున్న ఘటన నంద్యాల జిల్లా, శిరివెళ్లలో చోటుచేసుకుంది. మండలంలో ఉన్న నాలుగు మద్యం దుకాణాల్లో పనిచేసే వారు ఒక్కొక్కరు రూ.2వేలు ఇవ్వాలని అధికార పార్టీ నేతలు హుకుం జారీ చేశారు. దీంతో ఎర్రగుంట్ల మద్యం దుకాణంలో పనిచేసే యువకుడు తాను అంత ఇవ్వలేనని చెప్పడంతో అతని స్థానంలో శిరివెళ్లకు చెందిన అలవాల రాజేశ్ ఉద్యోగంలో చేరాడు. మండలంలోని నాలుగు మద్యం దుకాణాల నుంచి బ్లాక్‌లో విక్రయించేందుకు ఒక్కో కేస్‌కు రూ.500 చొప్పున ఇచ్చేలా ఒప్పందం ఉంది. ఈ డబ్బు వసూలు చేసేందుకు ఓ టీడీపీ నేత శిరివెళ్లకు చెందిన సుబ్బయ్య, నవీన్‌ను నియమించుకున్నాడు. వారం రోజులుగా ఎర్రగుంట్ల మద్యం దుకాణంలో పనిచేసే రాజేశ్ డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించినట్లు వారికి తెలిసింది. అడిగితే... తానూ టీడీపీనేతనేనని, ఎందుకు డబ్బులు ఇవ్వాలని సుబ్బయ్య, నవీన్‌లతో గొడవపడ్డట్లు సమాచారం. ఈ క్రమంలోనే సోమవారం రాత్రి శిరివెళ్లలో ఓ రచ్చబండ దగ్గర కూర్చున్న సుబ్బయ్య, నవీన్‌పై కొంత మంది టీడీపీ శ్రేణులతో దాడి చేశారు. ఈ ఘటనలో నవీన్‌కు స్వల్పగాయాలు కావడంతో స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

కొణతాల బంధువుల భూ ఆక్రమణలపై చర్యలేవి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: టీడీపీ అధికారంలోకి వచ్చిన 45 రోజుల్లోనే అనకాపల్లిలో దేవస్థానం భూమిని ఆక్రమించిన ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ బంధువులపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమైన భూములపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

వైఎస్ జగన్ పిటిషన్‌పై

హైకోర్టు స్పందన

- శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శికి నోటీసులు
- ప్రతిపక్షనేత హోదాపై పూర్తివివరాలు ఇవ్వాలని ఆదేశం



సాక్షి, అమరావతి: శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ శాసనసభ పక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. జగన్‌కు ప్రతిపక్ష నేత హోదానిచ్చే విషయంలో పూర్తి వివరాలను కోర్టు ముందుంచాలంది. చట్ట ప్రకారం శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేలా శాసనసభ కార్యదర్శి, స్పీకర్ కార్యదర్శిని ఆదేశించాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్షనేత జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంలో స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసన వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి విచారణ జరిపారు. విచారణ మొదలు కాగానే, జగన్ తరఫు సీనియర్ న్యాయవాది సుబ్రహ్మణ్య శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ, పిటిషనర్ వైఎస్సార్‌సీపీ శాసనసభ పక్ష నేత అని తెలిపారు. చట్ట ప్రకారం ఆయనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంలో చట్ట నిబంధనలు చాలా స్పష్టంగా ఉన్నాయని వివరించారు. ఈ సమయంలో న్యాయమూర్తి స్పందిస్తూ, మధ్యంతర ఉత్తర్వుల కోసం అభ్యర్థించని నేపథ్యంలో, ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉందన్నారు. ప్రతివాదులకు నోటీసులు జారీ చేసి, కౌంటర్ల దాఖలుకు ఆదేశాలిస్తామని తెలిపారు.

స్పీకర్‌కు నోటీసులు ఇవ్వొచ్చు

ఈ సమయంలో న్యాయ, శాసన వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శి తరఫున హాజరవుతున్న అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ జోక్యం చేసుకుంటూ, జగన్ తన వ్యాజ్యంలో అయ్యన్నపాత్రుడు, పయ్యావుల కేశవ్‌లను వ్యక్తిగత హోదాలో ప్రతివాదులుగా చేర్చారని.. ఈ హోదాలో వారు ప్రతివాదులుగా ఎంత మాత్రం అవసరం లేదని తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ, ప్రతిపక్ష నేత హోదా విషయంలో నిర్ణయం తీసుకోవాల్సింది ఎవరని ప్రశ్నించారు. స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని దమ్మాలపాటి తెలిపారు. న్యాయమూర్తి స్పందిస్తూ, స్పీకర్‌కు న్యాయస్థానాలు నోటీసులు ఇవ్వొచ్చా? అని ప్రశ్నించారు. శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ, ఇవ్వొచ్చని స్పష్టం చేశారు. దమ్మాలపాటి స్పందిస్తూ.. న్యాయ, శాసన వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదర్శికి నోటీసులు ఇవ్వాలని, ముందు విచారణార్హతపై తేల్చాలని కోర్టును కోరారు. విచారణార్హతపై తేల్చిన తర్వాత అవసరం అనుకుంటే అప్పుడు మిగిలిన ప్రతివాదులకు నోటీసులు ఇవ్వొచ్చని ప్రతిపాదించారు. శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ.. స్పీకర్‌కు నోటీసులు ఇవ్వకుండా ఎలాంటి నిషేధం లేదన్నారు. స్పీకర్‌కు నోటీసులు ఇచ్చిన ఉదంతాలున్నాయని చెప్పారు. మహారాష్ట్రలో ఎన్‌సీపీ చీలిక వ్యవహారంలో సుప్రీంకోర్టు ఆ రాష్ట్ర స్పీకర్‌కు నోటీసులు ఇచ్చిందని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు.

స్పీకర్ నిర్ణయం తీసుకున్నారా? లేదా? అన్నదే ముఖ్యం

న్యాయమూర్తి స్పందిస్తూ.. జగన్ ఇచ్చిన వినతి పత్రంపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారా? లేదా? అన్నదే ఇక్కడ ముఖ్యమని, అందువల్ల ఆ విషయంపై స్పష్టత కోసం స్పీకర్ కార్యదర్శి, శాసనసభ కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తానని తెలిపారు. దమ్మాలపాటి జోక్యం చేసుకుంటూ.. అసలు స్పీకర్‌కు జగన్ వినతి పత్రం సమర్పించలేదన్నారు. శ్రీరామ్ జోక్యం చేసుకుంటూ, వినతి పత్రం ఇచ్చామని, దానిని తమ వ్యాజ్యంతో జత చేసి కోర్టు ముందుంచామని చెప్పారు. అందరి వాదనలు విన్న న్యాయమూర్తి.. స్పీకర్ కార్యదర్శి, శాసనసభ కార్యదర్శికి నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. వ్యక్తిగతంగా వారికి నోటీసులు అందచేసేందుకు పిటిషనర్‌కు సైతం న్యాయమూర్తి అనుమతినిచ్చారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఇద్దరు కార్యదర్శులను ఆదేశించారు. విచారణను మూడు వారాలకు వాయిదా వేశారు.

స్పీకర్ ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదు..

ప్రతిపక్ష నేత హోదా కావాలని స్పీకర్‌కు పిటిషనర్ వినతి పత్రం ఇచ్చారా? ఇస్తే స్పీకర్ ఏం నిర్ణయం తీసుకున్నారు? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేత హోదా కోసం జగన్.. స్పీకర్‌కు వినతి పత్రం ఇచ్చారని, అయితే స్పీకర్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని శ్రీరామ్ వివరించారు. జగన్‌కు ప్రతిపక్ష నేత హోదానిచ్చే విషయంలో పయ్యావుల కేశవ్ ప్రభుత్వ వైఖరిని మీడియా ముందు స్పష్టం చేశారని, అందువల్లే ఆయనను ఈ వ్యాజ్యంలో వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చామన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మొదటి నుంచీ జగన్ పట్ల రాజకీయ వ్యతిరేకతను, వైరిభావాన్ని ప్రదర్శిస్తున్నారని, అందుకే ఆయన్ను కూడా ప్రతివాదిగా చేర్చామని శ్రీరామ్ చెప్పారు. అందువల్ల వారికి కూడా నోటీసులు ఇవ్వాలని, తద్వారా వారి వైఖరి ఏమిటో తెలుసుకోవచ్చన్నారు. విచారణార్హతపై ప్రభుత్వం లేవనెత్తుతున్న అభ్యంతరాలు ఎంత మాత్రం చెల్లవన్నారు. నిర్దేశిత విధి విధానాలకు విరుద్ధంగా స్పీకర్ వెళుతున్నారని శ్రీరామ్ తెలిపారు.

బాబుకు చెబుతా.. మళ్లీ పేకాట ఆడిస్తా

రాష్ట్రమంతా క్లబ్‌లు తెరిపిస్తా: టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రాష్ట్రంలో మళ్లీ జూదం పురివిప్పింది. ఇప్పటికే అనధికారికంగా టీడీపీ నేతలు నిర్వహిస్తున్న జూదం, మట్కా కేంద్రాలు ప్రజలను నడిరోడ్డున పడేస్తుండగా.. ఇప్పుడు అధికారికంగా పేకాట క్లబ్‌లు తెరిచేందుకు ఆ పార్టీ ప్రజాప్రతినిధులు సిద్ధమయ్యారు. ఇందుకు అనంతపురం అర్బన్ టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్ చేసిన వ్యాఖ్యలే నిదర్శనం. రెండు రోజుల కిందట ఆయన పాల్గొన్న సమావేశానికి సంబంధించిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. ఆ సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'అనంతపురం క్లబ్‌లో దాదాపు నాలుగైదేళ్లు అయ్యింది పేకాట తీసేసి. ఇక్కడ పేకాట ఆడించేందుకు ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడాను. జిల్లాలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న క్లబ్‌లలో పేకాట ఆడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుతో మాట్లాడుతా' అంటూ పేకాట రాయుళ్లకు భరోసా ఇచ్చారు. ఒక బాధ్యత కలిగిన ఎమ్మెల్యే ఇలా పేకాటకు ముఖ్యమంత్రితో మాట్లాడి అనుమతి ఇప్పిస్తా అని చెప్పడం దారుణమని స్థానిక ప్రజలతో పాటు టీడీపీ నేతలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గం, జిల్లా అభివృద్ధి గురించి ముఖ్యమంత్రితో మాట్లాడాల్సింది పోయి.. పేకాట కోసం సీఎం వద్దకు వెళ్లావా? అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలను వ్యసనపరులను చేసి.. కుటుంబాలను నాశనం చేయాలనుకుంటున్నారా? అని మండిపడ్డారు.

లిక్కర్ మాఫియాకు అప్పగించేందుకే..

విశ్రాంత ఉద్యోగుల వినోద కార్యక్రమాలకు నెలవైన అనంతపురం క్లబ్‌ను.. జూద గృహంగా మార్చేందుకు ప్రయత్నాలు జోరుగా సాగుతున్నాయి. సుమారు 1,100 మంది వరకు సభ్యులున్న ఈ క్లబ్‌ను ఎన్నికలు నిర్వహించకుండా అధికార బలంతో టీడీపీకి చెందిన లిక్కర్ మాఫియాకు కట్టబెట్టేందుకు తీవ్రంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. అనంతపురం జిల్లాలో లిక్కర్ మాఫియాకు పెట్టింది పేరైన ఓ వ్యక్తి.. టీడీపీ అధికారంలో ఉన్న 2014–2019 సమయంలో బార్‌లు, వైన్‌షాపుల నిర్వహణ, అక్రమ మద్యం రవాణా వంటివి నిర్వహించారు. అనంతపురం క్లబ్‌ను ఆ వ్యక్తి చేతిలో పెట్టేందుకు పావులు కదుపుతున్నట్లు తెలిసింది. రిటైర్డ్ ఉద్యోగులు ఏర్పాటు చేసుకున్న క్లబ్‌ను సంఘ విద్రోహ శక్తులకు అప్పజెప్పేందుకు జరుగుతున్న కుట్రపై.. సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మేజు(కమీషన్)ల రూపంలో రోజుకు రూ.లక్షకు పైగా వసూలు చేసేందుకు పకడ్బందీగా స్థానిక లిక్కర్ డాన్.. ఎమ్మెల్యే ద్వారా పావులు కదుపుతున్నట్లు సమాచారం. కమీషన్లతో పాటు రూముల అద్దె, అనధికారిక లిక్కర్.. ఇలా రకరకాల ఆదాయ మార్గాలు ఉండటంతో దీనిపై తీవ్ర ఆసక్తి కనబరుస్తున్నారు. ఇందు కోసం కొందరు అధికార పార్టీ నేతలకూ వాటాలు ఆఫర్ చేసినట్లు సమాచారం.

ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఈ వార్తా కథనానికి సంబంధించిన వీడియోను చూడొచ్చు.

బటన్ నొక్కి మెక్కేసిన ప్రజల సొమ్ము కక్కిస్తాం: కేఈ



కర్నూలు: రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడచిన ఐదేళ్ల కాలంలో బటన్ నొక్కి మెక్కేసిన ప్రజల సొమ్మును కక్కిస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి కేఈ కృష్ణమూర్తి అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేలాది ఎకరాల ప్రజల భూములను తన బినామీల పేర్లతో ఆక్రమించుకున్న చరిత్ర చూస్తే ఈ రాష్ట్రాన్ని ఎంతగా దోచుకున్నారో అర్థమవుతోందన్నారు. కర్నూలు జిల్లాలోని అత్యంత వెనుకబడిన ప్రాంతం పత్తికొండ నియోజకవర్గంలోని చెరువులను నింపుకునేందుకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటిని వాడుకునేలా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి రైతాంగానికి మేలు చేకూర్చేందుకు కృషి చేస్తానన్నారు.

రీసర్వేపై బాబుది దుష్ప్రచారమే

- ల్యాండ్ టైట్లింగ్ చట్టం పైనా అసత్యాలు ప్రచారం చేశారు
- ఈ రెండూ కరెక్టేనన్న విషయం ఇప్పుడు తెలుస్తోంది
- మాజీ మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: రైతులకు, ప్రజలకు మేలు చేసే భూముల రీ సర్వే, ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై చంద్రబాబు చేసింది దుష్ప్రచారమేనన్న విషయం తేలిపోయిందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. భూముల రీ సర్వే రద్దు చేస్తామన్న బాబు.. ఇప్పుడు వెనక్కి తగ్గడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, భూ సర్వేపై బాబుకు కనీస అవగాహన లేదన్న విషయం అర్థమవుతోందని అన్నారు. రైతులకు ఎంతో మేలు చేసే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ఇంకా ప్రయోగదశలోనే ఉన్నప్పటికీ, దాన్ని రద్దు చేశారని చెప్పారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంపైనా చంద్రబాబు వెనక్కి తగ్గే అవకాశం ఉందని అన్నారు. భూసర్వే, ల్యాండ్ టైట్లింగ్ చట్టం విషయంలో వైఎస్ జగన్ చేసింది కరెక్టేనన్న విషయం ఇప్పుడు అందరికీ అర్థమవుతుందని చెప్పారు. చంద్రబాబు అబద్ధంతోనే రాజ్యమేలుతాడనేది నగ్న సత్యమని, అది గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కించే అంశమని చెప్పారు. ఎన్నికల్లో గొప్పగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేక, శ్వేతపత్రాల పేరుతో తమ ప్రభుత్వంపై నిందలు మోపుతూ కాలయాపన చేస్తున్నారని ఆక్షేపించారు. సూపర్ సిక్స్ అమలు చేయాలంటే భయమేస్తోందని సీఎం చంద్రబాబు అసెంబ్లీలో చెప్పడం.. ఆయన మోసకారితనాన్ని నిరూపిస్తోందన్నారు. కేంద్రం రాష్ట్ర రాజధానికి రూ.15 వేల కోట్ల రుణం ఇప్పిస్తామని చెబితే, దానిపైనా గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇవన్నీ చూసిన ప్రజలు బాబుకు ఎందుకు ఓటు వేశామా అని పశ్చాత్తాపం పడుతున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో నంబర్ టూ అంటూ ఎవరూ ఉండరని, తమ ఏకైక నాయకుడు జగనే అని స్పష్టం చేశారు. ఆయన ఎవరికి ఏ పని అప్పజెపితే వారు ఆ పని చేస్తారన్నారు. తమ పార్టీపై ఎన్ని కుట్రలు చేసినా, అన్నింటినీ ఛేదించుకొని ముందుకు వచ్చే శక్తి సామర్థ్యాలు జగన్‌కి ఉన్నాయని చెప్పారు.

'ఆరోగ్యశ్రీ' ఆపేస్తాం..!

▶ మొదటి పేజీ తరువాయి

పేదలు సరిపెట్టుకోవాలని స్వయంగా కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తద్వారా రూ.25 లక్షల వరకూ ఉచిత వైద్యానికి భరోసానిచ్చిన ఆరోగ్యశ్రీకి పొగబెట్టి రూ.5 లక్షల వరకే పరిమితమైన కేంద్ర పథకం దయా దాక్షిణ్యాలకు ప్రజల ఆరోగ్యాన్ని వదిలేసినట్లు స్పష్టమైంది. గతంలోనూ ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేసేలా సీఎం చంద్రబాబు వ్యవహరించిన విషయం తెలిసిందే. 2014–19 మధ్య ప్రొసీజర్లు పెంచకుండా అరకొర సేవలతో పేదల ఆరోగ్యాన్ని గాలికి వదిలేశారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న ఆరోగ్యశ్రీకి 2019లో అధికారంలోకి రాగానే వైఎస్ జగన్ ప్రాణం పోశారు. వెయ్యి లోపు మాత్రమే ఉన్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను ఏకంగా 2,371కి విస్తరించారు. చికిత్స వ్యయ పరిమితిని రూ.5 లక్షలు నుంచి దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.25 లక్షలకు పెంచారు. టీడీపీ హయాంలో కేవలం 1,059 ప్రొసీజర్లు మాత్రమే ఉండగా వాటిని 3,257కి పెంచారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఐదేళ్లలో 45.10 లక్షల మందికి ఉచితంగా చికిత్సలు అందించి పథకానికి రూ.13 వేల కోట్లకు పైగా వెచ్చించారు. శస్త్ర చికిత్సలు జరిగిన 24.59 లక్షల మందికి కోలుకునే సమయంలో జీవన భృతికి ఇబ్బంది లేకుండా వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద మరో రూ.1,465 కోట్లకుపైగా సాయం అందించారు. దేశంలోనే తొలిసారిగా కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చి విపత్తు వేళ భరోసా కల్పించారు. ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లించకుండా టీడీపీ సర్కారు దిగిపోతూ బకాయి పెట్టిన దాదాపు రూ.700 కోట్లను సైతం చెల్లించారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం ఆస్పత్రులకు దాదాపు రూ.1,600 కోట్లకుపైగా బిల్లులను చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టడంతో పేదలకు ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలిచిపోయే పరిస్థితి ఉత్పన్నమైంది.

తహసీల్దార్లను సొంత డివిజన్లో నియమించవద్దు

కలెక్టర్లకు రెవెన్యూశాఖ ఆదేశాలు

సాక్షి, అమరావతి: ఎన్నికల విధుల తర్వాత సొంత జిల్లాలకు తిరిగి వచ్చిన తహసీల్దార్లను వారి సొంత రెవెన్యూ డివిజన్లలో నియమించవద్దని రెవెన్యూ శాఖ కలెక్టర్లను ఆదేశించింది. అలాగే ఎన్నికలకు ముందు వారు పనిచేసిన నియోజకవర్గాలు లేదా మండలాల్లోను నియమించవద్దని సూచించింది. ఈ మేరకు మంగళవారం ఒక మెమో జారీచేసింది. వెనక్కి వచ్చిన తహసీల్దారులకు సొంత జిల్లాలో పోస్టింగ్ ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లా కలెక్టర్, కొత్తగా ఏర్పడిన జిల్లా కలెక్టర్, అక్కడి ఆర్డీవోతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ కమిటీలు తహసీల్దారులకు నిబంధనల ప్రకారం పోస్టింగ్ ఇవ్వాలని స్పష్టం చేసింది. సొంత రెవెన్యూ డివిజన్, గతంలో పనిచేసిన నియోజకవర్గాల్లో పోస్టింగ్ ఇవ్వకూడదనే నిబంధనలకు ఇబ్బంది ఏర్పడితే ఉమ్మడి జిల్లాలను యూనిట్‌గా తీసుకోవాలని సూచించింది. తహసీల్దార్లకు పోస్టింగులు ఇచ్చే విషయంలో ఎమ్మెల్యేల సిఫార్సులను పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులు కలెక్టర్లకు అనధికారికంగా ఆదేశాలిచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.



ప్రాపంచిక బంధాల నుండి,
ప్రత్యేకించి మనం ఆరాటపడే వస్తువుల నుండి
స్వేచ్ఛ పొందే లక్షణాన్నే బుద్ధుడు విముక్తి అని అన్నాడు.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 31 జూలై 2024

కోచింగ్ కోళ్ళఫారాలు

వ్యవస్థల్ని నడిపే వ్యక్తులు చేయాల్సిన పని చేయకపోతే... విషాదం ఎలా ఉంటుందో చెప్పడానికి శనివారం సాయంత్రం ఢిల్లీలోని ఓ ప్రసిద్ధ ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో జరిగిన ఘటనే ఉదాహరణ. నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది అడుగుల లోతు బేస్‌మెంట్‌లో నడుపుతున్న స్టడీ సెంటర్‌లోకి పైపులు పగిలి నీళ్ళు వెల్లువెత్తినప్పుడు, జలదిగ్బంధంలో ముగ్గురు విద్యార్థులు ప్రాణాలు పోగొట్టుకున్న తీరు కన్నీరు తెప్పిస్తుంది. పూర్తిస్థాయి ఈ మానవ తప్పిదానికి ముగ్గురు చనిపోయారని అధికారికంగా చెబుతున్నా, సంఖ్య అంతకన్నా ఎక్కువే ఉంటుందట. పది పన్నెండు మంది కనిపించట్లేదట. కొద్దిరోజుల క్రితం పొంగిపొర్లిన వర్షపునీటి వీధిలో విద్యుదాఘాతంతో ఒక ఐఏఎస్ కోచింగ్ విద్యార్థి మరణించినప్పుడే వ్యవస్థ మేల్కొని ఉండాల్సింది. దురదృష్టవశాత్తూ అది జరగలేదు. ఇప్పుడీ తాజా ఘటనతో దేశమంతా ఉలిక్కిపడింది. గమనిస్తే, క్రిక్కిరిసిన అభ్యర్థులతో కోళ్ళఫారాలుగా మారిన కోచింగ్ సెంటర్లు, కిందికి వేలాడుతున్న కరెంట్ తీగలు, వర్షం పడితే చాలు వీధుల్లో కాలువలు కట్టే నీళ్ళు, అధ్వాన్నమైన డ్రైనేజ్ వ్యవస్థ, అవినీతికి పాల్పడి అన్నిటినీ వదిలేసిన అధికార యంత్రాంగం... అలా ఇది సామూహిక వైఫల్యం. సమష్టిగా అందరూ చేసిన పాపం.

ఒకరిద్దరు అధికారుల సస్పెన్షన్, యజమానుల లాంటి పెద్ద చేపల్ని వదిలేసి చిరుద్యోగుల అరెస్ట్, ఘటనకు దారి తీసిన కారణాలు – నివారణ చర్యలపై నివేదికకు కేంద్ర హోమ్‌శాఖ ప్రత్యేక ప్యానెల్ ఏర్పాటు లాంటివి చకచకా జరిగాయి. కానీ, పోయిన ఆ ప్రతిభావంతుల ప్రాణాలు తిరిగొస్తాయా? వారిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న తల్లితండ్రుల గర్భశోకం తీరుస్తాయా? శనివారం నుంచి విద్యార్థులు బైఠాయించి, శాంతియుత నిరసన తెలియజేస్తుంటే ప్రభుత్వాలు వారికి తగిన హామీనిచ్చి సాంత్వన పరచలేకపోవడం మరో వైఫల్యం. ఢిల్లీలో వేర్వేరు ప్రాంతాలకు విస్తరిస్తున్న ఈ విద్యార్థి నిరసనల వద్ద ప్రచారం కోసం కాసేపు కనిపించిపోతున్న టీచర్లు, పరస్పర నేరారోపణలు చేసుకుంటున్న రాజకీయ నేతలను చూస్తుంటే వెగటు పుట్టక మానదు. ప్రజలెన్నుకున్న ఢిల్లీ 'ఆప్' సర్కార్‌పై కేంద్రం పనుపున లెఫ్టినెంట్ గవర్నర్, ఆయన తైనాతీ అధికారుల పెత్తనం ఒక తప్పయితే... క్షేత్రస్థాయిలో లేకున్నా జైలు నుంచే రోజువారీ పాలన సాగిస్తానంటున్న ఢిల్లీ సీఎం మొండి వైఖరి మరో తప్పు. శిక్ష, నష్టం మాత్రం ఢిల్లీలో ప్రజలకు, పరిపాలనకు పడుతోంది.

ఢిల్లీలో పుట్టగొడుగుల్లా వెలిసిన కోచింగ్ కేంద్రాల్లో ప్రమాదాలు జరగడం ఇదేమీ తొలిసారి కాదు. ఏడాది క్రితం కూడా ఢిల్లీ ఉత్తర ప్రాంతంలోని ఓ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది. 61 మంది విద్యార్థులు గాయపడ్డారు. అప్పుడూ ఇలాగే జనాగ్రహం పెల్లుబికింది. సదరు కేంద్రం పర్మిట్ లేకుండా అక్రమంగా నడుస్తున్నట్టు అప్పట్లో అగ్నిమాపక శాఖ ప్రకటించింది. ఢిల్లీలో 600 దాకా కోచింగ్ సెంటర్లుంటే, వాటిలో 67కే అనుమతులున్నాయట. కఠిన చర్యలు తీసుకుంటామంటూ పాలకులు అప్పుడూ చెప్పారు, ఇప్పుడూ చెబుతున్నారు. కానీ, చేసింది శూన్యం. నిజానికి, 2021 నాటి ఢిల్లీ మాస్టర్ ప్లాన్, అలాగే 2016 నాటి యూనిఫైడ్ బిల్డింగ్ బైలాస్ భవనాల సెల్లార్ల వినియోగంపై స్పష్టమైన నిబంధనలు విధించాయి. అయినా సరే బేస్‌మెంట్లలో కోచింగ్ కేంద్రాలు, వాటి లైబ్రరీలు, జిమ్‌లు, షాపులు నడుస్తూనే ఉన్నాయి. హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా అనేక ప్రధాన నగరాల్లో, పట్టణాల్లో ఇలాంటి పొంచివున్న ప్రమాదాలు అనేకం. ఏ క్షణమైనా ఏదైనా జరగవచ్చని తెలిసినా, ఈ ఉల్లంఘనలపై అన్నిచోట్లా పాలకులది ఓ గుడ్డిదర్బారే!

వాహనాల పార్కింగ్, స్టోర్ రూమ్ కోసం ఉద్దేశించిన సెల్లార్లను ఇలా చట్టవ్యతిరేకంగా స్టడీ సెంటర్లుగా వాడుతూ, వందల విద్యార్థుల్ని కూర్చోబెడుతున్న వైనం పట్ల చాలాకాలంగా ఫిర్యాదులు వస్తున్నాయి. నెల క్రితం కూడా సాక్షాత్తూ ఓ విద్యార్థే ఈ సెల్లార్ల నియమోల్లంఘనపై ఢిల్లీ నగరపాలక సంస్థకు ఫిర్యాదు చేశారు. ''పెను ప్రమాదం సంభవించవచ్చు'' అని భవిష్యద్వాణిలా హెచ్చరించారు. అయినా పట్టించుకున్న నాథుడు లేడు. తక్కువ వసతులు, కనీస ఖర్చుతో ఎక్కువ సంపాదించాలన్న కోచింగ్ సెంటర్ల అత్యాశ తెలియనిది కాదు. సక్సెస్ రేటు, సెలక్టయిన వారి సంఖ్య లాంటి వివరాలు ప్రకటనల్లో ఇవ్వరాదని నిబంధనలున్నా, వాటినవి గాలికొదిలేస్తున్న వైనమూ నిత్యం చూస్తున్నదే. తప్పుడు గొప్పలు చెప్పుకొని ఆకర్షించే జిమ్మిక్కులూ తెలిసినవే. వందలాది విద్యార్థుల్ని ఒకే గదిలో కుక్కుతున్న వీటికి అడ్డూ ఆపూ లేదు. నియంత్రిత ఆర్థిక వ్యవస్థకు భిన్నమైన ఈ విద్యావ్యాపారపు మార్కెట్ ఎకానమీని అడ్డుకోలేకున్నా అమాయకుల ధన, ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా నిబంధనలతో అదుపు చేయడం పాలకులు తలుచుకుంటే కష్టం కాదు.

ఆ చిత్తశుద్ధి లేకనే సమస్య! తాజా ఘటన పార్లమెంట్‌లో చర్చ దాకా వెళ్ళడంతో నగరపాలక సంస్థ హడావిడిగా డజనుకు పైగా చట్టవిరుద్ధ కోచింగ్ సెంటర్లకు సీలు వేసింది. మరో అరడజను పేరున్న సంస్థల బేస్‌మెంట్లకు తాళాలు బిగించింది. స్థలాలను ఆక్రమించి, వరద నీటి కాల్వలపై అక్రమంగా కట్టిన నిర్మాణాలపై బుల్‌డోజర్ల ప్రయోగం మొదలుపెట్టింది. నిజానికిది నిరంతరం సాగాల్సిన ప్రక్రియ. మూడు విలువైన ప్రాణాలు పోయాక నడుం కట్టడమే విషాదం. కోచింగ్, దాని అనుబంధ వ్యాపారం కోట్లలో సాగుతూ, వేలాది విద్యార్థుల భవిష్యత్తు ముడిపడి ఉన్నా, కనీస రక్షణ, వసతులు ప్రభుత్వపరంగా కల్పించలేకపోవడం పాలకుల హ్రస్వదృష్టికి తార్కాణం. పైగా, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిర్మాణ మంత్రాన్ని నిత్యం పఠిస్తూ, వికసిత భారత గాథను లిఖించాలని చూస్తున్న పాలకులకిది శోభనివ్వదు. సరైన పట్టణ ప్రణాళిక లేకుండా కాంక్రీట్ కీకారణ్యాల్ని ప్రోత్సహిస్తే ప్రయోజనమూ లేదు. ఢిల్లీ ఘటనలు పునరావృతం కాకముందే కేంద్రం, రాష్ట్రాలు నిద్ర లేవాలి.

దీర్ఘకాలిక వృద్ధిని పెంచగలదా?

విశ్లేషణ



సుబీర్ రాయ్

2023–24 ఆర్థిక సంవత్సరంలో, ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం వృద్ధి చెందింది. తద్వారా పెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారత్ అత్యంత వేగంగా ముందుకు సాగుతున్న దేశంగా నిలబడింది. దీన్నిబట్టి, గత పదేళ్లలో సాధించినదాని పట్ల కేంద్ర ప్రభుత్వం సంతృప్తిగా ఉన్నట్టుంది! కానీ అధిక వృద్ధి ఫలాలను పెద్ద సంఖ్యలో ప్రజలు పొందుతున్నారా? బడ్జెట్ రూపకల్పన వారికి అనుగుణంగా జరిగిందా? వృద్ధి ఊపందుకున్నప్పటికీ, పేదరికం కారణంగా వినియోగ డిమాండ్ తక్కువగానే ఉంది. ఈ వృద్ధి నిలకడగా ఉండాలంటే, కార్మికులు మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. హ్రస్వ దృష్టితో చూస్తే బడ్జెట్ వాస్తవికంగానే కనబడుతుంది. కానీ దీర్ఘకాలిక వృద్ధిని నిర్ధారించే అంశాలను అది పరిష్కరించకుండా వదిలేసింది.

ప్రతి సంవత్సరం, ఆర్థిక సర్వే, బడ్జెట్‌లను ప్రభుత్వం ఒకదాని తర్వాత ఒకటి సమర్పిస్తుంది. ఈ సర్వే ద్వారా ఆర్థిక వ్యవస్థ ఎలా దూసుకుపోతోందో వివరించేందుకు ప్రయత్నిస్తుంది. బడ్జెట్ ద్వారా, తన మనస్సులో ఏ కార్యాచరణ ప్రణాళిక ఉందో వివరించడానికి ప్రయత్నిస్తుంది. రెండు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ రెండు ఉండాలి: ప్రస్తుత పరిస్థితిలో ఏమి చేయాలి? విషయాలు సరైన దిశలో వెళ్ళే అవకాశం ఉందా?

చూస్తుంటే గత పదేళ్లలో సాధించినదానిపట్ల ప్రభుత్వం సంతృప్తిగా ఉన్నట్టుంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో, ఆర్థిక వ్యవస్థ 8.2 శాతం వృద్ధి చెందింది. తద్వారా అన్ని పెద్ద ఆర్థిక వ్యవస్థలలో భారతదేశాన్ని అత్యంత వేగంగా ముందుకు కదలిపోయే దేశంగా నిలబెట్టింది. 2023లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3.2 శాతమే పెరిగింది. 2024–25లో ప్రధాన ద్రవ్యోల్బణాన్ని 4.5 శాతానికి కట్టడి చేయగలమనే విశ్వాసంతో ప్రభుత్వం ఉంది. కానీ ఈ కథ పూర్తిగా ఆశాజనకంగా లేదు. 2023–24లో రిటైల్ ద్రవ్యోల్బణం 5.4 శాతంగా ఉంది. ఆహార ద్రవ్యోల్బణం 7.5 శాతం వరకు ఉంటూ, మరింత ఆందోళనకరంగా మారింది.

మొత్తంమీద, ఈ విషయంలో బాగా పనిచేసినందున, కింది వృద్ధి వ్యూహాన్ని ఆర్థిక సర్వే సూచించింది; తద్వారా 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవచ్చని చెప్పింది: స్థిరంగా వృద్ధి చెందడానికి ప్రైవేట్ రంగం దాని సొంత మూలధనాన్ని ఏర్పాటుచేసుకోవాల్సి ఉంది. దేశంలో హరిత పరివర్తన జరగడానికి ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలి. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు తమ వృద్ధిని కొనసాగించేలా ప్రభుత్వం ఖాళీలను పూడ్చాలి. దేశం అభివృద్ధి చెందడానికి వీలుగా నైపుణ్యాల అంతరాన్ని పూరించడానికి ఒక విధానం అవసరం. ఈ విధానాన్ని రూపొందించాలంటే, రాష్ట్ర యంత్రాంగ సమర్థత, వ్యవస్థ ఒకేలా ఉండాలి.

ఇది పావు శతాబ్దానికి దీర్ఘకాలిక లక్ష్యం అయితే, మనం ఇప్పుడు ఎక్కడ నుండి ప్రారంభించాలి? ముందుగా, పన్ను చెల్లింపుదారులకు శుభవార్త. నిర్దిష్ట తగ్గింపు (స్టాండర్డ్ డిడక్షన్) రూ.50,000 నుంచి రూ.75,000కు పెంచుతున్నారు. రూ.17,000 వరకు ఉద్యోగులకు ఆదా అయ్యేలా శ్లాబుల్ని మెలితిప్పారు. ఉద్యోగాల్లో చేరేందుకు ప్రొఫెషనల్స్ ప్రోత్సాహకాలు పొందబోతున్నారు. దీని వల్ల రెండు లక్షల మంది యువకులు ప్రయోజనం పొందనున్నారు. కేవలం జీతం ఆదాయం మాత్రమే కాదు, పెట్టుబడిపై లాభాలు ఆర్జించే వారికి మూలధన లాభాలకు మినహాయింపు కూడా పెరుగుతోంది.

ఈ లెక్కన తక్కువ పన్నులు చెల్లించాల్సిన మధ్యతరగతి ప్రజలకు బడ్జెట్ తోడ్పడుతుంది. తమాషా ఏమిటంటే, ఆదాయపు



పన్ను చెల్లించే అవసరం లేని పేదలు, వారు తప్పనిసరిగా వినియోగించుకోవాల్సిన వస్తువులు అన్నింటికీ వాస్తవ చెల్లింపులు జరపాల్సి ఉంటుంది. ఇది జీఎస్టీ పరిధిలోకి వస్తుంది. ఏకాభిప్రాయం సాధించడం ఎల్లప్పుడూ కష్టమైనప్పటికీ, మరిన్ని జీఎస్టీ–అనుబంధ సంస్కరణలను కేంద్రం, రాష్ట్రాలు చేపట్టవచ్చు. అంతేకాకుండా, రాష్ట్రాలతో పంచుకోవాల్సిన అవసరం లేని సెస్ నుండి కేంద్రం ప్రయోజనం పొందడం అన్యాయం. పేద పిల్లలు చదువుకునేలా చేయడం వంటి అభివృద్ధి లక్ష్యాలను చేరుకునే ప్రాజెక్ట్‌ల కోసం సేకరించగలిగే మొత్తం ఆదాయం రాష్ట్రాలకు అవసరం.

నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూనీ, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీనీ సంతోషపెట్టడానికి అనేక భారీ ప్రాజెక్టులకు కూడా బడ్జెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన ప్రాజెక్టులలో పట్నా–పూర్నియా, బక్సర్–భాగల్పూర్ ఎక్స్‌ప్రెస్‌వేలు ఉన్నాయి. అంతేకాకుండా, బిహార్‌లోని బక్సర్ జిల్లాలో గంగా నదిపై రెండు లేన్ల వంతెనను నిర్మించనున్నారు. అదనంగా, భాగల్‌పూర్‌లోని పీర్‌పైంతిలో 2,400–మెగావాట్ల పవర్ ప్లాంట్ రానుంది. ఆంధ్రప్రదేశ్‌కు రైల్వే, రోడ్డు మార్గాల ప్రాజెక్టులను ప్రకటించారు. కొత్త రాజధాని అమరావతి అభివృద్ధికి రూ.15,000 కోట్లు ప్రకటించారు.

బడ్జెట్ అనేది రాజకీయ చర్య. దానికి స్పష్టమైన లక్ష్యం ఉంది. బీజేపీ సంకీర్ణ భాగస్వాములు, మధ్యతరగతి సంతృప్తి చెందేలా చూసుకోవడమే దాని లక్ష్యం. ప్రధాన పార్టీపై ఆధిపత్యం చలాయించే రాజకీయ వ్యాపారుల వెరపులేని ధీమా కారణంగానే సంకీర్ణ భాగస్వాములను సంతోషపెట్టాలనే లక్ష్యం నడుస్తుంటుంది. పూర్తిగా సంఖ్యల పరంగానే, చిన్న మధ్యతరగతి ఎన్నికల ఫలితాలను నిర్ణయించలేదు. పాలకవర్గం అంతిమ ఉద్దేశ్యం జనబాహుళ్యాన్ని సంతోషపెట్టడమే.

అయితే రానున్న రోజుల్లో ప్రభుత్వానికి మంచి జరగనుంది. ప్రపంచ వ్యాఖ్యాతలు కూడా భారత్ అధిక వృద్ధి రేటును ప్రశంసించారు. కానీ వృద్ధి నిలకడగా ఉండాలంటే, కార్మికులు మెరుగైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి, మంచిగా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. ఈ కీలక సమస్యలను పరిష్కరించడానికి బడ్జెట్ సంకేత పథకాలను మాత్రమే ప్రవేశపెట్టింది. అందుకే, అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లను బాగా అర్థం చేసుకున్నా, దూరదృష్టితో వ్యవహరించడం లేదనేది మొత్తం భావన.

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఏమి జరుగుతోందనే దానితో సంబంధం లేకుండా, బడ్జెట్ అంచనాలు కూడా పరిష్కరించాల్సిన మూడు సమస్యలను ఎత్తిపట్టాయి. వృద్ధి ఊపందుకున్నప్పటికీ, వినియోగ డిమాండ్ తక్కువగానే ఉంది. పైగా ఉపాధి చాలా వెనుకబడి ఉంది. అధిక ఆర్థిక వృద్ధి ఫలాలను పెద్ద సంఖ్యలో ప్రజలు పొంద లేకపోతున్నారా? ఇది కొంచెం ఎక్కువగా సాంకేతికమైనది. తక్కువ స్థాయి ద్రవ్యోల్బణం అనేది ఛేదించగలిగేటంత దృఢంగా ఉందా?

నోట్ల రద్దు, కోవిడ్–19 మహమ్మారి కారణంగా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినడంతో, వృద్ధి రేటు అనుకున్నంత ఎక్కువగా లేదని చాలా మంది వాదించారు. కాబట్టి, ఒక విధంగా, ఆర్థిక వ్యవస్థ కేవలం తేరుకోవడానికి ప్రయత్నిస్తోంది. ప్రజలు ఎక్కువ పొదుపు చేయడం వల్ల కాదు కానీ, రెండు ఎదురుదెబ్బల ఫలితంగా ఆదాయ వనరును కోల్పోయినప్పుడు వారు తీసుకున్న భారీ అప్పును తిరిగి చెల్లించడానికి ప్రయత్నిస్తున్నందున వినియోగం కుంచించుకుపోయింది. రిటైల్ ద్రవ్యోల్బణం అదుపులో ఉన్నది సమృద్ధిగా ఉన్న సరఫరాల వల్ల కాదు. ప్రజలు తాము కోరుకున్న వాటిని వినియోగించుకోలేకపోవడం వల్ల.

ఇక్కడ శక్తిమంతమైన వైరుధ్యం కూడా ఉంది. ఆర్థిక వ్యవస్థ, వ్యాపారాలు బాగా కొనసాగాలంటే, రిజర్వ్ బ్యాంక్ వడ్డీ రేట్లను తక్కువగా ఉంచాలి. అయితే, ఎక్కువ డిపాజిట్లను సంపాదించడానికి బ్యాంకులు అధిక వడ్డీ రేటును ఎలా చెల్లించగలవు? అందువల్ల, బ్యాంకులు రుణాలు, పొదుపు మధ్య అసమతుల్యతను చూస్తున్నాయి.

మొత్తంమీద, హ్రస్వ దృష్టితో చూస్తే బడ్జెట్ వాస్తవికంగానే కనబడుతుంది. కానీ ఇది మధ్యతరగతి ద్వారా, మధ్యతరగతి కోసం చేసే ఒక కసరత్తు. అది దీర్ఘకాలిక వృద్ధిని నిర్ధారించే అంశాలను పరిష్కరించకుండా వదిలివేసింది.

వ్యాసకర్త సీనియర్ ఆర్థిక విశ్లేషకులు
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పరిణతి తెలియట్లేదా?



రాహుల్ గాంధీని ఇంకా పప్పు అని అంటే, అది బెడిసికొట్టేంతగా పరిస్థితులు మారిపోయాయి. అట్లాంటి సంబోధనకు ఏ ప్రాసంగికతా లేదు. దీన్ని అంగీకరించలేనివారు తమ దృష్టికోణాన్ని మార్చుకునే నైతిక స్థైర్యం లేనివారే!

– మాధవన్ నారాయణన్, జర్నలిస్ట్

నరమేధానికి మద్దతా?



పారా చినార్ (పాకిస్తాన్)లో కొనసాగుతున్న షియాల నరమేధంలో తీవ్రవాదులకు పాకిస్తాన్ సైన్యం సహకరిస్తున్నట్టు వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. ఈ క్రూరత్వాన్ని మనం ఖండించాలి, న్యాయం కోసం డిమాండ్ చేయాలి.

– మజా మెహదీ, షియా ముస్లిం విద్యార్థి

ఎందుకు మాట్లాడరు?



గాజాలోని హమాస్ తీవ్రవాదులకు మీడియాలో వచ్చిన కవరేజీలో ఒక్క శాతం వెనిజులాకు వచ్చినా... ఐదు నిమిషాల్లో అది స్వేచ్ఛ పొందుతుంది. ప్రశ్నించిన వాళ్లను అక్కడ కాలుస్తున్నారు. లక్షలాది ప్రజల హక్కులు లాక్కున్నారు. ఆకలి, వేదనలతో దేశం అల్లాడుతోంది. అయినా లండన్, న్యూయార్క్‌లో ఏ నిరసనలూ జరగవు. అదే వెనిజులా గనక ఇజ్రాయిల్ అయివుంటే? ఇప్పటికే ఎన్ని వ్యాఖ్యానాలు వినబడేవో?

– అమ్జద్ తాహా, వ్యాఖ్యాత

ప్రేరణ మూలాలు



మేరీ కోమ్ 2012 ఒలింపిక్ కాంస్యం గెలవడం చూసిన మనూ భాకర్ బాక్సర్ అవ్వాలనుకుందట. కరణం మల్లీశ్వరి సిడ్నీ ఒలింపిక్ పతకం తనకు ఎలా స్ఫూర్తినిచ్చిందో దీపా కర్మాకర్ తన ఆత్మకథలో రాసింది. అవే క్రీడల్లోకి ఈ అథ్లెట్లు ప్రవేశించలేదు కానీ, ఒకటి చూడటం అనేది ఎలా ప్రేరణ కలిగిస్తుందో గమనించండి.

– ఋత్వికా ధర్, చిత్రకారిణి

నరకపు నొప్పి



నాకు చికున్ గున్యా వచ్చిందని ఇప్పుడే తెలిసింది. మొత్తం శరీరం ఎంత నొప్పెడుతోందంటే... నరకం!

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

ఇన్ బాక్స్

కొత్త యుద్ధం మొదలయిందా?

పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. ఒకపక్క ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య యుద్ధం నడుస్తూ ఉండగా ఇప్పుడు ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య ప్రత్యక్ష యుద్ధానికి తెర లేవబోతున్న సూచనలు కనిపిస్తున్నాయి. ఇజ్రాయెల్‌పై లెబనాన్ గత తొమ్మిది నెలలుగా దాడులు చేస్తోందనీ, తాజాగా గోలన్‌హైట్స్‌లో ఫుట్ బాల్ ఆడుతున్న చిన్నారులపై చేసిన దాడి దీనికి కొనసాగింపేననీ, ప్రతీకారం తీర్చుకుంటామనీ ఇజ్రాయెల్ ప్రకటించింది.

ఆ దాడితో మాకు సంబధం లేదని లెబనాన్ ప్రకటించినా ఇజ్రాయెల్ వినలేదు. ఇది లెబనాన్‌లోని హెజ్‌బొల్లా తీవ్రవాదుల పనే అనీ, దానికి తగిన మూల్యం లెబనాన్ చెల్లించుకోవాలనీ ఇజ్రాయెల్ ఊగిపోతూ లెబనాన్‌లోని బక్కా వ్యాలీ, కఫార్ కిలాల్లోని హెజ్‌బొల్లా స్థావరాలను ధ్వంసం చేసింది.

లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఇరాన్ ఈ సందర్భంగా హెచ్చరించింది. గోలన్ హైట్స్ రాకెట్ దాడిలో లెబనాన్ ప్రమేయం లేదనేది ఇరాన్ వాదన. ఈ వివాదం ముదిరితే విశ్వంలో అభద్రత, అస్థిరత్వం, అభివృద్ధి వంటివి కుంటు పడతాయని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి నాసర్ కనానీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కనాని మాట్లాడుతూ... ఇజ్రాయెల్ నిజానిజాలు తెలుసుకోవాలనీ, పిచ్చి పనులు చేయకుండా సభ్యత కోసం కృషి చేయాలనీ ఉద్బోధించారు. కానీ ఇజ్రాయెల్ వాసులు మాత్రం చిన్నారుల మరణం జీర్ణించుకోలేక పోతున్నారు. చనిపోయిన పిల్లల కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వచ్చిన మంత్రులను అక్కడి వారు తీవ్రంగా ప్రతిఘటించారు. దీంతో లెబనాన్‌తో పూర్తి స్థాయిలో యుద్ధం చేస్తామని ప్రకటించింది ఇజ్రాయెల్.

ఇజ్రాయెల్ కనుక లెబనాన్‌పై పూర్తి స్థాయిలో దాడి చేస్తే, ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగే ప్రమాదం ఉంది. అది ప్రపంచ ప్రజలు మరో భీకర యుద్ధ ఫలితాలను చవిచూసేందుకు దారి తీయవచ్చు. అందుకే ఇజ్రాయెల్, లెబనాన్, ఇరాన్‌లు సంయమనం పాటించి, చర్చల ద్వారా సమస్య పరిష్కరించుకుంటాయని ఆశిద్దాం.

– కనుమ ఎల్లారెడ్డి, తాడిపత్రి

కొలువుల బడ్జెట్ మాత్రం కాదు!

అభిప్రాయం



టి. మురళీధరన్

''కేంద్ర బడ్జెట్‌లో ఘనమైన లక్ష్యంతో కేటాయించిన రూ. 2 లక్షల కోట్ల ప్యాకేజీ వచ్చే ఐదేళ్లలో 4.1 కోట్ల మంది యువతకు లబ్ధి చేకూర్చనుంది. అంతేకాకుండా ఈ బడ్జెట్ ప్రత్యేకంగా విద్య, ఉద్యోగాలు, నైపుణ్యాల వృద్ధి కోసం రూ. 1.48 లక్షల కోట్లు వ్యయం చేయనుంది'' అని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్యోగాల కల్పన, నైపుణ్యాల అభివృద్ధితోపాటు ఎమ్ఎస్ఎంఈ రంగం గురించి కూడా బడ్జెట్ ప్రసంగంలో ప్రస్తావించారు. కేంద్ర బడ్జెట్–2024 అనేక విధాలుగా ప్రత్యేకమైందే. కాని అది కీలకమైన ఉద్యోగాల కల్పనలో విఫలమవడం ఖాయం. ఇది ఉద్యోగాలు సృష్టించే బడ్జెట్ కాదు.

ఉద్యోగ కల్పన దిశగా 2.1 కోట్ల మంది ఫ్రెషర్స్‌కు ప్రయోజనం చేకూర్చేలా ఒక నెల జీతం లేదా మూడు ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో రూ. 15,000 ఇవ్వనున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. దీనివల్ల వచ్చే ఐదేళ్లలో నెలకు రూ. 15 వేల వేతనంతో 2.1 కోట్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని ఆమె అంచనా వేశారు. ఇది ఊహాజనిత అంచనా మాత్రమే. ఇది ఉద్యోగాలు లభించే ప్రాంతాలకు యువత వలస పోయేట్లు మాత్రమే చేస్తుంది. కానీ వాస్తవంలో ఎలాంటి కొత్త ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం కచ్చితంగా లేదు.

మరో స్కీమ్ ఏమంటే.. తయారీ రంగం, అదేవిధంగా వ్యవస్థీకృత రంగంలో కొత్తగా ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు మేలు చేసేలా ఆ యా ఉద్యోగుల పీఎఫ్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. వ్యవస్థీకృత రంగ ఉద్యోగాల వేతనంలో పీఎఫ్ అనేది చాలా తక్కువ మొత్తం. దీని వల్ల వేతన వ్యయం కొంత తగ్గుతుంది. యజమాని మంచి వ్యక్తి అయితే ఆ మొత్తాన్ని ఉద్యోగికి ఇచ్చి వేతనం పెంచే ప్రయత్నం చేస్తాడు. అంతే కాని పీఎఫ్ ఇచ్చే స్కీమ్ ఏ రకంగానూ కొత్త ఉద్యోగాల కల్పనకు ప్రోత్సాహం ఇచ్చేది కాదు.

ఐటీఐలను అప్‌గ్రేడ్ చేయడం వల్ల నైపుణ్యాలు పెరుగుతాయి. ఎందుకంటే.. వాస్తవ నైపుణ్యాలు ఐటీఐల్లో లభించడం లేదు. ఉద్యోగంలో చేరిన తర్వాతే అవసరమైన స్కిల్స్ నేర్చుకుంటున్నారు. ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన తర్వాత సదరు అభ్యర్థికి సరైన ఉద్యోగం లభించకుంటే.. ఆ ఐటీఐ చదువు వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.



అదే విధంగా అప్రెంటిస్ స్కీమ్, ఇంటర్న్‌షిప్ స్కీమ్స్ కూడా సప్లయ్ వైపు తీసుకున్న చర్యలే తప్ప కొత్త ఉద్యోగాలు సృష్టించేవి కాదు. వాస్తవానికి వ్యాపారం విస్తరించినప్పుడే కొత్త ఉద్యోగాల కల్పన అనేది సాధ్యమవుతుంది. కొత్త మార్కెట్లు లేదా కొత్తగా డిమాండ్ పెరగడం వల్ల వ్యాపారాల విస్తరణ జరుగుతుంది. ఆర్థిక మంత్రి ఊహించినట్లు సప్లయ్ సైడ్ చర్యల వల్ల కొలువుల సృష్టి జరగదు. ఉద్యోగాల కల్పన అనేది డిమాండ్‌ను పెంచే ప్రోత్సాహకాల వల్లనే సాధ్యమవుతుంది.

అసలు మొత్తంగా ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నమే సరిగా లేదు. ఎందుకంటే... స్కిల్స్ పెంచడం, అప్రెంటిస్, ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పించడం వల్ల నైపుణ్యాలున్న యువత సంఖ్య మరింతగా పెరుగుతుంది. ఇలా స్కిల్స్ పెంచుకున్న యువతకు తక్షణమే ఉద్యోగాలు చూపించలేకపోతే అది మరింత వైఫల్యంగా మారుతుంది. కాబట్టి ప్రభుత్వం వ్యవస్థలో డిమాండ్ పెంచే చర్యలు తీసుకోవాలి.


కొత్త ఉద్యోగాలు భారీగా సృష్టించేది ఎవరు? ఐటీ రంగం కాని, పెద్ద పెద్ద కంపెనీలు కాని కాదు. వీరంతా ఇప్పుడు ఆటోమేషన్‌ను వినియోగిస్తున్నారు. వీరు భారీ సంఖ్యలో కొలువులు ఆఫర్ చేసే పరిస్థితి లేదు. ఎక్కువ మందికి ఉపాధి కల్పించేది ఎమ్ఎస్ఎంఈ రంగమే! బడ్జెట్‌లో ముద్రా లోన్ మొత్తాన్ని పది లక్షల రూపాయలకు పెంచారు. కానీ బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు వెనకంజ వేస్తుండటంతో అవి అవసరమున్న వారికి చేరడంలేదు. ఎంఎస్ ఎంఈలలో పెట్టుబడులు పెంచేలా రుణ గ్యారెంటీ స్కీమ్ మరొకటి కూడా ఉంది. కానీ దురదృష్టవశాత్తు ప్రభుత్వం పెద్ద పెద్ద కార్పొరేట్ సంస్థలకు భారీగా పన్ను రాయితీలు ఇస్తోంది. ఎంఎస్ఎంఈలకు మాత్రం తిరిగి చెల్లించే రుణాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

ఎంఎస్ఎంఈ రంగంలో వృద్ధితోపాటు లాభాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. ఈ రంగానికి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ చాలా అవసరం. వ్యాపార విస్తరణకు, వృద్ధికి, మనుగడకు సబ్సిడీ అందించాలి. జీఎస్టీ ఒకరకంగా ఎంఎస్ఎమ్ఈ రంగాన్ని దారుణంగా దెబ్బ తీసింది. కాని ఆర్థిక మంత్రి ఈ రంగం మనుగడ కోసం ఏమీ చేయడంలేదు. వడ్డీ రాయితీ తప్పితే ఎంఎస్ఎంఈ రంగానికి ఎలాంటి సబ్సిడీ అందుబాటులో లేదు. అంతిమంగా చెప్పేదేమంటే... ఎక్కువ మందికి ఉపాధి కల్పించే, అధిక సంఖ్యలో ఉద్యోగాలు సృష్టించే ఎంఎస్ఎమ్ఈ రంగ వృద్ధి, విస్తరణకు అవసరమైన ప్రోత్సాహాన్ని అందించడంలో బడ్జెట్ 2024–25 విఫలమైంది!!

వ్యాసకర్త టీఎమ్ఐ గ్రూపు ఫౌండర్ చైర్మన్

తెలుగు లోగిళ్లకు వెలుగు

ఆడపిల్లలు చదివితే ఇంటికి అరిష్టమనే రోజుల్లో పట్టుబట్టి బాలికలకు విద్య నేర్పించి తెలుగు లోగిళ్లలో వెలుగు నింపిన విద్యాదాత జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ (1793–1873). జర్మనీలోని హెల్మెస్టడ్ ప్రాంతంలో 1793 జూలై 10న జన్మించారు. అమెరికా వెళ్లి ఫిలడెల్ఫియాలో వేదాంత శాస్త్రం, యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్‌లో స్కూల్ ఆఫ్ మెడిసిన్ నుండి వైద్య విద్యలో ఎండీ పట్టా పొందారు. మెడిసిన్ చదివే రోజుల్లో సంస్కృతం నేర్చుకున్నారు. 1813–15 ప్రాంతంలో సౌత్‌వార్క్‌లోని జియోన్ స్కూల్‌లో అధ్యాపకుడిగా పనిచేశారు.



జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్

అనంతరం మిషనరీగా అభిషేకం పొంది దాదాపు 300కు పైగా సండే స్కూల్స్ నెలకొల్పారు. ఆయన చురుకుదనాన్ని గమనించిన ది సెంట్రల్ మిషనరీ సొసైటీ, మెకానిక్స్ బర్గ్ వారు భారతదేశానికి మిషనరీగా ఎంపిక చేశారు. ఆ విధంగా హయ్యర్ 1842 జూలై 31న గుంటూరు వచ్చారు. ఆనాటి గుంటూరు కలెక్టర్ హెచ్ స్టోక్స్, హయ్యర్‌కు ఆశ్రయమిచ్చారు. వచ్చిన వెంటనే తెలుగు నేర్చుకుని తొలి పాఠశాలను 1842 నవంబరులో ప్రారంభించారు. అదీ కేవలం బాలికలకు మాత్రమే. నెల గడిచేసరికి ఎనిమిదిమంది ముస్లిం బాలికలకు పాఠశాల ప్రవేశం కల్పించారు. తీవ్ర వ్యతిరేకతల మధ్య ముస్లిం బాలికల చదువు కొనసాగింది. అనంతరం అన్ని వర్గాలవారికీ ఏడు పాఠశాలలు నెలకొల్పారు. 1844 నాటికి మరో ఎనిమిది పాఠశాలలు ప్రారంభించి, 180 మందికి ప్రవేశం కల్పించారు. ఆనాటికి అందులో సగంమంది బాలికలే. కొన్ని కుటుంబాల ఆడపిల్లలు చదువుతున్నారని వెలివేశారు. వారి రక్షణ కోసం వసతి కల్పించి, తొలి ఉచిత హాస్టల్‌ను ఏర్పాటుచేశారు.

ఆ కాలంలో ప్రసూతి సమయంలో సరైన వైద్యం లభించక తల్లీపిల్లలు మరణించేవాళ్లే ఎక్కువ. అందుకే గుంటూరు కొత్తపేటలో 1843లో ఉచిత వైద్యాలయాన్ని తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఆ పైన హయ్యర్ అభ్యర్థన మేరకు అన్నా శారా కుగ్లర్‌తో గుంటూరులో ఒక వైద్యశిబిరాన్ని మహిళల కోసం నిర్వహించారు.

1845 నాటికి రాజమండ్రి, భీమవరంలో పాఠశాలలను నెలకొల్పారు. ఆ పరిసర ప్రాంతాల్లోనే వైద్యశాలలు ప్రారంభించారు. హయ్యర్ పరిచర్యకు తోడుగా వాల్టర్‌గస్, లూయిస్ మెనోవాలెట్, విలియం గ్రోయినింగ్, ఆగస్టస్ హైనీ వంటివారు వచ్చారు. మహిళా విద్యకు ఆగ్నెస్ పాండే, ఎమిలీ స్కాటన్ లాంటి వాళ్లు కృషిచేశారు. తెనాలి ప్రాంతంలో మెకాలె దంపతులు, డుంకుల్ బర్గర్; రేపల్లెలో హోప్‌లాంటి వాళ్లు అనంతర కాలంలో విద్యావ్యాప్తికి దోహదపడ్డారు. అలా ఆయన విద్య, వైద్య పరిచర్య ఆంధ్ర దేశమంతటా కొనసాగింది.

ఆయన అనంతరం ఆంధ్ర ఎవాంజెలికల్ లూథరన్ చర్చిగా రూపుదిద్దుకున్న సంస్థలో నేటికి 35 లక్షలమంది సభ్యులు ఉన్నారు. అయిదు వేల దేవాలయాలున్నాయి. హయ్యర్ అనారోగ్య కారణాలతో తిరిగి అమెరికా వెళ్లారు. 1873లో 80 ఏళ్ల వయసులో పెన్సిల్వేనియాలో మరణించారు. ఆయన స్మృత్యర్థం ప్రతి ఏటా జూలై 31వ తేదీన లూథరన్ సంస్థలో సువార్త దినంగా ఆచరిస్తారు.

– ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, క్రైస్తవ సాహిత్య పరిశోధకులు, తెనాలి
(జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ స్మృత్యర్థం లూథరన్ సంస్థలో నేడు సువార్త దినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: బ.ఏకాదశి సా.5.23 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: రోహిణి ప.12.37 వరకు, తదుపరి మృగశిర, వర్జ్యం: సా.6.07 నుండి 7.42 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.40 నుండి 12.32 వరకు, అమృత ఘడియలు: రా.3.32 నుండి 5.04 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.42, సూర్యాస్తమయం: 6.31.

క్లుప్తంగా...

హోటళ్లు పరిశుభ్రంగా ఉండాలి

- టీటీడీ ఈవో శ్యామలరావు



తిరుమల: తిరుమలకు వచ్చే భక్తులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన ఆహారం అందించాలనే ఉద్దేశంతో పెద్ద, చిన్న హోటళ్లతో సహా అన్ని తినుబండారాల విక్రయ ప్రాంతాల్లో వ్యర్థాలను తొలగించేందుకు రెండు చెత్త బిన్ల వ్యవస్థను నిర్వహించాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు ఆదేశించారు. తిరుపతి పద్మావతి విశ్రాంతి భవనంలోని సమావేశ మందిరంలో పెద్ద, జనతా క్యాంటీన్లు, ఏపీటీడీసీ హోటళ్లపై సోమవారం సమీక్షా సమావేశం జరిగింది. ఈవో మాట్లాడుతూ తిరుమలలోని అన్ని హోటళ్లలో చెత్తను తడిచెత్త, పొడి చెత్తగా సేకరించాలన్నారు. తమ హోటల్ ఆవరణలో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా వ్యర్థ పదార్థాలను ఎప్పటికప్పుడు తరలించాలని చెప్పారు. తిరుమలలోని అన్ని క్యాంటీన్ల వారికి ఆగస్టు 5 తర్వాత ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ శిక్షణ ఇస్తుందన్నారు. నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అన్నప్రసాదం, దాతల విభాగం, ఆరోగ్య శాఖలపైనా ఈవో సమీక్షించారు. అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి పాల్గొన్నారు.


రేపటి నుంచి ఇష్టకామేశ్వరి దర్శనం నిలిపివేత

- జంగిల్ సఫారీకీ బ్రేక్



శ్రీశైలం ప్రాజెక్ట్/పెద్దదోర్నాల: శ్రీశైలం అడవుల్లో కొలువైన ఇష్టకామేశ్వరి మాత దైవదర్శనాన్ని ఆగస్టు 1 నుంచి సెప్టెంబరు 31 వరకు నిలిపివేయనున్నట్లు నెక్కంటి ఫారెస్ట్ రేంజర్ పీఎండీ.ఆరిఫ్‌ఖాన్ మంగళవారం తెలిపారు. పులుల సాన్నిహిత్యం, పునరుత్పత్తి కాలం నేపథ్యంలో నేషనల్ టైగర్ కన్జర్వేషన్ అథారిటీ ఆదేశాల మేరకు భక్తులను దర్శనానికి అనుమతించడం లేదన్నారు. అలాగే నల్లమల అభయారణ్యంలో ఉన్న ఎకో టూరిజానికి సంబంధించిన జంగిల్ సఫారీకి కూడా నెల రోజులు విరామం ఇవ్వనున్నట్లు పెద్దదోర్నాల రేంజి అధికారి విశ్వేశ్వరరావు తెలిపారు.

రేపు శ్రీశైలానికి సీఎం బాబు




శ్రీశైలం టెంపుల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం శ్రీశైలంలో పర్యటించనున్నారు. ఉదయం విజయవాడలోని ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30గంటలకు సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి శ్రీశైలం చేరుకుని శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం శ్రీశైలం డ్యాం చేరుకుని కృష్ణానదికి జలహారతి ఇస్తారు. తరువాత శ్రీశైలం కుడిగట్టు జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించి విజయవాడ పయనమవుతారు.

మహిళపై జనసేన నాయకుడి దౌర్జన్యం



తిరుపతి (అలిపిరి): కపిలతీర్థంలోని దుకాణ సముదాయంలో వ్యాపారం చేస్తోన్న విజయవాడకు చెందిన అంజలిపై తిరుపతిలో జనసేన నాయకుడిగా చెలామణి అవుతున్న హరి అనే ఓ వ్యక్తి సోమవారం దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దుకాణాన్ని ఖాళీ చేయకుంటే దాడిచేస్తామని..ఖాళీ చేసి వెళ్లిపోవాలని బెదిరించినట్లు బాధితురాలు అంజలి మీడియాకు చెప్పారు. గిరిజన సంక్షేమం కింద టెండర్ ద్వారా షాపు దక్కించుకున్నామని..ఏడాదిన్నర నుంచి దుకాణం నడుపుకుంటున్నామని..తాను జనసేన నాయకుడు అని 10 రోజులుగా వస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నాడని తెలిపింది. తాను ఏ పార్టీకి సంబంధం లేకుండా దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నానని, తనపై జనసేన నాయకుడు అంటూ దౌర్జన్యం చేస్తున్నారని.. 100 కి కాల్ చేసి పోలీసులను ఆశ్రయించే లోపు వెళ్లిపోయారని, అధికారులు..పోలీసులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరింది.

20 ఏళ్లు శిక్షపడిన ఖైదీ ఆత్మహత్య



ఆరిలోవ (విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారంలో ఇరవై ఏళ్లు శిక్షపడిన ఓ ఖైదీ బలవన్మరణానికి పాల్పడ్డాడు. జైల్ సూపరింటెండెంట్ ఎస్. కిశోర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ మైనర్ బాలికపై 2020లో అత్యాచారానికి పాల్పడిన విశాఖ జిల్లా ఆనందపురం మండలం, పీకే గ్రామానికి చెందిన ఉప్పాడ గౌరీశంకరరావు (21)కు ఇటీవల పోక్సో ప్రత్యేక న్యాయస్థానం 20ఏళ్ల జైలుశిక్ష విధించింది. దీంతో జైలు అధికారులు అతనికి కొద్దిరోజులపాటు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో.. మంగళవారం సాయంత్రం శంకరరావు మరుగుదొడ్డికి వెళ్లి లోపల గడిపెట్టుకున్నాడు. నైట్‌ప్యాంట్ లాడాతో కిటికీ గజాలకు కట్టి మెడకు ఉరివేసుకున్నాడు. తోటి ఖైదీలు ఇది పసిగట్టి మరుగుదొడ్డి తలుపులు తెరిచి చూడగా.. శంకరరావు కిందపడి కొనఊపిరితో కనిపించాడు. దీంతో జైలు సిబ్బంది అతనిని హుటాహుటిన కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతిచెందాడు.

అల్లికవా.. రంగవల్లివా!



లేసు పార్కులో తయారయ్యే ఉత్పత్తులు

నరసాపురం లేసు పార్కుకు భౌగోళిక గుర్తింపు

- పారిస్‌లో ఒలింపిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులకు బహుమతిగా నరసాపురం లేసులు
- గుబాళించిన లేసు అల్లికల ఖ్యాతి

నరసాపురం: నరసాపురం లేసులకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్–జీఐ) లభించింది. కేంద్ర జౌళి శాఖ సిఫార్సుల మేరకు నరసాపురం మండలం సీతారామపురంలోని లేసు పార్కుకు కేంద్ర ప్రభుత్వం భౌగోళిక గుర్తింపు ఇచ్చింది. ఫ్రాన్స్ వేదికగా పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌కు హాజరయ్యే క్రీడాకారులకు బహూకరించేందుకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం లేసు ఉత్పత్తులు ఎంపికై ప్రపంచ దృష్టిని ఆకర్షించాయి. నాలుగు నెలల క్రితం ఈ ఘనత సాధించగా.. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని జౌళి శాఖ సిఫార్సుల మేరకు మన కేంద్ర ప్రభుత్వం నరసాపురం మండలం సీతారామపురంలోని లేసు పార్కుకు భౌగోళిక గుర్తింపు లభించింది. 1930–35 కాలంలో లండన్ వీధుల్లో నరసాపురం లేసు ఉత్పత్తుల అమ్మకాలు జరిగేవి. మళ్లీ ఇన్నాళ్లకు నరసాపురం లేసు అల్లికలు తమ ప్రాముఖ్యతను నిలుపుకొని ముందుకెళ్లడం విశేషం.


కష్టమంతా మహిళలదే

కళా నైపుణ్యంతో విశ్వ ఖ్యాతిని ఆర్జించిన లేసు పరిశ్రమలో కష్టం మొత్తం మహిళలదే. కనీస అక్షర జ్ఞానం కూడా లేని మహిళలదే కీలక పాత్ర. లేసు అల్లికల్లో శ్రమించే మహిళలకు కష్టానికి తగ్గ ఫలితం దక్కేది కాదు. వారు అల్లే లేసులు ఏ దేశాలకు వెళుతున్నాయో, వాటి రేటు అక్కడ ఎంత ఉంటుందో కూడా వీరికి తెలియదు. కమీషన్‌దారులు కేజీ దారంతో అల్లితే ఇంత అని కూలీ చెల్లిస్తారు. కేజీ దారం అల్లడానికి ఒక మహిళ రోజుకు ఐదారు గంటలు పనిచేస్తే 15 రోజుల సమయం పడుతుంది. కేజీ దారం అల్లడానికి రూ.200 నుంచి డిజైన్‌ను బట్టి రూ.500 వరకు చెల్లిస్తారు. అంటే నెలకు రూ.1,500 నుంచి రూ.2,000 వరకు మాత్రమే అల్లేవారికి దక్కుతాయి. నరసాపురం, రాజోలు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎనిమిదేళ్ల బాలికల నుంచి 80 ఏళ్ల వృద్ధుల వరకు గిన్నెలో దారం తోడుకుని లేసు కుట్టుకుంటూ ఇప్పటికీ కనిపిస్తారు. లేసు అల్లే మహిళల్లో మార్కెట్ నైపుణ్యాలు పెంచడం, అధునాతన డిజైన్లలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారికి మేలు జరుగుతుందని గుర్తించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నరసాపురంలో 2005లో లేస్ పార్కు, ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ నెలకొల్పారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో లేసు నిర్వహణ సాగేలా చర్యలు తీసుకున్నారు. లేసు పార్కు ప్రారంభమైన తరువాతే నరసాపురంలో ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ ప్రారంభమైంది. దీంతో లేసులు అల్లే మహిళలకు ఆర్థికంగా గిట్టుబాటు అవుతోంది. వైఎస్సార్ నెలకొల్పిన లేసు పార్కుకు ఇప్పుడు భౌగోళిక గుర్తింపు రావడం విశేషం.



భౌగోళిక గుర్తింపు పొందిన నరసాపురం సీతారామపురం లేసు పార్కు





భౌగోళిక గుర్తింపు ఇస్తూ పంపిన సర్టిఫికెట్

ఇది అరుదైన ఘనత



లేసు పార్కుకు భౌగోళిక గుర్తింపు దక్కడం అరుదైన ఘనత. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో లేసు పార్కుకు మరింత గుర్తింపు లభిస్తుంది. లేసు పార్కు వైభవం, నరసాపురం లేసు ఉత్పత్తుల ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతున్నాయి. లేసు పరిశ్రమ అభివృద్ధికి ఇవి మంచి రోజులు. మాపై బాధ్యత మరింత పెరిగింది. – ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ

ఇదీ నరసాపురం లేసు చరిత్ర

సుమారు 200 సంవత్సరాల క్రితం స్వీడన్ మిషనరీ సంస్థలు ఇక్కడకు వచ్చి, స్థానిక మహిళలతో పరిచయాలు పెంచుకోవడంలో భాగంగా లేసు అల్లికలను పరిచయం చేశాయి. తరువాత కాలంలో ఇది పెద్ద పరిశ్రమగా మారింది. అమెరికా సహా యూరప్ దేశాల్లో నరసాపురం ప్రాంత లేసు అల్లికలనే వినియోగిస్తారు. దిండ్లు, సోఫా సెట్, డైనింగ్ టేబుల్స్, డోర్ కర్టెన్స్‌పై వీటిని వాడతారు. విదేశీయులు ధరించే దుస్తులుగా కూడా లేసు అల్లికలకు ప్రాధాన్యం ఉంది. యూరప్ దేశాల్లో లేసు గార్మెంట్స్ అంటే ఎనలేని క్రేజ్. అనేక అబ్బురపరిచే డిజైన్లలో వీటిని తయారు చేస్తారు. అమెరికా, బ్రిటన్, హాలెండ్, జపాన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, స్వీడన్, జర్మనీ తదితర దేశాలకు లేసు అల్లికలు ఎగుమతి అవుతున్నాయి.

వివేకా హత్య కేసుపై కథనాలు ఎలా ప్రచురిస్తారు?

- ఆ కేసు న్యాయస్థానం ముందు విచారణలో ఉంది
- ఏకంగా ట్రయల్ కూడా నిర్వహించేస్తున్నారు
- తీర్పులు కూడా ఇచ్చేస్తూ ప్రజలను ప్రభావితం చేస్తున్నారు
- ఘటన వెనుక ఎవరున్నారో తేల్చాల్సింది దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలే
- ఆంధ్రజ్యోతి యాజమాన్యాన్ని నిలదీసిన హైకోర్టు
- రాధాకృష్ణ, శ్రీనివాస్‌పై విచారణ ప్రొసీడింగ్స్ నిలుపుదల
- తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



సాక్షి, అమరావతి: వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు న్యాయస్థానం ముందు పెండింగ్‌లో ఉండగా, ఆ కేసు గురించిన కథనాలు ఎలా ప్రచురిస్తారని ఆంధ్రజ్యోతి యాజమాన్యాన్ని హైకోర్టు నిలదీసింది. కథనాలే కాకుండా ఏకంగా ట్రయల్ నిర్వహించి, తీర్పులు కూడా ఇచ్చేస్తూ ప్రజలను, కేసును ప్రభావితం చేస్తున్నారని తీవ్రంగా మండిపడింది. ఘటన జరిగినట్లు రాస్తే సరిపోతుందని, దానికి కారకులు, ఎవరిది తప్పు వంటి వివరాలేవీ ప్రచురించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఇవన్నీ చేయాల్సింది దర్యాప్తు సంస్థలు, న్యాయస్థానాలేనని స్పష్టం చేసింది. ఇదే సమయంలో ఆంధ్రజ్యోతి యాజమాన్యంపై అప్పటి రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్రిమినల్ కేసు చెల్లదని, దీనిపై తాము ఓ నిర్ణయం తీసుకుని కోర్టుకు తెలియజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. అప్పటివరకు క్రిమినల్ కేసులో తదుపరి చర్యలన్నీ నిలిపేయవచ్చని తెలిపింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. ఆంధ్రజ్యోతి యాజమాన్యంపై గుంటూరు కోర్టులో జరుగుతున్న విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నింటినీ ఆరు వారాల పాటు నిలిపివేసింది. ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ కె. శ్రీనివాస్‌కు వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునిచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పన వరాహ లక్ష్మీనరసింహ చక్రవర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్దేశపూర్వకంగా తప్పుడు కథనం

వివేకానందరెడ్డి హత్య కేసులో ఉన్న ఓ వ్యక్తిని అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి తన కారులో కడప నుంచి తాడేపల్లి తీసుకొచ్చారంటూ ఆంధ్రజ్యోతి గత ఏడాది ఓ తప్పుడు కథనం ప్రచురించింది. ఈ కథనం ప్రభుత్వ ప్రతిష్టను దెబ్బతీసేలా ఉందంటూ రాష్ట్ర ప్రభుత్వం తరఫున అప్పటి పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంటూరు కోర్టులో ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ, ఎడిటర్ కె. శ్రీనివాస్‌పై క్రిమినల్ కేసు దాఖలు చేశారు. గుంటూరు కోర్టు వారిద్దరినీ వ్యక్తిగత హాజరుకు ఆదేశించింది. ఈ కేసును కొట్టేయాలని, తదుపరి చర్యలన్నీ నిలిపివేయాలని, వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపునివ్వాలని కోరుతూ రాధాకృష్ణ, శ్రీనివాస్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ చక్రవర్తి మంగళవారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది గింజుపల్లి సుబ్బారావు వాదనలు వినిపిస్తూ.. ఆంధ్రజ్యోతి కథనం గురించి, ఏ సెక్షన్ల కింద కేసు దాఖలు చేశారో వివరించారు. ఈ సమయంలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. కోర్టు ముందు విచారణలో ఉన్న కేసు గురించి ఎలా కథనాలు ప్రచురిస్తారని, ట్రయల్ కూడా నిర్వహించి తీర్పులిచ్చేస్తున్నారంటూ మండిపడ్డారు. ఘటన గురించి మాత్రమే రాశామని సుబ్బారావు చెప్పగా.. 'ఘటన అంటే ఏమిటి? ఓ వ్యక్తి గాయపడితే గాయపడ్డాడు అని రాయాలి. అంతే తప్ప ఆ వ్యక్తిని ఎవరు గాయపరిచారు, దాని వెనుక ఎవరున్నారు, అంతిమంగా తప్పు ఎవరిది వంటి విషయాల గురించి చెప్పాల్సింది మీరు కాదు. దర్యాప్తు అధికారులు, న్యాయస్థానాలే' అని న్యాయమూర్తి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) ఇవన సాంబశివ ప్రతాప్ స్పందిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం తనను తాను బాధితునిగా పేర్కొంటూ దాఖలు చేసిన ఈ క్రిమినల్ కేసు చెల్లదన్నారు. ఇది కేకే మిశ్రా కేసులో సుప్రీం కోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఈ కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలిపివేస్తూ ఉత్తర్వులిచ్చారు.

పిఠాపురం మహారాజా మేనకోడలి ఇంటిపై టీడీపీ నేతల దౌర్జన్యం



బాధితులు చంద్రలేఖ, ఆమె కుమారులు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇలాకా అయిన పిఠాపురంలో సాక్షాత్తు పిఠాపురం మహారాజా కుటుంబానికే రక్షణ లేకుండా పోయింది. 2014–19 వరకు ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జా చేసిన టీడీపీ నేతలు మళ్లీ కూటమి అధికారంలోకి రావడంతో తమ కబ్జాల పర్వం ప్రారంభించేశారు. ఎవరి అండా లేని వారిని చూడడం, వారి ఆస్తులు తాము కొన్నామంటూ బెదిరించి వాటిని స్వాధీనం చేసుకోవడంలో ఆరితేరిన పిఠాపురంలోని ఓ టీడీపీ నేత తన అనుచరులతో మహారాజా మేనకోడలి ఇల్లు స్వాధీనం చేసుకోడానికి పన్నాగం పన్నాడు. తన అనుచరులతో కలిసి వెళ్లి ఆ ఇంటిని ఖాళీ చేయాలని తాము వేరే వారి వద్ద కొనుగోలు చేశామంటూ బెదిరింపులకు దిగాడని బాధితులు ఆరోపిస్తున్నారు. తాము 5 దశాబ్దాలుగా ఇదే ఇంటిలో ఉంటున్నామని తమకు కోర్టు ద్వారా కూడా ఇల్లు తమకు దఖలు పడిందని కాగితాలు చూపించినా లెక్క చేయకుండా దౌర్జన్యానికి దిగిన టీడీపీ నేత, అతని అనుచరులు ఇల్లు ఖాళీ చేయకపోతే ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టి జైలుకు పంపుతామని, ఇంకా వినకపోతే చంపుతామంటూ బెదిరించడంతో పోలీసులను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. స్థానిక పోలీసులకు, ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని టీడీపీ నేతలకే సపోర్టు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. తమకు న్యాయం చేయకపోతే చావే శరణ్యమంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశిస్తూ బాధితులు ఒక వీడియో ద్వారా సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఆ వీడియో వైరల్‌గా మారింది. పిఠాపురం కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధిలో పిఠాపురం మహారాజా మేనకోడలు విన్నపాల చంద్రలేఖ, ఆమె కుమారులు మాధవరావు, రంగారావులు 1970 నుంచి తమ సొంత ఇంట్లో నివాసముంటున్నారు. గతంలో దీనిపై వివాదం ఏర్పడగా 1974లో కోర్టు ద్వారా డిక్రీ పొందారు. 2 నెలల క్రితం జిగటాల లక్ష్మి అనే మహిళ కొందరు వ్యక్తులను తీసుకుని వచ్చి ఇల్లు తాను కొనుగోలు చేశానని చెప్పి, వెంటనే ఇల్లు ఖాళీ చేయాలని డిమాండ్ చేశారు. అయితే ఇల్లు మీకు ఎవరు అమ్మారు.. మా ఇల్లు ఎలా అమ్ముతారు అంటూ ప్రశ్నించినా పట్టించుకోకుండా మహిళతో పాటు వచ్చిన వ్యక్తులు దౌర్జన్యానికి దిగి ఇంట్లో ఉన్న తమను బయటకు లాగి దాడి చేశారని చంద్రలేఖ మాధవరావు, రంగారావు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా కొందరు నేతల పైరవీలతో తమకు న్యాయం చేయలేదని, ఇక తమకు పవన్ కళ్యాణ్ న్యాయం చేయకపోతే కుటుంబమంతా ఆత్మహత్యలు చేసుకుంటామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ బృందాలు

హోం మంత్రి అనిత



విశాఖ సిటీ: రాష్ట్రంలో గంజాయి, ఇతర మత్తుపదార్థాల నియంత్రణ కోసం త్వరలో యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. ఆమె మంగళవారం విశాఖపట్నంలోని నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి అన్ని జిల్లాల ఎస్పీలతో వీడియో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ కారణంగానే రాష్ట్రంలో ఎక్కువగా నేరాలు నమోదవుతున్నాయని తెలిపారు. అందుకే గంజాయి నివారణపై విద్య, గిరిజన, ఎక్సైజ్, హోం శాఖలతో ఉపసంఘం నియమించినట్లు చెప్పారు. గంజాయి సాగు, అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఇందుకోసం సెబ్‌ను కాకుండా పాత తరహాలోనే ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గంజాయి, డ్రగ్స్ సమాచారం, ఫిర్యాదుల కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో డ్రోన్ల సాయంతో గంజాయి సాగును గుర్తిస్తామన్నారు.

36 మంది పేర్లు చెప్పాలి

పోలీసుల విధులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు వారి సంక్షేమంపై కూడా తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోందన్నారు. రాష్ట్రంలో అశాంతి నెలకొందని జగన్ ఢిల్లీలో ధర్నా చేసి ఏపీ పరువు తీశారన్నారు. ఆయన ఆరోపించినట్లు హత్యకు గురైన 36 మంది పేర్లను ప్రకటించాలని కోరారు. గవర్నర్‌కు ఇచ్చిన ఫిర్యాదులో 31 హత్యలు జరిగినట్లు పేర్కొన్నారని తెలిపారు.

చంద్రగిరి టు షిర్డీ యాత్ర

రెండువేల మందితో ప్రత్యేక రైలులో కుటుంబ సమేతంగా వెళ్లిన చెవిరెడ్డి

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు రెండు వేల మందితో కలిసి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక రైలులో షిర్డీ యాత్రకు బయలుదేరి వెళ్లారు. ప్రతి సంవత్సరం చెవిరెడ్డి తన కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి షిర్డీ యాత్రకు వెళ్లడం ఆనవాయితీగా మారింది. అదేవిధంగా ఈ ఏడాది కూడా రెండు వేల మందితో చంద్రగిరి నుంచి తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుని ప్రత్యేక రైలులో షిర్డీ బయలుదేరి వెళ్లారు. రెండు వేల మంది నాయకులు, కార్యకర్తలతోపాటు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి, కుమారులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి ఉన్నారు. షిర్డీ నుంచి తిరిగి ఆగస్టు రెండో తేదీన తిరుచానూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. ఈ ఆధ్యాత్మిక యాత్రలో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలంతా వసుధైక కుటుంబంగా ఉండాలని చెవిరెడ్డి ఆకాంక్షించారు. నాలుగు రోజులు కొనసాగే ఈ యాత్రకు సంబంధించి ప్రత్యేక రైలు ఏర్పాటు, ఇతర అన్ని సదుపాయాలను చెవిరెడ్డి సొంత డబ్బులతో ఏర్పాటు చేశారు. కాగా, చంద్రగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు రెండు నెలలు ఎన్నికల హడావుడిలో నిమగ్నమై తీవ్ర ఒత్తిడికి గురయ్యారని, వారందరికీ ఈ యాత్ర కొంత ఉపశమనం కలిగిస్తుందని మోహిత్‌రెడ్డి తెలిపారు.

మధురవాడలో యూనిటీ మాల్

సాక్షి, అమరావతి: యూనిటీ మాల్ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి.రేఖారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాల్ విశాఖపట్నం జిల్లా, మధురవాడలో నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. స్కీం ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్–2023–24లో భాగంగా దీన్ని నిర్మించనున్నారని వివరించారు. ఇందుకోసం మధురవాడ రెవెన్యూ గ్రామంలో ఐదు ఎకరాల స్థలం కేటాయించినట్లు తెలిపారు. టెండర్ డాక్యుమెంట్లు జ్యుడీషియల్ ప్రివ్యూ కోసం దాఖలు చేశామన్నారు.

కరెంట్ బిల్లు.. గుండె గుభిల్లు

- ఇంటికి రూ.17,400, వ్యవసాయ బోరుకు రూ.7,600



విద్యుత్ అధికారులు ఇచ్చిన నోటీసు

మార్కాపురం: పాత బకాయిల పేరిట.. రూ వేలకు వేల బిల్లులు చెల్లించాలని విద్యుత్ శాఖాధికారులు నోటీసులిస్తుండడంతో నిరుపేద దళిత వ్యవసాయ కూలీలు బెంబేలెత్తిపోతున్నారు. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలంలోని మొద్దులపల్లి గ్రామానికి చెందిన చప్పిడి యలమంద దళిత వ్యవసాయ కూలీ. 2016లో ఇల్లు కట్టుకుని సర్వీస్ నం 42తో విద్యుత్ కనెక్షన్ తీసుకున్నాడు. వ్యవసాయ బోరుకు సంబంధించి ఈ ఏడాది జూలై వరకూ రూ.7,600 బకాయి ఉందని, ఇంటికి సంబంధించి 2016 నుంచి ఇప్పటి వరకూ రూ.17,400 బకాయి ఉందని విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఆయనకు నోటీసులిచ్చారు. వ్యవసాయ బోరు బకాయిలను మూడు రోజుల లోపు, ఇంటి విద్యుత్ బకాయిలను వారం రోజులలోపు చెల్లించకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే 2019 నుంచి వైఎస్ జగన్ ప్రభుత్వం ఎస్సీ కాలనీలకు, ఎస్సీ గృహాలకు ఉచిత విద్యుత్ ఇచ్చిందని, అలాగే వ్యవసాయ బోర్లకు కూడా ఉచిత విద్యుత్ అందించగా పాత బకాయిలంటూ తమకు నోటీసులు ఇవ్వడంలో అర్థం లేదని చప్పిడి యలమంద చెబుతున్నారు. విద్యుత్ అధికారులు తమపై కక్ష సాధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై తాను కలెక్టర్‌ను, విద్యుత్ అధికారులను కలిసి న్యాయం చేయాలని కోరుతానని యలమంద కుమారుడు జాన్సన్ తెలిపారు. జాన్సన్ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం క్రియాశీలక కార్యకర్తగా ఉన్నాడు. కాగా, పాత బకాయిలకు మాత్రమే నోటీసులిచ్చామని మార్కాపురం డీఈ సియానాయక్ స్పష్టం చేశారు.

సైబర్ నేరగాళ్లే ఎంపీడీవో ఉసురు తీశారు?

- నరసాపురం ఎంపీడీవో ఆత్మహత్యపై కీలక ఆధారాలు సేకరించిన పోలీసులు!
- పోలీసుల అదుపులో రాజస్థాన్ సైబర్ ముఠా సభ్యుడు?



వెంకటరమణ (ఫైల్)

నరసాపురం: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం ఎంపీడీవో ఎం.వెంకటరమణ అదృశ్యం, ఆత్మహత్య ఘటన వ్యవహారం కీలక మలుపు తిరిగింది. రాజస్థాన్‌కు చెందిన సైబర్ నేరగాళ్ల వేధింపుల కారణంగానే ఎంపీడీవో ఆత్మహత్య చేసుకున్నారని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం, ఆత్మహత్యపై కృష్ణా జిల్లా పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు విచారణ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను నియమించారు. వెంకటరమణ సెల్‌ఫోన్ కాల్ డేటా, బ్యాంక్ లావాదేవీలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించారు. వాటి ఆధారంగా రాజస్థాన్‌లోని బర్కత్‌పూర్‌కు చెందిన సైబర్ ముఠా వలలో ఎంపీడీవో చిక్కుకున్నట్లు గుర్తించారని తెలిసింది. సుమారు 30మంది ఉన్న ఈ సైబర్ నేరస్తుల ముఠా ఓ యువతి న్యూడ్ వీడియోను ఆధారంగా చేసుకుని ఎంపీడీవోను ఇరుకునపెట్టినట్లు పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఆయనను బెదిరించి పలుమార్లు డబ్బులు వసూలు చేసినట్లు కూడా గుర్తించారని తెలిసింది. మరింత డబ్బులు కావాలని సైబర్ ముఠా ఒత్తిడి చేయడంతో బయటకు చెప్పుకోలేక ఎంపీడీవో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు రాజస్థాన్‌లోని బర్కత్‌పూర్‌కు చెందిన సైబర్‌ముఠా సభ్యుడిని ప్రత్యేక పోలీసు బృందం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, ఎంపీడీవో అదృశ్యమైన తర్వాత ఈ వ్యవహారం రాజకీయ రంగు పులుముకుంది. నరసాపురంలోని మాధవాయిపాలెం ఫెర్రీ కాంట్రాక్టర్ సీహెచ్ రెడ్డప్ప ధవేజీ ప్రభుత్వానికి రేవు నిర్వహణకు సంబంధించిన లీజు డబ్బులు బకాయి ఉండటంతోనే ఎంపీడీవో కనిపించకుండాపోయారని కూటమి నేతలు ఆరోపణలు చేశారు. కాంట్రాక్టర్ ధవేజీ మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అనుచరుడని, లీజు డబ్బులు చెల్లించకుండా ప్రసాదరాజు ఒత్తిడి తెచ్చారని విమర్శించారు. అందువల్లే ఒత్తిడికి గురైన ఎంపీడీవో ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో ఎంపీడీవో తన కుటుంబ సభ్యులకు వాట్సాప్‌లో పెట్టిన సూసైడ్ నోట్ కథనాన్ని తెరపైకి తెచ్చారు. అయితే, ఎంపీడీవో ఆత్మహత్యకు, ఫెర్రీ వ్యవహారానికి సంబంధం లేదని పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం.


రాళ్ల దిబ్బగా మారిన ఓ ప్రాంతంలో చిక్కుబడ్డ వారి కోసం గాలింపు


మేటవేసిన బురదలో కూరుకుపోయిన ఓ ఫ్యామిలీ ఫొటో


సహాయక చర్యల్లో నిమగ్నమైన సిబ్బంది


ఆస్పత్రిలో తమవారి మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

బురద వరద ముంచేసింది

కేరళలో మృత్యువిలయం • 123 మంది బలి


వయనాడ్ జిల్లాలోని చూరల్మలలో బురద విలయం విశ్వరూపం

వయనాడ్ (కేరళ): ఘోర కలి. మాటలకందని విషాదం. కేరళ చరిత్రలో కనీ వినీ ఎరగని ప్రకృతి విలయం. కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కొండ ప్రాంతమైన వయనాడ్ జిల్లాలో మహోత్పాతానికి కారణమయ్యాయి. అక్కడి మెప్పడి ప్రాంతంపైకి మృత్యువు కొండచరియల రూపంలో ముంచుకొచ్చింది. సోమవారం అర్ధరాత్రి దాటాక ఆ ప్రాంతమంతటా భారీ స్థాయిలో కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో వెల్లువెత్తిన బురద, ప్రవాహం ఊళ్లకు ఊళ్లనే ముంచెత్తాయి. గ్రామాలతో పాటు సహాయ శిబిరాలు కూడా బురద ప్రవాహంలో గల్లంతయ్యాయి. ఎటు చూసినా అంతులేని బురదే కప్పేసింది. దాంతో గాఢ నిద్రలో ఉన్న వందలాది మంది తప్పించుకునే అవకాశం కూడా లేక నిస్సహాయంగా శాశ్వత నిద్రలోకి జారుకున్నారు. బురద, మట్టి దిబ్బల కింద సమాధైపోయారు. కళ్లు తిప్పుకోనివ్వనంత అందంగా ఉండే మెప్పడి ప్రాంతమంతా క్షణాల వ్యవధిలో శవాల దిబ్బగా మారిపోయింది. ఇప్పటిదాకా 123 మృతదేహాలను వెలికితీశారు. వాటిలో చాలావరకు సమీపంలోని నదుల్లోకి కొట్టుకొచ్చినవే. ఏ శవాన్ని చూసినా కాళ్లు చేతులు తెగిపోయి కన్పించడం బీభత్స తీవ్రతను కళ్లకు కడుతోంది. ప్రమాద స్థలం పొడవునా నిండిపోయిన బురద ప్రవాహాన్ని, మట్టి దిబ్బలను తొలగిస్తే వందల్లో శవాలు బయట పడతాయని చెబుతున్నారు. మృతుల్లో స్థానికులతో పాటు ఉత్తరాది నుంచి పొట్ట చేత పట్టుకుని వచ్చిన వారు కూడా భారీ సంఖ్యలో ఉన్నారని భావిస్తున్నారు. సమీపంలోని టీ ఎస్టేట్లో పని చేస్తున్న 600 మంది వలస కూలీల జాడ తెలియడం లేదు. వారంతా విలయానికి బలై ఉంటారంటున్నారు.


ఓ మహిళను కాపాడుతున్న సిబ్బంది

నడి రాత్రి ఘోర కలి...

మెప్పడి ప్రాంతంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో కొండ ప్రాంతమంతా తడిసీ తడిసీ వదులుగా మారిపోయింది. అర్ధరాత్రి వేళ కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో వరద, బురద వెల్లువెత్తాయి. వాటి ప్రవాహ మార్గంలో ఉన్న ముండక్కై, చూరల్మల, అత్తమల, నూల్పుజ తదితర కుగ్రామాలు సమాధయ్యాయి. తొలుత సోమవారం అర్ధరాత్రి రెండు గంటల వేళ ముండక్కై ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటంతో సహాయక సిబ్బంది హుటాహుటిన స్పందించారు. బాధితులను సమీపంలోని చూరల్మల స్కూలు వద్ద సహాయక శిబిరాలకు తరలించారు. అనంతరం తెల్లవారుజామున నాలుగింటికి ఆ ప్రాంతమంతటా మళ్లీ భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దాంతో శిబిరాలతో పాటు పరిసర గ్రామాల్లోని ఇళ్లు, దుకాణాలన్నీ బురదలో కొట్టుకుపోయాయి. రోడ్లు, బ్రిడ్జిల వంటివన్నీ నామరూపాల్లేకుండా పోయాయి. దాంతో ఆ ప్రాంతాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెగిపోవడంతో సహాయక బృందాలు అక్కడ కాలు పెట్టలేకపోతున్నాయి. అయితే బురదలో చిక్కుబడి ప్రాణాలతో ఉన్న పలువురిని సైన్యం, నేవీ సంయుక్త ఆపరేషన్ చేపట్టి హెలికాప్టర్ల ద్వారా కాపాడాయి. మెప్పడి ఆరోగ్య కేంద్రంలో స్థలాభావం కారణంగా మృతదేహాలను నేలపైనే వరుసగా పేరుస్తున్నారు. ఉత్పాతం నుంచి ప్రాణాలతో బయటపడ్డ వారంతా తలలు బాదుకుంటూ, హృదయ విదారకంగా రోదిస్తూ తమవారి శవాల కోసం వెదుక్కుంటున్నారు! నిర్వాసితులుగా మారిన వేలాదిమందిని సహాయక శిబిరాలకు తరలిస్తున్నారు.

రంగంలోకి సైన్యం

కేరళ ప్రభుత్వ యంత్రాంగంతో పాటు సైన్యం, జాతీయ విపత్తు దళం హుటాహుటిన రంగంలోకి దిగాయి. బురద, మట్టి దిబ్బల కింద ప్రాణాలతో ఉన్నవారిని కాపాడేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. వారి ఆనవాలు పట్టేందుకు డాగ్ స్క్వాడ్ను రంగంలోకి దించారు.

మోదీ దిగ్భ్రాంతి

ఈ ఘోర విపత్తుపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వెలిబుచ్చారు. సీఎం పినరయి విజయన్తో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. సహాయక చర్యలు తదితరాల్లో కేరళకు అన్నివిధాలా దన్నుగా నిలుస్తామని ప్రకటించారు. ఆయన బుధవారం కేరళ వెళ్లనున్నారు. మరోవైపు, మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డవారికి రూ.50 వేల చొప్పున కేంద్రం పరిహారం ప్రకటించింది.

ఫోన్లలో ఆర్తనాదాలు

బురద ప్రవాహంలో చిక్కుబడ్డ చాలామంది కాపాడాలంటూ అధికారులకు ఫోన్లు చేశారు. ప్రాణ భయంతో ఫోన్లోనే ఏడ్చేసిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది. చానళ్లలో ప్రసారమవుతున్న ఆ సంభాషణలు, గ్రామాలన్నీ బురద కింద కప్పబడిపోయిన్న దృశ్యాలు అందరినీ కలచివేస్తున్నాయి. ఇది మాటలకందని విషాదమని సీఎం విజయన్ అన్నారు. ''భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో మొత్తం ప్రాంతమంతా పెను విధ్వంసానికి లోనైంది. మృతుల్లో మహిళలు, చిన్నారులున్నారు. పలు శవాలు చెలియార్ నదిలో పొరుగున మలప్పురం జిల్లాలోకి కొట్టుకొచ్చాయి.

నదే రెండుగా చీలింది

విరిగిపడ్డ కొండచరియల ధాటికి స్థానిక ఇరువలింజిపుజ నది ఏకంగా రెండుగా చీలిపోయింది! అక్కడి వెల్లరిమల ప్రభుత్వ పాఠశాల పూర్తిగా సమాధైపోయిందని సీఎం విజయన్ చెప్పారు.

ప్రాణం దక్కించుకున్న వృద్ధుడు

వయనాడ్ విలయంలో వెల్లువెత్తిన బురద ప్రవాహంలో చిక్కిన ఓ వృద్ధుడు గంటల కొద్దీ ఒక పెద్ద బండరాయిని ఆధారంగా పట్టుకుని ప్రాణాలు నిలబెట్టుకున్నాడు. స్థానికులు అతని ఆర్తనాదాలు విని కూడా వరద ప్రవాహ తీవ్రత కారణంగా ఏమీ చేయలేకపోయారు. దాంతో వృద్ధుడు జోరు వానలో, వరద ప్రవాహం నడుమ గంటల పాటు బండరాయి చాటునే బిక్కుబిక్కుమంటూ గడిపాడు. చివరికి సహాయక బృందాలు చాలాసేపు శ్రమించి ఆయన్ను కాపాడాయి. ఆ వీడియో వైరల్గా మారింది.

త్రుటిలో బయటపడ్డాం...

కళ్లముందే సర్వస్వాన్నీ ముంచెత్తిన వరద, బురద బీభత్సం నుంచి పలువురు త్రుటిలో తప్పించుకున్నారు. ఆ భయానక అనుభవాన్ని గుర్తు చేసుకుంటూ వణికిపోయారు. ఓ వృద్ధ జంట తమ ఇంటి చుట్టూ బురద నీటి ప్రవాహం నెమ్మదిగా పెరుగుతుండటంతో వణికించే చలిని, జోరు వానను కూడా లెక్కచేయకుండా రాత్రి 11 గంటల వేళ కొండపై భాగానికి వెళ్లిపోయింది. కాసేపటికే వాళ్ల ఇల్లు నామరూపాల్లేకుండా పోయింది. ''పొరుగింటాయనను రమ్మని బతిమాలాం. రాకుండా ప్రాణాలు పోగొట్టుకున్నాడు'' అంటూ వాళ్లు వాపోయారు. ''మా బంధువులైన దంపతులు పసిపాపను చంకనేసుకుని ప్రాణాల కోసం పరుగులు తీస్తూ నాతో ఫోన్లో మాట్లాడారు. వరద ప్రవాహం, బురద తమను ముంచెత్తుతున్నాయని చెప్పారు. కాసేపటికే ఫోన్ మూగబోయింది. వాళ్ల జాడా తెలియడం లేదు'' అంటూ ఒక మహిళ రోదించింది.

వయనాడ్కు రెడ్ అలర్ట్: న వయనాడ్తో పాటు కేరళలోని ఉత్తరాది జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. రెండు రోజులు అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

లోక్సభలో కులకలం

- 'తాము ఏ కులమో తెలియని వాళ్లు...'
- రాహుల్పై ఠాకూర్ వ్యాఖ్యలు
- తీవ్రంగా ఆక్షేపించిన విపక్షాలు
- రికార్డుల్లోంచి తొలగించిన స్పీకర్
- నాకిది ఘోరమైన అవమానం: రాహుల్
- కులగణన చేయించి తీరతానని శపథం



న్యూఢిల్లీ: మోదీ సర్కారుపై విపక్షనేత రాహుల్గాంధీ చేసిన 'చక్రవ్యూహం' వ్యాఖ్యల తాలూకు వేడి లోక్సభలో మంగళవారం కూడా కొనసాగింది. ప్రభుత్వం తరఫున మాట్లాడిన బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ వాటిని తీవ్రంగా ఖండించారు. రాహుల్ తన ప్రసంగం పొడవునా ఆరితేరిన వక్తనని నిరూపించుకునేందుకు పాకులాడారని ఎద్దేవా చేశారు. ''అందుకోసం అంకుల్ శామ్ (కాంగ్రెస్ నేత శామ్ పిత్రోడా) నుంచి తెచ్చుకున్న అరువు జ్ఞానాన్ని ప్రదర్శించారు. రాహుల్ రియల్ పొలిటీషియన్ కాదు. కేవలం వీడియోల కోసమే ప్రసంగాలిచ్చే రీల్ పొలిటీషియన్. బహుశా విపక్ష నేత (ఎల్ఓపీ) అంటే దుష్ప్రచార సారథి (లీడర్ ఆఫ్ ప్రాపగాండా) అని అపార్థం చేసుకున్నట్టున్నారు'' అంటూ దుయ్యబట్టారు. ''కొందరు పేరుకు మాత్రమే హిందువులు. మహాభారతంపై వారికున్నది కూడా మిడిమిడి జ్ఞానమే'' అంటూ రాహుల్ను ఠాకూర్ ఎద్దేవా చేశారు. ఆ క్రమంలో 'తమది ఏ కులమో కూడా తెలియని వారు కులగణన కోరుతున్నారు' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై సభలో తీవ్ర దుమారం రేగింది. అవి రాహుల్ను ఉద్దేశించినవేనంటూ విపక్ష సభ్యులంతా మండిపడ్డారు. ఒక వ్యక్తి కులం గురించి ఎలా మాట్లాడతారంటూ సమాజ్వాదీ నేత అఖిలేశ్ యాదవ్ మండిపడ్డారు. ఠాకూర్ వ్యాఖ్యలను తీవ్రంగా నిరసిస్తూ కాంగ్రెస్ సభ్యులంతా వెల్లోకి దూసుకెళ్లారు. దాంతో ఆ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు. తర్వాత రాహుల్ మాట్లాడుతూ ఠాకూర్ వ్యాఖ్యలు తనకు ఘోర అవమానమన్నారు. ''దళితులు, వెనకబడ్డ వర్గాల హక్కుల కోసం ఎవరు పోరాడినా ఇలాంటి అవమానాలు భరించాల్సిందే. అందుకే నన్నెంత తిట్టినా, అవమానించినా పట్టించుకోను. క్షమాపణలూ కోరబోను. అర్జునుడు పక్షి కన్నుపైనే దృష్టి పెట్టినట్టు నా దృష్టినంతా కులగణనపైనే కేంద్రీకరించాను. పోరు ఆపబోను. విపక్ష ఇండియా కూటమి ఎట్టి పరిస్థితుల్లోనూ దేశవ్యాప్తంగా కులగణన చేయించి తీరుతుంది'' అని ప్రకటించారు.

మీకో వైఖరే లేదు

దళితులు, ఓబీసీల వెనకబాటుకు 1947 నుంచి దశాబ్దాల పాటు దేశాన్ని పాలించిన కాంగ్రెసే కారణమని ఠాకూర్ ఆరోపించారు. ఎన్ (నెహ్రూ), ఐజీ (ఇందిరాగాంధీ), ఆర్జీ1 (రాజీవ్గాంధీ) అంటూ గాంధీ కుటుంబానికి చెందిన మాజీ ప్రధానులందరిపైనా విమర్శలు చేశారు. కాంగ్రెస్ దృష్టిలో ఓబీసీలు అంటే ఓన్లీ బ్రదర్-ఇన్-లా కమీషన్ అంటూ రాహుల్ బావ రాబర్ట్ వద్రాను ఉద్దేశించి ఆరోపణలు గుప్పించారు. ''కులగణనపై కాంగ్రెస్కు ఓ వైఖరంటూ ఉందా? రాహుల్ కులగణన కావాలంటున్నారు. ఆయన తండ్రి రాజీవ్ గాంధీ మాత్రం ఓబీసీలకు రిజర్వేషన్లను వ్యతిరేకించారు. బోఫోర్స్ మొదలుకుని కామన్వెల్త్ క్రీడలు, 2జీ, గడ్డి, యూరి యా, బొగ్గు, నేషనల్ హెరాల్డ్... ఇలా కాంగ్రెస్ హయాంలో జరిగిన కుంభకోణాలకు అంతే లేదు'' అంటూ దుయ్యబట్టారు.



పట్టాలు తప్పిన హౌరా-ముంబై రైలు

జంషెడ్పూర్/రాంచీ/చాయ్బసా/కోల్కతా: జార్ఖండ్లోని సెరాయ్కెలా-ఖర్సావాన్ జిల్లాలో హౌరా-ముంబై మెయిల్ రైలు పట్టాలు తప్పింది. 18 బోగీలు పట్టాలు తప్పిన ఈ ఘటనలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. 22 మంది గాయపడ్డారు. జంషెడ్పూర్ నుంచి 80 కిలోమీటర్ల దూరంలోని బారాబంబూ స్టేషన్ దగ్గర్లోని పోటోబెబా గ్రామం వద్ద మంగళవారం తెల్లవారుజామున 3.45 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలికి సమీపంలోనే గూడ్సు రైలు ఒకటి పట్టాలు తప్పిందని, రెండు ఘటనలు ఒకేసారి జరిగాయా అనేది తేల్చాల్సి ఉందని సౌత్ఈస్ట్రైల్వే అధికార ప్రతినిధి ఓం ప్రకాశ్ చరణ్ చెప్పారు. అయితే ఆగిఉన్న గూడ్సు రైలును హౌరా-ముంబై రైలు ఢీకొట్టిందని వెస్ట్ సింఘ్భమ్ డిప్యూటీ కమిషనర్ కుల్దీప్ చౌదరి చెప్పారు. ఘటనపై ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించారు. మృతుల కుటుంబాలకు తలో రూ.10 లక్షల ఎక్స్గ్రేషియాను రైల్వే శాఖ ప్రకటించింది. తీవ్రంగా గాయపడిన వారికి తలో రూ.1 లక్ష ఇవ్వనున్నారు. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల ఎక్స్గ్రేషియాను జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ప్రకటించారు. క్షతగాత్రులను దగ్గర్లోని ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఘటన జరిగిన రైల్వే మార్గం గుండా వెళ్లాల్సిన పలు ఎక్స్ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రద్దుచేశారు. కొన్నింటిని దారి మళ్లించారు.

విపక్షాల గొంతు నొక్కుతోంది

కేంద్రంపై ఇండియా కూటమి ధ్వజం • జంతర్మంతర్ వద్ద ధర్నా

న్యూఢిల్లీ: బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం విపక్షాల గొంతు నొక్కేస్తోందని 'ఇండియా' కూటమి నేతలు హస్తిన వేదికగా ధ్వజమెత్తారు. ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ను అన్యాయంగా జైల్లో పడేసి ఆరోగ్యపరిస్థితిని దారుణంగా దిగజార్చారని మండిపడ్డారు. కేజ్రీవాల్ను విడుదలచేయాలంటూ కూటమి నేతలు మంగళవారం ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద భారీ ధర్నా చేపట్టారు. భారత్ మాతాకీ జై, నియంతృత్వం నశించాలి నినాదాలతో ధర్నాస్థలి హోరెత్తింది. ఆప్ పిలుపుమేరకు చేపట్టిన ఈ ధర్నాకు ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్పవార్, సమాజ్వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నేత దీపాంకర్ భట్టాచార్య, లోక్సభలో కాంగ్రెస్ డెప్యూటీ లీడర్ గౌరవగొగోయ్, శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా, కాంగ్రెస్, ఆప్ లోక్సభ, రాజ్యసభ సభ్యులు, భారీ సంఖ్యలో ఆప్ కార్యకర్తలు హాజరయ్యారు.

ఢిల్లీ సర్కార్కు ఎన్హెచ్ఆర్సీ నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో రావూస్ కోచింగ్ సెంటర్ బేస్మెంట్లో సివిల్స్ అభ్యర్థుల జలసమాధి ఉదంతంపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్హెచ్ఆర్సీ) స్పందించింది. మరణాలపై మీడియా వార్తలతో కేసును సూమోటోగా స్వీకరించింది. ఘటనపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వంతోపాటు ఢిల్లీ పోలీస్ కమిషనర్, ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్కు నోటీసుల జారీ చేసింది. నిబంధనలకు విరుద్ధంగా ఢిల్లీలో నడుస్తున్న కోచింగ్ సెంటర్లు, సంస్థల వివరాలు, వాటిపై వచ్చిన ఫిర్యాదులు, సంబంధిత శాఖ అధికారులు వాటిపై తీసుకున్న చర్యల గురించి కూడా నివేదికలో పొందుపర్చాలని ఎన్హెచ్ఆర్సీ కోరింది. అధికారులకు అనేక ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మీడియాలో కథనాలు వెలువడ్డాయని, ఇది అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని మండిపడింది. పటేల్ నగర్ ప్రాంతంలో పూడిక తీయకపోవడం వల్ల వర్షపు నీరు నిలిచి అక్కడ విద్యుదాఘాతానికి గురై సివిల్స్ అభ్యర్థి మరణించిన ఉదంతాన్నీ కేసుగా ఎన్హెచ్ఆర్సీ సూమోటోగా స్వీకరించింది.

ఆగస్టు 2-3 తేదీల్లో గవర్నర్ల సదస్సు

న్యూఢిల్లీ: వచ్చే నెల రెండు, మూడో తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన గవర్నర్ల సదస్సు జరగనుంది. నూతన నేర చట్టాల అమలు, ఉన్నత విద్యలో సంస్కరణలు, గిరిజన ప్రాంతాల పురోభివృద్ధి, విశ్వవిద్యాలయాల పనితీరు, వెనుకబడిన జిల్లాలు, సరిహద్దు ప్రాంతాల సమస్యలు వంటి అంశాలు ఈ సదస్సులో ప్రధానంగా చర్చకొచ్చే అవకాశముంది. రాష్ట్రపతి ముర్ము ఆధ్వర్యంలో జరగబోతున్న తొలి గవర్నర్ల సమావేశం ఇదేనని రాష్ట్రపతిభవన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సదస్సులో ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్, ప్రధాని మోదీ, పలువురు కేంద్ర మంత్రులు, ప్రధాని కార్యాలయంలోని సీనియర్ ఉన్నతాధికారులు పాల్గొంటారు. మై భారత్, ఏక్ భారత్ శ్రేష్ఠ్ భారత్, అమ్మ కోసం ఒక చెట్టు, ప్రకృతి వ్యవసాయం, కేంద్రప్రభుత్వ సంస్థలతో రాష్ట్రాలు సమన్వయంగా పనిచేయడం వంటి అంశాలూ చర్చకురానున్నాయి.

భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసి.. మనదేశం పెట్టుబడులకు సురక్షితం కాదనే సందేశాన్ని విదేశీ ఇన్వెస్టర్లకు పంపే కుట్ర జరిగిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. 2024-25 బడ్జెట్పై చర్చకు లోక్సభలో ఆమె సమాధానమిస్తూ విపక్షాలపై మండిపడ్డారు. 'భారత సామాజిక విలువలపై, పార్లమెంటరీ సాంప్రదాయాలపై, సాయుధ బలగాలపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్రదాడి జరిగింది. దేశంలో అస్థిరత, అరాచకత్వం ఉంటే.. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమవుతుంది. ఇదో పెద్ద సవాల్' అని నిర్మల అన్నారు. భిన్నత్వం కలిగిన సమాజాన్ని తరతరాల కృషితో భారత్ ఏకతాటి పైకి తెచ్చిందని, కానీ ఈ రోజు కుట్రపూరితంగా ఒకరికొకరిపై మరొకరికి అపనమ్మకాన్ని కలిగిస్తున్నారని ధ్వజమెత్తారు. అబద్ధాలు, కుయుక్తులతో ప్రజల మధ్యన విభజన తెస్తున్నారని ఆరోపించారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులను కల్పించే ప్రయత్నం జరుగుతోందని, చిన్నపాటి నిప్పురవ్వ (గొడవ) కూడా తీవ్ర సంఘర్షణలకు దారితీయాలని కోరుకుంటున్నారని అన్నారు. ఏదో ఒక వంకతో సాయుధ బలగాలపై దాడులను ముమ్మరం చేస్తున్నారని ఆక్షేపించారు. అగ్నివీర్లపై వివాదం ఈ కుట్రలో భాగమన్నారు. సమాజమే కాకుండా ఆర్థిక వ్యవస్థ, పార్లమెంటు, సైన్యంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. పారిశ్రామికవేత్తలను విలన్లుగా చూపుతున్నారని, ఇది సిగ్గుచేటని పేర్కొన్నారు. 'పారిశ్రామిక సంస్కృతిని ముగించాలనే కుట్ర జరుగుతోంది. భారత్ వెన్నుముకపై దాడి జరుగుతోంది. వ్యాపారులపై ప్రతికూలతను వ్యాప్తి చేస్తున్నారు. సంపదను సృష్టించే వారిపై, వ్యాపారాలపై ద్వేషం ప్రబలుతోంది. పెట్టుబడులకు భారత్ సురక్షితం కాదనే సందేశాన్ని ప్రపంచానికి పంపే కుట్ర జరుగుతోంది. ఇది మంచిది కాదు' అని నిర్మల అన్నారు.

2009 బడ్జెట్లో ఏకంగా 26 రాష్ట్రాల ప్రస్తావన లేదు

బడ్జెట్లో ఏదేని రాష్ట్రం ప్రస్తావన రాకపోతే సదరు రాష్ట్రానికి అసలే నిధుల కేటాయింపు జరగనట్లు కాదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. బీజేపీ మిత్రపక్షాలైన జేడీయూ, టీడీపీలను సంతృప్తిపర్చడానికే బడ్జెట్లో ప్రాధాన్యమిచ్చారనే విపక్షాల ఆరోపణలను తోసిపుచ్చారు. యూపీఏ హయాంలో 2009-10 బడ్జెట్లో ఏకంగా 26 రాష్ట్రాల ఊసు లేదని, 2004-05 బడ్జెట్లో 17 రాష్ట్రాల ప్రస్తావనే లేదని.. అంటే ఆ రాష్ట్రాలకు నిధులు వెళ్లలేదా? అప్పుడు ప్రస్తావన లేని రాష్ట్రాలకు నిధులు ఆపి ఉంటే.. ఇప్పుడిలా కనీస ప్రస్తావన లేదనే అంశాన్ని లేవనెత్తవచ్చు' అని నిర్మల అన్నారు. తమ ప్రభుత్వం ఏ ఒక్క రాష్ట్రానికి నిధులను నిరాకరించలేదన్నారు.

'కమల' వికాసం సాధ్యమే: లిచ్మాన్

వాషింగ్టన్: గత నాలుగు దశాబ్దాలుగా అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను దాదాపు ఖచ్చితంగా ఊహించి చెప్పిన అలాన్ లిచ్మాన్ మరోమారు తన విశ్లేషణను వెల్లడించారు. తాజా ఎన్నికల ప్రచార సరళి, అమెరికా ఓటర్ల మనోభావాలను లెక్కలోకి తీసుకుంటే డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ నెగ్గే అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఆయన చెప్పారు. అయితే వచ్చే నెలలో డెమొక్రటిక్ కన్వెన్షన్ తర్వాతే తన తుది అంచనాలను వెల్లడిస్తానని ఆయన స్పష్టంచేశారు. 1984 ఏడాది నుంచి అమెరికాలో 10 సార్లు అధ్యక్ష ఎన్నికలు జరిగితే తొమ్మిది సార్లు ఈయన చెప్పింది నిజమైంది. దీంతో ఆయన్ను అమెరికా అధ్యక్ష ఎన్నికల నోస్ట్రడామస్గా అందరూ పిలుస్తారు. అమెరికన్ విశ్వవిద్యాలయంలో గత యాభై సంవత్సరాలుగా అధ్యాపకుడిగా పనిచేస్తున్న లిచ్మాన్ 1981 ఏడాదిలో 'గెలుపునకు 13 సూత్రాలు' అనే విధానాన్ని ప్రతిపాదించారు. ఈ 13 అంశాల ప్రాతిపదికన ఏ పార్టీ, అభ్యర్థి గెలుస్తారని అంచనా వేస్తానని ఆయన చెప్పారు. 2016లో ట్రంప్, 2020లో బైడెన్ గెలుస్తారన్న జోస్యాలు నిజమవడంతో 2024లో గెలుపుపై ఏం చెప్పబోతున్నారోనని ఆసక్తి నెలకొంది.

లాయర్లుగా ఎన్రోల్కు అంత ఫీజా?

వేలల్లో ఫీజుల వసూలుపై సుప్రీంకోర్టు విస్మయం

న్యూఢిల్లీ: న్యాయవాద వృత్తిలోకి అడుగుపెట్టేందుకు లాయర్లుగా ఎన్రోల్చేసుంటున్న న్యాయశాస్త్ర పట్టభద్రుల నుంచి రాష్ట్రాల బార్ కౌన్సిళ్ల(ఎస్బీసీ) భారీ స్థాయిలో ఫీజులు వసూలుచేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. నిబంధనల ప్రకారం ఎస్సీ-ఎస్టీ కేటగిరీ లా పట్టభద్రుల నుంచి రూ.125 ఫీజు, జనరల్ కేటగిరీ నుంచి రూ.750 మించి వసూలుచేయకూడదని ధర్మాసనం ఆదేశించింది. ఎస్బీసీలు వసూలుచేస్తున్న విపరీతమైన ఫీజుల కారణంగా అణగారిన, ఆర్థికంగా వెనకబడిన వర్గాల పేద, మధ్యతరగతి లా పట్టభద్రులు న్యాయవృత్తిలోకి రాలేని పరిస్థితి నెలకొంటోందని, వారు ఈ వృత్తిలో భాగస్వాములయ్యే అవకాశాలు తగ్గిపోతాయని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆవేదన వ్యక్తంచేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది.

క్యాట్ సభ్యురాలిగా రైల్వే బోర్డు చైర్పర్సన్



న్యూఢిల్లీ: రైల్వే బోర్డు చైర్పర్సన్, సీఈవో జయ వర్మ సిన్హా కేంద్ర అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) సభ్యురాలిగా నియమితులయ్యారు. ఆగస్టు 31న రైల్వే బోర్డు నుంచి పదవీ విరమణ పొందాక క్యాట్ సభ్యురాలిగా బాధ్యతలు చేపడతారు. జయతో పాటు మరో 11 మందిని క్యాట్ సభ్యులుగా నియమిస్తూ కేబినెట్ నియామకాల కమిటీ సోమవారం నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హర్నరేశ్ సింగ్ గిల్, జస్టిస్ పద్మరాజ్ నేమచంద్ర దేశాయ్, వీణా కొత్తవాలే, రాజ్వీర్ సింగ్ వర్మలు క్యాట్లో జ్యుడీషియల్ సభ్యులుగా నియమితులయ్యారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

బుధవారం : 31 : జూలై : 2024





బెంగళూరులో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం సాయంత్రం నగరంలోని విల్సన్‌గార్డెన్ రోడ్లలో గొడుగు సాయంతో వెళ్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

కేరళకు సహాయహస్తం : సీఎం

శివాజీనగర: కేరళలోని వయనాడ్ జిల్లాలో మంగళవారం కొండ చరియలు విరిగిపడి భారీ ఎత్తున ప్రాణనష్టం జరిగిన నేపథ్యంలో అన్ని రకాల సహాయ సహకారాలు అందజేస్తామని సీఎం సిద్దరామయ్య తెలిపారు. మహా విపత్తు నుంచి బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వయనాడ్ సమీపంలోని కర్ణాటకలోని జిల్లాల ఆరోగ్య అధికారులను పంపి బాధితులకు వైద్య సదుపాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కలబురగి మేయర్‌గా యల్లప్ప



మేయర్ యల్లప్ప, ఉపమేయర్ హీనాబేగం

యశవంతపుర: కలబురగి మహానగర పాలికె మేయర్‌గా కాంగ్రెస్‌కు చెందిన యల్లప్ప నాయికోడి, ఉపమేయర్‌గా హీనా బేగం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ రెండు స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరిగాయి. మేయర్ పదవికి కాంగ్రెస్ నుంచి యల్లప్ప, బీజేపీ నుంచి దిగంబర్ నాడగౌడ నామినేషన్లు దాఖలు చేశారు. కుల పత్రంలో దోషం ఉన్న కారణంగా దిగంబర్ నామినేషన్‌ను ఎన్నికల అధికారి తిరస్కరించారు. దీంతో యల్లప్ప ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఉపమేయర్‌గా బీజేపీ–జేడీఎస్ మద్దతుతో అలీమ్ పటేల్ నామినేషన్ వేసి వాపస్ తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన హీనాబేగం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రాదేశిక కమిషనర్ కృష్ణ బాజపేయి ప్రకటించారు.

ఎస్ఐ పోస్టుల జాబితా విడుదల ఎప్పుడు?

దొడ్డబళ్లాపురం : రాష్ట్రంలో 545 ఎస్ఐ పోస్టుల ఎంపిక జాబితాను విడుదల చేయడంలో ఆలస్యం జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వైఖరి పట్ల ఆగ్రహంతో ఉన్న అభ్యర్థులు హోం మంత్రికి రక్తంతో లేఖ రాశారు. జనవరి నెలలో మరుపరీక్ష జరిగింది. మార్చిలో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ప్రకటన చేయాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ ఆ ప్రకటన వెలువడలేదు. దీంతో తీవ్ర ఆగ్రహంతో ఉన్న అభ్యర్థులు త్వరగా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ హోంమంత్రి పరమేశ్వర్‌కు లేఖ రాశారు.

నదీ తీర ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి

మైసూరు: జిల్లాలోని హెచ్‌డీ కోటె తాలూకాలో తారక నదీ పరివాహక ప్రాంతంలో ఎక్కువగా వర్షాలు కురుస్తున్నందున తారక డ్యాంకు వరద పోటెత్తింది. ఈనేపథ్యంలో డ్యాంలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరే దశకు చేరినందున డ్యాం నుంచి ఏక్షణంలోనైనా నీటిని బయటకు వదిలే అవకాశం ఉంది. దీంతో నదీ తీర లోతట్టు గ్రామాల ప్రజలు ముందు జాగ్రత్తలు పాటించి తమ సామగ్రిని తీసుకుని, పశువులతో సహా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సంబంధిత అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో సూచించారు.

పునీత్ కెరెహళ్లికి బెయిల్ మంజూరు

బనశంకరి: రాజస్థాన్ నుంచి కుక్క మాంసం తరలిస్తున్నారనే ఆరోపణ కేసులో అరెస్టయిన రాష్ట్ర రక్షణాపడె నేత పునీత్ కెరెహళ్లికి నగరంలోని కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మంగళవారం బెయిల్ పిటిషన్ విచారణ చేపట్టిన 5వ ఏసీఎంఎం కోర్టు పునీత్ కెరెహళ్లికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ప్రతినెల మొదటి ఆదివారం పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకం చేయాలి. విచారణ పూర్తయ్యేవరకు దేశం విడిచి వెళ్లరాదు, ఎలాంటి నేరాల్లో పాల్గొనరాదు అని షరతులను విధిస్తూ బెయిల్ ఇచ్చింది.

రాయితీ విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేసిన దృశ్యం

మైసూరు: వ్యవసాయ శాఖ రైతులకు రాయితీ ధరలో అందించే విత్తనాల పంపిణీని ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సాంకేతికంగా సోమవారం ఇక్కడి అతిథిగృహం వద్ద ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ మహదేవప్ప, వ్యవసాయ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి చలువరాయస్వామితో పాటు జిల్లా ఎమ్మెల్యేలు, రైతులు పాల్గొన్నారు.



బాగల్‌కోటె జిల్లాలో ఘటప్రభ నది ప్రవాహం



బంట్వాళ వద్ద నేత్రావతి నది ఉగ్రరూపం



బెళగావి జిల్లా అథణి తాలూకా జుగుల గ్రామంలో వరద నీరు

ముంచెత్తుతున్న వరదలు

- ప్రమాదకర స్థాయిలో నేత్రావతి, కుమారధార నదులు
- చిక్కమగళూరు జిల్లాలో తెగిన చెరువు కట్ట
- బెళగావి జిల్లాలో జోరుగా ఘటప్రభ ప్రవాహం
- జలదిగ్బంధంలో గ్రామాలు
- నీట మునిగిన పొలాలు

యశవంతపుర: కరవాళి, మలెనాడు, సరిహద్దు జిల్లా బెళగావి జిల్లాలో భారీ వానలు కురుస్తున్నాయి. కొండ చరియలు విరిగిపడటంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కరావళి జీవనదులైన నేత్రావతి, కుమారధార నదులు ప్రమాద స్థాయిలో ప్రవాహిస్తుండగా ఆయా ప్రాంతాలకు వరద ముప్పు పొంచి ఉంది. నదీ తీర ప్రాంతం ప్రజలు అరచేతిలో ప్రాణం పెట్టుకొని గడుపుతున్నారు. హళ్లిగేటు సమీపంలోని ఐత ముగేర అనే వ్యక్తికి చెందిన ఇల్లు సగం కూలిపోయింది. కుటుంబ సభ్యులను సురక్షత ప్రాంతాలకు తరలించారు. పంజల జాతీయ రహదారిపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మలెనాడు ప్రాంతంలో జాతీయ రహదారి 173లో రోడ్డుపై భారీ చెట్టు కూలింది. మంగళూరు–చిక్కమగళూరు రోడ్డును మూసివేశారు. కొట్టిగెహారలో ట్రాఫిక్ స్థంభించి పోయింది. ఎన్‌ఆర్‌పుర తాలూకా మహల్గోడు వంతెన మునిగిపోయింది. శృంగేరి నెమ్మారు వద్ద జాతీయ రహదారి169లో వంతెనపై తుంగానది వరద నీరు పోటెత్తింది. శృంగేరి–కార్కళ హైవేని బంద్ చేశారు. చిక్కమగళూరులో సోమవారం రాత్రి ఎస్టేట్ చెరువు తెగి నీరు పొలాల్లోకి నీరు చేరింది. వరి నాట్లు వరదనీటితో మునిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయ్యారు. హాసన జిల్లా సకలేశపుర తాలూకా కుంబరడి సమీపంలో రోడ్డు నూరు మీటర్లు వరకు కోసుకోయింది. కొడగు జిల్లా భాగమండళలో త్రివేణి సంగమ పూర్తిగా నిండిపోయింది. వర్షంతోపాటు పరీతమైన గాలి వీస్తుండటంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. భాగమండల భంగడేశ్వర ఆలయం స్నానఘట్టం వరకు వరద నీరు ప్రవాహిస్తుంది. బెళగావి జిల్లాలో ఘటప్రభ జోరుగా ప్రవహిస్తోంది. అనేక ఊర్లు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. గోకాక్ తాలూకా మెళవంకి గ్రామంలో ఐదు వందలకు పైగా గృహాల్లోకి నీరు చేరింది. వందలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు. వరిపంటలు నీటిలో మునిగిపోయాయి.

శిరాడిలో కూలిన మట్టిచరియలు

హాసన జిల్లా సకలేశపుర తాలూకా పరిధిలోని శిరాడి ఘాట్ జాతీయ రహదారి 75లో మట్టి చరియలు కూలాయి. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్యాంకర్‌తో పాటు ఆరు వాహనాలు మట్టిలో చిక్కుకున్నాయి. మంగళవారం ఉదయం దొడ్డతప్పె వద్ద మట్టి చరియలు విరిగి రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై మట్టి పడటంతో అక్కడిక్కడే చిక్కుకున్నాయి. కారులోని వారు ప్రమాదం నుంచి బయట పడ్డారు. రక్షణ సిబ్బంది జెసీబీల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. వాహనాల రాకపోకలను గుండ్య వద్ద నిలిపివేశారు. మంగళూరు–బెంగళూరు మధ్య సంచరించే వాహనదారులు సంపాజె, మడికేరి మార్గంలో వెళ్లాలని దక్షిణకన్నడ జిల్లా కలెక్టర్ ముల్లైముగిలన్ తెలిపారు. మాణి–పుత్తూరు మార్గంలో చిన్నపాటి మట్టి చరియలు విరిగి పడటం వల్ల సహాయక చర్యలు చేపట్టినట్లు వివరించారు. హాసన జిల్లాలో మట్టి చరియలు విరిగి పడిన ప్రాంతాల్లో మంగళవారం మంత్రి కృష్ణబైరేగౌడ పర్యటించి సహాయక చర్యలను పర్యవేక్షించారు. అలాగే బాగలకోటె జిల్లాలో కూడా మంత్రి పర్యటించారు.

ఆగస్ట్ 3 వరకు వానలు

ఆగస్ట్ 3 వరకు రాష్ట్ర వ్యాప్తంగా వానలు పడే అవకాశం ఉన్నట్లు బెంగళూరు వాతావరణశాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఐదు జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. కరావళి జిల్లాల పరిధిలో విస్తారమైన వానలు పడనున్నాయి. ఉత్తర, దక్షిణ ఒళనాడులో ఆగస్ట్ 3 వరకు వానలు పడనుండగా 30–40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు బెంగళూరు వాతావరణశాఖ శాస్త్రవేత్త సీఎస్ పాటిల్ తెలిపారు. శివమొగ్గ, కొడగు, చిక్కమగళూరు, దక్షిణకన్నడ, ఉడుపి జిల్లాలో బుధవారం రాత్రి వరకు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఆగస్ట్ 1 నుంచి ఆరెంజ్ అలర్ట్, 2,3 తేదీల్లో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఉత్తరకన్నడ జిల్లాలో బుధవారం నుంచి గురువారం వరకు ఆరెంజ్ అలర్ట్, దక్షిణకన్నడ జిల్లాలో 2, 3వ తేదీల్లో ఎల్లో అలర్ట్ ప్రటించారు.



ముధోళ తాలూకా మళలి గ్రామంలో ఇళ్లలోకి వచ్చిన వరద నీరు



శిరాడిఘాట్‌లో చిక్కుకున్న వాహనాలు



బాగల్‌కోటె జిల్లాలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వరద బాధితులు

స్వావలంబన దిశగా విద్యుత్ రంగం

బనశంకరి: విద్యుత్ రంగంలో స్వావలంబన దిశగా సాగేందుకు కృషి చేస్తున్న ఇంధన శాఖ వేసవి అనంతరం రాష్ట్రంలో రూ.1,403 విలువచేసే విద్యుత్ విక్రయించామని ఆశాఖ మంత్రి కేజే.జార్జ్ తెలిపారు. మంగళవారం బెస్కాం కార్యాలయంలో ఆయన విలేకరులతోమాట్లాడారు. 2024 ఏప్రిల్ 1 నుంచి జూలై చివరి వరకు రూ.1,403 కోట్ల విలువైన విద్యుత్ విక్రయించామన్నారు. నిత్యం రూ.30 నుంచి 40 కోట్ల విలువైన విద్యుత్ విక్రయించామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిత్యం సరాసరి 250 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా ఇందులో 20 మిలియన్ యూనిట్లు వేసవిలో వినిమయ ఆధారంగా విద్యుత్ తీసుకుంటున్న పంజాబ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు 40 నుంచి 50 మిలియన్ యూనిట్లు సరఫరా చేసినట్లు తెలిపారు. 180 మిలియన్ యూనిట్లు రాష్ట్రంలో వినియోగిస్తున్నామని తెలిపారు. రాయచూరులో ఉష్ణవిద్యుత్ స్థావరంలో 1,006 , బళ్లారిలో 1,049 , యరమరస్‌లో 898 మెగావ్యాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. వర్షాలు జోరుగా పడుతుండటంతో జలవిద్యుత్ ఉత్పత్తి ప్రమాణం 34.96 మిలియన్ యూనిట్లకు పెరిగిందన్నారు. సౌరశక్తితో 34.64 , పవన విద్యుత్ 60.05 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి అవుతోందన్నారు. యలహంక సమీపంలో గ్యాస్ ఆధారిత 370 మెగావ్యాట్ల సామర్థ్యం కలిగిన కేంద్రం, బిడదిలో 11.05 మెగావ్యాట్ల (చెత్తతో విద్యుత్ ఉత్పత్తి) ఉత్పత్తిచేసే కేంద్రాన్ని ఆగస్టులో ప్రారంభిస్తామని తెలిపారు.

యువతి హంతకుని అరెస్ట్

సాక్షి బళ్లారి : ముంబైలో ఓ యువతిని దారుణంగా హత్య చేసిన దావుద్ అనే దుర్మార్గుడిని యాదగిరిలో ముంబై పోలీసులు అరెస్ట్ చేశారు. కల్బుర్గి జిల్లా జేవర్గి తాలూకా హంగరగ గ్రామానికి చెందిన దావూద్ బెంగళూరులో రోజువారి కూలిపనులు చేస్తుండేవాడు. ఫేస్‌బుక్ ద్వారా ముంబైకి చెందిన యశశ్రీ(25)తో పరిచయం చేసుకున్నాడు. 2019లో ఆయువతిని వేధించాడని ఫిర్యాదు చేయడంతో పోలీసులు అరెస్టు చేశారు. జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత మళ్లీ మాయమాటలు చెప్పేందుకు యత్నించగా తిరస్కరించింది. అప్పటినుంచి పగ పెంచుకుని హత్యకు పథకం రచించాడు. ఈనెల 27న ఆమెను అంతమొందించాడు. వక్షోజాలు, మర్మాంగం కోసి దారుణంగా హత్య చేసినట్లు పోస్టుమార్టం రిపోర్టులో బయట పడింది. దావూద్ ఈ హత్య చేసినట్లు గుర్తించిన ముంబై పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నిందితుడిని అరెస్టు చేశారు.

ముక్కుసూటి మనిషిపై అవినీతి మరక

- సిద్ధరామయ్య రాజకీయ జీవితంలోని అవినీతి కేసులపై బీజేపీ విమర్శలు
- సోషల్ మీడియాలో అవహేళన పోస్టులు
- 40 ఏళ్లు.. 9 బ్లాక్ మార్క్స్
- తనది నిష్కళంక రాజకీయ జీవితమన్న ముఖ్యమంత్రి



ఏడాది పాలనలో అపనిందలు

సాక్షి బెంగళూరు: కర్ణాటక రాజకీయాల్లో ముఖ్యమంత్రి సిద్దరామయ్యది ప్రత్యేక స్థానం. ఆయన ముక్కుసూటి మనిషి. కాంగ్రెస్‌లో అధిష్టానానికి.. ముఖ్యంగా గాంధీ కుటుంబానికి విధేయుడి గుర్తింపు. 40 ఏళ్లకు పైగా సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఈ అపర చాణక్యుడు.. న్యాయవాద వృత్తిలో ఉంటూ రాజకీయ అరంగేట్రం చేశారు. రాజకీయాల్లో ఎన్నో ఎత్తుపల్లాలు, ఒడిదొడుకులు చూసిన సిద్దరామయ్యను ప్రస్తుతం వాల్మీకి కుంభకోణం, ముడా స్థలాల పంపిణీలో అక్రమాల పేరిట ఉన్న రెండు కేసులు నిద్రపోనివ్వకుండా చేస్తున్నాయి. 1983లో తొలిసారి ఏడో అసెంబ్లీలో అడుగుపెట్టిన సిద్దరామయ్య, 1985లోనే మంత్రి పదవిని అలంకరించారు. 1996లో ఉప ముఖ్యమంత్రిగాను, 2013లో తొలిసారి ముఖ్యమంత్రిగా ఇలా ఎన్నో పార్టీ, ప్రభుత్వ పదవులు చేపట్టిన సిద్దరామయ్య మలి వయసులో ఇబ్బందులు పడుతున్నారు.

సోషల్ మీడియాలో బీజేపీ విమర్శల దాడి :

40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి బ్లాక్ మార్కు లేదని గర్వంగా చెప్పుకుని తిరిగే సిద్దరామయ్యకు జీవితంలో ఒంటి నిండా అవినీతి మరకలు ఉన్నాయని ప్రతిపక్ష బీజేపీ ఆరోపణలు గుప్పిస్తోంది. ఈ ఆరోపణలకు బదులు చెప్పలేక సిద్దరామయ్య మాటలు తడబడుతున్నాయి. ఇదే క్రమంలో సిద్దరామయ్య పరిపాలన కాలంలో ఏకంగా 9 అవినీతి మరకలు, కుంభకోణాలు ఉన్నాయని బీజేపీ ఒక జాబితాను తయారు చేసి విడుదల చేసింది. ఈ జాబితా ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిద్దరామయ్యపై వస్తున్న ఆరోపణలకు బాధ్యత వహిస్తూ ఆయన రాజీనామా చేసి తాను సత్యహరిశ్చంద్రుడినని నిరూపించుకోవాలని ప్రతిపక్షాలు సవాలు విసురుతున్నాయి. తన నిష్కళంక రాజకీయ జీవితంపై బ్లాక్ మార్కు వేయాలని బీజేపీ ముఖ్య నేతలు ఉద్దేశపూర్వకంగా అసత్య ఆరోపణలు చేస్తున్నారని సిద్దరామయ్య మాత్రం పదే పదే చెబుతున్నారు. బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణలకు బదులు చెప్పలేక, ప్రతిపక్ష పార్టీ నేతలపై కూడా చాలా వరకు అవినీతి ఆరోపణలు వచ్చాయని, కానీ వాటిపై ఎప్పుడు విచారణ జరగలేదని ఎద్దేవా చేశారు. తాను మాత్రం ముడా కేసులో న్యాయ విచారణకు సిద్ధపడ్డానని, ఇంతకుమించి ఇంకేమీ చేయాలంటే ప్రతిపక్షాల నోరు మూయించే ప్రయత్నం చేశారు. తన రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి చేయలేదని, తన పేరుకు కళంకం తీసుకొచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. ముడా కేసు విషయంపై తనకు ఎలాంటి భయం లేదని, ఎందుకంటే తాను ఎలాంటి తప్పు చేయలేదని వివరణ ఇచ్చారు. సిద్దరామయ్య వ్యాఖ్యలపై బీజేపీ ఎదురు దాడి చేసింది. ఈ బ్లాక్ మార్కు ఎవరు పెడుతున్నారు. సిద్దరామయ్య తన ఒంటి నిండా అవినీతి మరకలు పెట్టుకుని మాపై నిందలు వేయడమా అంటూ బీజేపీ 9 అవినీతి కుంభకోణ కేసులను సోషల్ మీడియాలో ప్రచారం చేసింది.

సిద్దూపై బీజేపీ ఆరోపణలు ఇవే

- వజ్రాలతో పొదిగిన హ్యూబ్లాట్ వాచ్ ధరించడం
- ఆర్కావతి లేఔట్ డీనోటిఫైపై
- కృషి భాగ్య పథకంలో వందలాది కోట్ల అవినీతి
- అన్నభాగ్య పథకంలో వేలాది కోట్ల రూపాయల అక్రమాలు
- ఇందిరా క్యాంటీన్‌లో అవినీతి
- ఇందిరా క్యాంటీన్ అవినీతిని కప్పిపుచ్చేందుకు లోకాయుక్త మూసివేత
- వాల్మీకి నిగమలో వందలాది కోట్ల రూపాయల గోల్‌మాల్
- ముడాలో అక్రమంగా స్థలాల పంపిణీ
- సిట్‌ను తమ చేతి కీలుబొమ్మగా మార్చుకుని క్లీన్‌చిట్ పొందడం

నవనీత అలంకరణలో బనశంకరీదేవి



నవనీత అలంకరణలో బనశంకరీదేవి



పసుపుకొమ్ముల అలంకరణలో శాకంబరీదేవి

బనశంకరి: ఆషాఢ మాసం సందర్భంగా బెంగళూరు నగరవాసుల ఆరాధ్య దేవత బనశంకరీదేవికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో బనశంకరీదేవీ మూలవిరాట్‌కు అర్చనలు, అభిషేకం నిర్వహించి నవనీత అలంకరణచేపట్టారు.శాకంబరీదేవికి పసుపుకొమ్ములతో అలంకరణచేసిపూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధనచేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

సిద్దుకు విరుద్ధంగా కుట్రలు

- అణగారిన వర్గాల ధర్నా హెచ్చరిక

శివాజీనగర: వెనుకబడిన వర్గాల నాయకుడైన ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వ్యతిరేకంగా బీజేపీ, జేడీఎస్ నాయకులు కుట్రలు చేపట్టడంపై కర్ణాటక అణగారిన వర్గాల మహా ఒక్కూట ఆగ్రహం వ్యక్తం చేసింది. మంగళవారం బెంగళూరులో జాయింట్ విలేకరుల సమావేశంలో మాట్లాడిన కర్ణాటక అణగారిన వర్గాల మహా ఒక్కూట ప్రధాన సంచాలకుడు కే.ఎం.రామచంద్రప్ప, సంచాలకుడు మావళ్లి శంకర్, ఎణ్ణెగెరె ఆర్.వెంకటరామయ్యలు రాష్ట్రంలో మతతత్వవాదులు, కులవాదులు అధికారం కోసం ప్రజల తరపున ఉన్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. సిద్దరామయ్య విరుద్ధంగా పెద్ద స్థాయిలో కుట్ర రూపొందించారు. ఎలాంటి మచ్చలేని నాయకుడిగా ఉన్న సిద్దరామయ్య గౌరవానికి మసి పూసి, ఆయనను రాజకీయంగా ముగించే కుట్ర చేపట్టారు. ఈ కుట్రను నిలుపకపోతే అణగారిన వర్గాలు పోరాటం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య విరుద్ధంగా బీజేపీ–జేడీఎస్ రాష్ట్ర నాయకులు జరిపిన కుట్రకు బీజేపీ జాతీయ నాయకులు కొమ్ముకాస్తున్నారని, దీన్ని ఏమాత్రం సహించబోమన్నారు.

ఇంటి భోజనం కోసం హైకోర్టును ఆశ్రయించిన దర్శన్

దొడ్డబళ్లాపురం: ఇంటి భోజనం కోసం దర్శన్ నిర్విరామంగా పోరాడుతున్నారు. జైలు భోజనం వల్ల ఆరోగ్యం క్షీణిస్తోందని, తగిన సౌకర్యాలు లేక నిద్ర రావడం లేదని దర్శన్ గగ్గోలు పెడుతున్నాడు. ఇటీవల దర్శన్ రిట్ పిటిషన్‌ను మెజిస్ట్రేట్ కోర్టు తిరస్కరించింది. అయితే దర్శన్ మళ్లీ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలను ప్రశ్నిస్తూ లాయర్ ద్వారా హైకోర్టును ఆశ్రయించారు.

జైలులో దర్శన్‌కు భద్రత పెంపు

పరప్పన అగ్రహార జైలులో ఉన్న దర్శన్‌కు జైలు అధికారులు భద్రత పెంచారు. దర్శన్ ఉంటున్న సెల్ వద్ద అధిక సిబ్బందిని నియమించారు. దర్శన్‌ను ఎవరు కలవాలని వచ్చినా ఆయనతో పాటు ఏడుగురు భద్రతా సిబ్బంది కూడా ఉంటారు. ఇటీవల జైలు నుండి బయటకు వచ్చిన సిద్ధారూఢ అనే ఖైదీ తాను కూడా దర్శన్‌ను కలిశానని స్టేట్‌మెంట్ ఇచ్చాడు. అంతేకాకుండా జైలులో దర్శన్‌కు తగిన భద్రత కల్పించడం లేదని ఫ్యాన్స్ నుంచి ఆరోపణలు వస్తుండడంతో జైలు అధికారులు ఆయనకు భద్రత పెంచారు.

సెల్ఫీ సరదా గుంజీలు తీయించింది !



యువకులతో గుంజీలు తీయిస్తున్న దృశ్యం

మైసూరు: కర్ణాటకలోని చామరాజనగర జిల్లా కొళ్లేగాల తాలూకాలోని భరచుక్కి జలపాతం తుది అంచులకు వెళ్లి సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించిన 20 మందికి పైగా యువకులను పోలీసులు శిక్షించారు. కేఆర్‌ఎస్ రిజర్వాయర్ నుంచి కావేరి నదిలోకి భారీగా నీటిని విడుదల చేయడంతో భరచుక్కి జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో 'జలపాతం దగ్గరికి వెళ్లొద్దు' అని బోర్డు పెట్టారు. అయినప్పటికీ యువకులు సెల్ఫీ కోసం అక్కడికి చేరుకుంటున్నారు. ఈక్రమంలో 20 మంది యువకులు మంగళవారం సరదాగా జలపాతం తుది అంచులకు వెళ్లి సెల్ఫీ తీసుకునేందుకు సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న కొళ్లేగాల పోలీసులు చేరుకొని వారిని వెనక్కు పిలిపించి గుంజీలు తీయించారు.సెల్ఫీ మోజుతో ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దని హితవు పలికారు.

ఆపరేషన్ మక్నా విజయవంతం



మత్తు ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత స్పృహ కోల్పోయిన మక్నా ఏనుగు



క్రేన్ ద్వారా మక్నాను లారీలోకి ఎక్కిస్తున్న దృశ్యం

- ఏనుగు పట్టివేత
- వందమంది సిబ్బంది..మూడు రోజుల గాలింపు
- మత్తు ఇంజక్షన్ ఇవ్వడం ద్వారా ఏనుగు బందీ

బొమ్మనహళ్లి : బన్నేరుఘట్ట జాతీయ ఉద్యానవనం చుట్టు పక్కల గ్రామాల్లోకి పదే పదే వచ్చి ముగ్గురు వ్యక్తులను బలి తీసుకున్న మక్నా(అటు ఆడ కాదు, ఇటు మగ కాదు) ఏనుగును ఎట్టకేలకు బంధించారు. దీంతో గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వంద మంది అటవీ సిబ్బందితోపాటుగా డ్రోన్ కెమరాలు దుబారె, మత్తిగోడు ఏనుగుల శిబిరాలనుంచి 8 గజరాజులను తెప్పించి శనివారం, ఆదివారం సైతం గాలింపు కొనసాగించారు. సోమవారం వేకువజామున మక్నా ఏనుగు కదలికలను గుర్తించి షార్ప్‌షూటర్ రంజన్ మత్తు ఇంజక్షన్‌ను ఇచ్చారు. రెండు కిలో మీటర్ల దూరం పోయిన తర్వాత ఏనుగు స్పృహ కోల్పోయింది. సిబ్బంది అక్కడికి చేరుకొని మక్నా కాళ్లను తాళ్లతో బంధించి పెంపుడు ఏనుగులు బీమా, మహేంద్ర సహకారంతో దానిని నడిపించి క్రేన్ సహాయంతో లారీలోకి ఎక్కించి బన్నేరుఘట్ట ఉద్యానం పరిధిలోని సీగేకట్టె శిబిరానికి తరలించినట్లు బన్నేరుఘట్ట జాతీయ ఉద్యాన వనం డీఎఫ్‌ఓ ప్రభాకర్ ప్రియదర్శి తెలిపారు. షార్ప్ షూటర్ రంజన్, వైద్యులు రమేష్, కిరణ్, నాగరహొళె ఏనుగుల నిపుణుడు రమేష్, బండిపుర ఏనుగుల నిపుణుడు వసీమ్, మావటీలు అటవీ సిబ్బంది ఈ ఏనుగును బంధించడంలో శ్రమించారని తెలిపారు. సీగెకట్టె శిబిరంలో బంధించిన ఏనుగును కొన్ని రోజుల తర్వాత బయటకు తీసుకొస్తామని తెలిపారు.



మక్నాను బంధించడంలో శ్రమిస్తున్న ఏనుగులు

క్లుప్తంగా

ఘనంగా ఆడికృత్తిక



సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

మండ్య: ఇక్కడి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న శ్రీ బాలసుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీ బాల సుబ్రహ్మణేశ్వరస్వామి పూజా మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మహాగణపతి పూజ, గణపతి మూర్తులకు పంచామృతాభిషేకం, చండికా హోమం, పూర్ణాహుతి, దుర్గా హోమం నిర్వహించారు. ఆడికృత్తిక నక్షత్రం సందర్భంగా శ్రీ సుబ్రహ్మణేశ్వరస్వామికి ఫల పంచామృతాభిషేక సహిత మహాపూజ జరిగింది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి అన్నదానం చేశారు.

బైక్ వీలింగ్.. ఐదుగురి అరెస్ట్

దొడ్డబళ్లాపురం: రహదారులపై వీలింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న 5మందిని నెలమంగల ట్రాఫిక్ పోలీసులు అరెస్టు చేశారు. నెలమంగల చుట్టుపక్కల జాతీయ రహదారులపై ఇటీవల బైకులపై గుంపులుగా వస్తున్న యువకులు రోడ్లమీద ప్రమాదకరంగా ఫీట్లు, వీలింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఇందుకు సంబంధించి అనేక ఫిర్యాదులు అందడంతో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. మంగళవారం బెంగళూరుకు చెందిన 5మంది యువకులను అరెస్టు చేశారు.

స్వాతంత్య్ర దిన ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ అక్రం పాషా

కోలారు : 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని అర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అక్రం పాషా పిలుపునిచ్చారు. స్వాతంత్య్ర దిన వేడుకల నిర్వహణపై మంగళవారం ఆయన తన కార్యాలయ సభాంగణంలో అధికారులతో సమావేశమై మాట్లాడారు. కార్యక్రమానికి వారం రోజుల ముందు నగరంలో స్వచ్ఛత కార్యక్రమాలను చేపట్టాలని నగరసభ అధికారులకు సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వాన పత్రికను ముద్రించాలని తెలిపారు. జాతీయ గీతం, నాడగీతం, రైతుగీతాలను ఆలపించడానికి విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేదిక ఏర్పాట్లు, ఆర్షక పథసంచలనంపై దృష్టి పెట్టాలని సూచించారు. స్వాతంత్య్ర దినం రోజు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. ఎస్పీ నిఖిల్ , డిప్యూటీ కలెక్టర్ మంగళా తదితరులు పాల్గొన్నారు.

మద్యపాన వ్యసనాన్ని వీడండి



మాట్లాడుతున్న డైరెక్టర్ శీనప్ప

చిక్కబళ్లాపురం : మద్యపాన వ్యసనాన్ని వీడాలని శ్రీ క్షేత్ర దర్మస్థళ గ్రామాభివృద్ధి సంఘం బెంగళూరు విభాగం డైరెక్టర్ శీనప్ప సూచించారు. మద్యపాన వ్యసనం మాన్పించేందుకు జిల్లా కేంద్రానికి సమీపం జాతవార గ్రామంలో రామానుజసముదాయ భవనంలో శ్రీక్షేత్ర ధర్మస్థళ, స్థానిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిబిరం మంగళవారం ముగిసింది. శీనప్ప మాట్లాడుతూ సప్త వ్యసనాలలో మద్యపానం మొదటిదని, దీనిని వీడాలన్నారు. రాష్ట్రంలో వేలాది శిబిరాలను ఏర్పాటు చేశామని, ధర్మస్థల మంజునాథుని కటాక్షం వల్ల లక్షలాది మంది ఈ వ్యసనాన్ని వీడారని అన్నారు. సమితి అధ్యక్షులు వెంకటేశ్, క్షేత్రయోజనాధికారి ధనుంజయ్ పాల్గొన్నారు.

పిల్లలతో భిక్షాటన నేరం



ప్రారంభిస్తున్న జడ్జి శృంగేష్

మండ్య: పిల్లలతో భిక్షాటన, వ్యభిచారం చేయించడం, మానవ అక్రమ రవాణా ద్వారా అవయవాల చౌర్యం వంటివి చేయడం నేరం అని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి ఎం.శృంగేష్ పేర్కొన్నారు. ఆయన నగరంలోని జిల్లా కారాగారంలో ఏర్పాటు చేసిన మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవంలో మాట్లాడారు. సమాజంలో తెలిసో తెలియకో చిన్న చిన్న తప్పులు చేస్తాం, తెలిసిన తర్వాత సరిదిద్దుకోవాలన్నారు. ప్రతిఒక్కరికి న్యాయపరమైన అవగాహన ముఖ్యమని సూచించారు. అన్యాయం జరిగితే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఆనంద్ అన్నారు. జిల్లా జైలు సూపరింటెండెంట్ టీకే లోకేష్, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.టి.రాజేంద్ర, న్యాయశాఖ సహాయ ఆచార్యులు ఎస్.బి.బోరెగౌడ, అసిస్టెంట్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమేష్, న్యాయశాఖ సహాయ ఆచార్యులు కె.ఎస్.జయకుమార్ పాల్గొన్నారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు

- ఆకుకూరలు, కూరగాయలతోనే అధిక దిగుబడి
- వ్యవసాయంతో ఆదాయం గడిస్తున్న చిన్నకారు రైతు



రైతు సాగు చేసిన దోసతోట



ఏపుగా పెరిగిన వంగతోట

సాక్షి బళ్లారి: మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు, వ్యవసాయ పద్ధతులు, విపరీతమైన రసాయనిక క్రిమిసంహారక మందులు వాడుతూ పొలాలను రైతులు ఓ వైపు నాశనం చేసుకోవడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపే విధంగా జరుగుతోంది. ఇటీవల కొందరు రైతులు సేంద్రియ ఎరువులతోనే పంటలను పండిస్తున్నామని అందులో కూడా రసాయనిక, క్రిమిసంహారక మందులను వాడుతూ కొంత మేర మోసగిస్తున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. అయితే కొప్పళ జిల్లా నిశాల గ్రామానికి చెందిన ఓ చిన్నకారు రైతు ఎలాంటి రసాయనిక, క్రిమిసంహారక మందులను వాడకుండా పశువుల పేడ, ఇతరత్ర సేంద్రియ ఎరువులను వాడుతూ ఆరోగ్యకరమైన ఆకు కూరలను, కూరగాయలను పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నిశాల గ్రామంలో తనకు ఉన్న మూడు ఎకరాల లోపు పొలంలో కొత్తిమీర, సబ్బాక్సీ, మెంతి కూర, పలకలకూర తదితర ఆకు కూరలతో పాటు కూరగాయలను కూడా సాగు చేస్తూ ప్రతి రోజు ఆదాయం పొందుతున్నారు. ఆకు కూరలను సాగు చేయడం వల్ల ఆరోగ్యకరంగా ఉండేందుకు దోహదం చేస్తుందంటున్నారు. అందులో ఒక గ్రాము రసాయనిక ఎరువులు కానీ, ఒక చుక్క క్రిమి సంహారక మందులు కానీ వాడకుండా ఆకు కూరలను, కూరగాయలను సాగు చేసి అమ్మకాలు సాగిస్తున్నట్లు రైతు శరణప్ప దంపతులు పేర్కొన్నారు.

రోజు వారి రూ.1500లకు పైగా ఆదాయం

మలబరీ సాగుతో పాటు ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఆకు కూరలు తీసుకొని కొప్పళలో మార్కెట్ చేసుకోవడం వల్ల రోజు వారి ఆదాయం రూ.1500 వరకు వస్తుందన్నారు. తాను, తన భార్య లక్ష్మమ్మ ప్రతి నిత్యం పొలంలోకి వెళ్లి పనులను చేసుకుంటూ నెలకు కనీసం రూ.30 వేలకు పైగా ఆదాయం పొందుతున్నామన్నారు. రసాయనిక, క్రిమిసంహారక మందులు వాడకపోవడం వల్ల ఆకు కూరలు ఎంతో ఏపుగా పెరిగి కళకళలాడుతుంటాయన్నారు. తాము మార్కెట్‌కు వెళ్తే చాలా మంది వరుసలో ఉండి కొనుగోలు చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తోందని గుర్తు చేశారు. ఆకు కూరలతో పాటు వంకాయ, దోసకాయ, తదితర కూరగాయలు కూడా సాగు చేశామని వాటి ద్వారా కూడా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు మలబరీ ప్రతి 45 రోజులకు ఒకసారి పంట చేతికి వస్తుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా తమ పొలం మరింత బలవర్థకంగా మారుతోందన్నారు. విపరీతమైన రసాయనిక, క్రిమిసంహారక మందులకు స్వస్తి చెప్పి సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపాలని రైతులకు శరణప్ప సూచిస్తున్నారు.



కొత్తిమీర సాగు

భోజనం రుచిగా ఉండాలి

కోలారు: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం రుచిగా శుచిగా ఉండాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ అధికారులకు హెచ్చరించారు. మంగళవారం నగరంలోని తాలూకా పంచాయతీ కార్యాలయంలో సామాన్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజనం పథకం నాణ్యతపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. వారానికోసారి పాఠశాలలకు వెళ్లి మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలన చేయాలన్నారు. కోలారు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రతి అంగనవాడీ కేంద్రానికి సొంత భవనం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా ఆలయాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు. కోలారు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు వచ్చాయని అన్నారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్, తాపం ఈఓ, ఉప విభాగాధికారి డాక్టర్ మైత్రి తదితరులు పాల్గొన్నారు.

పరిసర సంరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న జడ్జి సునీల్ హోసమని

కోలారు: పరిసర సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి న్యాయమూర్తి సునీల్ హోసమని తెలిపారు. నగరంలోని ఎం విశ్వేశ్వరయ్య ఇంటర్ నేషనల్ పాఠశాలలో కదంబ సేవా ఫౌండేషన్ 50వ రోజు మొక్కను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఒక చెట్టును నరికితే దాని స్థానంలో మరో మొక్క నాటి పెంచే బాధ్యతలను తీసుకోవాలన్నారు. జిల్లాలో వర్షపాతం తక్కువగా ఉండడానికి కారణం అటవీ ప్రాంతం తక్కువగా ఉండడమే కారణమన్నారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అటవీకరణ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. మైనర్ బాలురు వాహనాలు నడిపితే పోషకులకు జరిమానా విధిస్తామన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు భారత సేవాదళ జిల్లా అధ్యక్షుడు గణేష్, ప్రిన్సిపాల్ శ్రీదేవి బాయి, విద్యార్థులు పాల్గొన్నారు.

వస్త్ర మేళా ప్రారంభం



వివిధ రకాల దుస్తులను ప్రదర్శిస్తున్న మహిళలు

బనశంకరి: ప్యాలెస్ మైదానంలోని ప్రిన్సస్ షైన్‌లో మూడు రోజులపాటు నిర్వహించే సౌత్ ఇండియా గార్మెంట్స్ అసోసియేషన్ బీ 2బీ మేళా మంగళవారం ప్రారంభమైంది. సౌత్ ఇండియా గార్మెంట్స్ ఉత్పాదకర సంఘ అధ్యక్షుడు అనురాగ్ సింగ్లా మాట్లాడుతూ.. జౌళిరంగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని దేశీయంగా ఉత్పత్తి చేసిన దుస్తులను కొనుగోలు చేయాలని మనస్థితి రావాలన్నారు. దేశీయ బ్రాండ్లతో ఆర్థికాభివృద్ధికి అధిక రీతిలో సహాయపడుతుందని, అలాగే భారత గార్మెంట్స్‌లో తయారు చేసిన దుస్తులను ధరించాలని విదేశీ వ్యామోహం వీడాలని పిలుపునిచ్చారు. బెంగళూరు గార్మెంట్స్ రంగానికి ఉత్తమ భవిష్యత్ ఉందన్నారు. విలేకరుల సమావేశంలో కార్యదర్శి రాజేశ్‌చావత్, జౌళి ఉత్సవ సంచాలకుడు గోవిందముద్రా, నరేశ్‌లక్న పాల్, తేజస్నేహత్ తదితరులు పాల్గొన్నారు. ఈ మేళా ఆగష్టు 1వ తేదీ వరకు నిర్వహిస్తారు.

సర్జన్‌ను నియమించాలి



వినతిపత్రం సమర్పించిన దృశ్యం

కోలారు : నగరంలోని ఎస్ఎన్ఆర్ జిల్లా ఆస్పత్రికి పర్మనెంట్ సర్జన్‌ను నియమించాలని కోరుతూ రైతు సంఘం పదాధికారులు మంగళవారం తాత్కాలిక సర్జన్ డాక్టర్ బాల సుబ్రమణ్యం ద్వారా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడిన రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ జిల్లా ఆస్పత్రిలో సర్జన్ లేకపోవడం వల్ల రోగులు ఇబ్బందులు పడుతున్నారని, గతంలో ఉన్న సర్జన్ డాక్టర్ విజయ్ కుమార్ రిటైర్ అయ్యారని, అప్పటి నుంచి ఆ స్థానంలో మరొకరిని నియమించలేదన్నారు. ఇన్‌ఛార్జి సర్జన్‌గా వ్యవహరిస్తున్న వారు ఆస్పత్రి సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ప్రజలను దృష్టిలో ఉంచుకుని వెంటనే ఆస్పత్రికి పర్మనెంట్ సర్జన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, బంగవాది నాగరాజగౌడ, మహిళా అధ్యక్షురాలు నళినిగౌడ తదితరులు ఉన్నారు.

ముడా కుంభకోణంలో కాంగ్రెసోళ్ల పేర్లు చెప్పరేం?

- సీఎంకు ఎమ్మెల్సీ హెచ్.విశ్వనాథ్ సూటి ప్రశ్న

మైసూరు : ముడాలో జరిగిన రూ.5 వేల కోట్ల కుంభకోణానికి ప్రత్యక్ష కారణం మంత్రి భైరతి సురేశ్ అని, మొదట ఆయనను అరెస్ట్ చేయాలని విధాన పరిషత్ సభ్యుడు హెచ్.విశ్వనాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ముడా, వాల్మీకి కుంభకోణంతో కుదేలైందన్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఒంటరి అయ్యారన్నారు. తాను భయపడి, బెదిరింపులకు పాల్పడుతూ ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. హెచ్‌డీ దేవెగౌడ కుటుంబం, బీఎస్ యడియూరప్ప కుటుంబీకులు సైట్లు పొందలేదా? అని దబాయించడం సీఎంకు తగదన్నారు. తీసుకున్న స్థలాలను తిరిగి ఇచ్చేసి కుంభకోణాన్ని సీబీఐ విచారణకు అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. జేడీఎస్, బీజేపీ నేతల పేర్లను మాత్రమే ప్రస్తావిస్తున్న సీఎం సిద్ధరామయ్య..కుంభకోణానికి పాల్పడిన కాంగ్రెస్ వాళ్ల పేర్లను మాత్రం ప్రస్తావించడం లేదన్నారు. రాజకీయాల చివరి సంధ్యలో ఉన్న సిద్ధరామయ్య ఇప్పటికైనా మేల్కొనకుంటే మీతో ఉన్న వారే మసి పూస్తారని హెచ్చరించారు. ముడా కమిషనర్‌గా ఉన్న దినేష్ కుమార్ బదిలీ అయిన తర్వాత కూడా అక్రమాలు కొనసాగాయన్నారు. ఆయన జైలుకెళ్లి ఉంటే ఇలా జరిగేది కాదన్నారు. ముడా కుంభకోణానికి వ్యతిరేకంగా బీజేపీ-జేడీఎస్ నిర్వహించే పాదయాత్రలో తాను కూడా పాల్గొంటానని చెప్పారు.

వైభవంగా మారెమ్మ జాతర



ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి



పరంగిపాళ్యలో మారెమ్మతల్లికి అలంకరణ

గౌరిబిదనూరు: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని తాలూకాలోని ఎం.జాలహళ్లిలో మారెమ్మ దేవత జాతర, జ్యోతుల ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.హెచ్.శివశంకరరెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పాడిపంటలతో గ్రామస్తులు సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు మరళూరు ప్రకాశరెడ్డి, గంగాధరప్ప, శ్రీనివాస్, యతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారెమ్మతల్లికిపూజలు

బొమ్మనహళ్లి : బొమ్మనహళ్లి నియోజకవర్గం హెచ్ఎస్ఆర్ లేఔట్ వార్డు పరంగిపాళ్య గ్రామంలో మారెమ్మదేవికి అర్చకులు వినయ్ కుమార్ ఆధ్వర్యంలో అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

రాహుల్‌పై చర్యలకు ఆదేశించండి

శివాజీనగర: లైంగిక దాడులపై ఆరోపణలు ఎదుర్కొంటున్న హాసన్ మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను విమర్శించే క్రమంలో లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ మహిళల పరువుకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేశారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆల్ ఇండియా దళిత్ యాక్షన్ కమిటీ జాతీయ అధ్యక్షుడు చి.నా.రాము, జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు సుశీలా దేవరాజ్ పిల్ దాఖలు చేశారు. ఈ ఏడాది మే 2వ తేదీన శివమొగ్గలో లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి విచ్చేసిన రాహుల్‌గాంధీ... ప్రజ్వల్‌పై పలు విమర్శలు చేశారు. 400 మంది మహిళలపై అత్యాచారం చేసి ఆ దృశ్యాలను వీడియో తీసిన రేవణ్ణకు ఓటు వేయాలని కోరిన ప్రధాని మోదీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలు పరోక్షంగా హాసన్ ప్రాంత మహిళలను అవమానించేలా ఉన్నాయని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. రాహుల్ గాంధీపై చర్యలు చేపట్టేలా జాతీయ, రాష్ట్ర మహిళా కమిషన్, కర్ణాటక హోం శాఖ, రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్‌ను ఆదేశించాలని ఆ పిటిషన్‌లో కోరారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



వేణుగోపాల్(ఫైల్)

గౌరిబిదనూరు: చిక్కబళ్లాపురం జిల్లా గౌరీబిదనూరులో జరిగిన రూ.10లక్షల నగదు చోరీకి సంబంధించి ఏపీలోని అనంతపురం నగరం భాగ్యనగర్‌కు చెందిన చిక్కమగళూరు జిల్లా కొప్ప నివాసి లేట్ హనుమంతప్ప కుమారుడు వేణుగోపాల్(34)ను పోలీసులు అరెస్ట్ చేశారు. కొరటగెరె తాలూకా తగరిఘట్ట నివాసి హెచ్.నారాయణప్ప ఈనెల 8న రాత్రి కారులో వెళ్తూ 7గంటల సమయంలో గౌరీబిదనూరులోని గణేశ్ గ్రాండ్ హోటల్‌లో టీ తాగేందుకు వెళ్లాడు. దుండగుడు కారు అద్దాలు ధ్వంసం చేసి అందులో ఉన్న రూ.10 లక్షలు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో టౌన్ సీఐ సత్యనారాయణ, రూరల్ ఎస్ఐ రమేశ్ గుగ్గేరిలు విచారణ చేపట్టారు. సీసీకెమెరా ఆధారంగా దొంగను గుర్తించి అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. నిందితుడి నుంచి రూ.7లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను హోం మంత్రి పరమేశ్వర్, ఐజీపీ లాబూరామ్ అభినందించారు.

బీబీఎంపీ చెత్త లారీ డ్రైవర్ అరెస్ట్

శివాజీనగర: ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల మృతికి కారణమై పరారీలో ఉన్న బీబీఎంపీ చెత్త లారీ డ్రైవర్ శివశంకర్(38)ను హలసూరు గేట్ ట్రాఫిక్ పోలీసులు అరెస్ట్ చేశారు. టీసీఎస్ కంపెనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ప్రశాంత్, శిల్పలు ఆదివారం రాత్రి హోటల్‌లో భోజనం చేసి పీజీకి వెళ్తుండగా కే.ఆర్.సర్కిల్ వద్ద బీబీఎంపీ చెత్త లారీ దూసుకొచ్చి ఆ ఇద్దరూ మృతి చెందిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన అనంతరం లారీ డ్రైవర్ పరారయ్యాడు. దీంతో పోలీసులు గాలింపు చేపట్టి అతన్ని అరెస్ట్ చేశారు. మద్యం మత్తులో డ్రైవర్ లారీని నడిపినట్లు అనుమానంతో పోలీసులు అతన్ని ఆస్పత్రికి తరలించి రక్తనమూనాలు సేకరించారు. మెడికల్ రిపోర్ట్ తరువాత వాస్తవాలు వెల్లడికానున్నాయి.

చెత్త లారీలకు వేగపరిమితి

బీబీఎంపీ చెత్త లారీల ద్వారా నగరంలో పదే పదే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో వాటి వేగాన్ని నియంత్రించాలని ట్రాఫిక్ పోలీసులు యోచిస్తున్నారు. ప్రస్తుతం చెత్త లారీలకు ప్రతి గంటకు 60 కి.మీ. వేగపరిమితి ఉంది. ఆ వేగాన్ని మరింత తగ్గించాలని యోచిస్తున్నారు. చెత్త దుర్వాసనల మధ్య పని చేయాల్సి ఉండటంతో కొందరు డ్రైవర్లు మద్యం సేవించి వాహనం నడుపుతున్నారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆ విషయంలో కూడా పోలీసులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలిసింది.

ప్రతిభా పురస్కారాల ప్రదానం



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించిన దృశ్యం

విజయపుర : పిల్లలు మాతృభాష ఏదైనా రాష్ట్ర భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని తమకూరుకు చెందిన కర్ణాటక స్టేట్ రిజర్వ్ పోలీస్ ఎస్పీ హంజా హుసేన్ పిలుపునిచ్చారు. ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన ముస్లిం విద్యార్థులకు పట్టణంలోని హయాత్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఆయన ప్రతిభా పురస్కారాలను అందజేసి మాట్లాడారు. డీఎస్ఎఫ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ ముజమ్మిల్, సంస్థాపక అధ్యక్షుడు నాసిర్ అహ్మద్, సభ్యులు సయ్యద్ వాసిం, తబ్రేజ్ అహ్మద్, రోషన్‌ఖాన్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

రూ. 25 కోట్లతో పెద్ద చెరువు అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: పట్టణ సమీపంలోని పెద్ద చెరువును రూ. 25 కోట్ల వ్యయంతో అన్ని హంగులతో అభివృద్ధి చేస్తామని, నాణ్యతలో రాజీపడేది లేదని ఎమ్మెల్యే కె వై నంజేగౌడ తెలిపారు. పట్టణంలోని యోజనా ప్రాధికార సభాంగణంలో ప్రాధికార సర్వ సభ్య సమావేశంలో పెద్ద చెరువు అభివృద్ధి ప్రగతి పరిశీలనా సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని పెద్ద చెరువు అభివృద్ధి చేయాలని కొన్నేళ్లుగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారని, బీజేపీ హయాంలో తాలూకాలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని, రూ. 2200 కోట్ల వ్యయంతో దేవనహళ్లి నుంచి వేమగల్, నరసపురం, మాలూరు, సంపగెరె, హోసకోట వరకు నాలుగు లేన్ల రహదారి నిర్మాణానికి అనుమతి మంజూరైందని కొద్ది రోజులలో పనులు ప్రారంభమవుతాయన్నారు. ఈ సందర్భంగా పురసభ ముఖ్యాధికారి ప్రదీప్, చిన్ననీటి పారుదల ఇంజినీర్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కన్నడ జ్యోతి రథం రాక

కోలారు: కర్ణాటక సంభ్రమ - 50లో భాగంగా బుధవారం కన్నడ జ్యోతి రథం కోలారు నగరానికి వస్తుండటంతో రథాన్ని స్వాగతించడానికి అన్ని ఏర్పాట్లు చేశామని తహసీల్దార్ హర్షవర్ధన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో కన్నడపర సంఘటనలు, ప్రముఖులతో సమావేశమై మాట్లాడారు. రథం సంచరించే మార్గాలపై సమావేశంలో చర్చించారు. బంగారుపేట సర్కిల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మాలార్పణ చేసి అనంతరం ఊరేగింపును ప్రారంభిస్తారు. రథం గాంధీవనం, ఎంజీ రోడ్డు, పాత బస్టాండు, అనంతరం మాలూరు తాలూకాకు వెళుతుందని తహసీల్దార్ తెలిపారు. కన్నడ, సంస్కృతి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ గీతా, కసాప జిల్లా అధ్యక్షుడు గోపాలగౌడ, భువనేశ్వరి కన్నడ సంఘం అధ్యక్షుడు త్యాగరాజ్, కర్ణాటక జానపద పరిషత్ అధ్యక్షుడు డిఆర్ రాజప్ప తదితరులు పాల్గొన్నారు.



ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను జైలు నుంచి విడుదల చేయాలని మంగళవారం బెంగళూరు ఫ్రీడం పార్కులో ఆందోళన నిర్వహిస్తున్న ఆప్ ఆద్మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు.

మానవ అక్రమ రవాణాను అడ్డుకోవాలి



జాతా ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీఎఫ్: దేశ అభివృద్ధికి కంటకంగా మారిన మానవ అక్రమ రవాణాను సంపూర్ణంగా అడ్డుకోవాలని 3వ జిల్లా సెషన్స్ న్యాయమూర్తి గణపతి గురుసిద్ధ బాదామి తెలిపారు. మంగళవారం కెజీఎఫ్ తాలూకా న్యాయ ప్రాధికార, న్యాయవాదుల సంఘం, కళాశాల సహకారంతో నిర్వహించిన మానవ అక్రమ రవాణా వ్యతిరేక జాతాను ప్రారంభించి మాట్లాడారు. 14 సంవత్సరాల లోపు సుమారు 36 కోట్ల మంది పిల్లలు మన దేశంలో ఉన్నారు. వారి జీవితం, భవిష్యత్తు రూపుదిద్దుకోవడానికి అందరు సహకరించాలన్నారు. వారు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి ప్రతి ఒక్కరు జవాబుదారిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయమూర్తి ముజఫర్ ఎ మాంజరి, ప్రధాన సివిల్ న్యాయమూర్తి వినోద్‌కుమార్, ప్రిన్సిపాల్ రేఖా సేథి తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: నగరంలోని మూడు కళాశాలల అభివృద్ధికి రూ. 30 కోట్లు నిధులు విడుదలయ్యాయని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. మంగళవారం ప్రభుత్వ మహిళా కళాశాలలో రూ. 6.85 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 15 తరగతి గదుల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి మాట్లాడారు. కళాశాలల్లో దశల వారిగా మౌలిక సౌలభ్యాలు కల్పిస్తామని చెప్పారు. మహిళా కళాశాలలో 3500 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారని, విద్యార్థినుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులను నిర్మిస్తున్నట్లు తెలిపారు. మరో రూ. 10 కోట్లు త్వరలో విడుదల అవుతాయని, ప్రభుత్వ జూనియర్ కళాశాలకు రూ. 5 కోట్లు, బాలుర కళాశాలకు రూ. 5 కోట్లు, కలిపి మొత్తం రూ. 30 కోట్లతో కళాశాలల అభివృద్ధి కోసం వెచ్చిస్తున్నట్లు తెలిపారు. కోలారుకు అదనంగా మరో మూడు ఇందిరా క్యాంటీన్‌లు మంజూరయ్యాయని, ఇప్పటికే పాత బస్టాండు వద్ద ఒక ఇందిరా క్యాంటీన్ పనిచేస్తోందన్నారు. నగరంలో రింగ్ రోడ్డు నిర్మాణం కోసం రూ. 100 కోట్లు విడుదల అయిందని, టెండర్ ప్రక్రియ ప్రగతి దశలో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్, కుడా అధ్యక్షుడు మహ్మద్ అనీఫ్, కోచిముల్ డైరెక్టర్ షంషీర్ పాల్గొన్నారు.

దొడ్డ కాంగ్రెస్ సీనియర్ నేత కన్నుమూత



సీడీ సత్యనారాయణ

దొడ్డబళ్లాపురం: దొడ్డ తాలూకా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సీడీ సత్య నారాయణ (86) అనారోగ్యంతో కన్ను మూశారు. తీవ్ర అనారోగ్యంతో బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం మృతి చెందాడు. సీడీ కాంగ్రెస్ పార్టీలో గత 40 ఏళ్లుగా పనిచేస్తున్నారు. గ్రామ పంచాయతీ, తాలూకా పంచాయతీ, జిల్లా పంచాయతీ అధ్యక్షుడిగా కూడా ఎన్నికయ్యారు. దొడ్డ తాలూకా చెన్నాదేవి అగ్రహార గ్రామస్తుడైన సత్యనారాయణ మధురె శనిమహాత్మస్వామి దేవాలయం కార్యదర్శిగా ఉన్నారు.

క్లుప్తంగా

కావేరి సమావేశం.. కర్ణాటకకు ఊరట

శివాజీనగర: కావేరి నది జలాల పంపిణీ విషయానికి సంబంధించి మంగళవారం ఢిల్లీలో కావేరి నీటి నియంత్రణ కమిటీ కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కర్ణాటక, తమిళనాడు వాద, ప్రతివాదనలను ఆలకించిన న్యాయమండలి, ప్రధానంగా కావేరి నీటి విడుదలపై అవలోకిస్తామని వెల్లడించింది. దీంతో కర్ణాటకకు సీడబ్ల్యూఆర్‌సీ భారీ ఊరట వచ్చింది. ఈ సమావేశంలో బిళిగుండ్లు ప్రవాహంలో ఎలాంటి ఆందోళన లేకపోవటంతో ప్రవాహం సాధారణంగా ఉండటంతో కమిటీ వచ్చే నెల సమావేశంలో ప్రవాహ పరిస్థితిని చూసి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. దీంతో కర్ణాటకకు కొంత ఊరట లభించినట్లయింది.

లారీ ఢీకొని బైకిస్టు మృతి

మైసూరు: లారీ ఢీకొని బైక్ చోదకుడు మృతి చెందిన ఘటన నగర శివార్లలోని రింగ్ రోడ్డులో ఆర్టీనగర్ మారెమ్మ గుడి వద్ద జరిగింది. జిల్లాలోని సరగూరు తాలూకా సాగర గ్రామానికి చెందిన నాగరాజు(38), నాగేంద్ర అనే ఇద్దరు పెయింటింగ్ పని ముగించుకుని బైక్‌పై గ్రామానికి వెళుతుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో నాగరాజు అక్కడికక్కడే మరణించగా, నాగేంద్రకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కువెంపునగర ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

గొర్రెల దొంగలు అరెస్టు



నిందితులు అపహరించి దాచిన గొర్రెలు

దొడ్డబళ్లాపురం: గ్రామీణ ప్రాంతాల్లో సంచరిస్తూ గొర్రెలు, మేకలను అపహరిస్తున్న ఇద్దరు నిందితులను దొడ్డ గ్రామీణ పోలీసులు అరెస్టు చేసారు. దర్గాపేటకు చెందిన నూరుల్లా, రోజిపుర నివాసి మహమ్మద్ అబీబ్ అరెస్టైన నిందితులు. ఈనెల 21న సంతోష్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్టు చేసారు. గొర్రెలను అపహరిస్తున్న దృశ్యాలు ఒక చోట సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి. ఫుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించారు. నిందితుల నుండి రూ.2.30 లక్షల విలువైన 18 గొర్రెలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పెరిగిన బీరు ధరలు

యశవంతపుర: బీరు ధరలు పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నెల రోజుల క్రితం ముడిసరుకు ధరలు పెరగడంతో ధర పెంచగా తాజాగా ఏడాది తరువాత బీరు బాటిల్‌పై అదనంగా రూ.10 నుంచి 20లు పెరిగింది. గతంలో ప్రభుత్వం 20 శాతం పన్ను విధించగా ఉత్పాదక వ్యయం సరిపోవటానికి పది రూపాయలు పెంచగా మరోసారి బీరు ధరలను పెంచడంతో మద్యం ప్రియులు డీలా పడిపోయారు.

వేశ్యావాటికపై పోలీసుల దాడి

- నలుగురు విటుల అరెస్ట్

మైసూరు: వ్యభిచారం నిర్వహిస్తున్న స్పాపై దాడి చేసిన నగర సీసీబీ పోలీసులు ముగ్గురు మహిళలను రక్షించి యజమానురాలిని, ముగ్గురు విటులను అరెస్ట్ చేశారు. మైసూరులోని విద్యారణ్యపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూయజ్ ఫామ్ రోడ్డులోని శ్రీ బ్యూటీ పార్లర్ అండ్ స్పా సెంటర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సీసీబీ పోలీసులు దాడి చేశారు. ముగ్గురు మహిళలకు డబ్బు ఎర చూపి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తేలింది. స్పా లక్ష్మి అనే మహిళకు చెందినది. విచారణలో కస్టమర్ల నుంచి ఆన్‌లైన్‌లో డబ్బు వసూలు చేస్తున్నట్లు తేలింది. విద్యారణ్యపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరమే



విజయపుర : పిల్లలకు చదువుతో పాటు క్రీడలూ అవసరమని అతిథులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో మంగళవారం ఫిర్కా స్థాయి ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యార్థుల క్రీడా పోటీలు జరిగాయి. కాలేజీ సీనియర్ విద్యార్థి, సమాజ సేవకుడు షఫీఉల్లా, ఎస్‌డీఎంసీ ఉపాధ్యక్షుడు హనీఫుల్లా మాట్లాడుతూ క్రీడలతో శారీరక వ్యాయామం, ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. అనంతరం విద్యార్థులు పలు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగీత ఉపాధ్యాయిని శ్రీదేవి, ప్రధానోపాధ్యాయుడు రాజు అవళేకర్, కాలేజీ ఉప ప్రిన్సిపాల్ వెంకటేష్, పురసభ మాజీ ఉపాధ్యక్షుడు కేశవప్ప, పురసభ సభ్యులు రాజణ్ణ, నారాయణస్వామి, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పశువుల మృతి

మైసూరు: జిల్లాలోని నంజనగూడు తాలూకా పుర గ్రామంలో నాగమ్మ అనే మహిళ తన ఇంటిలో రెండు పశువులను కట్టేసి ఉంచగా, సోమవారం అర్ధరాత్రి మంటలు వ్యాపించాయి. మంటలకు పశువులు సజీవ దహమయ్యాయి. సుమారు రూ.80 వేల మేర విలువ చేసే పశువులు, రూ.లక్ష విలువ చేసే షామియానా, కుర్చీలు కాలిపోయినట్లు నాగమ్మ వాపోయింది.

పశ్చిమ కనుమల్లో మళ్లీ వరుణుడి జోరు

- పలు గ్రామాలకు ముంపు భయం
- పొంగిపొర్లుతున్న కుంటలు, వాగులు

శివమొగ్గ: శివమొగ్గ తాలూకాతోపాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో రుతుపవనాల తీవ్రత కొద్దిగా తగ్గింది. కానీ పశ్చిమ కనుమల పరిధిలోని ప్రాంతాల్లో మాత్రం వర్షాలు మళ్లీ కురుస్తున్నాయి. హొసనగర తాలూకాలోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం తాలూకాలో చాలా చోట్ల కురిసిన ఎడతెరిపి లేని వర్షంతో వరద ముంపు భయాందోళన నెలకొంది. సందోడిలో ఓ చిన్న వంతెన నీట మునిగింది. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. భారీ వర్షం కారణంగా సరస్సు, కుంటలు మళ్లీ పొంగిపొర్లాయి. మంగళవారం ఉదయానికి గత 24 గంటల్లో హొసనగర తాలూకాలోని ప్రధాన ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. సావెహక్లులో 167 మి.మీ., మాణిలో 185, హులికల్‌లో 210, యడూరులో 217,, మాస్తికట్టెలో 240, చక్రాలో 220 మి.మీ.ల వర్షం కురిసింది.

భద్రా డ్యాం నుంచి నీరు విడుదల

మధ్య కర్ణాటకలోని ప్రధాన రిజర్వాయర్, శివమొగ్గ, దావణగెరె జిల్లాల రైతుల జీవనాడి భద్రా జలాశయం నిండుతుండటంతో డ్యాం నుంచి మంగళవారం ఉదయం నీటిని విడుదల చేశారు. డ్యాం నాలుగు క్రస్ట్ గేట్లను ఉదయం 9.30 గంటల ప్రాంతంలో తెరిచి దాదాపు 6 వేల క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. డ్యాం నుంచి నీటిని విడుదల చేయడంతో అక్కడున్న ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయానికి భద్ర జలాశయానికి 20,774 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 186 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 183 అడుగులకు చేరుకుంది. పరివాహక ప్రాంతంలో వర్షాలు కురుస్తూ డ్యాంలోకి ఇన్ ఫ్లో వస్తుండటంతో భద్రా డ్యాం సలహా కమిటీ నిర్ణయం మేరకు డ్యాం నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాం నుంచి విడుదల చేస్తున్న నీటి పరిమాణాన్ని క్రమంగా పెంచుతామని, 25 వేల నుంచి 30 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసే అవకాశం ఉందని చెబుతున్నారు. గతేడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో భద్రా డ్యాంలో నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుకోలేదు. ప్రస్తుత ఏడాది పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు భద్రా డ్యాం నీటిమట్టం గరిష్ట స్థాయికి చేరుతుండటంతో ప్రస్తుతం నీటిని విడుదల చేస్తుండటంపై శివమొగ్గ, దావణగెరె జిల్లాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



ఇళ్ల ముందు ప్రవహిస్తున్న వాన నీరు



వీధులను ముంచెత్తిన వర్షపు నీరు



భద్రా డ్యాం నుంచి విడుదలవుతున్న జలాలు

పనిచేస్తున్న ఇంటికే కన్నం

- ఖతర్నాక్ దొంగలు అరెస్ట్

బనశంకరి: పనిచేస్తున్న ఇంటిలోనే చోరీకి పాల్పడిన ఇద్దరు మహిళలతో పాటు ముగ్గురు ఖతర్నాక్ దొంగలను మంగళవారం మారతహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్దనుంచి రూ.30 లక్షల విలువ చేసే చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. మారతహళ్లి పోలీసులు స్వాధీనం చేసుకున్న చోరీ సొత్తును పరిశీలించిన అనంతరం సీపీ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మారతహళ్లిలోని ఓ ఇంట్లో రూ.60 లక్షల విలువచేసే బంగారు, వజ్రాభరణాలు చోరీకి గురయ్యాయి. ఇంట్లో పనిచేస్తున్న ఏడుగురు పనిమనుషులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఇంటి యజమాని మారతహళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఈనెల 17న ఇంటి పనిమనిషి దివ్యను మారతహళ్లి పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా చోరీకి పాల్పడినట్లు నోరువిప్పింది. తనదైన శైలిలో విచారణ చేపట్టడంతో చోరీకి పాల్పడిన బంగారు ఆభరణాలు, వజ్రాలు నీలసంద్రంలో పెద్దమ్మ వద్ద ఉన్నట్లు తెలిపింది. మంజులను నీలసంద్రలో అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టి ఇద్దరిని కోర్టులో హాజరుపరిచి 9 రోజుల పాటు కస్టడీకి తీసుకుని విచారణ చేయగా గడియారం, బంగారుచైన్ స్వాధీనం చేసుకున్నారు. అంతేగాక వీరిద్దరూ ఇచ్చిన సమాచారం ఆధారంగా ఇతర బంగారు ఆభరణాలు, వజ్రాలు ఈజీపురలో ఉన్న జామూన్‌కు ఇచ్చినట్లు తెలిపారు. అతడిని వద్ద నుంచి బంగారు ఆభరణాలను ఈజీపురలోని వివిధ జ్యువెలరీ దుకాణాల్లో విక్రయించినట్లు తెలపడంతో జ్యువెలరీ దుకాణాల నుంచి రూ.30 లక్షల విలువచేసే బంగారు వజ్రాభరణాలు స్వాధీనం చేసుకున్నారు.



చోరీ కేసులో పట్టుబడిన నిందితులు, స్వాధీనం చేసుకున్న నగలు



మొబైల్స్ చోరీ కేసులో పట్టుబడిన అబ్దుల్‌రజాక్

మొబైల్ చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

వైట్‌ఫీల్డ్ విజయనగర మెయిన్‌రోడ్డు కార్‌వాటర్ వాష్ సెంటర్‌లో మొబైల్ చోరీకి పాల్పడిన అబ్దుల్ రజాక్ అనే దొంగను మారతహళ్లి పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడి వద్ద నుంచి రూ.4.50 లక్షలు విలువ చేసే 32 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

సేల్స్ ఎగ్జిక్యూటివ్ అరెస్ట్

ల్యాప్‌టాప్, పెన్‌డ్రైవ్‌లను చోరీలకు పాల్పడుతున్న సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ను రామమూర్తినగర పోలీసులు అరెస్ట్ చేశారు. రామమూర్తినగర మెయిన్‌రోడ్డు షోరూమ్‌లో ల్యాప్‌టాప్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను విక్రయించేవాడు. షోరూమ్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా ఇతర పనులు చేసేవాడు. షోరూమ్ మేనేజర్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న రామమూర్తినగర పోలీసులు దర్యాప్తు చేపట్టి ఈనెల 24న సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ను అరెస్ట్ చేసి విచారణ చేపట్టగా చోరీకి పాల్పడినట్లు నోరువిప్పాడు.

ఫ్లెక్సీ, బ్యానర్ల నియంత్రణపై సమావేశం

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె, పోలీస్‌శాఖ సంయుక్త ఆధ్వర్యంలో బెంగళూరు నగరంలో ఫ్లెక్సీలు, బ్యానర్ల నియంత్రణ కోసం ఎస్‌ఓపీ జారీ చేయాలని అధికారులకు బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్ సూచించారు. బీబీఎంపీ పరిధిలో అనధికారికంగా అమరుస్తున్న ఫ్లెక్సీలు, బ్యానర్ల నియంత్రణ కోసం పాలికె, పోలీస్‌శాఖతో మంగళవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తుషార్ మాట్లాడారు. నగరంలో ఫ్లెక్సీలు, బ్యానర్ల నియంత్రణ కోసం పాలికె, పోలీస్‌శాఖ సమన్వయంతో పనిచేయడానికి సరైన ప్రామాణిక విధానం ఎస్‌ఓపీ జారీ చేస్తామన్నారు. దీంతో నగరంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుని ఫ్లెక్సీలు, బ్యానర్లు అమర్చడాన్ని నియంత్రించాలని ఆదేశించారు. పాలికె పరిధిలో ప్రింటింగ్ యూనిట్స్‌లను సందర్శించి ఫ్లెక్సీలు బ్యానర్లు ముద్రించరాదని హెచ్చరించాలన్నారు. పాలికెతో అనుమతిలేని ఎలాంటి అనధికార ప్రకటనలను ముద్రిస్తే వాటిని స్వాధీనం చేసుకుని జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పాలికె వలయ కమిషనర్లు ఆర్‌ఎల్.దీపక్, రమేశ్, శివానంద్‌కపాశి, రమ్యా, స్నేహల్, వినోత్‌ప్రియా, నగర పోలీస్ కమిషనర్ బీ.దయానంద్, అదనపు పోలీస్ కమిషనర్లు సతీశ్‌కుమార్, రమణ్‌గుప్తా, ఏసీపీలు, డీసీపీలు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న తుషార్, బీ.దయానంద్ తదితరులు

ఫ్లెక్సీలు, బ్యానర్లు పూర్తిగా నిషేధం

బెంగళూరు నగరంలో ఫ్లెక్సీలు, హోర్డింగ్స్, బ్యానర్లు పూర్తిగా నిషేధించామని నగర పోలీస్ కమిషనర్ దయానంద్ తెలిపారు. అక్రమ ఫ్లెక్సీలు, బ్యానర్లు బీబీఎంపీ కమిషనర్ తుషార్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో దయానంద్ మాట్లాడారు. ఫ్లెక్సీలు అమర్చే సమయంలో పర్మిషన్ తీసుకోవాలని లేనిపక్షంలో కేసు పెడతామని హెచ్చరించారు.

బెంగళూరును గ్రేటర్ నగరంగా విభజించొద్దు

బొమ్మనహళ్లి : బెంగళూరు నగరాన్ని గ్రేటర్ బెంగళూరుగా భజించవద్దని, ప్రస్తుతం ఉన్న బీబీఎంపీ పరిధి చాలని దానిని గ్రేటర్ బెంగళూరు నగరం చేయాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే ఎం.సతీష్ రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని కన్నడ సాహిత్య పరిషత్ సమావేశం హాల్లో దశముఖ సామాజిక సేవా ట్రస్టు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థుల చదువుకోసం ఆర్థిక సహాయంతో పాటు వివిధ రంగాల్లో ఉత్తమ సేవలను అందజేసిన ప్రముఖులకు దశముఖ సామాజిక సేవారత్న అవార్డును ప్రదానం చేసి ఆయన మాట్లాడారు. దశముఖ సామాజిక సేవా ట్రస్టు అధ్యక్షుడు హోసకెరె కే.బొమ్మెగౌడ, సమాజ సేవకుడు వై.డి.రవిశంకర్ చేస్తున్న సేవలను అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్.భగవాన్, కత్రిగుప్పె మునిరాజు ఆర్. ఎం.వినయ్ కుమార్, ఎల్. నంజప్ప కాళెగౌడ, కే.జీ.హనుమంతయ్య, ఆర్‌ఎల్ఎన్ మూర్తి,ఎస్.మదన్ మురళి, శశికుమార్, రాజశేఖర్, లయన్ అనంత పద్మనాభ్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పోషణలో తల్లిదండ్రుల పాత్ర అమోఘం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రజ్ఞా ట్రస్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు తదితరులు

గౌరిబిదనూరు: దివ్యాంగుల పోషణలో తల్లిదండ్రుల పాత్ర మహత్తరమైనదని సత్య సాయి అన్నపూర్ణ సంస్థ తాలూకా ప్రతినిధి కృష్ణారెడ్డి అన్నారు. దివ్యాంగుల ఆలనపాలనపై పట్టణంలోని ప్రజ్ఞా ట్రస్ట్ ఆధ్వర్యంలోని అరుణోదయ ప్రత్యేక పాఠశాల, ప్రతీక్షా కేంద్రం నిర్వాహకులు సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దివ్యాంగుల పిల్లల పోషణలో పోషకులు ఎక్కువగా శ్రమించాల్సి ఉంటుందన్నారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు మాట్లాడుతూ మానసిక దివ్యాంగులకు నిరామయ భీమా పథకం ద్వారా ఏడాదికి ఔషధాల కొనుగోలుకు రూ.లక్ష పొందవచ్చని తెలిపారు. ట్రస్ట్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే యూడీఐడీ (యూనివర్సల్ డిజబిలిటీ ఐడెంటిటీ కార్డు)ప్రమాణ పత్రాల గురించి వివరించారు. కార్యక్రమంలో కౌశల్య శిక్షణ ఉపాధ్యాయుడు రామప్ప, ఫిజియోథెరపిస్ట్ మంజుల, శాంతా మహేశ్, ఉషా, నందిని, శాంతలక్ష్మి, నవీన్, దివ్య పాల్గొన్నారు.

ఢిల్లీకి సీఎం, డీసీఎం

శివాజీనగర: రాష్ట్ర మంత్రి మండలి పునర్ నియామకం, వాల్మీకి అభివృద్ధి మండలి, మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార అక్రమాలపై హైకమాండ్‌కు వివరణ ఇచ్చేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ మంగళవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. మంగళవారం ఉదయం బెంగళూరులోని హెచ్‌ఏఎల్ విమానాశ్రయం నుండి ప్రత్యేక విమానంలో ఇద్దరు ఢిల్లీకి వెళ్లారు. అక్కడ సాయంత్రం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి రణదీప్ సింగ్ సుర్జేవాలాలను భేటీ చేసి పార్టీ, ప్రభుత్వ విషయాలపై చర్చించనున్నారు. ఈ భేటీ సమయంలో వాల్మీకి, ముడా అక్రమాలపై హైకమాండ్‌కు వివరణ ఇవ్వనున్నట్లు సమాచారం.

మంత్రి మండలి పునర్నియామకంపై చర్చ :

ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ మంత్రి మండలి పునర్ నియామకంపై హైకమాండ్‌తో చర్చించే అవకాశముంది. లోకసభ ఎన్నికల ఫలితాల తరువాత కొంతమంది మంత్రులను తొలగించాలని ఒత్తిళ్లు వచ్చాయి. లోకసభ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై మధుసూదన్ మిస్త్రి నేతృత్వంలో సత్య శోధనా కమిటీ నివేదిక ప్రకారం మంత్రి మండలి పునర్ నియామక తీర్మానాన్ని హైకమాండ్ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. 7-8 మంది మంత్రులకు ఉద్వాసన తప్పదని సమాచారం.

మంత్రులు కూడా:

మంత్రి స్థానం చేజారిపోయే అవకాశం ఉండటంతో కొందరు మంత్రులు ఢిల్లీకి బయలుదేరారు. పదవిని కాపాడుకోవడానికి ప్రయత్నాలు చేపట్టారు.

కేపీసీసీ అధ్యక్షుడి మార్పుపై చర్చ:

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఢిల్లీ భేటీ సమయంలో కేపీసీసీ అధ్యక్షుడి స్థానానికి కొత్తవారిని తీసుకొచ్చే విషయంపై కూడా చర్చ జరిగే అవకాశముంది. కాంగ్రెస్‌లో ఒక వ్యక్తికి ఒకే పదవి అనే నియమం ఉండగా, అధిష్టానం నాయకులే లోకసభ ఎన్నికల వరకు కూడా కేపీసీసీ అధ్యక్షుడి స్థానంలో కొనసాగాలని ఉప ముఖ్యమంత్రిగా ఉన్న డీ.కే.శివకుమార్‌కు గతంలో సూచించారు. ప్రస్తుతం కేపీసీసీ అధ్యక్ష స్థానానికి కొత్తవారిని తీసుకొచ్చేందుకు హైకమాండ్ ఆసక్తిగా ఉంది.

‘కొంతమంది శకుని రాజకీయాలు చేస్తున్నారు’

బనశంకరి: ఎమ్మెల్యే రమేశ్ జర్కిహోళికి తనకు ఎలాంటి సంబంధం లేదని తమ మధ్య విషబీజం నాటాలనేది వారి రాజకీయ ఉద్దేశమని మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ ఆరోపించారు. సిద్దరామయ్య, డీకే.శివకుమార్ నియంత్రణలో ఉన్నారంటూ రమేశ్ జర్కిహోళి వ్యాఖ్యలపై మంగళవారం విలేకరులతో మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ మాట్లాడుతూ... గతం నుంచి చాలామంది శకుని రాజకీయాలు చేస్తున్నారని వీటికి భయపడేదిలేదన్నారు. సిద్దరామయ్య, డీకే.శివకుమార్ ఉత్తమ రాజకీయ నేతలని కొన్నేళ్లుపాటు సీఎంగా పనిచేసిన అనుభవం కలిగిన సిద్దరామయ్యకు ఉందన్నారు. శివకుమార్ ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైయ్యారని రమేశ్ జర్కిహోళి సమాధానం ఇవ్వాలనే పిన్న వయస్కులు కాదన్నారు. బసవనగౌడ పాటిల్ యత్నాళ్ పట్ల గౌరవం ఉందని, అతడి రాజకీయ వ్యాఖ్యలు గమనిస్తే నిత్యం యడియూరప్పకు వ్యతిరేకంగా మాట్లాడతారని గందరగోళం సృష్టించడానికి ఇలా మాట్లాడతారని లక్ష్మీహెబ్బాళ్కర్ అన్నారు.

డెలివరీ బాయ్‌ల దోపిడీనే అతని లక్ష్యం



నిందితుడు అజయ్

కృష్ణరాజపుర: బెంగళూరు నగరంలో రాత్రివేళలో డెలివరీ బాయ్‌లను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడుతున్న అజయ్ (26) అనే యువకుడు పట్టుబడ్డాడు. మహదేవపురలో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతుండగా పోలీసులకు చిక్కాడు. పలు సంస్థల్లో పని చేసే డెలివరీబాయ్స్ కదలికలపై నిఘా ఉంచి వారు ఒంటరిగా వెళ్తున్న సమయంలో అడ్డగించి దోపిడీకి పాల్పడేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి 10కి పైగా మొబైల్ ఫోన్లు స్వాధీనపరచుకుని విచారణ చేపట్టారు. అదే సమయంలో ముఠా నుంచి తప్పించుకున్న మరొక సభ్యుడి ఆచూకీ కోసం మహదేవపుర పోలీసులు గాలింపు చేపట్టారు.

బీడీఏ కాంప్లెక్స్ కూల్చివేత కుట్రలను అడ్డుకుంటాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్లి : హెచ్‌ఎస్‌ఆర్ బీడీఏ కాంప్లెక్స్‌ను ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కుట్రలు జరుగుతోందని, క్రమేణా కాంప్లెక్స్‌ను కూల్చి వేసి మల్టిపెక్స్ నిర్మాణం చేయడానికి యతిస్తున్నారని, దీనిపై పోరాటం చేస్తామని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి అన్నారు. మంగళవారం బీడీఏ కాంప్లెక్స్ ఆవరణంలో స్థానిక వ్యాపారులు, హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్ అసోసియేషన్ సభ్యులు సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మల్టిపెక్స్ నిర్మాణానికి ఒప్పుకునేది లేదని, అవసరం అయితే కోర్టుకు కూడా వెళ్తామన్నారు. గత పదేళ్లగా బీడీఏ కాంప్లెక్స్‌ను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి కుట్రలు జరుగుతున్నాయని, తాము అవకాశం ఇవ్వలేదన్నారు. నగరంలో మొత్త ఏడు బీడీఏ కాంప్లెక్స్‌లను ప్రైవేట్‌కు తాకట్టు పెట్టే పని జరుగుతోందని, తాము అడ్డుకుని తీరుతామన్నారు. బహుజన దళిత సంఘర్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎం.ఎన్.రమేష్ మాట్లాడుతూ... సుమారు రూ. 2,500 కోట్ల విలువ చేసే ఆస్తిని ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టడానికి యత్నిస్తున్నారని, తాము అడ్డుకుంటామన్నారు.

‘రేణుకాస్వామి ఇంటికి వెళ్లింది రాజీ కోసం కాదు’

దొడ్డబళ్లాపురం: పరప్పన అగ్రహార జైలులో దర్శన్‌ను కలిసిన నటుడు వినోద్ రాజ్ కొన్ని రోజుల వ్యవధిలోనే రేణుకాస్వామి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించడంపై సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ వస్తున్నాయి. దర్శన్, రేణుకాస్వామి కుటుంబం మధ్య రాజీ చేయడానికి వినోద్‌రాజ్ వెళ్లారని వదంతులు వినిపిస్తున్నాయి.

ఇందుకు సంబంధించి వివరణ ఇచ్చిన వినోద్ రాజ్...తోటి ఆర్టిస్టు అనే అభిమానంతో, దర్శన్‌తో ఉన్న అనుబంధం నేపథ్యంలో దర్శన్‌ను జైలుకు వెళ్లి కలిశానన్నారు. మానవత్వం కోణంలో ఆలోచించి ఆ కుటుంబానికి ఏమైనా సాయం చేద్దామని రేణుకాస్వామి కుటుంబ సభ్యులను కలిశానని, రాజీ కుదిర్చే ఉద్దేశం ఆలోచన తనకు లేవన్నారు.

హోసూరు వార్తలు..

ఆలయ అభివృద్ధికి చేయూత



చెక్కు అందిస్తున్న దృశ్యం

హోసూరు: సూళగిరి తాలూకా అత్తిముగం గ్రామంలో వెలసిన ప్రసిద్ధ గ్రామ దేవత శ్రీ కామాక్షి సమేత బరావధీశ్వరర్ అఖిలాండేశ్వరి సమేత ఆళోఘేశ్వర ఆలయ అభివృద్ధికి అత్తిముగం గ్రామ పంచాయతీ అధ్యక్షుడు రూ. 5 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా చేయూతనందిస్తానని తెలిపారు. ఆలయ ట్రస్టు చైర్మెన్ మహేష్‌కుమార్, శివశంకర్, వేణుగోపాల దీక్షిత్, నాగభూషణం, పురుషోత్తంలు చెక్కును అందుకున్నారు. ఈ సందర్భంగా నాగరాజ్, మహదేవరాజ్, శ్రీనివాసులు, గురుమూర్తి, విజయకుమార్, రమేష్, హరీష్ స్థానిక భక్తులు ఉన్నారు.

గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న లారీ స్వాధీనం

హోసూరు: అనుమతి లేకుండా గ్రానైట్ రాళ్లు తరలిస్తున్న టిప్పర్ లారీని ఖనిజ శాఖ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా ఖనిజ శాఖ అధికారులు సోమవారం రాత్రి మహారాజగడ ప్రాంతంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సమయంలో వచ్చిన ఓ లారీని తనిఖీ చేయగా ఆంధ్ర రాష్ట్రం కుప్పం ప్రాంతం నుంచి గ్రానైట్ రాళ్లు తరలిస్తున్నట్లు తెలిసింది. లారీని స్వాధీనం చేసుకుని మహారాజగడ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేశారు.

గ్రామ దేవతకు పూజలు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా జే.కారుపల్లి పంచాయతీ వెంకటాపురం పొలిమేరలో వెలసిన గ్రామదేవత పైసీమ్మ ఆలయంలో మంగళవారం విశేష పూజలు చేశారు. గ్రామస్తులు పిండిదీపాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి అభిషేకించారు. ఈ సందర్భంగా జంతుబలులిచ్చి మొక్కులు తీర్చుకొన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

లారీ డ్రైవర్ హత్య

క్రిష్ణగిరి: క్రిష్ణగిరి సమీపంలో లారీ డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు...కేరళ రాష్ట్రం ఎర్నాకులం ప్రాంతానికి చెందిన అలియాజ్ (43) శ్రీపెరంబదూరు నుంచి ఎలక్ట్రానిక్ వస్తువులను లారీలో తీసుకొని బెంగళూరు వెళ్తుండగా క్రిష్ణగిరి సమీపంలోని సుబేదర్‌మేడు వద్ద ద్విచక్ర వాహనంలో వెళ్లిన ఇద్దరు వ్యక్తులు లారీని అడ్డగించి ఇనుప రాడ్‌తో డ్రైవర్‌పై దాడి చేసి పరారయ్యారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన అలియాజ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మహారాజగడ పోలీసులు కేసు నమోదు చేసుకుని నిందితుల కోసం గాలిస్తున్నారు.

ఫిర్యాదుల స్వీకారం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే వై. ప్రకాష్

కెలమంగలం: డెంకణీకోట తాలూకా బేళగొండపల్లి ప్రభుత్వ ఉన్నతోన్నత పాఠశాలలో మంగళవారం ప్రజల వద్దకు ముఖ్యమంత్రి పాలన కార్యక్రమంలో భాగంగా ఫిర్యాదులను స్వీకరించారు. హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. పరిశీలించి తగు చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తళి యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు రాజేష్,శ్రీనివాసమూర్తి, చంద్రప్ప, యల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

రూ. కోట్ల నగదు స్వాహాపై విచారణ

హోసూరు: ఖాతాదారుని అనుమతి లేకుండా వంద కోట్లు స్వాహా చేశారని కర్ణాటక వ్యక్తి విలేకరులతో ఆరోపించారు. వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు హెబ్బగోడి ప్రాంతానికి చెందిన పారిశ్రామికవేత్త దయానందరెడ్డి. సామాజిక సేవలు కూడా చేస్తుంటారు. ఈయన హోసూరు- బెంగళూరు జాతీయ రహదారిపై వాణిజ్య కాంప్లెక్స్ నిర్వహిస్తున్నాడు. గత 2015 అతని బ్యాంకు ఖాతా నుంచి రూ. 2 కోట్లు మాయమైందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో గత 2016న తన ఖాతాలో రూ.101 కోట్లు అనుమతి లేకుండా మాయమయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేసి కోర్టులో కేసు దాఖలు చేశాడు. ఈ నేపథ్యంలో 2020న బ్యాంకు నుంచి రుణం తీసుకొన్నట్లు అతనికి చెందిన వాణిజ్య కాంప్లెక్స్‌కు సీల్ వేశారు. పై మూడు కేసులు కోర్టులో విచారణ జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో వాణిజ్య కాంప్లెక్స్‌కు సీల్ వేయడంతో అక్కడున్న సుమారు 50 కోట్ల విలువ చేసే ఉపకరణాలు కూడా అదృశ్యమయ్యాయని బాధితుడు ఇరు రాష్ట్రాల విలేకరులతో సమావేశం ఏర్పాటు చేసి తనకు న్యాయం చేయాలని కోరాడు.



బాధితుని వద్ద విచారణ చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా...

ఐపీఎస్‌కు మోషేన్‌రాజు కుమారుడి ఎంపిక



సాక్షి, భీమవరం: ఏపీ శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు చిన్న కుమారుడు కొయ్యే చిట్టిరాజు ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్)కు ఎంపికయ్యారు. సివిల్స్‌లో 833 ర్యాంకు సాధించిన ఆయనకు ఐపీఎస్‌ను కేటాయిస్తూ మంగళవారం ఉత్తర్వులు అందాయి. చిట్టిరాజు ఆగస్టు 26న ట్రైనింగ్‌కు ముస్సోరి బయలుదేరి వెళ్లనున్నారు. తన తండ్రి మోషేన్ రాజు ఎప్పుడు ప్రజాసేవలోనే ఉండటం, పశ్చిమ గోదావరి జిల్లా పూర్వపు కలెక్టర్ లవ్ అగర్వాల్, జిల్లా నుంచి ఐఏఎస్‌గా ఎదిగిన రేవు ముత్యాలరాజు తాను సివిల్ సర్వీసెస్ వైపు వెళ్లేందుకు స్ఫూర్తిగా నిలిచారని చిట్టిరాజు 'సాక్షి'కి తెలిపారు.

గురుకుల సిబ్బందికి వేతనాలివ్వండి: ఎస్టీయూ

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో పనిచేస్తున్న సిబ్బందికి జూన్ నెల వేతనాలు ఇప్పటి వరకు చెల్లించలేదని, తక్షణమే వేతనాలు విడుదల చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ ఏపీ) ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ గురుకులాల్లో రెగ్యులర్, కాంట్రాక్టు, పార్ట్‌టైమ్, అవుట్ సోర్సింగ్ విధానంలో దాదాపు 7 వేల మంది సేవలు అందిస్తున్నట్టు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. త్రైమాసిక బడ్జెట్ విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం కారణంగానే ఈ దుస్థితి వచ్చిందని వారు మండిపడ్డారు.

ఎస్టీ కమిషన్‌తో ఎన్నో సమస్యలను పరిష్కరించాం

కమిషన్ చైర్మన్ శంకరరావు వెల్లడి



సాక్షి, అమరావతి: గిరిజనులతో మమేకమై వారికి న్యాయం జరిగేలా ఏపీ ఎస్టీ కమిషన్ పనిచేస్తోందని కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు స్పష్టంచేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఏపీలో తాను విస్తృతంగా పర్యటించానని తెలిపారు. సామాన్యుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం ద్వారా కమిషన్ అందరికీ చేరువ అయ్యిందన్నారు. వాట్సప్ ద్వారా విజ్ఞాపనలు స్వీకరించే విధానానికి శ్రీకారం చుట్టామన్నారు. నేరుగా రాలేక వాట్సాప్ ద్వారా సమస్యలు తెలిపితే వాటిని తక్షణమే పరిష్కరించే ప్రయత్నం చేశామన్నారు. ఎప్పటికప్పుడు ఐటీడీఏలలో సమీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన సందర్భాల్లో క్షేత్ర స్థాయి పర్యటనలు చేశామన్నారు. భాషా వాలంటీర్ల కొనసాగింపు, అటవీ హక్కుల చట్టం అమలు, అత్యాచార నిరోధక చట్టం అమలుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు.

కొత్తపల్లిలో నాటుతుపాకీ కలకలం!

- సూరంపాలెం ప్రాజెక్టు వద్ద వేటకు వచ్చిన ఇద్దరు వ్యక్తులు
- వారి వద్ద నాటు తుపాకీ ఉండటంతో కేసు నమోదు



నాటు తుపాకీతో పట్టుబడిన వ్యక్తులతో ఎస్ఐ నాగరాజు, సిబ్బంది

గోకవరం: తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో నాటు తుపాకీ కలకలం రేపింది. గ్రామంలో సూరంపాలేనికి వెళ్లే మార్గంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను సోమవారం అర్ధరాత్రి సమయంలో గ్రామస్తులు గుర్తించి పట్టుకున్నారు. దీనిపై మంగళవారం ఉదయం వీఆర్వో ఎం.వెంకట్రావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కె.నాగరాజు విచారణ చేపట్టారు. పట్టుబడిన వారు అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం మండలం సూరంపాలేనికి చెందిన పాతర అప్పారావు, పోడియం పొట్టిదొరగా గుర్తించారు. వీరిద్దరూ నాటు తుపాకీతో సూరంపాలెం ప్రాజెక్టు పరిధిలో వేటకు వచ్చారని, అర్ధరాత్రి కావడంతో సమీపంలోని వేపచెట్టు వద్ద నిద్రలోకి జారుకున్నారని ఎస్ఐ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామన్నారు. ఇదిలా ఉండగా, దొంగతనానికి వచ్చిన వీరిని గ్రామస్తులు పట్టుకునే ప్రయత్నం చేయగా వారి వద్ద ఉన్న నాటు తుపాకీతో కాల్పులు జరిపారన్న వదంతులు గ్రామంలో ఉదయం గుప్పుమన్నాయి. దీంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే వీరిని పోలీసులు విచారించిన అనంతరం అటువంటిదేమీ లేదని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. వదంతులను నమ్మవద్దని పోలీసులు తెలిపారు.

కృష్ణా నదిలో స్థిరంగా వరద

శ్రీశైలం ప్రాజెక్టులో ఉధృతి

- 10 గేట్లు ఎత్తి శ్రీశైలం నుంచి 2,75,700 క్యూసెక్కులు విడుదల

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్/విజయపురి సౌత్: శ్రీశైలం ప్రాజెక్టులోకి వరద ఉధృతి కొనసాగుతోంది. జూరాల, సుంకేసుల ప్రాజెక్ట్‌ల నుంచి మంగళవారం రాత్రి 9గంటల సమయానికి 3,79,822 క్యూసెక్కుల వరద వస్తోంది. పది గేట్లను పది అడుగుల మేరకు తెరచి 2,75,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సోమవారం నుంచి మంగళవారం వరకు జలాశయానికి 4,51,080 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. శ్రీశైలం నుంచి దిగువ ప్రాంతాలైన నాగార్జున సాగర్, పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ, కల్వకుర్తి ఎత్తిపోతలకు 1,21,973 క్యూసెక్కులు విడుదలైంది. కుడిగట్టు కేంద్రంలో 15.201 మిలియన్ యూనిట్లు, ఎడమగట్టు కేంద్రంలో 18.437 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేశారు. రాత్రి 9గంటల సమయానికి జలాశయంలో 209.5948 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, డ్యాం నీటిమట్టం 883.90 అడుగులకు చేరుకుంది. కాగా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో కృష్ణా ప్రధాన పాయలో ఎగువన వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. ఆల్మట్టిలోకి 3.01 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 3 లక్షల క్యూసెక్కులను, నారాయణపూర్ డ్యామ్‌లోకి 2.85 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా 2.77 లక్షల క్యూసెక్కులను వదిలేస్తున్నారు. జూరాల ప్రాజెక్టులోకి 2.95 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. 2.85 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. తుంగభద్ర నదిలో వరద తగ్గుముఖం పట్టింది.



శ్రీశైలం డ్యాం నుంచి విడుదల అవుతున్న నీరు

దోబూచులాడుతున్న గోదావరి



పోలవరం స్పిల్‌వే వద్ద గోదావరి వరద

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్/ధవళేశ్వరం/అమలాపురం: గోదావరి నదిలో వరద ప్రవాహం దోబూచులాడుతోంది. దిగువన వరద తగ్గుతుండగా.. ఎగువన పెరుగుతోంది. ఎగువ ప్రాంతాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఖమ్మం జిల్లాల్లో సోమవారం రాత్రి నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాణహిత, ఇంద్రావతి, శబరి, వాగులు, వంకల్లో వరద ఉధృతి పెరిగింది. దీంతో గోదావరిలో మళ్లీ వరద ప్రవాహం పెరుగుతోంది. భద్రాచలం నుంచి ధవళేశ్వరం వరకు బుధవారం గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుందని కేంద్ర జలసంఘం అధికారులను హెచ్చరించింది. కూనవరం వద్ద శబరి వరద ఉధృతి అత్యంత ప్రమాదకర స్థాయిలో కొనసాగుతుందని వెల్లడించింది. ప్రాణహితలో వరద పెరగడంతో తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజీలోకి వరద ప్రవాహం 7.71 లక్షల క్యూసెక్కులకు పెరిగింది. అదేస్థాయిలో బ్యారేజీ నుంచి దిగువకు వదిలేస్తున్నారు. దానికి ఇంద్రావతి వరద తోడవుతుండటంతో తుపాకులగూడెం (సమ్మక్క సాగర్) బ్యారేజీలోకి 9.15 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. అంతేస్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. సీతమ్మసాగర్‌లోకి చేరుతున్న 9.64 లక్షల క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి 10.08 లక్షల క్యూసెక్కులు చేరుతుండగా.. అంతేస్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతి మంగళవారం మరింత తగ్గింది. సాయంత్రం 6 గంటలకు 175 గేట్లను ఎత్తి బ్యారేజీ నుంచి 11,30,731 క్యూసెక్కుల మిగులు జలాలను విడుదల చేశారు. దిగువన వరద తగ్గడంతో అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల్లో ముంపు వీడుతోంది.

'ఉపాధి' బడ్జెట్ 21.50 కోట్ల పనిదినాలకు పెంపు

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదన మేరకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను మహాత్మా గాంధీ జాయతీ గ్రామీణ ఉపాధి హామీ పథకం లేబర్ బడ్జెట్‌ను 21.50 కోట్ల పని దినాలకు పెంచడానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అంగీకరించిందని డిప్యూటీ సీఎం కె.పవన్‌కళ్యాణ్ ఒక మంగళవారం ప్రకటనలో తెలిపారు. పెరిగిన పని దినాల వల్ల ఉపాధి హామీ పథకంలో పని చేసే 54 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరనుందని పేర్కొన్నారు. కూలీలకు చెల్లించాల్సిన బకాయిల సత్వర విడుదలకు కేంద్రం సమ్మతించిందని ఆయన తెలిపారు.

యూఎస్ కాన్సుల్ జనరల్ భేటీ

కాగా.. పవన్‌కళ్యాణ్‌తో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ మంగళవారం భేటీ అయ్యారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునే నైపుణ్యం గల యువత రాష్ట్రంలో ఉందని, వారి ప్రతిభకు తగిన అవకాశాలు అందించడంతోపాటు ఉన్నత విద్యకు అమెరికా వెళ్లేవారికి తగిన సహకారం, మార్గనిర్దేశం చేయాలని పవన్‌కళ్యాణ్ ఈ సందర్భంగా కోరినట్టు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. జెన్నిఫర్ లార్సన్‌ను పవన్ కళ్యాణ్ సన్మానించారు.



జెన్నిఫర్ లార్సన్‌ను సన్మానిస్తున్న పవన్ కల్యాణ్

విజయసాయిరెడ్డికి 'ఐసీఏఐ' నోటీసులు సరికాదు

తెలంగాణ హైకోర్టులో విజయసాయిరెడ్డికి ఊరట



సాక్షి, హైదరాబాద్:చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తిపరమైన ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై విచారణకు హాజరుకావాలంటూ గతేడాది అక్టోబర్ 23న రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డికి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెర్డ్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) క్రమశిక్షణ కమిటీ జారీ చేసిన నోటీసులను తెలంగాణ హైకోర్టు రద్దు చేసింది. ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ తీరు సరికాదని తప్పుబట్టింది. ఈ మేరకు మంగళవారం తీర్పు వెలువరించింది. చార్టర్డ్ అకౌంటెంట్ వృత్తిపరమైన ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై విచారణకు హాజరుకావాలంటూ గతేడాది అక్టోబర్ 23న ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ విజయసాయిరెడ్డికి నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. చార్టెర్డ్ అకౌంటెంట్‌గా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొంది. ఈ నోటీసులను తెలంగాణ హైకోర్టులో విజయసాయిరెడ్డి సవాల్ చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా విచారణ చేపట్టారు. పిటిషనర్‌కు ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేయడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.వెంకటేశ్ వాదనలు వినిపించారు. కమిటీ, డైరెక్టరేట్ ఆరోపిస్తున్న కేసుల్లో ఏ కేసులోనూ పిటిషనర్ దోషిగా నిరూపణ కాలేదని న్యాయస్థానం దృష్టికి తెచ్చారు. రాజకీయ ప్రోద్బలంతో ఆ కేసులు పెట్టారని.. విచారణ సాగుతోందని వెల్లడించారు. వాదనలు విన్న న్యాయమూర్తి ఐసీఏఐ క్రమశిక్షణ కమిటీ ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడాన్ని తప్పుబడుతూ తీర్పునిచ్చారు. విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించారు.

నేరం జరిగిన చోట మోహిత్‌రెడ్డి లేరు

- ఆయన అక్కడ ఉన్నారనేందుకు ఎలాంటి ఆధారాల్లేవ్: హైకోర్టు
- సహ నిందితుల వాంగ్మూలం స్వీకరించదగ్గ సాక్ష్యం కిందకు రాదు



సాక్షి, అమరావతి: తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పులివర్తి నాని, చెవిరెడ్డి వర్గీయుల మధ్య ఘర్షణ జరిగిన సమయంలో అక్కడ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఉన్నారనేందుకు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని హైకోర్టు స్పష్టం చేసింది. మొదట నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో మోహిత్‌రెడ్డి నిందితుడు కాదని, ఇతర నిందితులు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఆయనను పోలీసులు నిందితునిగా చేర్చారని తెలిపింది. వాస్తవానికి సహ నిందితులు ఇచ్చిన వాంగ్మూలం.. విచారణకు స్వీకరించదగ్గ సాక్ష్యం కిందకు రాదని తేల్చి చెప్పింది. మోహిత్‌రెడ్డి ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారని, ఆయన పారిపోయే అవకాశం ఎంతమాత్రం లేదంది. మోహిత్‌రెడ్డిపై నిర్దిష్టంగా ఎలాంటి ఆరోపణలు లేవని స్పష్టం చేసింది. అందువల్ల ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. హైకోర్టు సోమవారం వెలువరించిన ఉత్తర్వుల కాపీ మంగళవారం అందుబాటులోకి వచ్చింది. పద్మావతి విశ్వవిద్యాలయంలో మే 14వ తేదీన జరిగిన ఘర్షణపై నాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో అరెస్ట్ నుంచి తనకు రక్షణ కల్పించాలంటూ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు సోమవారం మోహిత్‌కు షరతులతో కూడిన ముందస్తు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే.

లారీని ఓవర్‌టేక్ చేయబోయి..

- అదుపుతప్పిన బైక్.. ఇద్దరు మృతి
- శ్రీకాకుళం జిల్లాలో దుర్ఘటన



ప్రమాద స్థలంలో మృతిచెందిన ఆర్యని

రణస్థలం : శ్రీకాకుళం జిల్లాలోని పైడిభీమవరం జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. ఇదే జిల్లా మందస మండలంలోని కుదుమసాయికి చెందిన సవర ఆర్యని (27), ఆమె మరిది సవర జీవన్ కుమార్ (20)లు పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. పైడిభీమవరం ఫ్లైఓవర్ పైన రాత్రి ఎనిమిది గంటల సమయంలో లారీని ఓవర్‌టేక్ చేయబోయి వీరి బండి అదుపు తప్పింది. దీంతో వెనుక కూర్చున్న ఆర్యని రోడ్డుపై పడిపోయింది. జీవన్‌కుమార్ ఏకంగా ఫ్లైఓవర్ కిందపడడంతో ఇద్దరూ మృతిచెందారు. ప్రమాదం జరిగిన చాలాసేపటి తర్వాత అటుగా వచ్చిన ఓ యువకుడు ఈ సమాచారాన్ని మృతుల కుటుంబ సభ్యులకు, పోలీసులకు తెలియజేశాడు. మృతదేహాలను శవపంచనామా కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

నిర్ణయించిన ధరలకే ఇసుక అమ్మాలి

- మంత్రి కొల్లు రవీంద్ర



సాక్షి, అమరావతి: డిమాండ్ మేరకు ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మించి ఎక్కడా వసూళ్లకు పాల్పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గనులు, అబ్కారీ అధికారులతో ఆయన మంగళవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఎక్సైజ్, గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా, గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌తో పలు అంశాలపై ఆయన చర్చించారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలు, జిల్లాల వారీగా ఇసుక లభ్యత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో అబ్కారీ, గనుల శాఖ ముఖ్య అధికారులు దేవకుమార్, అనుసూయాదేవి పాల్గొన్నారు.

'పుట్టా' పాపం.. 'సీమ'కు శాపం

టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ నిర్వాకంతో హంద్రీ-నీవా నీటి విడుదలకు బ్రేక్

కృష్ణమ్మ కరుణిస్తున్నా కరువు సీమకు అందని నీళ్లు



మైదుకూరు టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు చెందిన రోడ్డు నిర్మాణ సంస్థ ఈ ఫోటోలో కనిపిస్తున్న హంద్రీ-నీవా కెనాల్‌ను పూడ్చివేసి దీనిపై తాత్కాలిక రహదారిని నిర్మించింది. కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి పనుల్లో భాగంగా గార్గేయపురం - బ్రాహ్మణకొట్కూరు మధ్య కాలువపై వంతెన నిర్మాణం కోసం కెనాల్‌ను పూడ్చివేయడంతో హంద్రీ-నీవా నీళ్లు దిగువకు విడుదల కాని దుస్థితి నెలకొంది. రాయలసీమ మొత్తానికి జీవనాడి అయిన హంద్రీ-నీవాకు నీళ్లు రాకపోవడంతో 6.02 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు అందని పరిస్థితి ఏర్పడింది. టీడీపీ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌కు చెందిన పీఎస్‌కే ఇన్‌ఫ్రా ఈ రహదారి నిర్మాణ పనులను చేస్తోంది. కాలువలో కనీసం పైపులు అమర్చి రోడ్డు నిర్మించినా నీళ్లు పారేవి. ఆ మాత్రం జాగ్రత్తలు కూడా తీసుకోకుండా పుట్టా సంస్థతో పాటు జలవనరులశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించగా నీటి విడుదల నిలిచిపోవటానికి కారణాలు వెల్లడించకుండా రాష్ట్ర ప్రభుత్వం గోప్యంగా వ్యవహరిస్తోంది.

సాక్షి ప్రతినిధి కర్నూలు: జలవనరులశాఖ నిర్లక్ష్యం, పుట్టా సంస్థ పీఎస్‌కే ఇన్‌ఫ్రా లెక్కలేనితనం వెరసి ప్రభుత్వ వైఫల్యం.. రాయలసీమకు పెనుశాపంగా పరిణమించింది. కళ్లెదుట కృష్ణమ్మ ఉధృతంగా ప్రవహిస్తున్నా, శ్రీశైలం రిజర్వాయర్ నిండటంతో నీళ్లు దిగువకు విడుదలవుతున్నా హంద్రీ-నీవాకు నీళ్లు మళ్లించుకోలేని దౌర్భాగ్య పరిస్థితి తలెత్తింది. రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ అధికార పార్టీ ఎమ్మెల్యే పుట్టాది కావడంతో ఇటు అధికారులు, అటు ప్రభుత్వం చూసీ చూడనట్లుగా ఉన్నారు. తాత్కాలిక రోడ్డు వేసే సమయంలోనే కాలువలో నీళ్లు దిగువకు వెళ్లేలా ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదు? 15 రోజులుగా కృష్ణాకు వరద నీరు వస్తున్నా హంద్రీ-నీవాకు ఎందుకు ఇవ్వలేకపోతున్నాం? అని సమీక్షించి అప్రమత్తం కావాల్సిన రాష్ట్ర ప్రభుత్వం కళ్లు మూసుకుని కూర్చుంది. సర్కారు నిర్వాకాలతో ఈ ఏడాది 'సీమ'లో వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదం నెలకొంది.

గత ఐదేళ్లూ ముందుగానే..

గతేడాది రాయలసీమలో వర్షాభావంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ ఏడాది కూడా ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. అయితే అదృష్టవశాత్తూ మహారాష్ట్ర, కర్ణాటకలో భారీ వర్షాలకు కృష్ణా, తుంగభద్ర పోటెత్తాయి. శ్రీశైలానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. జలాశయం పూర్తిగా నిండటంతో ఆరు గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా 23 వేల క్యూసెక్కులు విడుదల చేశారు. దీంతో హంద్రీ-నీవా నీటితో చెరువులు, రిజర్వాయర్లు నింపితే భూగర్భ జలాలు పెరిగి పంటలు సాగు చేసుకోవచ్చని సీమ రైతులు ఆశ పడ్డారు. గత ఐదేళ్లు పోతిరెడ్డిపాడు కంటే ముందుగానే హంద్రీ-నీవాకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నీటిని విడుదల చేసింది. శ్రీశైలంలో నీటిమట్టం 834 అడుగులకు చేరితే హంద్రీ-నీవాకు నీళ్లు విడుదల చేయవచ్చు. ముచ్చుమర్రి ద్వారా 800 అడుగులకే నీరు లిఫ్ట్ చేయవచ్చు. అయితే రిజర్వాయర్‌లో పూర్తి స్థాయి నీటి మట్టం ఉన్నా ప్రభుత్వం నీటిని విడుదల చేయకుండా, కారణాలు చెప్పకుండా దాగుడు మూతలాడుతోంది. 15 రోజులుగా నీళ్లు విడుదల కాకపోవడంపై రైతన్నలు తీవ్రంగా మథన పడుతున్నారు.



కర్నూలు-విజయవాడ మార్గంలో తాత్కాలిక రహదారిపై వెళ్తున్న బస్సు

హంద్రీ-నీవాపై ఆధారపడ్డ 6.02 లక్షల ఎకరాల ఆయకట్టు

'హంద్రీ-నీవా సుజల స్రవంతి'పై ఆధారపడి ఉమ్మడి కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో 6.02 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ జిల్లాలలో 30 లక్షల మందికి తాగునీరు అందుతోంది. క్రిష్ణగిరి, పత్తికొండ, జీడిపల్లి, గొల్లపల్లి, మారాల, చెర్లోపల్లి, శ్రీనివాసపురం, అడవిపల్లి, చెర్లోపల్లి రిజర్వాయర్ల కింద వందల చెరువులకు ఏటా నీళ్లు ఇస్తున్నారు. 76 చెరువులకు గత ప్రభుత్వం నీరందించింది. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ కుప్పానికి కూడా హంద్రీ-నీవా నీటిని విడుదల చేశారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కృష్ణాలో నీళ్లున్నా విడుదల చేయకుండా అన్నదాతలతో పరిహాసమాడుతోంది. హంద్రీ-నీవా ద్వారా 40 టీఎంసీలను 120 రోజుల పాటు ఎత్తిపోసేలా పథకాన్ని డిజైన్ చేశారు. అయితే అన్ని రోజులు కృష్ణాలో ప్రవాహం ఉండటం లేదు. దీంతో కెనాల్‌ను విస్తరించాలని గత ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో 15 రోజుల ముందే నీటిని విడుదల చేయాల్సిన ప్రభుత్వం ఇప్పటికీ దృష్టి సారించకపోవడంతో 'సీమ'కు తీవ్ర నష్టం జరుగుతోంది.

రోడ్డు తొలగించి నీటిని విడుదల చేస్తాం

జాతీయ రహదారి పనుల్లో భాగంగా హంద్రీ-నీవా కాలువపై వంతెన నిర్మాణం జరుగుతోంది. నీటిని విడుదల చేసే లోపు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చి తాత్కాలిక రోడ్డు వేశారు. అయితే సకాలంలో పనులు పూర్తి చేయలేకపోయారు. గడువు దాటితే ఏజెన్సీతో పని లేకుండా రోడ్డు తొలగించి, పూడిక తీసేసి నీటిని విడుదల చేస్తాం.

– రామగోపాల్, ఎస్‌ఈ, హంద్రీ-నీవా సుజల స్రవంతి

ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నాం

పీఎస్‌కే ఇన్‌ఫ్రా హంద్రీ కాలువపై వంతెనను నిర్మిస్తోంది. కాలువను నిర్మాణ సంస్థే పూడ్చింది. నీటి విడుదల కోసం జలవనరులశాఖ అధికారులు తాత్కాలిక రోడ్డును తొలగించే యోచనలో ఉన్నారు. ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచిస్తున్నాం.

– జి.గోవర్ధన్, పీడీ, నేషనల్ హైవేస్ అథారిటీ, కర్నూలు

పైపులు వేసి ఉంటే..

కర్నూలు-విజయవాడ నేషనల్ హైవే పనుల్లో భాగంగా ఎన్‌హెచ్-340 సి రోడ్డు పనుల్లో ఒకటో ప్యాకేజీని పుట్టా సుధాకర్ యాదవ్‌కు చెందిన పీఎస్‌కే ఇన్‌ఫ్రా దక్కించుకుంది. ఈ ప్యాకేజీలో 30.6 కి.మీ. నాలుగు లేన్ల రహదారిని రూ.827.39 కోట్లతో నిర్మించనున్నారు. ఇందులో గార్గేయపురం, బ్రాహ్మణ కొట్కూరు మధ్య హంద్రీ-నీవా కాలువపై వంతెన నిర్మించాలి. దీంతో కాలువపై ఉన్న కల్వర్టు తొలగించి వంతెన నిర్మిస్తున్నారు. రాకపోకల కోసం హంద్రీ-నీవా కెనాల్‌ను పూడ్చేసి తాత్కాలిక రోడ్డు వేశారు. పైపులు వేసి రోడ్డు నిర్మిస్తే కాలువలో నీటి ప్రవాహానికి వీలుండేది. 15 రోజుల క్రితమే హంద్రీ-నీవా నీళ్లు విడుదలయ్యేవి. పీఎస్‌కే ఇన్‌ఫ్రా నిర్లక్ష్యంగా వ్యవహరించి పైపులు వేయకుండా కాలువను పూర్తిగా పూడ్చేసింది. నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్న ఇరిగేషన్ అధికారులు ఇప్పుడు ఉలిక్కిపడుతున్నారు.





యంగ్ రైటర్స్... కథలు రాస్తారా?

కొత్త తరం నుంచి కొత్త ఆలోచనలు పుడతాయి. కొత్త సాహిత్యం వస్తుంది. కొత్త కథా వస్తువులు మిలమిలమని మెరుస్తాయి. అందుకే కథలు రాయాలనుకుంటున్న నేటి తరానికి వేదిక పరవాలనుకుంటోంది సాక్షి. 30 ఏళ్ల లోపు యువ రచయితల కోసం 'సాక్షి ఫన్‌డే'లో 'యువ కథ' శీర్షిక ప్రారంభించనుంది. 'సాక్షి ఫన్‌డే' మేగజీన్‌లో ఒకటి లేదా రెండు పేజీల నిడివి వచ్చేలా కథలు రాసి పంపండి. అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తాం. ఒక్క కథ జీవితాంతం మీకో మంచి సాంగత్యం కాగలదు. గుర్తింపు మార్గం ఇవ్వగలదు. ప్రయత్నించండి.

మా చిరునామా: యువ కథ, సాక్షి ఫన్ డే, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ -34. ఈమెయిల్: funday.kathalu@gmail.com



● కమ్ బ్యాక్

జెంగ్ సైరన్

'కొన్ని విజయాలు కూడా పరాజయాలే. కొన్ని పరాజయాలు కూడా విజయాలే' నిజమే! ఆటలోని పరాజితులు లోకం దృష్టిగా పెద్దగా రారు. అయితే టానియా జెంగ్ పరిస్థితి వేరు. ఈ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి ప్రిలిమినరీ రౌండ్‌లోనే నైదొలగినా... ఆమె విజేతగానే వెలిగిపోయింది. దీనికి కారణం ఆమె వయసు. 58 సంవత్సరాల వయసులో తన ఒలింపిక్ కలను నిజం చేసుకున్న చైనీస్ - చిలీ టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి టానియా జెంగ్ సంచలనం సృష్టించింది....

తల్లి టేబుల్ టెన్నిస్ కోచ్ కావడంతో చిన్నప్పటి నుంచే ఆ ఆటపై జెంగ్‌కు ఆసక్తి ఏర్పడింది. బడిలో కంటే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో కనిపించిందే ఎక్కువ. అక్కడ ఎంతోమంది ప్రొఫెషనల్ ప్లేయర్స్‌తో మాట్లాడే అవకాశం దొరికింది.

వారితో మాట్లాడడం అంటే... ఆటల పాఠాలు నేర్చుకోవడమే!

తొమ్మిది సంవత్సరాల వయసు నుంచి టేబుల్ టెన్నిస్‌లో జెంగ్‌కు తల్లి శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టింది. 11 ఏళ్ల వయసులో ఎలిట్ స్పోర్ట్స్ అకాడమీలో చేరింది జెంగ్. పన్నెండేళ్ల వయసులో ప్రొఫెషనల్ ప్లేయర్ అయింది. నేషనల్ జూనియర్ చాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకుంది. పదహారు సంవత్సరాలకు చైనీస్ టేబుల్ టెన్నిస్ టీమ్‌లో చోటు సంపాదించింది. 'ప్రామిసింగ్ ప్లేయర్'గా పేరు తెచ్చుకుంది.

'అంతా ఓకే' అనుకొని ఉంటే జెంగ్ ప్రయాణం మరోలా ఉండేది. అయితే ఆ సమయంలో టేబుల్ టెన్నిస్‌కు సంబంధించి నిబంధనలు ఏవో మార్చడం జెంగ్‌కు చిరాకు తెప్పించింది. ఆ చిరాకు కోపంగా మారి తనకు ప్రాణ సమానమైన టేబుల్ టెన్నిస్‌కు దూరం అయింది.

కొంత కాలం తరువాత...

తనకు అందిన ఆహ్వానం మేరకు చిలీలో స్కూల్ పిల్లల టేబుల్ టెన్నిస్ కోచ్‌గా కొత్త ప్రయాణం ప్రారంభించింది. జియాంగ్ జెంగ్ పేరు కాస్తా టానియా జెంగ్‌గా మారింది. 'జెంగ్' తాను పుట్టిపెరిగిన చైనా అస్తిత్వం. 'టానియ' తనకు ఎంతో ఇష్టమైన, కొత్త జీవితాన్ని ఇచ్చిన చిలీ అస్తిత్వం.

వివిధ ప్రాంతాలకు కుమారుడు ఒంటరిగా పోటీలకు వెళ్లే సమయానికి జెంగ్ టెన్నిస్ రాకెట్‌కు దూరం అయింది. సుదీర్ఘ విరామం తరువాత రీజినల్ టోర్నమెంట్స్ కోసం మళ్లీ రాకెట్ పట్టింది. మళ్లీ విజయ పరంపర మొదలైంది. 2023 పాన్ అమెరికన్ గేమ్స్‌లో కాంస్యం గెలుచుకోవడంతో చిలీలో జెంగ్‌కు ఎంతోమంది అభిమానులు ఏర్పడ్డారు. ఒలిపింక్స్ 2024కు క్వాలిఫై కావడంతో జెంగ్ పేరు మరోసారి వార్తల్లోకి వచ్చింది.



తన కుమారుడికి టేబుల్ టెన్నిస్‌లో కోచింగ్ ఇస్తున్న సమయంలో పోటీలలో పాల్గొనాలనే ఉత్సాహం జెంగ్‌లో మొదలైంది. 2004, 2005 నేషనల్ లెవల్ టోర్నమెంట్స్‌ను గెలుచుకుంది.

టేబుల్ టెన్నిస్‌లో చూపించే అద్భుత ప్రతిభాపాటవాలతో చిలీ మీడియా ఎట్రాక్షన్‌గా మారింది జెంగ్. ఆమె ఆట ఆడే తీరు చిలీ అధ్యక్షుడు గాబ్రియెల్ బోరిక్‌కు ఎంతో ఇష్టం.

ఎప్పటి నుంచో నేస్తంగా ఉన్న 'విజయం' ఒలింపిక్స్‌లో ముఖం చాటేసినా... జెంగ్ ముఖంలోని వెలుగు తగ్గలేదు. అదే పోరాట స్ఫూర్తి! కుమార్తెను ఒలింపిక్స్‌లో చూడాలనేది 92 సంవత్సరాల తండ్రి కల. ఆ కలను నిజం చేసి తండ్రి కళ్లలో వెలుగు నింపింది జెంగ్.

'గో ఎట్ ఇట్, గో విత్ ఎవ్రీ థింగ్' అంబరాన్ని అంటే సంతోషంతో అంటున్నాడు ఆ పెద్దాయన.

'ఒలింపిక్ గ్రాండ్ మదర్'

'కమ్ బ్యాక్ క్వీన్'... ఇలా రకరకాల కాప్షన్‌లతో జెంగ్ గురించి సోషల్ మీడియాలో గొప్పగా పోస్టులు పెడుతున్నారు నెటిజనులు.

'ఒలింపిక్స్ అనేది నా జీవితకాల కల. క్వాలిఫై అవుతానని ఊహించలేదు. నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. విరివిగా ఆటలు ఆడాలనే ఉత్సాహం పెరిగింది' అంటుంది టానియ జెంగ్.

మేడ మీద వంట

మేడ మీద వడియాలు పెటుకున్నట్టే, మేడ మీద పంటలు కూడా ఇటీవల ఎక్కువైంది. బెంగళూరుకు చెందిన రేవా జింగాన్ మాలిక్ మాత్రం రోజూ ఉదయం తొమ్మిది గంటలకు మేడ మీదకెళ్లి వంట మొదలుపెడుతుంది. అదే సోలార్ కుకింగ్. ప్రకృతి పరిరక్షణ, పర్యావరణ హితమైన జీవనశైలి లో భాగంగా ఆమె ఈ సోలార్ కుకింగ్‌ని అనుసరిస్తోంది. ఎల్‌పీజీ గ్యాస్ వాడకం వల్ల భూమికి జరిగే హానిని తనవంతుగా నిలువరించగలిగినందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నారామె. వండడానికి, ఎండబెట్టడానికి అనువుగా ఆమె డిజైన్ చేయించుకున్న సోలార్ ఎక్విప్‌మెంట్ గురించి...

ప్రత్యామ్నాయ జీవనశైలి

ఎల్‌పీజీ వాడకం ఎక్కువైంది. గడచిన ఐదేళ్లలో మనదేశం దిగుమతులు కూడా ఆ మేరకు పెరిగిపోతున్నాయి. 2017-18 ఆర్థిక సంవత్సరంలో 11.4 మిలియన్ మెట్రిక్ టన్నుల నుంచి 2022-23 నాటికి 18.3 ఎమ్‌ఎమ్‌టీలకు చేరింది. మన ఉత్పత్తుల శాతం నాలుగుగా ఉంటే వినియోగ శాతం 22కి చేరింది. అందుకే సస్టెయినబుల్ లివింగ్ మాత్రమే అసలైన ప్రత్యామ్నాయం అనుకున్నాను. అదే విషయాన్ని పిల్లలకు, పెద్దలకు బోధిస్తున్నాను. ప్రతిదీ ప్రభుత్వమే చేయాలని ఎదురు చూడరాదు, మనవంతుగా ప్రయత్నాలు మొదలు పెట్టాలి. కొన్ని దేశాల్లో సూర్యరశ్మి తగినంత ఉండదు, కానీ మనదేశంలో సూర్యరశ్మి పుష్కలంగా లభిస్తుంది. ఇతర ఇంధనాల వలె వాడుకకు అనువుగా చేయడానికి ప్రాసెసింగ్ అవసరం, సోలార్ ఎనర్జీని వాడడానికి మనం ప్రత్యేకంగా శ్రమించాల్సింది ఏమీ లేదు. ఒకసారి సోలార్ కుకర్‌ని కొంటే సంవత్సరాల పాటు వినియోగించుకోవచ్చు. నాలుగేళ్ల కిందట 18వేల రూపాయలకు కొన్నాను. శీతాకాలం, వర్షాకాలం కొంచెం ఇబ్బంది ఉంటుంది. 850 వాట్స్ సోలార్ ఇన్వర్టర్ అమర్చడం ద్వారా ఆ సమస్యనూ పరిష్కరించుకున్నాను.



అన్నం, పప్పు, కూరగాయలకు మూడు అరల సోలార్ కుకర్ డిజైన్ చేయించుకున్నాను. ఉదయం ఎనిమిది గంటలకు బియ్యం, పప్పు కడిగి, నానబెట్టి, కూరగాయలు తరిగి తొమ్మిదింటికి మేడ మీదకు వెళ్లి కుకర్ ఆన్ చేసి వస్తాను. పదకొండు గంటలకల్లా వంట పూర్తవుతుంది. పాలు మరిగించడం నుంచి ప్రతిదీ ఇందులోనే చేస్తున్నాను. పప్పులు, గింజలు, రైజిన్స్, వేయించడం నుంచి ఎండబెట్టి పొడి చేసుకునే పసుపు, ఎండుమిర్చి వరకు అందులోనే చేస్తున్నాను. మంట లేని వంట మాది''.

యోగం

తల నుంచి మోకాలి వరకు

తల నుంచి మోకాలి వరకు ఉండే ఈ భంగిమను జాను శీర్షాసన అంటారు. 'జాను' అంటే మోకాలు 'శీర్ష' అంటే తల. ఈ ఆసనాన్ని వేసే ముందు మ్యాట్ పైన సుఖాసనంలో కూర్చోవాలి.



ఒక కాలును ముందుకు చాపి, చేతులతో ఆ కాలి పాదాన్ని పట్టుకోవాలి. తలను మోకాలి మీదుగా ఉంచాలి. మడిచి ఉన్న రెండవ కాలు పాదం మరొక కాలును తాకినట్టుగా, పొట్ట దగ్గరగా ఉండాలి. ఈ ఆసనంలో ఎక్కువ సేపు ఉండటం వల్ల వెన్నెముక సాగినట్టుగా, దిగువ శరీరం అంతా రిలాక్స్ అయినట్టుగా అనిపిస్తుంది.

జీర్ణక్రియ, శ్వాసకోశ పనితీరును మెరుగుపరుస్తుంది. నడుము నొప్పి, ఒత్తిడి, నిరాశ, అలసటపై ప్రభావం చూపుతుంది.

అధిక బరువుకు: మొదట్లో ఈ ఆసనం వేస్తున్నప్పుడు కొంత సవాల్‌గా అనిపిస్తుంది. ఎక్కువ ఒత్తిడి లేకుండా మెల్లగా ప్రయత్నించడం వల్ల ఈ భంగమను సాధన చేయవచ్చు. ఒక కాలును ఒకసారి రెండవ కాలును మరొకసారి 5 సార్లు మార్చుతూ చేయాలి. రోజూ పరగడుపున పది సార్లు ఈ ఆసనం వేయడం వల్ల అధికబరువు, గ్యాస్ట్రిక్, మధుమేహం సమస్యలకు మంచి పరిష్కారం లభిస్తుంది. రోజులో ఉండే ఒత్తిడి నుంచి కూడా త్వరగా రిలాక్స్ అవుతారు.

సూచన: గర్భిణులు, హెర్నియా, ఆస్తమా, స్పాండిలోసిస్, స్లిప్డ్ డిస్క్ వంటి సమస్యలు ఉన్నవారు వైద్యుల సలహా మేరకు లేదా యోగా నిపుణుల ఆధ్వర్యంలో మాత్రమే సాధన చేయాలి.



- జి.అనూషా రాకేష్, యోగా ట్రైనర్

నైట్ బ్రషింగ్ తప్పనిసరి...

రాత్రివేళల్లో నిద్రపోయేముందు బ్రష్ చేసుకోడాన్ని అందరూ తప్పనిసరిగా అలవరచుకోవాలి. ఎందుకంటే మెలకువతో ఉన్నప్పుడు అందరూ తినడానికీ, మాట్లాడటానికీ... ఇలా అనేక పనుల కోసం నోటిని అనేక మార్లు తెరుస్తుంటారు. కానీ నిద్రలో కనీసం ఏడెనిమిది గంటలు నోరు మూసుకుపోయే ఉండటంతో నోట్లో సూక్ష్మజీవుల సంఖ్య చాలా ఎక్కువగా వృద్ధిచెందుతాయి. రాత్రి పూట నోటిలో ఊరే లాలాజలం కూడా చాలా తక్కువే. ఫలితంగా నోట్లో సూక్ష్మజీవులు విపరీతంగా పెరిగిపోయి, అవి దంతాలకు హానికరమైన యాసిడ్‌నూ ఉత్పత్తి చేస్తుంటాయి. అందువల్ల నోటి ఆరోగ్యం దెబ్బతినడంతో పళ్లూ తీవ్రంగా దెబ్బతినే అవకాశం పగటి కంటే రాత్రి పూటే ఎక్కువ. అందుకే రాత్రి పడుకునేముందు బ్రష్ చేసుకునే అలవాటు పళ్లకు జరిగే హానిని గణనీయంగా తగ్గించడంతో పాటు నోటి ఆరోగ్యానికి ఎంతగానో సహాయపడుతుంది.



సినిమా

నిర్మాతల మండలి ఏకపక్ష నిర్ణయం సరికాదు

- నడిగర్ సంఘం

తమిళ నిర్మాతల మండలి, నడిగర్ సంఘం మధ్య వార్ మొదలైందా? అంటే అలాంటి వాతావరణమే కనిపిస్తోంది. ఇందుకు కారణం నిర్మాతల మండలి తీసుకున్న నిర్ణయాలే. ఈ మండలి ఈ నెల 29న ఒక ప్రకటన విడుదల చేసింది. తమిళ నిర్మాతల మండలి, యాక్టీవ్ నిర్మాతల మండలి, డిస్ట్రిబ్యూటర్స్ సంఘం కలిసి నిర్వహించిన సమావేశంలో చేసిన తీర్మానాలను ఆ ప్రకటనలో వెల్లడించారు. ముఖ్యంగా నటీనటులు ముందుగా నటించడానికి అంగీకరించి, అడ్వాన్స్‌లు తీసుకున్న చిత్రాల్లోనే నటించాలని, అదే విధంగా నటీనటుల పారితోషికం, నిర్మాణ వ్యయం వంటి విషయాల గురించి నూతన విధి విధానాలను నిర్ణయించే వరకూ నవంబర్ 1వ తేదీ నుంచి షూటింగ్‌లను నిలిపి వేయాలని నిర్మాతల మండలి నిర్ణయించింది. ఆగస్ట్ 16 తర్వాత కొత్త చిత్రాల ఆరంభానికి అనుమతి లేదని కూడా నిర్మాతల సంఘం పేర్కొంది. అయితే ఇప్పటికే నిర్మాణంలో ఉన్న చిత్రాల షూటింగ్‌లను అక్టోబర్ 30 లోగా పూర్తి చేయాలని తీర్మానం చేసింది. అలాగే నటుడు ధనుష్ పలువురు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారనీ, అందువల్ల ఆయనతో కొత్త చిత్రాలను నిర్మించే నిర్మాతలు తమిళ నిర్మాతల మండలి నిర్వాహకులతో చర్చించాకే ఆ సినిమా కార్యక్రమాలు మొదలుపెట్టాలనే తీర్మానం చేశారు. కాగా నిర్మాతల మండలి తీర్మానాలపై నడిగర్ సంఘం (దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు నడిగర్ సంఘం (నటీనటుల సంఘం) విడుదల చేసిన పత్రికా ప్రకటనలోని సారాంశం ఈ విధంగా...



ధనుష్

తమిళ నిర్మాతల మండలి విడుదల చేసిన ప్రకటనలో నటీనటులకు సంబంధించిన తీర్మానాలు, నటుడు ధనుష్‌కు సంబంధించిన తీర్మానం తమను దిగ్భ్రాంతికి గురి చేశాయని నటీనటుల సంఘం పేర్కొంది. ధనుష్ గురించి ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదు రాలేదని, అకస్మాత్తుగా అతనిపై నిషేధం విధించడం ఏమాత్రం ఆమోదనీయం కాదని కూడా ఆ ప్రకటనలో ఉంది. సమస్యను తమతో చర్చించకుండా తీర్మానించడాన్ని ఖండిస్తున్నామని పేర్కొంది. రెండు సంఘాలూ కలిసి మాట్లాడుకుని, నిర్ణయం తీసుకోవాల్సిన విషయాన్ని ఏకపక్షంగా నిర్ణయించి, పత్రికా ప్రకటనలా ఇవ్వడం సరి కాదని కూడా నటీనటుల సంఘం అభిప్రాయపడింది. తమిళ సినీ సంఘాల్లో ముఖ్యమైన నటీ నటీనటుల సంఘం నిర్వాహకులను సంప్రదించకుండా వేలాది మంది నటీనటులు, కార్మికుల జీవితాలను బాధించే విధంగా షూటింగ్‌లు నిలిపివేయాలని నిర్మాతల మండలి నిర్ణయించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కూడా తాము విడుదల చేసిన నోట్‌లో నటీనటుల సంఘం పేర్కొంది. ఈ ఏక పక్ష తీర్మానాన్ని వెంటనే వెనక్కు తీసుకోవాలని, ఈ విషయమై దక్షిణ భారత సినీ నటీనటుల సంఘం కార్యవర్గంతో చర్చించి తగిన చర్యలు గురించి వెల్లడించడం జరుగుతుందని పేర్కొంది.

- సాక్షి, చెన్నై



నిర్మాతల మండలి తీర్మానాన్ని ఖండిస్తున్నాం

- కార్తీ

నటీనటుల సంఘం కోశాధికారి, నటుడు కార్తీ మీడియాతో మాట్లాడుతూ - "తమిళ నిర్మాతల మండలి ఏక పక్షంగా చేసిన తీర్మాలను ఖండిస్తున్నాం. ముఖ్యంగా నటుడు ధనుష్ పై ఎలాంటి ఫిర్యాదు లేకున్నా ఆయనపై చర్యలు తీసుకోవాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం" అన్నారు. నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, కార్యదర్శి విశాల్‌లను సంప్రదించాకే పత్రికా ప్రకటన విడుదల చేశామని కూడా కార్తీ పేర్కొన్నారు. అదే విధంగా నడిగర్ సంఘాన్ని సంప్రదించకుండా నిర్మాతల మండలి చేసిన తీర్మానాలను వ్యతిరేకిస్తున్నట్లు నటీనటుల సంఘం ఉపాధ్యక్షుల్లో ఒకరైన కరుణాస్ కూడా పేర్కొన్నారు.

ఆ పొరపాటు చేయను

- నిర్మాత మహేశ్వర్ రెడ్డి



''కథలో ఊహించని మలుపులు ఉన్న సినిమాలనే ప్రేక్షకులు ఆదరిస్తున్నారు. 'శివం భజే' కథలో చాలా మలుపులు ఉన్నాయి'' అన్నారు మహేశ్వర్ రెడ్డి. అశ్విన్ బాబు హీరోగా నటించిన చిత్రం 'శివం భజే'. దిగంగనా సూర్యవన్షీ హీరోయిన్‌గా నటించారు. అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకర్ల సమావేశంలో మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ– ''శివం భజే'లో ఐదు జానర్లు ఉన్నాయి. మర్డర్, మిస్టరీ, ఆధ్యాత్మికం, యాక్షన్... ఇలాంటి అంశాలు ఉన్నాయి. డిస్ట్రిబ్యూటర్‌గా చాలా సినిమాలను పంపిణీ చేశాను. నిర్మాతగా ఇది నా తొలి చిత్రం. ఈ సినిమాపై నాకు నమ్మకం ఉంది కాబట్టే ఇంకా ఓటీటీ, శాటిలైట్ హక్కులు అమ్ముడుపోకుండానే థియేటర్స్‌లో రిలీజ్ చేస్తున్నాం. ఇక పెయిడ్ ప్రీమియర్స్ వేయడం అనేది నా దృష్టిలో పొరపాటు. 'శివం భజే' విషయంలో ఆ పొరపాటు చేయను. టికెట్ ధరలు ఎలా ఉన్నా కంటెంట్ బాగుండి, మంచి మౌత్ టాక్ వస్తే ఆ సినిమాను ఆడియన్స్ చూస్తారని నా నమ్మకం'' అని చెప్పుకొచ్చారు.



కల్యాణ్ రామ్

వెయ్యి మందితో ఫైట్

నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'ఎన్‌కేఆర్ 21' (వర్కింగ్ టైటిల్) క్లైమాక్స్ షూటింగ్ పూర్తయింది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో విజయశాంతి, సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హైదరాబాద్ శివార్లలో వేసిన సెట్‌లో ముప్పై రోజుల పాటు క్లైమాక్స్ సన్నివేశాలు చిత్రీకరించారు. ''క్లైమాక్స్ కోసం బ్రహ్మ కడలి అద్భుతమైన సెట్స్‌ని రూపొందించారు. పతాక సన్నివేశాల షూట్‌లో ప్రముఖ తారాగణంతో పాటు దాదాపు వెయ్యి మంది జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. ఈ క్లైమాక్స్‌కే రూ. 8 కోట్లు ఖర్చు చేశాం. రామకృష్ణ యాక్షన్ కొరియోగ్రఫీని పర్యవేక్షించారు'' అని యూనిట్ పేర్కొంది.

కొందరు ఇండస్ట్రీని దోచుకుంటున్నారు

- నిర్మాత మల్కాపురం శివకుమార్



రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా హీరో హీరోయిన్లుగా, మన్నారా చోప్రా కీలక పాత్రలో నటించిన చిత్రం 'తిరగబడర సామీ'. ఏఎస్ రవికుమార్ దర్శకత్వంలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో శివకుమార్ మాట్లాడుతూ– ''మూడు ముళ్ళ బంధానికి భార్యాభర్తలు ఏ విధంగా కట్టుబడి ఉండాలనడానికి నిదర్శనమే 'తిరగబడర సామీ'. ఓ మామూలు కుర్రాడు ఏ పరిస్థితుల వల్ల వైలెంట్‌గా మారాడు? అనేది కథ. రాజ్ తరుణ్ – మాల్వీల వ్యక్తిగత అంశాలతో ఈ సినిమాకు సంబంధం లేదు. వాళ్లిద్దరి ప్రెజెన్స్‌తో ఓ ఈవెంట్ ప్లాన్ చేస్తున్నాం. జేడీ చక్రవర్తితో ఓ సినిమా ప్లానింగ్ ఉంది. 'తిరుమల బాలాజీ', 'రాహు కేతు' వెబ్ సిరీస్‌లతో పాటు ఓ హిందీ సినిమా చేస్తున్నాం'' అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''కొందరు సినిమా ఇండస్ట్రీని దోచుకుంటున్నారు. టికెట్ ధరలను తగ్గించి నిర్మాత జ్ఞానవేల్ రాజా ('బడ్డీ' సినిమా టికెట్ ధర తగ్గించడాన్ని ఉద్దేశించి) రిలీజ్ చేయడాన్ని సపోర్ట్ చేస్తున్నా. నా సినిమాలకు టికెట్ ధరలు పెంచను'' అని చెప్పుకొచ్చారు.

తెలుగు నేర్చుకుని మరీ...

ఉత్తరాది బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే అవలీలగా తెలుగు మాట్లాడారు. 'మిస్టర్ బచ్చన్' సినిమా ద్వారా ఆమె తెలుగు పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయమవుతున్నారు. ఈ సినిమాలోని తన పాత్రకి తానే డబ్బింగ్ చెప్పుకున్నారు. ఆమె మాతృభాష తెలుగు కాదు. అయినప్పటికీ కష్టపడి తెలుగు నేర్చుకొని తన పాత్రకు డబ్బింగ్ చెప్పి అందర్నీ సర్‌ప్రైజ్ చేశారామె. ఆమె అంకితభావం ప్రశంసనీయం అని చిత్రబృందం పేర్కొంది. రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. హరీష్ శంకర్ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ మూవీ ఆగస్టు 15న రిలీజ్ కానుంది.



భాగ్యశ్రీ

మన చరిత్ర తెలుస్తుంది

- అద్దంకి దయాకర్



అద్దంకి దయాకర్, బొమ్మకు మురళి

''ఇండియా ఫైల్స్' సినిమా చూస్తే అందరికీ మన చరిత్ర తెలుస్తుంది. మానవీయ కోణం అంటే ఏంటో కూడా ఈ సినిమాలో చూపించాం''అన్నారు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, నటుడు అద్దంకి దయాకర్. బొమ్మకు హిమమాల సమర్పణలో డా. బొమ్మకు మురళి స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'ఇండియా ఫైల్స్'. అద్దంకి దయాకర్, ఇంద్రజ, 'శుభలేఖ' సుధాకర్, సుమన్ ముఖ్య తారలుగా నటించారు. ఈ మూవీకి ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. కాగా సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ 'జై ఇండియా...' అనే పాటకి సంగీతం అందించి, పాడారు. ఈ పాట రిలీజ్ ఈవెంట్‌లో బొమ్మకు మురళి మాట్లాడుతూ– ''గద్దర్ అన్న ఇచ్చిన కథ 'ఇండియా ఫైల్స్'. మనిషి పుట్టుక నుండి ఇప్పటివరకు మన జీవన విధానంలో జరిగిన మార్పులు, సనాతన ధర్మం మన మధ్య ఎలా నడుస్తుంది? మన జీవితాన్ని ఎలా నడిపిస్తుంది? అనేది ఈ మూవీలో చెప్పాను'' అన్నారు. సంగీత దర్శకుడు రాజ్‌కిరణ్, గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీటీ

ఇది చూడొచ్చు

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే చిత్రాలు చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతున్న వాటిలో మలయాళ చిత్రం 'ఆడుజీవితం' (ది గోట్ లైఫ్) ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.

జీవితాన్ని చూపిస్తుంది



సినిమాలకు కథలు ఎలా వస్తాయి అనుకుంటే మనలో నుండే. సాధారణ మనుషుల నుండి అసాధారణ చరిత్రకారుల జీవన విధానమే మన సినిమా కథలకు మూలం. ముఖ్యంగా నేటి సమాజంలో జరుగుతున్న వాస్తవ విషయాలను కూడా వెండితెర మీద అసాధారణ రీతిలో ప్రతిబింబిస్తున్నారు మన వర్ధమాన దర్శకులు. ఆ కోవలో రిలీజైన సినిమానే బ్లెస్సీ దర్శకత్వం వహించిన 'ఆడుజీవితం'. ప్రముఖ మలయాళ నటుడు పృథ్వీరాజ్ నటించిన ఈ సినిమా ఓ కళాఖండమనే చెప్పాలి. కథ కన్నా ముందు కథానాయకుడి గురించి మాట్లాడుకోవడం చాలా ముఖ్యం. ఎవరైనా సినిమా పాత్రలో ఒదిగిపోవడానికి సాధ్యమైనంత వరకు ఆ పాత్రను ఆపాదించుకుంటారు. కాని ఈ సినిమా కథానాయకుడు పృథ్వీరాజ్ ఈ పాత్రకు ప్రాణం పోశాడు. కథాపరంగా కథానాయకుడు తన స్నేహితుడితో గల్ఫ్ ఎయిర్ పోర్టులో దిగుతాడు. వాళ్లిద్దరూ జీవనోపాధి కోసం ఓ ఏజెంట్ ద్వారా విదేశాలకు వెళతారు. అక్కడి భాష రాకపోవడం వల్ల ఒకడి మోసంతో ఇద్దరూ విడిపోయి ఎడారిలో పనివాళ్ళుగా మారి దుర్భర స్థితిలో మిగిలిపోతారు. తినడానికి తిండి లేక అతి హీన స్థితిలో అక్కడి నుండి తిరిగి ఎలా ఇండియా వస్తారు అన్నదే సినిమా. ముఖ్యంగా పృథ్వీరాజ్ ఈ సినిమాలో చూపించిన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్ సినిమా మొత్తానికి హైలైట్. కాస్త నిడివి ఎక్కువున్నా పృథ్వీరాజ్ తన నటనతో తనతో పాటు మనల్ని తీసుకువెళతాడు. సినిమా అంటే వినోదమే కాదు, వాస్తవానికి ప్రతీక అనేదానికి ఇదో మచ్చు తునక. సినిమాకి కథే కాదు సరైన కథానాయకుడు... ఇంకా సరిగ్గా చెప్పాలంటే పాత్రకి ప్రాణం పోసే పాత్రధారి దొరికినప్పుడు సినిమాని చూసినట్లుండదు, జీవితాన్ని చూసినట్లుంటుంది. మరి ఆ జీవితం చూడాలంటే హాట్ స్టార్‌లో స్ట్రీమ్ అవుతున్న 'ఆడుజీవితం' చూసేయండి.

- ఇంటూరు హరికృష్ణ

3 స్వాతంత్య్రం వచ్చాక ఒలింపిక్స్ క్రీడల్లో రెండు పతకాలు సాధించిన మూడో భారత ప్లేయర్ మనూ భాకర్. గతంలో రెజ్లర్ సుశీల్ కుమార్ (2008 బీజింగ్-కాంస్యం; 2012 లండన్-రజతం), షట్లర్ పీవీ సింధు (2016 రియో-రజతం; 2020 టోక్యో-కాంస్యం) ఈ ఘనత సాధించారు.

6 ఒలింపిక్స్ క్రీడల్లో పతకం గెలిచిన ఆరో భారతీయ షూటర్‌గా సరబ్‌జోత్ సింగ్ గుర్తింపు పొందాడు. గతంలో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్(డబుల్ ట్రాప్: రజతం-2004 ఏథెన్స్), అభినవ్ బింద్రా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: స్వర్ణం-2008 బీజింగ్), విజయ్ కుమార్ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్: రజతం-2012 లండన్), గగన్ నారంగ్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్: కాంస్యం-2012 లండన్), మనూ భాకర్ (2024 పారిస్: 2 కాంస్యాలు) ఈ ఘనత సాధించారు.

“ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలుస్తానని నేను అనుకోలేదు. ఈ అనుభూతి కొత్తగా ఉంది. దేశం తరఫున సాధ్యమైనన్ని ఎక్కువ పతకాలు గెలవాలని కోరుకుంటా. టోక్యోలో వైఫల్యం చూశాను కాబట్టి ఆ పతకాల విలువ ఏమిటో నాకు ఇప్పుడు ఇంకా బాగా అర్థమవుతోంది. ప్రస్తుతానికి మరో మెడల్ సాధించడం పట్ల చాలా ఆనందంగా ఉన్నా. తర్వాతి ఈవెంట్‌లో ఎలా ఆడతానో చెప్పలేను. నా శాయశక్తులా ప్రయత్నిస్తా. ఒకవేళ విఫలమైతే అభిమానులు నిరాశపడరనే అనుకుంటున్నా. నాపై కురుస్తున్న ఈ ప్రేమాభిమానులు ఇలాగే కొనసాగాలి. -మనూ భాకర్



మను మహారాణి

ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు నెగ్గిన తొలి భారత ప్లేయర్‌గా ఘనత

10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో కాంస్యం

సరబ్‌జోత్‌తో కలిసి మూడో స్థానం సొంతం

ఆగస్టు 2న మూడో ఈవెంట్ బరిలో మనూ భాకర్

పారిస్ వేదికగా మంగళవారం భారత మహిళా షూటర్ మనూ భాకర్ కొత్త చరిత్రను లిఖించింది. గతంలో ఏ భారత ప్లేయర్‌కూ సాధ్యంకాని ఘనతను మనూ సాధించి చూపించింది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా ఈ హరియాణా అమ్మాయి అద్భుతాన్ని ఆవిష్కరించింది. ఆదివారం మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం గెలిచిన 22 ఏళ్ల మనూ భాకర్... మంగళవారం అదే వేదికపై సహచరుడు సరబ్‌జోత్ సింగ్‌తో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. తద్వారా ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన భారత ప్లేయర్‌గా ఆమె చరిత్రకెక్కింది. తాను పోటీపడ్డ రెండు ఈవెంట్లలోనూ పతకాలు నెగ్గిన మనూకు మూడో పతకం సాధించే అవకాశం కూడా ఉంది. ఆగస్టు 2న ఆమె 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ క్వాలిఫయింగ్‌లో బరిలోకి దిగుతుంది. క్వాలిఫయింగ్‌లో రాణించి ఫైనల్‌కు చేరితే ఆగస్టు 3న మూడో పతకంపై మనూ గురి పెడుతుంది. పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత క్వాలిఫయింగ్‌లో త్రుటిలో ఫైనల్ స్థానాన్ని చేజార్చుకున్న సరబ్‌జోత్... మనూతో కలిసి 'మిక్స్‌డ్'లో కాంస్యం నెగ్గి కెరీర్‌లోనే చిరస్మరణీయ ప్రదర్శన నమోదు చేశాడు.

పారిస్: రెండు రోజుల క్రితం పతకం సాధించిన విశ్వాసంతో భారత మహిళా యువ షూటర్ మనూ భాకర్ మరోసారి అదరగొట్టింది. పూర్తి సంయమనంతో, చెక్కు చెదరని ఏకాగ్రతతో లక్ష్యం దిశగా బుల్లెట్‌లు సంధించిన మనూ ఈ క్రమంలో కొత్త చరిత్రలో భాగమైంది. స్వాతంత్య్రం వచ్చాక ఒలింపిక్స్ క్రీడల్లో ఏ భారతీయ క్రీడాకారుడు సాధించని ఘనతను మనూ అందుకుంది. ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి భారత ప్లేయర్‌గా మనూ భాకర్ రికార్డు నెలకొల్పింది. మంగళవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో మనూ భాకర్-సరబ్‌జోత్ సింగ్ (భారత్) జోడీ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. కాంస్య పతక మ్యాచ్‌లో మనూ-సరబ్‌జోత్ ద్వయం 16–10 పాయింట్ల తేడాతో జిన్ ఓయె-లీ వన్‌హో (దక్షిణ కొరియా) జోడీపై గెలిచింది. సోమవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో మనూ-సరబ్‌జోత్ 580 పాయింట్లతో మూడో స్థానంలో, జిన్ ఓయె-లీ వన్‌హో 579 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచి కాంస్య పతక పోరుకు అర్హత సాధించారు. తర్హాన్ సెవల్ ఇల్యాదా-యూసుఫ్ డికెచ్ (టర్కీ) జోడీ 582 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో... జొరానా అరునోవిచ్-దామిర్ మికెచ్ (సెర్బియా) ద్వయం 581 పాయింట్లతో రెండో ర్యాంక్‌లో నిలిచి స్వర్ణ-రజత పతక పోరుకు అర్హత పొందారు. మంగళవారం జరిగిన ఫైనల్లో జొరానా-దామిర్ ద్వయం 16–14తో తర్హాన్-యూసుఫ్ జంటను ఓడించి స్వర్ణ పతకాన్ని గెల్చుకుంది. తర్హాన్-యూసుఫ్ జోడీకి రజత పతకం లభించింది. 1900 పారిస్ ఒలింపిక్స్ అథ్లెటిక్స్‌లో బ్రిటిష్ ఇండియాకు ప్రాతినిధ్యం వహించిన నార్మన్ ప్రిచర్డ్ పురుషుల 200 మీటర్లు, 200 మీటర్ల హర్డిల్స్‌లో రెండు రజత పతకాలు సాధించాడు. అయితే ఈ ఘనత భారత్‌కు స్వాతంత్య్రం రాక ముందు నమోదైంది.

గత టోక్యో ఒలింపిక్స్‌లో సౌరభ్ చౌదరీతో కలిసి 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో బరిలోకి దిగిన మనూ భాకర్ క్వాలిఫయింగ్‌లో ఏడో స్థానంలో నిలిచి మెడల్ రౌండ్‌కు అర్హత పొందలేకపోయింది. అయితే ఈసారి సరబ్‌జోత్‌తో జత కట్టిన మనూ క్వాలిఫయింగ్‌లోనే కాకుండా కాంస్య పతక మ్యాచ్‌లోనూ నిలకడగా స్కోరు చేసి తన ఖాతాలో రెండో పతకాన్ని వేసుకుంది. మరోవైపు 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగం క్వాలిఫయింగ్‌లో 577 పాయింట్లతో తొమ్మిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందలేకపోయిన బాధను మర్చిపోయి సరబ్‌జోత్ 'మిక్స్‌డ్' ఈవెంట్‌లో గురి తప్పని లక్ష్యంతో పాయింట్లు సాధించి తన ఒలింపిక్ పతకం కలను నిజం చేసుకున్నాడు.

మిక్స్‌డ్ ఈవెంట్ పతక మ్యాచ్‌లో రెండు జోడీల్లో తొలుత 16 పాయింట్లు స్కోరు చేసిన జంటను విజేతగా ప్రకటిస్తారు. ఒక్కో అవకాశంలో రెండు జట్లలోని ఇద్దరేసి షూటర్లు లక్ష్యం దిశగా రెండు షాట్‌ల చొప్పున సంధిస్తారు. రెండు జోడీల్లో ఎక్కువ పాయింట్లు సాధించిన జంటకు 2 పాయింట్లు, తక్కువ స్కోరు చేసిన జోడీకి 0 పాయింట్లు కేటాయిస్తారు. 13 సిరీస్‌లపాటు జరిగిన కాంస్య పతక మ్యాచ్‌లో తొలి సిరీస్‌లో కొరియా జోడీ నెగ్గగా... ఆ తర్వాత వరుసగా నాలుగు సిరీస్‌లలో భారత జంట గెలిచి 8–2తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత ఆరో సిరీస్‌లో కొరియా ద్వయం... ఏడో సిరీస్‌లో భారత జోడీ పైచేయి సాధించాయి. ఎనిమిదో సిరీస్‌లో కొరియా గెలుపొందగా... తొమ్మిది, పది సిరీస్‌లను భారత జోడీ సొంతం చేసుకొని 14–6తో విజయానికి చేరువైంది. అయితే 11వ సిరీస్‌లో, 12వ సిరీస్‌లో కొరియా ద్వయం పైచేయి సాధించి ఆధిక్యాన్ని 10–14కి తగ్గించింది. అయితే 13వ సిరీస్‌లో మనూ-సరబ్‌జోత్ జోడీ 19.6 స్కోరు చేయగా... కొరియా జంట 18.5 స్కోరు సాధించింది. దాంతో భారత జంట మొదటగా 16 పాయింట్లను అందుకొని విజయంతోపాటు కాంస్య పతకాన్ని దక్కించుకుంది.



కాంస్య పతకాలతో మనూ భాకర్, సరబ్‌జోత్ సింగ్

“పతకం గెలవగానే నా మనసులో ఎన్నో చిన్ననాటి ఆలోచనలు వచ్చాయి. ఇన్నేళ్లుగా నాన్న, తాత నాకు అండగా నిలిచిన వైనం, తొలి రెండేళ్లు కోచింగ్ కోసం బస్సులో అంబాలాకు వెళ్లిన రోజులు గుర్తుకొచ్చాయి. ఈవెంట్‌కు ముందు రేంజ్‌లోకి అడుగు పెట్టే సమయంలో కొంత ఒత్తిడిని ఎదుర్కొన్నా. వ్యక్తిగత విభాగంలో వైఫల్యం తర్వాత నా కుటుంబసభ్యులు, కోచ్‌లు ఓదార్చి నాలో మళ్లీ స్ఫూర్తిని నింపారు. ఎక్కడ తప్పు జరిగిందో సరిదిద్దుకునే ప్రయత్నం చేశాను. నా విజయంలో ఆర్థిక పరంగా అండగా నిలిచిన భారత ప్రభుత్వ పాత్ర కూడా ఎంతో ఉంది.
-సరబ్‌జోత్ సింగ్

మనందరం గర్వపడే క్షణాలను మన షూటర్లు మళ్లీ అందించారు. మనూ, సరబ్‌జోత్‌లకు అభినందనలు. ఇద్దరూ చక్కటి ప్రదర్శన కనబర్చారు. భారత్ ఎంతో సంతోషిస్తోంది. -నరేంద్ర మోదీ, ప్రధానమంత్రి

వరుసగా రెండో ఒలింపిక్ పతకం సాధించడం మనూ భాకర్ నిలకడైన ప్రదర్శనను, అంకితభావాన్ని చూపిస్తోంది. కాంస్యం గెలిచిన మనూ, సరబ్‌జోత్‌లకు శుభాకాంక్షలు. వారు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలి. -ద్రౌపది ముర్ము, రాష్ట్రపతి

మనూ, సరబ్‌జోత్... గతంలో ఏ భారత జోడీ సాధించని ఘనతను మీరు అందుకున్నారు. షూటింగ్‌లో ఇది భారత్‌కు తొలి టీమ్ మెడల్. ఈ క్షణాలను ఆస్వాదించండి. -అభినవ్ బింద్రా

ఒలింపిక్స్‌లో కాంస్యం సాధించి మనూ, సరబ్‌జోత్ దేశం గర్వపడేలా చేశారు. ఇతర క్రీడాకారులకు మీ ప్రదర్శన స్ఫూర్తిగా నిలుస్తుంది.
-వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం



మనూ భాకర్



కాంస్య పతకం కోసం పోటీ జరిగిందిలా...

భారత్	పాయింట్లు	0	2	2	2	2	0	2	0	2	2	0	0	2	16
	మొత్తం స్కోరు	18.8	21.2	20.8	20.7	20.1	20.2	20,0	18.5	20.5	20.8	19.3	20.8	19.6	
మనూ భాకర్		10.2	10.7	10.4	10.7	10.5	10.0	10.6	8.3	10.0	10.5	9.6	10.6	9.4	
సరబ్‌జోత్		8.6	10.5	10.4	10.0	9.6	10.2	9.4	10.2	10.5	10.3	9.7	10.2	10.2	
కొరియా	పాయింట్లు	2	0	0	0	0	2	0	2	0	0	2	2	0	10
	మొత్తం స్కోరు	20.5	19.9	19.8	20.5	19.5	20.6	19.7	20.7	20.4	19.4	19.8	21.0	18.5	
జిన్ ఓయె		10.4	10.0	9.1	9.9	9.8	9.8	9.9	10.4	9.7	9.6	9.0	10.2	9.5	
లీ వన్‌హో		10.1	9.9	10.7	10.6	9.7	10.8	9.8	10.3	10.7	9.8	10.8	10.8	9.0	

'పిస్టల్'తో పంట పండించాడు!

పొలం నుంచి ఒలింపిక్ పోడియం వరకు రైతు బిడ్డ సరబ్‌జోత్ ప్రస్థానం

'కిసాన్ ద పుత్తర్ హై... దిల్ థోడా చడీ దా'... శనివారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో త్రుటిలో ఫైనల్ చేరే అవకాశం కోల్పోయిన తర్వాత సరబ్‌జోత్‌తో అతని తండ్రి జతీందర్ సింగ్ చెప్పిన మాట ఇది. 'రైతు బిడ్డవు నువ్వు...బేలగా మారిపోయి బాధపడవద్దు' అంటూ నాన్న స్ఫూర్తి నింపే ప్రయత్నం చేయగా... సరిగ్గా మూడు రోజుల తర్వాత ఆ బిడ్డ మళ్లీ తన తుపాకీని లక్ష్యంపై సరిగ్గా గురి పెట్టాడు. 'నా కొడుకు షూటింగ్‌ను చాలా ఇష్టపడ్డాడు. గత పదేళ్లుగా అందులో ఎంతో కష్టపడ్డాడు. గత ఈవెంట్‌లో ఫైనల్ అవకాశం కోల్పోయినప్పుడు అదే గుర్తు చేశాను. గతం మరిచి భవిష్యత్తుపై దృష్టి పెట్టమని చెప్పాను. ఆ నిరాశను దూరం చేసి అతను ఇప్పుడు ఒలింపిక్ పతకం గెలవడం చాలా గర్వంగా ఉంది' అని జతీందర్ సంతోషం వ్యక్తం చేశాడు.

నాన్న అండతో...

హరియాణా రాష్ట్రం అంబాలాలోని ధీన్ గ్రామం సరబ్‌జోత్ స్వస్థలం. ఐదు ఎకరాల వ్యవసాయదారుడు అయిన తండ్రి అక్కడి చాలా కుటుంబాల లాగే తన పెద్ద కొడుకు కూడా పొలంలో సహాయకారిగా ఉంటే చాలనుకున్నాడు. కానీ సరబ్‌జోత్ ఆలోచనలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. స్థానికంగా జరిగిన వేసవి శిబిరంలో కొంత మంది కుర్రాళ్ల చేతుల్లో ఉన్న ఎయిర్ గన్స్ అతడిని ఆకర్షించాయి. కాగితాలపై చిత్రించిన లక్ష్యాలను వారు కొడుతున్న తీరు మరింత ఇష్టాన్ని పెంచింది. కొన్నాళ్లకు ఆ శిబిరం ముగిసిపోయినా... ఆ టీనేజర్ మనసులో పిస్టల్ ముద్రించుకుపోయింది. దాంతో ధైర్యం చేసుకొని 13 ఏళ్ల ఆ కుర్రాడు తాను షూటింగ్ నేర్చుకుంటానంటూ తండ్రితో చెప్పేశాడు. ముందుగా సందేహించినా...ఆ తర్వాత తండ్రి తనను అంబాలాలోని షూటింగ్ అకాడమీలో చేర్పించాడు. అక్కడ ఓనమాలు నేర్పించిన కోచ్ అభిషేక్ రాణా ఇప్పటి వరకు కూడా కోచ్‌గా ఉంటూ సరబ్‌జోత్ ఒలింపిక్ పతక ప్రస్థానంలో కీలకపాత్ర పోషించడం విశేషం. ఆ వయసులోనే పొలంలో కష్టం చేసే అలవాటు ఉన్న ఆ అబ్బాయి తనకు సూపర్‌ఫిట్‌గా అనిపించాడని, నిర్విరామంగా గంటలకొద్దీ కదలకుండా నిలబడి సాధన చేసేవాడని రాణా గుర్తు చేసుకున్నాడు.



అలా మొదలై...

16 ఏళ్ల వయసులో తొలిసారి జాతీయ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో ఈ హరియాణా అబ్బాయి వెలుగులోకి వచ్చాడు. అప్పుడే అతను తన తండ్రి వద్ద తొలిసారి సొంతంగా కొత్త పిస్టల్ కొనివ్వమని అడిగే ధైర్యం చేశాడు. అదే సమయంలో నోట్లు రద్దు కారణంగా కొంత ఇబ్బందులు ఉన్నా... కొడుకు కోసం దాదాపు రూ. 2 లక్షలతో తండ్రి పిస్టల్ కొనిచ్చాడు. తనపై తండ్రి ఉంచిన నమ్మకాన్ని సరబ్‌జోత్ నిలబెట్టుకున్నాడు. తర్వాతి రెండేళ్ల పాటు ఆటలో మరింత రాటుదేలిన అతను 2019లో జర్మనీలో జరిగిన జూనియర్ వరల్డ్ కప్‌లో స్వర్ణం సాధించి అంతర్జాతీయ స్థాయిలో విజయాన్ని రుచి చూశాడు. అదే ఏడాది ఆసియా చాంపియన్‌షిప్‌లలో 2 స్వర్ణాలు, ఒక కాంస్యం సరబ్‌ను భారత్ నుంచి మంచి భవిష్యత్తు ఉన్న పిస్టల్ షూటర్లలో ఒకడిగా మార్చింది. రెండేళ్ల తర్వాత పెరూలోని లిమాలో జరిగిన జూనియర్ వరల్డ్ చాంపియన్‌షిప్‌లో రెండు స్వర్ణాలతో అతను ఆకట్టుకున్నాడు. ఇదే జోరులో వరల్డ్ కప్‌లో రెండు స్వర్ణాలు, ఆసియా క్రీడల్లో స్వర్ణ, రజతాలు సరబ్ ఖాతాలో చేరాయి. గత ఏడాది చాంగ్వాన్‌లో ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో పతకం గెలిచి ఒలింపిక్స్‌కు అర్హత సాధించినప్పుడే అతనిపై అంచనాలు పెరిగాయి. చివరకు అతను వాటిని నిలబెట్టుకున్నాడు.

లక్ష్యం చేరిన బుల్లెట్...

'నాకు వరల్డ్ కప్ విజయాలు అవసరం లేదు... వేరే ఇతర టోర్నీల్లో పతకాలు అవసరం లేదు... నాకు ఒలింపిక్స్ పతకం మాత్రమే కావాలి... గత ఎనిమిదేళ్లుగా నేను దీని గురించి కలగన్నాను... ఇప్పుడు నా గుండెల్లో ఒక రకమైన అగ్ని జ్వలిస్తోంది'... పారిస్ ఒలింపిక్స్‌కు వెళ్లే ముందు సరబ్‌జోత్ సింగ్ ఆత్మవిశ్వాసంతో చెప్పిన మాట ఇది. శనివారం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో పోటీ పడినప్పుడు కూడా అతను అంతే ఉత్సాహంగా కనిపించాడు. క్వాలిఫయింగ్‌లో జర్మనీ షూటర్ రాబిన్ వాల్టర్‌తో కలిసి 577 పాయింట్లతో సంయుక్తంగా ఎనిమిదో స్థానంలో నిలిచాడు. అయితే 10 పాయింట్ల షాట్‌లు వాల్టర్ కంటే ఒకటి తక్కువగా కొట్టడంతో అనూహ్యంగా ఫైనల్ చేరే అవకాశం చేజారింది. దాంతో ఆవేదనగా నిష్క్రమించిన అతను ఇప్పుడు మిక్స్‌డ్‌లో కాంస్యంతో ఆ భారం కాస్త దించుకున్నాడు. వేగంగా దూసుకెళ్లే కార్లు, పంజాబీ పాప్ సంగీతాన్ని ఇష్టపడే ఈ 23 ఏళ్ల షూటర్ తన ఇంట్లో, పరిసరాల్లో, సరదాగా ఆడే వీడియో గేమ్‌లపై కూడా ఒలింపిక్ రింగ్‌లను ఎల్‌ఈడీ లైట్లతో అలంకరించుకున్నాడు. వాటిని చూడగానే తన లక్ష్యం ఏమిటో, తాను పడిన శ్రమ ఏమిటో ఇవి పదే పదే గుర్తుకొస్తుందని, తన కలను నెరవేర్చుకోవాలనే పట్టుదలను పెంచడం కోసం ఇలా చేసినట్లు అతను చెప్పుకున్నాడు. ఇప్పుడు ఒలింపిక్ పతకం గెలుచుకున్న క్షణాన 'నేను ఎన్నో ఫాస్ట్ కార్లను అద్దెకు తీసుకొని నోయిడా సర్క్యూట్‌లో వేగంగా డ్రైవింగ్ చేశాను. ఇప్పుడు నా కోసం ఒకటి కొనుక్కుంటాను. అది ఎంతో వేగంగా దూసుకెళ్లాలంటే 3–4 సెకన్లలో 100 కిలోమీటర్ల వేగం అందుకోవాలి' అంటూ తన కోరికను అతను బయటపెట్టాడు.

-సాక్షి క్రీడా విభాగం



నేడు భారత క్రీడాకారుల షెడ్యూల్

బాక్సింగ్
మహిళల 75 కేజీల ప్రిక్వార్టర్స్: లవ్లీనా బొర్గొహైన్ x సునీవా హాఫ్‌స్టడ్ (నార్వే) (మధ్యాహ్నం గం. 3:50 నుంచి). పురుషుల 71 కేజీల ప్రిక్వార్టర్స్: నిశాంత్ దేవ్ x జోస్ గాబ్రియల్ రోడ్రిగ్జ్ (ఈక్వెడార్) (అర్ధరాత్రి గం. 12:18 నుంచి).

టేబుల్ టెన్నిస్
మహిళల సింగిల్స్ రెండో రౌండ్ మ్యాచ్: ఆకుల శ్రీజ x జియాన్ జెంగ్ (సింగపూర్) (మధ్యాహ్నం గం. 2:20 నుంచి).

బ్యాడ్మింటన్
మహిళల సింగిల్స్ గ్రూప్ లీగ్ మ్యాచ్: పీవీ సింధు x క్రిస్టిన్ కూబా (ఎస్తోనియా) (మధ్యాహ్నం గం. 12:50 నుంచి). పురుషుల సింగిల్స్ గ్రూప్ లీగ్ మ్యాచ్: లక్ష్యసేన్ x జొనాథన్ క్రిస్టీ (ఇండోనేసియా) (మధ్యాహ్నం గం. 1:40 నుంచి). పురుషుల సింగిల్స్ గ్రూప్ లీగ్ మ్యాచ్): హెచ్‌ఎస్ ప్రణయ్ x డక్ పాట్ లీ (వియత్నాం) (రాత్రి గం. 11:00 నుంచి).

ఆర్చరీ
మహిళల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: దీపిక x రీనా పర్నట్ (ఎస్తోనియా) (మధ్యాహ్నం గం. 3:56 నుంచి). పురుషుల వ్యక్తిగత 1/32 ఎలిమినేషన్ రౌండ్: తరుణ్‌దీప్ రాయ్ x టామ్ హాల్ (బ్రిటన్) (రాత్రి గం. 9:15 నుంచి).

షూటింగ్
50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ పురుషుల క్వాలిఫికేషన్ రౌండ్: ఐశ్వర్య ప్రతాప్ సింగ్ తోమర్, స్వప్నిల్ (మధ్యాహ్నం గం. 12:30 నుంచి). మహిళల ట్రాప్ క్వాలిఫికేషన్ రౌండ్: శ్రేయసి సింగ్, రాజేశ్వరి కుమారి (మధ్యాహ్నం గం. 12:30 నుంచి).

ఈక్వెస్ట్రియన్
డ్రెసాజ్ వ్యక్తిగత గ్రాండ్ ప్రి: అనూష్ అగర్వల్లా (మధ్యాహ్నం గం. 1:30 నుంచి).



మనిక బత్రా సంచలనం

పారిస్ ఒలింపిక్స్‌లో భారత స్టార్ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్ మనిక బత్రా సంచలనం సృష్టించింది. మహిళల సింగిల్స్‌లో ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లి విశ్వ క్రీడల్లో ఈ ఘనత సాధించిన తొలి భారత టీటీ ప్లేయర్‌గా రికార్డుల్లోకెక్కింది. రెండో రౌండ్ మ్యాచ్‌లో 29 ఏళ్ల మనిక 11–9, 11–6, 11–9, 11–7తో ప్రపంచ 18వ ర్యాంకర్, భారత సంతతికి చెందిన ఫ్రాన్స్ క్రీడాకారిణి ప్రీతిక పవాడెపై విజయం సాధించింది. 1988 ఒలింపిక్స్ నుంచి టీటీని విశ్వక్రీడల్లో భాగం చేయగా.. అప్పటి నుంచి ప్రతీసారి భారత్ ప్రాతినిధ్యం వహించింది. ఇప్పటి వరకు 9 ఒలింపిక్స్‌ల్లో పాల్గొన్న మన టీటీ ప్లేయర్లు ఎవరూ సాధించలేని ఘనత మనిక సొంతం చేసుకుంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	99	81,455
నిఫ్టీ ▲	21	24,857

విదేశీ సూచీలు (తొలి సెషన్ రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	17,131	▽ 239
డోజోన్స్	40,646	▲ 106
ఎఫ్‌టీఎస్ఈ 100	8,274	▽ 18
డాక్స్	18,411	▲ 91
షాంఘై	2,879	▽ 13
నికాయ్	38,526	▲ 57

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్లు)	67,310
బంగారం (22 క్యారెట్లు)	64,100
వెండి (కిలో)	89,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	83.33	84.35
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	106.47	109.04
€	యూరో	ఎస్‌బీఐ	89.53	91.90
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	53.82	55.01
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.95	55.88
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	60.00	64.69
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.66	12.48

మాజీ సైనికులకు కార్పొరేట్ 'సెల్యూట్'!



రక్షణ దళాల్లో పనిచేసి రిటైర్ అయిన మాజీ సైనికోద్యోగులకు కార్పొరేట్ కంపెనీలు రారమ్మంటూ రెడ్ కార్పెట్ వేస్తున్నాయి. ఎలాంటి విపత్కర పరిస్థితుల్లోనైనా అలవోకగా పని చేసే శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, ప్రాజెక్టుల అమలులో కచ్చితత్వం వంటి ప్రత్యేక నైపుణ్యాలను ఉపయోగించుకోవడంపై ఫోకస్ చేస్తున్నా యి. కొన్ని విభాగాల్లో నిపుణుల కొరతను అధిగమిస్తున్నాయి.

– సాక్షి, బిజినెస్ డెస్క్

- రక్షణ దళాల మాజీ సిబ్బందికి కంపెనీల రెడ్ కార్పెట్
- నిపుణుల కొరతకు చెక్
- శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ బలం
- జాబితాలో టాటా, రిలయన్స్, మారుతీ, ఓఎన్‌జీసీ తదితర దిగ్గజాలు

దేశంలో మాజీ సైనికుల వెంట పడుతున్న టాప్ కంపెనీలు, బడా కార్పొరేట్ సంస్థల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. అతిపెద్ద కార్పొరేట్ కంపెనీ రిలయన్స్ ఇండస్ట్రీస్ గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఏకంగా 2,000 మంది మాజీ సైనికోద్యోగులను నియమించుకుంది. అంత క్రితం ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్య మూడో వంతు ఎక్కువ. దీంతో ఈ కంపెనీ మొత్తం ఉద్యోగుల్లో రక్షణ దళాల మాజీ సిబ్బంది 7,500 మందికి ఎగబాకారు. ఇంత భారీ సంఖ్యలో ఎక్స్-సర్వీస్‌మెన్ ఉన్న కంపెనీగా కూడా రిలయన్స్ రికార్డు సృష్టించింది. పరిశ్రమ వర్గాల సమాచారం ప్రకారం టాటా గ్రూప్ కంపెనీలు, మారుతీతో పాటు అదానీ గ్రూప్, ఆర్‌పీజీ గ్రూప్, వేదాంత, సొడెక్సో, ప్రభుత్వ రంగ ఓఎన్‌జీసీ వంటి సంస్థలు సైతం మాజీ సైనిక సిబ్బందిని నియమించుకుంటున్న జాబితాలో టాప్‌లో ఉన్నాయి.

ఏటా 60,000 మంది పదవీ విరమణ...

త్రివిధ దళాల్లో (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఏటా పదవీ విరమణ చేస్తున్న రక్షణ సిబ్బంది సంఖ్య దాదాపు 55,000-60,000 వరకు ఉంటుందని అంచనా. వీరిలో ఆఫీసర్ ర్యాంకుల్లో ఉన్నవారు 1,200-1,300 (సుమారు 2%) మంది వరకు ఉంటారు. అంతేకాకుండా, 50 ఏళ్లు పైబడిన చాలా మంది అధికారులు స్వచ్ఛందంగా రిటైర్ అయ్యేందుకు మొగ్గు చూపుతుండటం విశేషం. ఇలా వైదొలగుతున్న వారిలో ఎక్కువగా రిలయన్స్, అదానీ, ఎల్అండ్ టీ, టాటా గ్రూప్ వంటి బడా కార్పొరేట్ కంపెనీల్లో హెచ్ఆర్, అడ్మిన్, సరఫరా వ్యవస్థలు ఇతర త్రా విధుల్లో చేరుతున్నారని త్రివిధ దళాల మాజీ సైనికుల సంక్షేమ సంఘం చీఫ్ మెంటార్, పూర్వ అధ్యక్షుడు కమోడోర్ సుధీర్ పరకాల చెబుతున్నారు. సరుకు రవాణా (లాజిస్టిక్స్), ఈ-కామర్స్, వేర్-హౌసింగ్ పరిశ్రమతో పాటు ఆటోమొబైల్, తయారీ, విద్యుదుత్పత్తి, టెలికం వంటి రంగాల్లో ఎక్స్-సర్వీస్‌మెన్‌కు దండిగా అవకాశాలు లభిస్తున్నాయి. ఇంజినీరింగ్, మెషీన్ విభాగాలు, అడ్మినిస్ట్రేషన్ విధుల్లో ఎక్కువగా నియమించుకుంటున్నాయి.

ప్రత్యేక సామర్థ్యాలు ప్లస్...

మాజీ సైనికోద్యోగులకు అత్యుత్తమ ఫిట్‌నెస్‌కు తోడు క్రమశిక్షణ వంటి ప్రత్యేకతల కారణంగా సంస్థకు అదనపు బలం చేకూరుతోందని రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టులను పక్కాగా అమలు చేసే సామర్థ్యం, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించే నైపుణ్యాలు, ప్రతికూల ప్రదేశాలను తట్టుకుని పని చేసే ధైర్య సాహసాలు... కంపెనీలు ఏరికోరి మరీ వారిని నియమించుకునేలా చేస్తున్నాయన్నారు. దీనివల్ల వైవిధ్యంతో పాటు కొన్ని విభాగాల్లో నిపుణుల కొరత కూడా తీరుతుందనేది హైరింగ్ నిపుణుల మాట. 'రక్షణ దళాల్లో ఏళ్ల తరబడి పని చేసేటప్పుడు అలవడిన క్రమశిక్షణ, వారికి ఇచ్చే కఠోర శిక్షణ కారణంగా మాజీ సైనిక సిబ్బందికి ప్రత్యేక సామర్థ్యాలు అలవడతాయి. ముఖ్యంగా సమస్యల పరిష్కార తీరు, టీమ్ వర్క్, మల్టీ టాస్కింగ్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ వంటి విషయాల్లో వారు ఆరితేరి ఉంటారు. అందుకే టాటా, ఆదిత్య బిర్లా, రిలయన్స్, ఎల్అండ్‌టీ, వేదాంత గ్రూప్ వంటి బడా కార్పొరేట్లు మాజీ సైనికుల హైరింగ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నాయి' అని సియెల్ హెచ్ఆర్ అంటోంది.

ఓఎన్‌జీసీ: కంపెనీ నిబంధనల మేరకు మాజీ సైనికోద్యోగులకు ఎగ్జిక్యూటివ్ స్థాయి నియామకాల్లో 5 ఏళ్ల వయో సడలింపును ప్రకటించింది.

రిలయన్స్: గత ఆర్థిక సంవత్సరంలో 2,000 మంది మాజీ సైనికులను నియమించుకుంది. ఈ సంఖ్య 7,500కు చేరింది.

వేదాంత: రక్షణ దళాల మాజీ సిబ్బంది నియామకం కోసం 2023-24లో ప్రత్యేక పాలసీ చర్యలు చేపట్టింది.

క్వాల్‌కామ్ చౌక 5జీ ఫోన్ చిప్‌సెట్

రూ. 8 వేల లోపునకు ఎంట్రీ లెవెల్ ఫోన్ల ధర



న్యూఢిల్లీ: 5జీ స్మార్ట్‌ఫోన్ల ధరలను మరింత తగ్గించేందుకు తోడ్పడేలా భారత మార్కెట్ కోసం ప్రత్యేకంగా స్నాప్‌డ్రాగన్ 4ఎస్ జెన్2 చిప్‌సెట్‌ను ప్రవేశపెట్టినట్లు క్వాల్‌కామ్ వెల్లడించింది. ఎంట్రీ లెవెల్ స్థాయి హ్యాండ్‌సెట్ల కోసం డిజైన్ చేసిన ఈ చిప్‌తో స్మార్ట్‌ఫోన్ల ధరలు 99 డాలర్ల (సుమారు రూ.8,300) లోపు స్థాయికి తగ్గే అవకాశం ఉందని 'స్నాప్‌డ్రాగన్ ఫర్ ఇండియా' కార్యక్రమంలో కంపెనీ తెలిపింది. ఐడీసీ డేటా ప్రకారం ప్రస్తుతం దేశీయంగా అత్యంత తక్కువకు లభించే 5జీ ఫోన్ రేటు రూ. 9,999గా ఉంది. ఈ చిప్‌సెట్‌ను ముందుగా షావోమీ తదితర బ్రాండ్లు ఉపయోగించనున్నట్లు క్వాల్‌కామ్ తెలిపింది. ఇతర సంస్థలతో కూడా చర్చలు జరుగుతున్నాయని వివరించింది. ఈ చిప్‌సెట్‌తో తయారు చేసే తొలి డివైజ్‌ను ఈ ఏడాది ఆఖరు నాటికి ప్రకటించే అవకాశం ఉందని తెలిపింది. దీన్ని భారత మార్కెట్ కోసం దేశీయంగా డిజైన్ చేసి, అభివృద్ధి చేసినట్లు క్వాల్‌కామ్ ఇండియా ప్రెసిడెంట్ సవీ సోయిన్ తెలిపారు. కార్యక్రమం సందర్భంగా భారత మార్కెట్ కోసం ఉద్దేశించిన స్నాప్‌డ్రాగన్ ఎక్స్ సిరీస్ చిప్‌సెట్లను కంపెనీ ఆవిష్కరించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
పసిడి డిమాండ్‌కు ధరల చెక్ | 4 ఐపీవోలకు సెబీ గ్రీన్‌సిగ్నల్

గ్లోబల్ ఇన్వెస్టర్ల చూపు.. భారత్ వైపు!



ఈ సువర్ణావకాశాన్ని వదులుకోవద్దు.. ● భారత కార్పొరేట్లకు ప్రధాని మోదీ పిలుపు

న్యూఢిల్లీ: వచ్చే ఐదేళ్లలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించేలా భారత్ పరుగులు తీస్తోందని.. దీంతో ప్రపంచ స్థాయి దిగ్గజ ఇన్వెస్టర్లందరూ భారత్‌లో పెట్టుబడులకు ఉవ్విళ్లూరుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. భారత కార్పొరేట్లు ఈ 'వికసిత్ భారత్' ప్రస్థానంలో సువర్ణావకాశాన్ని అందిపుచ్చుకోవాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. బడ్జెట్ తదనంతరం భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)తో ఏర్పాటు చేసిన 'వికసిత్ భారత్ దిశగా పయనం' సదస్సునుద్దేశించి మోదీ ప్రసంగించారు. 'నేడు ప్రపంచమంతా భారత్ వృద్ధితో పాటు మీ (పారిశ్రామిక వర్గాలు) వైపే చూస్తోంది. ప్రపంచ ప్రగతికి భారత్ మూల స్తంభంగా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు భారత్‌లో పెట్టుబడి పెట్టేందుకు సంసిద్ధంగా ఉన్నారు. ప్రపంచ నాయకుల్లో సైతం భారత్ పట్ల పూర్తి ఆశావాదం నెలకొంది. భారతీయ పారిశ్రామిక రంగానికి ఇదో సువర్ణావకాశం, దీన్ని మనం వదులుకోకూడదు' అని మోదీ చెప్పారు.

వృద్ధి జోరు.. ధరలకు కళ్లెం

ప్రపంచమంతా అధిక ద్రవ్యోల్బణం, వృద్ధి మందగమనంతో పాటు భౌగోళిక రాజకీయ సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో వృద్ధి జోరు ద్రవ్యోల్బణానికి కళ్లెం వేయడం ద్వారా భారత్ వృద్ధి, స్థిరత్వాలకు దిక్సూచిగా నిలుస్తోందని ప్రధాని పేర్కొన్నారు. భారత్ ఇప్పుడు 8 శాతం జీడీపీ వృద్ధితో పురోగమిస్తోంది. దీన్ని ప్రకారం చూస్తే, ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో ప్రస్తుత ఐదో స్థానం నుంచి మూడో ర్యాంకుకు చేరుకునే రోజు ఎంతో దూరంలో లేదన్నారు. ఈ ఘనతను తన మూడో విడత హయాంలోనే సాధిస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. '5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం, సంతృప్త స్థాయి విధానం, జీరో ఎఫెక్ట్-జీరో డిఫెక్ట్, ఆత్మనిర్భర్ భారత్ లేదా వికసిత్ భారత్ ప్రతిజ్ఞ అనేవి నేషన్ ఫస్ట్ విషయంలో మా నిబద్ధతకు నిదర్శనం' అని మోదీ వ్యాఖ్యానించారు. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా, వర్ధమాన రంగాల్లో ప్రపంచ శక్తిగా నిలిపేందుకు దేశీ పారిశ్రామిక రంగం ప్రభుత్వంతో పోటీ పడాలని చెప్పారు.

ఉద్యోగ కల్పనపైనే బడ్జెట్లో దృష్టి...

కోట్లాదిగా ఉద్యోగాలిచ్చే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్ఎంఈ)ను ప్రోత్సహించేందుకు బడ్జెట్లో పలు చర్యలు తీసుకున్నామని మోదీ గుర్తు చేశారు. ఇండస్ట్రీ 4.0 ప్రమాణాల మేరకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగాల కల్పనపైనే ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించిందన్నారు. భారత్ 1.4 లక్షల స్టార్టప్‌లకు నిలయం. లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా వంటి స్కీమ్‌లతో 8 కోట్ల మంది కొత్త వ్యాపారాలను మొదలుపెట్టారని చెప్పారు. 4 కోట్ల మంది యువతకు మేలు చేకూర్చేలా రూ.2 లక్షల కోట్లతో పీఎం ప్యాకేజీని బడ్జెట్లో ప్రకటించామన్నారు. దేశంలోని 100 జిల్లాల్లో పెట్టుబడులకు సిద్ధంగా ఉండే ఇన్వెస్ట్‌మెంట్ పార్కులను నెలకొల్పనున్నామని, ఈ 100 నగరాలు వికసిత్ భారత్‌లో నయా కేంద్రాలుగా ఆవిర్భవించనున్నట్లు ప్రధాని తెలిపారు.

ఐవోసీ లాభం పతనం

క్యూ1లో రూ. 2,643 కోట్లకు పరిమితం



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐవోసీ) నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 81 శాతం పడిపోయి రూ. 2,643 కోట్లకు పరిమితమైంది. రిఫైనరీ, మార్కెటింగ్ మార్జిన్లు క్షీణించడానికితోడు, తక్కువ ధరల్లో ఎల్‌పీజీ అమ్మకాలు(అండర్ రికవరీ) ప్రభావం చూపింది. గతేడాది(2023-24) ఇదే కాలంలో రూ. 13,750 కోట్లకుపైగా ఆర్జించింది. ఈ కాలంలో రూ. 5,156 కోట్లమేర ఎల్‌పీజీ సబ్సిడీ అందలేదని కంపెనీ పేర్కొంది. మొత్తం ఆదాయం దాదాపు ఫ్లాట్‌గా రూ. 2.15 లక్షల కోట్లుగా నమోదైంది. ప్రతీ బ్యారల్ చమురు శుద్ధిపై స్థూల మార్జిన్లు(జీఆర్ఎం) 6.39 డాలర్లుగా నమోదయ్యాయి. గత క్యూ1లో 8.34 జీఆర్ఎం సాధించింది.

ఫలితాల నేపథ్యంలో ఐవోసీ షేరు 1.6% లాభంతో రూ. 183 వద్ద ముగిసింది.

మూడోరోజూ ముందుకే..

అమ్మకాల ఒత్తిడితో సూచీల లాభాలు పరిమితం



ముంబై: ఇంధన, ఆటో షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు మూడో రోజూ ముందడుగేశాయి. సెన్సెక్స్ 99 పాయింట్లు పెరిగి 81,455 వద్ద, నిఫ్టీ 21 పాయింట్లు లాభపడి 24,857 వద్ద జీవితకాల గరిష్టస్థా యిలో ముగిశాయి. అమెరికా ఫెడ్ పాలసీ నిర్ణయాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ఫ్లాట్‌గా మొదలైన సూచీలు ప్రథమార్ధంతా పరిమిత శ్రేణిలో కదలాడాయి. మిడ్ సెషన్ తర్వాత అమ్మకాల ఒత్తిడి నుంచి తేరుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 459 పాయింట్లు బలపడి 81,815 వద్ద, నిఫ్టీ 136 పాయింట్లు ఎగసి 24,972 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. చివర్లో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడడంతో పరిమిత లాభాలతో ముగిశాయి. మూడు రోజుల జోరుతో రూ.3.98 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్ఈలోని లిస్టెడ్ కంపెనీల మొత్తం విలువ ఆల్‌టైం ఆల్‌టైం హై రూ. 460.91 లక్షల కోట్లకు చేరింది.

సాక్షి స్పోర్ట్స్



7 నెలల గర్భవతిగా ఫెన్సింగ్ బరిలోకి దిగి...

ఈజిప్ట్ ఫెన్సర్ నదా హాఫెజ్ ప్రిక్వార్టర్ ఫైనల్ వరకు వెళ్లడంతో సఫలమైంది. గతంలో రెండుసార్లు ఒలింపిక్స్ బరిలోకి దిగి విఫలమైన ఆమె తన మూడో ప్రయత్నంలో పారిస్ ఒలింపిక్స్‌లో అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. అయితే ఇందులో విశేషం ఏమీ లేదు. కానీ నదా ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి! ఇలాంటి స్థితిలో ఆమె ఫెన్సింగ్ సాబెర్ ఈవెంట్‌లో పోటీ పడింది. మెడిసిన్‌లో డిగ్రీ చదవడంతో పాటు జిమ్నాస్ట్ కూడా అయిన నదా ఆఫ్రికా క్రీడల్లో చాంపియన్. ఒలింపిక్స్ ప్రిక్వార్టర్స్‌లో ఓటమి తర్వాత ఆమె ఈ విషయాన్ని వెల్లడించింది. 'నా కడుపులో ఒక చిన్న ఒలింపియన్ కూడా పెరుగుతోంది. నేను, నా పాప శారీరకంగా, మానసికంగా ఒకే రకమైన సవాల్‌ను ఎదుర్కొన్నాం. గర్భవతిగా ఉండి ఇలా ఆడటం చాలా కష్టమైన విషయం. అయితే జీవితాన్ని, ఆటను సమంగా చూడగలిగినందుకు నేను సంతోషంగా ఉన్నా. ప్రిక్వార్టర్స్ వరకు చేరడం పట్ల గర్వపడుతున్నా' అని నదా సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

భారత హాకీ జట్టుకు రెండో విజయం

ఐర్లాండ్‌పై గెలుపుతో క్వార్టర్ ఫైనల్‌కు చేరువ



పారిస్: గత ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించి... పూర్వవైభవాన్ని గుర్తు చేసిన భారత పురుషుల హాకీ జట్టు.. 'పారిస్' గేమ్స్‌లోనూ అదే జోరు కొనసాగిస్తోంది. పూల్ 'బి'లో భాగంగా మంగళవారం జరిగిన పోరులో హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలోని భారత హాకీ జట్టు 2-0తో ఐర్లాండ్‌ను ఓడించింది. ఇప్పటి వరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలు, ఒక 'డ్రా' నమోదు చేసుకున్న టీమిండియా 7 పాయింట్లతో క్వార్టర్ ఫైనల్‌కు చేరువైంది. మంగళవారం ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (13వ, 19వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో సత్తా చాటాడు. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు 9 పెనాల్టీ కార్నర్ అవకాశాలు రాగా.. అందులో కేవలం ఒక్క దాన్ని మాత్రమే గోల్‌గా మలచగలిగింది. మరోవైపు ఐర్లాండ్ 10 పెనాల్టీ కార్నర్‌లను వృథా చేసింది. తొలి రెండు క్వార్టర్స్‌లో ఒక్కో గోల్ చేసిన టీమిండియా... ద్వితీయార్ధంలో గోల్ కొట్టలేకపోయింది. మన డిఫెండర్లు మెరుగైన ప్రదర్శన కనబర్చగా.. గోల్ కీపర్ శ్రీజేశ్ అడ్డుగోడలా నిలిచి ప్రత్యర్థి ప్రయత్నాలను భగ్నం చేశాడు. గ్రూప్‌లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిన ఐర్లాండ్ నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది. రెండు గ్రూప్‌ల్లో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్స్‌కు చేరుతాయి. తదుపరి మ్యాచ్‌లో గురువారం బెల్జియంతో భారత్ తలపడనుంది.

అమిత్, జైస్మిన్ అవుట్



పారిస్ ఒలింపిక్స్‌లో భారత బాక్సర్లు నిరాశ పరిచారు. పురుషుల 51 కేజీల విభాగంలో తొలి రౌండ్‌లో 'బై' దక్కించుకున్న అమిత్ పంఘాల్ మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 1-4తో పాట్రిక్ చిన్‌యెంబా (జాంబియా) చేతిలో ఓటమి చవిచూశాడు. టోక్యో ఒలింపిక్స్‌లోనూ బరిలోకి దిగిన తొలి బౌట్‌లోనే నిష్క్రమించిన అమిత్ ఈసారి కూడా అదే ప్రదర్శన పునరావృతం చేశాడు. మహిళల 57 కేజీల విభాగం తొలి రౌండ్‌లో జైస్మిన్ (భారత్) 0-5తో నెస్టీ పెటిసియో (ఫిలిప్పీన్స్) చేతిలో ఓడిపోయింది.

గ్రూప్ 'టాపర్'గా సాత్విక్-చిరాగ్ జోడీ



భారీ అంచనాలతో విశ్వక్రీడల బరిలోకి దిగిన సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జంట.. అందుకు తగ్గట్లే వరుస విజయాలతో గ్రూప్ టాపర్‌గా నిలిచింది. బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ గ్రూప్ 'సి' మ్యాచ్‌లో మూడో సీడ్ సాత్విక్-చిరాగ్ జోడీ 38 నిమిషాల్లో 21-13, 21-13తో ఫజర్-రియాన్ (ఇండోనేసియా) జంటపై విజయం సాధించింది. ఇప్పటికే క్వార్టర్ ఫైనల్ బెర్త్‌లు ఖరారు చేసుకున్న ఈ రెండు జోడీలు గ్రూప్ విజేత స్థానం కోసం పోటీ పడ్డాయి. గ్రూప్ దశలో మిగిలిన మ్యాచ్‌లు ముగిసిన అనంతరం బుధవారం క్వార్టర్ ఫైనల్ 'డ్రా' విడుదల కానుంది. ఇక మహిళల డబుల్స్ గ్రూప్ 'సి'లో అశ్విని పొన్నప్ప-తనీషా క్రాస్టో జంట వరుసగా మూడో పరాజయంతో ఒలింపిక్స్ నుంచి విజయం లేకుండానే నిష్క్రమించింది. చివరి లీగ్ మ్యాచ్‌లో అశ్విని-తనీషా జంట 15-21, 10-21తో మాపసా-ఏంజెలా (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో ఓడింది. కాగా, ఇవే తన చివరి ఒలింపిక్ క్రీడలని 34 ఏళ్ల అశ్విని పొన్నప్ప ప్రకటించింది.

పతకాల పట్టిక



ర్యాంక్	దేశం	స్వ	ర	కాం	మొ
1	జపాన్	7	2	4	13
2	చైనా	6	6	2	14
3	ఫ్రాన్స్	5	8	4	17
4	ఆస్ట్రేలియా	5	4	0	9
5	దక్షిణ కొరియా	5	3	3	11
6	అమెరికా	4	8	10	22
7	బ్రిటన్	3	5	3	11
32	భారత్	0	0	2	2

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం. స్వర్ణాల సంఖ్య ఆధారంగా ర్యాంక్ వరుస క్రమాన్ని నిర్ణయిస్తారు.

రెండో రౌండ్‌లోనే ధీరజ్ ఓటమి



పారిస్ ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. ఇప్పటికే పురుషుల టీమ్ విభాగంలో ఆకట్టుకోలేకపోయిన ధీరజ్.. వ్యక్తిగత విభాగంలో హోరాహోరీగా పోరాడి వెనుదిరిగాడు. మంగళవారం పురుషుల తొలి రౌండ్‌లో ధీరజ్ 7-1తో ఆడమ్ లీ (చెక్ రిపబ్లిక్)పై గెలిచాడు. అనంతరం రెండో రౌండ్‌లో చివరి వరకు పోరాడిన ధీరజ్ 5-6తో ఎరిక్ పీటర్స్ (కెనడా) చేతిలో ఓడాడు. ఐదు సెట్‌ల తర్వాత ఇద్దరూ 5-5తో సమంగా నిలిచారు. దాంతో 'షూట్ ఆఫ్' నిర్వహించారు. 'షూట్ ఆఫ్'లో ఇద్దరూ 10 పాయింట్లు స్కోరు చేశారు. అయితే ధీరజ్ కొట్టిన బాణం కంటే కెనడా ప్లేయర్ కొట్టిన బాణం కేంద్ర బిందువుకు సమీపంగా ఉండటంతో కెనడా ప్లేయర్‌ను విజేతగా ప్రకటించారు. మహిళల విభాగంలో భారత్ ఆర్చర్ భజన్ కౌర్ ప్రిక్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. తొలి రౌండ్‌లో భజన్ 7-3తో సిఫా (ఇండోనేసియా)పై గెలిచింది. అనంతరం రెండో రౌండ్‌లో 6-0తో మజర్ (పోలాండ్)పై నెగ్గింది. భారత్‌కే చెందిన అంకిత తొలి రౌండ్‌లో 4-6తో వియోలెటా (పోలాండ్) చేతిలో ఓడిపోయింది.

భారత్ 'సూపర్' క్లీన్‌స్వీప్



- రింకూ సింగ్, సూర్యకుమార్ స్పిన్ మ్యాజిక్‌తో మ్యాచ్ 'టై'
- సూపర్ ఓవర్లో టీమిండియా గెలుపు
- చేజేతులా ఓడిన శ్రీలంక
- 2 నుంచి వన్డే సిరీస్

పల్లెకెలె: భారత్ బ్యాటింగ్‌లో మాత్రమే చెత్తగా ఆడింది. కానీ శ్రీలంక మొత్తానికే చెత్త చెత్తగా ఆడి చేజేతులా ఓడింది. మరోవైపు ఓటమి ఖాయమైన మ్యాచ్‌లో టీమిండియా సూపర్ ఓవర్లో గెలిచి టి20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. చివరిదైన మూడో టి20 మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. శుబ్‌మన్ గిల్ (37 బంతుల్లో 39; 3 ఫోర్లు) కుదురుగా ఆడాడు. తీక్షణ 3, హసరంగ 2 వికెట్లు తీశారు. అనంతరం సులువైన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన శ్రీలంక కూడా సరిగ్గా 20 ఓవర్లలో 8 వికెట్లు 137 పరుగులే చేయడంతో మ్యాచ్ టై అయ్యింది. కుశాల్ పెరీరా (34 బంతుల్లో 46; 5 ఫోర్లు), కుశాల్ మెండిస్ (41 బంతుల్లో 43; 3 ఫోర్లు) రాణించారు. వాషింగ్టన్ సుందర్ వేసిన సూపర్ ఓవర్లో శ్రీలంక 3 బంతులాడి 2 వికెట్లు కోల్పోయి 2 పరుగులే చేసింది. 3 పరుగుల లక్ష్యాన్ని తొలి బంతికే బౌండరీతో భారత్ అధిగమించింది. రెండు జట్ల మధ్య మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆగస్టు 2న మొదలవుతుంది.

డ్రామా మొదలైందిక్కడే...

లంక 15 ఓవర్లలో 108/1 స్కోరు చేసింది. చేతిలో 9 వికెట్లున్న లంక 30 బంతుల్లో 30 పరుగులు చేస్తే సరిపోతుంది. రవి బిష్ణోయ్ 16వ ఓవర్లో కుశాల్ మెండిస్‌ను అవుట్ చేస్తే, 17వ ఓవర్లో సుందర్... హసరంగ (3), అసలంక (0)లను పెవిలియన్ చేర్చాడు. 18వ ఓవర్లో ఏకంగా 11 బంతులేసిన ఖలీల్ 12 పరుగులిచ్చాడు. 12 బంతుల్లో 9 పరుగుల సమీకరణం లంకకే అనుకూలంగా ఉండగా... రింకూ సింగ్ 19వ ఓవర్లో 3 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. ప్రధాన బౌలర్ సిరాజ్‌ను పక్కనబెట్టి ఆఖరి ఓవర్ వేసిన సూర్యకుమార్ 2 వికెట్లు తీసి 5 పరుగులే ఇచ్చాడు. అంతే మ్యాచ్ 'టై' అయ్యింది.

నిర్లక్ష్యంగా బ్యాటింగ్

ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ఒకవేళ విఫలమైనుంటే భారత్ వంద పరుగులు కూడా దాటేది కాదు. ఎందుకంటే అప్పటికే యశస్వి జైస్వాల్ (10), సంజూ సామ్సన్ (0), రింకూ సింగ్ (1) అవుటవడంతో 14 పరుగులకే 3 వికెట్లు, కాసేపటికే కెప్టెన్ సూర్యకుమార్ (8), శివమ్ దూబే (13) పెవిలియన్ చేరడంతో 48కే సగం వికెట్లు కూలాయి. ఈ దశలో గిల్... రియాన్ పరాగ్ (18 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో కలిసి జట్టు స్కోరును 100 పరుగులు దాటించాడు. తర్వాత వాషింగ్టన్ సుందర్ (18 బంతుల్లో 25; 2 ఫోర్లు, 1 సిక్స్) చేసిన స్కోరుతో భారత్ ఆమాత్రం స్కోరు చేసింది.

తీరుమారని లంక

లంక లక్ష్యం చేరేందుకు టాప్-3 బ్యాటర్లు నిసాంక (27 బంతుల్లో 26; 5 ఫోర్లు), కుశాల్ మెండిస్, పెరీరా చక్కని బాటవేశారు. 15.1 ఓవర్లలో 110/1 స్కోరుతో పటిష్టంగా ఉంది. మరుసటి బంతికి మెండిస్ అవుటయ్యాక ఒక్కసారిగా పరిస్థితి మారింది. హసరంగ (3), అసలంక (0), పెరీరా, రమేశ్ మెండిస్ (3), తీక్షణ (0)ఇలా 22 పరుగుల వ్యవధిలో 7 వికెట్లను పారేసుకోవడంతో ఛేదించే స్కోరును సమం చేసింది.

స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) తీక్షణ 10; గిల్ (స్టంప్డ్) కుశాల్ మెండిస్ (బి) హసరంగ 39; సామ్సన్ (సి) హసరంగ (బి) విక్రమసింఘే 0; రింకూ సింగ్ (సి) పతిరణ (బి) తీక్షణ 1; సూర్యకుమార్ (సి) హసరంగ (బి) ఫెర్నాండో 8; శివమ్ దూబే (సి) కుశాల్ మెండిస్ (బి) రమేశ్ 13; పరాగ్ (సి) రమేశ్ (బి) హసరంగ 26; సుందర్ (బి) తీక్షణ 25; రవి బిష్ణోయ్ (నాటౌట్) 8; సిరాజ్ (రనౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1-11, 2-12, 3-14, 4-30, 5-48, 6-102, 7-105, 8-137, 9-137. **బౌలింగ్:** విక్రమసింఘే 4-0-17-1, తీక్షణ 4-0-28-3, ఫెర్నాండో 2-0-11-1, రమేశ్ 3-0-26-1, హసరంగ 4-0-29-2, కమిందు 3-0-24-0.

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (సి) పరాగ్ (బి) రవి బిష్ణోయ్ 26; కుశాల్ మెండిస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బిష్ణోయ్ 43; పెరీరా (సి అండ్ బి) రింకూ సింగ్ 46; హసరంగ (సి) బిష్ణోయ్ (బి) సుందర్ 3; అసలంక (సి) సామ్సన్ (బి) సుందర్ 0; రమేశ్ (సి) గిల్ (బి) రింకూ సింగ్ 3; కమిందు (సి) రింకూ సింగ్ (బి) సూర్య 1; విక్రమసింఘే (నాటౌట్) 4; తీక్షణ (సి) సామ్సన్ (బి) సూర్య 0; ఫెర్నాండో (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 137. వికెట్ల పతనం:** 1-58, 2-110, 3-117, 4-117, 5-129, 6-132, 7-132, 8-132. **బౌలింగ్:** ఖలీల్ అహ్మద్ 3-0-28-0, సిరాజ్ 3-0-11-0, సుందర్ 4-0-23-2, రవి బిష్ణోయ్ 4-0-38-2, పరాగ్ 4-0-27-0, రింకూసింగ్ 1-0-3-0, సూర్యకుమార్ 1-0-5-2.

క్లుప్తంగా...

నేటి నుంచి ఓపెన్ స్కూల్ ప్రవేశాలు



సాక్షి, అమరావతి/గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్టు ఓపెన్ స్కూల్ డైరెక్టర్ కె.నాగేశ్వర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఆగస్టు 27వ తేదీ వరకు అభ్యర్థులు రూ.200 రుసుము చెల్లించి www.apopenschool.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.

ముగిసిన ఈఏపీసెట్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీ

1.20 లక్షల మందికి సీట్ల కేటాయింపు



సాక్షి, అమరావతి: ఏపీలోని ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్దేశించిన ఏపీ ఈఏపీసెట్ 2024లో కన్వీనర్ కోటాలో ప్రవేశాలు ముగిసినట్లు సాంకేతిక విద్యా డైరెక్టర్ గుమ్మల గణేష్ కుమార్ మంగళవారం తెలిపారు. తుది దశ కౌన్సెలింగ్‌లో 17,575 మందికి సీట్లు కేటాయించినట్లు చెప్పారు. తుది దశ అనంతరం 247 కళాశాలల్లో 1,39,254 సీట్లకు గాను 1,20,303 సీట్లు భర్తీ అయ్యాయని వివరించారు.

పేరెంట్స్ కమిటీ ఎన్నికలకు షెడ్యూల్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కమిటీల ఎన్నికలకు విద్యాశాఖ షెడ్యూల్ ప్రకటించింది. ఈ మేరకు మంగళవారం పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఉన్న పేరెంట్స్ కమిటీల పదవీకాలం పూర్తి కావడంతో కొత్త కమిటీల ఎన్నికకు చర్యలు తీసుకోవాల్సిందిగా సమగ్ర శిక్ష అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే, గత ప్రభుత్వంలోని పేరెంట్స్ కమిటీ పేరును 'స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ'గా మార్చారు. ఈమేరకు ఆగస్టు 1న కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసి, ఓటర్ల జాబితా ప్రకటించాలి. 8వ తేదీన కమిటీ సభ్యుల ఎన్నిక పూర్తిచేసి, అనంతరం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలు నిర్వహించాలి.

మధ్యాహ్నం వరకూ వెబ్‌ఆప్షన్‌లకు అవకాశం



సాక్షి, అమరావతి: మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జన్ (ఎండీఎస్) కోర్సుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి యాజమాన్య కోటా సీట్లలో ప్రవేశాల కోసం వెబ్‌ఆప్షన్‌ల నమోదును వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మంగళవారం ప్రారంభించింది. బుధవారం మధ్యాహ్నం ఒంటిగంటలోపు అభ్యర్థులు https://drysr.uhsap.in వెబ్‌సైట్‌లో ఆప్షన్‌లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ డాక్టర్ రాధికా రెడ్డి తెలిపారు. ఈ సమయంలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్టైతే 90007 80707 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ప్రపంచ స్థాయి వర్సిటీగా ఏయూను అభివృద్ధి చేయాలి

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్



ఏయూ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహిస్తున్న విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్

సాక్షి, విశాఖపట్నం: ప్రపంచ స్థాయి యూనివర్సిటీగా ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సౌరభ్ గౌర్ సూచించారు. ఆయన మంగళవారం ఏయూలో పర్యటించి అడ్మిషన్ల ప్రక్రియ, వార్షిక క్యాలెండర్, విద్యార్థులకు అవసరమైన కల్పన తదితర అంశాలపై అధికారులు, విభాగాల అధిపతులతో సమీక్షించారు. నైపుణ్యాలను విద్యలో అంతర్భాగం చేయాలని గౌర్ సూచించారు. వర్సిటీలోని ప్రతి విభాగంలో ఇండస్ట్రీ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని చెప్పారు. నైపుణ్యాభివృద్ధి రంగంలో పనిచేస్తున్న విభిన్న శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు. విశాఖలో ఉన్న ఇంక్యుబేషన్ సెంటర్లను, వివిధ సంస్థలతో పరిశోధకులను అనుసంధానం చేయాలని నిర్ణయించామన్నారు. ఏయూ ఒక మోడల్‌ను తయారు చేస్తే ఇదే విధానాన్ని రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో అమలు చేస్తామని తెలిపారు. విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వినియోగాన్ని ఎట్టిపరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, ఇందులో ఎవరైనా భాగస్వాములైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దేశంలో తొలి 50 స్థానాల్లోకి రాష్ట్ర విశ్వవిద్యాలయాలను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా పని చేస్తామని పేర్కొన్నారు. వీసీ ప్రొఫెసర్ శశిభూషణరావు, ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ ఉమామహేశ్వరీదేవి, ఏయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ గిరిజాశంకర్, ఎంవీఆర్ రాజు, కె.సీతామాణిక్యం, పద్మశ్రీ పాల్గొన్నారు.


వైఎస్ జగన్ హయాంలో మెడిసిన్‌కు మహర్దశ

2019-24 మధ్య కొత్తగా అందుబాటులోకి 1,585 మెడికల్ సీట్లు

- 2018-19లో బాబు దిగిపోయేనాటికి 4,900 సీట్లే
- వైఎస్ జగన్ హయాంలో భారీగా పెరిగిన ఎంబీబీఎస్ సీట్లు
- 2023-24లో 6,485కు పెరిగిన సీట్లు
- అత్యధిక వైద్య సీట్లు ఉన్న రాష్ట్రాల్లో ఏపీది 7వ స్థానం
- లోక్‌సభలో కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా వెల్లడి



సాక్షి, అమరావతి: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా ప్రజల ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చారు. అందులో భాగంగా వైద్య రంగాన్ని విస్తృతం చేశారు. మారుమూల ప్రజలకు కూడా అత్యాధునిక వసతులతో స్పెషాలిటీ వైద్య సేవలందించేలా చర్యలు తీసుకున్నారు. ఒక్క ప్రభుత్వ రంగంలోనే రాష్ట్రవ్యాప్తంగా రూ.8,480 కోట్లతో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే 5 వైద్య కళాశాలల్లో తరగతులు, వైద్యం ప్రారంభం కాగా, ఈ ఏడాది మరో ఐదు కళాశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. తద్వారా ప్రజలకు అధునాతన వైద్య సేవలు చేరువవడమే కాకుండా, వైద్య విద్యార్థులకు ఎంబీబీఎస్ సీట్లు కూడా భారీగా పెరిగాయి. ఒక్కడ 2023–24 విద్యా సంవత్సరంలోనే కొత్తగా ఏర్పాటైన విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల ప్రభుత్వ కాలేజీల ద్వారా 750 సీట్లు అందుబాటులోకి వచ్చాయి. మొత్తంమీద 2019–20 నుంచి 2023–24 సంవత్సరాల మధ్య వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కొత్తగా 1,585 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా లోక్ సభలో వెల్లడించింది. 2018–19లో (నాటి చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయేనాటికి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ సీట్లు 4,900 మాత్రమే ఉన్నట్టు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా లోక్‌సభలో తెలిపారు. ఆ తర్వాతి ఐదేళ్లలో (వైఎస్ జగన్ హయాంలో) 1,585 సీట్లు పెరిగి 6,485కు చేరినట్లు వెల్లడించారు. దేశంలోనే అత్యధిక మెడికల్ సీట్లు గల రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో ఉంది. ప్రభుత్వ లేదా ప్రైవేటు మెడికల్ కాలేజీలు లేని జిల్లాల్లో కొత్త కళాశాలలను మంజూరు చేస్తున్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. మూడు దశల్లో దేశవ్యాప్తంగా 157 కాలేజీలను మంజూరు చేసినట్లు మంత్రి వివరించారు.



టోఫెల్ శిక్షణ రద్దుతో పేద విద్యార్థులకు అన్యాయం

ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లో టోఫెల్ విద్యా బోధన నిలిపివేయాలన్న నిర్ణయం పెద్ద తిరోగమన చర్యగా ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని పేద ప్రజల విద్యా హక్కును రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ కాలరాస్తున్నారని, ఆంగ్లం నేర్చుకోవాలన్న వారి కలను కల్లలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని లక్షలాది మంది పేద విద్యార్థులకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఉచితంగా ఆంగ్ల బోధన అందించిందని, వారిలో 16 లక్షల మంది టోఫెల్ ప్రైమరీ రెడీనెస్ టెస్టులకు కూడా హాజరయ్యారని, పిల్లల్లో ఆంగ్ల భాషా పరిజ్ఞానం పెరుగుతున్న తరుణంలో విద్యాశాఖ మంత్రి ఈ నిర్ణయం తీసుకోవడం శోచనీయమన్నారు.

ఇండియాటుడే ర్యాంకింగ్స్‌లో సత్తాచాటిన ఏఎన్‌యూ

ఏపీలో మొదటి, జాతీయ స్థాయిలో 12వ ర్యాంకులు సొంతం



ర్యాంక్ ఖరారు సర్టిఫికెట్లతో వీసీ గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ: ఇండియా టుడే–ఎండీఆర్‌ఏ బెస్ట్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ జనరల్ కేటగిరిలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను, జాతీయ స్థాయిలో 12వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. వర్సిటీలోని రెప్యూటేషన్ అండ్ గవర్నెన్స్, అకడమిక్–రీసెర్చ్ ఎక్స్‌లెన్స్,' ఇన్‌ఫ్రాస్ట్రక్చర్–లివింగ్ ఎక్స్‌పీరియన్స్', 'పర్సనాలిటీ–లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ అండ్ కెరీర్ ప్రోగ్రెషన్– ప్లేస్‌మెంట్ తదితర ప్రమాణాల ఆధారంగా ఇండియా టుగే–ఎండీఆర్ఏ ఈ ర్యాంకులను కేటాయించింది. మంగళవారం వర్సిటీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ వర్సిటీ అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థుల సమష్టి కృషితోనే ఈ ర్యాంకు సాధించగలిగామన్నారు. ఏఎన్‌యూకి ఉత్తమ ర్యాంకు రావడం పట్ల రెక్టార్ ఆచార్య రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు, సీడీసీ డీన్ ఆచార్య రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

హెచ్‌సీఎల్‌లో ఐటీ కోర్సుల్లో శిక్షణ

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థులకు ఐటీ సేవలకు తోడ్పడే డిజిటల్ సపోర్ట్ శిక్షణ ఇవ్వనున్నట్టు ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సీఈవో ఎస్.సుర్జీత్ సింగ్ తెలిపారు. ప్రముఖ ఐటీ కంపెనీ హెచ్‌సీఎల్ టెక్‌బీ ప్రోగ్రామ్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఏడాది పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఉద్యోగంతో పాటు ఉన్నత విద్యా కోర్సులు చదువుకునే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులు registrations.hcltechbee.comలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాల వారీగా టెక్‌బీ డ్రైవ్ ఈ తేదీల్లో..

కృష్ణా ఆగస్టు6, నెల్లూరు8, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు 9, కడప 10, కర్నూలు 13, అనంతపురం 17, పశ్చిమ గోదావరి 19న, తూర్పు గోదావరి 20, విశాఖపట్నం 22, విజయనగరం 23, శ్రీకాకుళం 24న డ్రైవ్ నిర్వహించనున్నారు.

ఏపీలో 'పాల్' అమలు భేష్


నోబెల్ పురస్కార గ్రహీత మైఖెల్ క్రీమర్ ప్రశంస



మైఖెల్ క్రీమర్‌తో మాట్లాడుతున్న కోన శశిధర్, ఎస్పీడీ శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో పర్సనలైజ్డ్ అడెప్టివ్ లెర్నింగ్ (పాల్) అమలు దేశంలో ఇతర రాష్ట్రాల కంటే బాగుందని యూనివర్సిటీ ఆఫ్ చికాగో ప్రొఫెసర్, పాల్ పరిశోధకుడు మైఖెల్ క్రీమర్ ప్రశంసించారు. మంగళవారం విజయవాడలోని సమగ్ర శిక్షా రాష్ట్ర కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, విద్యాశాఖ ఉన్నతాధికారులతో పాల్ అమలుపై ఆయన చర్చించారు. రాష్ట్రంలో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రాజెక్టు కింద ఉన్న 700 పాఠశాలల్లో పాల్ ప్రోగ్రామ్ కింద విద్యార్థులకు శిక్షణనిస్తున్నారు. ఇందులో అభ్యాస ఫలితాల ప్రభావం, డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్, క్షేత్రస్థాయిలో పాల్ రెమెడియేషన్‌ను పొడిగించడం, వివిధ రాష్ట్రాల్లో అవలంబించిన ఉత్తమ పద్ధతులపై క్రీమర్ చర్చించారు.

విద్యాశాఖలో వివాదాస్పద జేడీపై వేటు



సాక్షి, అమరావతి: పాఠశాల విద్యాశాఖలో వివాదాస్పద అధికారిగా ముద్రపడ్డ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం విద్యాశాఖ సర్వీసెస్ జేడీగా కొనసాగుతున్న ఆయనపై పలు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఆయన్ను విద్యాశాఖ ప్రభుత్వానికి సరెండర్ చేసింది. ఆయనపై క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో ఉన్నందున విధుల నుంచి తప్పించి డైరెక్టర్ పి.పార్వతికి ఆ బాధ్యతలు అప్పగిస్తూ విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

ఏపీలో రెండు ఆయుష్ ఆస్పత్రులు



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ ప్రతిపాదనల మేరకు కాకినాడ, విశాఖపట్నం జిల్లాల్లో రెండు ఇంటిగ్రేటెడ్ ఆయుష్ ఆస్పత్రుల ఏర్పాటుకు మంత్రిత్వశాఖ ఆమోదించిందని కేంద్ర ఆయుష్ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ మంగళవారం తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు విజయసాయిరెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. దీంతోపాటు 23 ఆయుష్ డిస్పెన్సరీలకు మౌలిక సదుపాయాల పెంపునకు మద్దతు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఏపీలో 126 ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లు పనిచేస్తున్నాయని పేర్కొన్నారు.

విద్యకు వైఎస్ జగన్‌లా ప్రాధాన్యమివ్వాలి

రాజ్యసభలో ఎంపీ ఆర్.కృష్ణయ్య



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. ఏపీలో 1వ తరగతి నుంచి కళాశాల స్థాయి వరకూ విద్యార్థులకు రూ.15 వేలు, రూ.20 వేలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో ప్రోత్సహించారని గుర్తు చేశారు. ఏపీలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య ప్రమాణాలు పెంచడం కోసం ప్రవేశపెట్టిన పథకాలు దేశవ్యాప్తంగా కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ముఖ్యంగా ఓబీసీలకు సంబంధించి ఎలాంటి పథకాలు లేవన్నారు. ఆర్థిక మద్దతు లేకుండా వెనుకబడిన వర్గాలు విద్యలో ముందుకు వెళ్లడం సాధ్యం కాదన్నారు. క్రీమీలేయర్ పరిధిలోకి రాని ఓబీసీలు ఐఐఎం, ఐఐటీ , కేంద్ర విద్యాసంస్థల్లో రుసుములు చెల్లించే పరిస్థితి లేదన్నారు. ఓబీసీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని ప్రధాని, ఆర్థిక మంత్రికి పలుసార్లు వినతిపత్రాలు ఇచ్చామని అయినా బడ్జెట్‌లో దాని ఊసే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ బీసీ కమిషన్‌ను సంక్షేమ పథకాలపై నివేదిక ఇవ్వాలని కేంద్రం ఎందుకు అడగడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు.

లోక్‌సభ

95 మందికి కొబ్బరి హస్తకళల శిక్షణ



గురుమూర్తి



మిథున్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: మూడేళ్లలో ఏపీలోని కలికిరి, పార్వతీపురం మన్యం, కోనసీమ, శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 95 మందికి కొబ్బరి హస్తకళల్లో శిక్షణ ఇచ్చినట్టు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యుడు మద్దిళ్ల గురుమూర్తి ప్రశ్నకు లోక్‌సభలో మంగళవారం లిఖితపూర్వక సమాధానమిస్తూ.. శిక్షణతోపాటు అవగాహన కార్యక్రమాలు, ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

పాల ధరల నియంత్రణ కేంద్రం చేయదు



తనూజరాణి

దేశంలో పాల సేకరణ, విక్రయ ధరలను కేంద్రం చేయదని పశుసంవర్ధక, డెయిరీ శాఖ మంత్రి లల్లన్ సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ సభ్యులు గుమ్మా తనూజరాణి, పీవీ మిథున్ రెడ్డిల ప్రశ్నకు లోక్‌సభలో మంగళవారం లిఖితపూర్వక సమాధానమిస్తూ.. సహకార, ప్రైవేటు డెయిరీలు వాటి ఉత్పత్తి–వ్యయం, మార్కెట్ ఆధారంగా ధరలు నిర్ణయిస్తాయన్నారు. పాలకు కనీస మద్దతు ధర నిర్ణయించే ప్రతిపాదన మంత్రిత్వశాఖ వద్ద లేదని పేర్కొన్నారు.

పోలవరం తొలిదశ సవరించిన అంచనా వ్యయం రూ.30,437 కోట్లు

- దయాఫ్రం వాల్, ఇతర మరమ్మతులకు రూ.2,620.24 కోట్లు
- లోక్‌సభలో తేల్చి చెప్పిన హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్
- కేంద్రం నిర్మించాల్సిన పోలవరాన్ని 2016లో చేతుల్లోకి తీసుకున్న చంద్రబాబు
- 2013–14 ధరలతోనే పూర్తి చేస్తానంటూ కేంద్రంతో ఒప్పందం
- దీంతో నిధుల సంక్షోభంలో కూరుకుపోయిన ప్రాజెక్టు
- తాజా ధరల ప్రకారం నిధులిచ్చేలా కేంద్రాన్ని ఒప్పించిన వైఎస్ జగన్
- నిధుల సమస్య లేకుండా చేసి ప్రాజెక్టు పూర్తికి మార్గం సుగమం



సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు తొలి దశ సవరించిన అంచనా వ్యయం తాజా (2023, మార్చి) ధరల ప్రకారం రూ.30,436.95 కోట్లు అని రివైజ్డ్ కాస్ట్ కమిటీ (ఆర్‌సీసీ) 2023 అక్టోబర్ 19న తేల్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో చెప్పారు. గోదావరి వరదల ఉద్ధృతికి ప్రధాన (ఎర్త్ కమ్ రాక్ ఫిల్) డ్యామ్ గ్యాప్–2లో కోతకు గురై దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్ పునరుద్ధరణ, డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురవడం వల్ల ఏర్పడిన అగాధాలను పూడ్చి యథాస్థితికి తెచ్చే పనులకు రూ.2,620.24 కోట్లు ఖర్చవుతుందని ఆర్‌సీసీ అంచనా వేసిందని మంగళవారం టీడీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన చెప్పారు. తాజా ధరల ప్రకారం నిధులిచ్చేలా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్రాన్ని ఒప్పించడం ద్వారా పోలవరం ప్రాజెక్టుకు నిధుల సమస్య లేకుండా చేశారని, ఇది ప్రాజెక్టును సత్వరమే పూర్తి చేయడానికి దోహదపడుతుందని అధికారవర్గాలు చెబుతున్నాయి.

నిధుల సంక్షోభంలోకి నెట్టిన చంద్రబాబు

విభజన చట్టం ప్రకారం పోలవరం జాతీయ ప్రాజెక్టును కేంద్రమే నిర్మించాలి. కానీ.. కమీషన్ల కోసం అప్పటి సీఎం చంద్రబాబు.. 2016 సెప్టెంబరు 7న ప్రత్యేక హోదాను కేంద్రానికి తాకట్టు పెట్టి మరీ పోలవరం నిర్మాణ బాధ్యతలను తీసుకున్నారు. 2013–14 నాటి ధరల ప్రకారం ప్రాజెక్టు పూర్తి చేస్తామని కేంద్రంతో ఒప్పందం చేసుకున్నారు. దాని ప్రకారం 2014 ఏప్రిల్ 1 నాటికి ప్రాజెక్టు పనులకు చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లు పోను మిగతా రూ.15,667.90 కోట్లు మాత్రమే ఇస్తామని కేంద్రం చెబితే దానికీ తలూపారు. నిజానికి 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాస వ్యయమే రూ.33,168.24 కోట్లు. కానీ.. ప్రాజెక్టు మొత్తాన్ని రూ.15,667.90 కోట్లతోనే పూర్తి చేస్తానని చంద్రబాబు అంగీకరించడంలో ఆంతర్యం కమీషన్లే. పోలవరాన్ని చంద్రబాబు ఏటీఎంగా మార్చుకున్నారని 2019లో సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ఆరోపణలే ఇందుకు నిదర్శనం.

సంక్షోభం నుంచి తప్పించిన వైఎస్ జగన్

వైఎస్ జగన్ సీఎం అయ్యాక చంద్రబాబు చేసిన తప్పులను సరిదిద్దుతూ పోలవరం ప్రాజెక్టును శరవేగంగా పూర్తి చేస్తూ వచ్చారు. తాజా ధరల ప్రకారం నిధులిచ్చి, ప్రాజెక్టును పూర్తి చేయడానికి సహకరించాలని ప్రధాని నరేంద్ర మోదీని అనేక మార్లు కోరారు. దీనికి సానుకూలంగా స్పందించిన ప్రధాని.. ప్రాజెక్టును రెండో దశల్లో పూర్తి చేద్దామని, తొలి దశలో 41.15 మీటర్ల కాంటూర్ వరకు, ఆ తర్వాత 45.72 మీటర్ల కాంటూర్ వరకు పూర్తి చేద్దామని చెప్పారు. ఆ మేరకు తొలి దశ పనుల పూర్తికి (డయాఫ్రం వాల్ పునరుద్ధరణ, మరమ్మతులతో కలిపి) తాజా ధరల ప్రకారం రూ.31,625.37 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం పంపిన సవరించిన అంచనాలకు 2023 జూలైలో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదముద్ర వేసి, ఆర్‌సీసీకి నివేదించింది. వాటిని పరిశీలించిన ఆర్‌సీసీ.. తొలి దశ సవరించిన అంచనా వ్యయం రూ.30,436.95 కోట్లుగా నిర్ధారించింది.

నాడు మోకాలడ్డి.. నేడు వినతులు

పోలవరం తొలి దశలో ఇప్పటివరకూ అయిన పనులకు చేసిన వ్యయం, కేంద్రం రీయింబర్స్ చేసిన మొత్తంపోనూ మిగిలిన పనుల పూర్తికి రూ.12,157.53 కోట్లు మంజూరు చేయాలని గత మార్చి 6న కేంద్ర కేబినెట్‌కు కేంద్ర జల్ శక్తి శాఖ ప్రతిపాదన పంపింది. అప్పటికే ఎన్డీఏలో చేరిన టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు.. ఆ ప్రతిపాదనపై ఆమోద ముద్ర వేస్తే రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందని కేంద్ర ప్రభుత్వ పెద్దల వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో అప్పట్లో ఆ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్ అజెండా నుంచి తప్పించింది. ఇలా ఆ నిధులకు మోకాలడ్డిన చంద్రబాబే.. ఈ నెల 27న ఢిల్లీలో కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి పోలవరం తొలి దశకు ఇవ్వాల్సిన రూ.12,157.53 కోట్లు మంజూరు చేయాలని, ఆ ప్రతిపాదనను కేంద్ర కేబినెట్‌లో ప్రవేశపెట్టి, ఆమోదించాలని విజ్ఞప్తి చేయడం గమనార్హం.

క్రాష్ అవుతున్న బ్యాంక్‌లో పోస్ట్ డేటెడ్ చెక్

- వాగ్దానం చేసిన ప్రాజెక్టులకు నిధులిచ్చే సమయానికి ఈ ప్రభుత్వం ఉండదు
- ఆంధ్రప్రదేశ్, బిహార్‌లకు ఆర్థిక ప్యాకేజీపై కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేశ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఎంపీ జైరాం రమేశ్ చురకలు అంటించారు. రెండు రాష్ట్రాలకు కేంద్రం ఇచ్చిన వాగ్దానాలు కొన్నేళ్ల పాటు అమల్లోకి వచ్చే అవకాశం లేదని, అప్పటికి ఈ ప్రభుత్వం ఉండే అవకాశాలు లేవని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. 'కుర్చీ బచావో ప్రభుత్వం రెండు రాష్ట్రాలకు కీలకమైన వాగ్దానాలు చేసింది. బిహార్‌లోని నిర్దిష్ట ప్రాజెక్టులకు రూ.58,900 కోట్లు కేటాయించారు. ఆంధ్రాలో పోలవరం ప్రాజెక్టు మొదటిదశకు మాత్రమే కేంద్ర ప్రభుత్వం రూ.14 వేలకోట్లు ఖర్చు చేస్తుంది. స్పష్టమైన కేటాయింపులు లేకుండా ఇతర అనేక ప్రాజెక్టులు ప్రకటించారు. అయితే బడ్జెట్ ద్వారా రెండు రాష్ట్రాలకు చేసిన మొత్తం నిధుల హామీలు కాగితాలపై లక్షల కోట్లలో ఉన్నాయి. ఈ స్థాయిలో వాగ్దానాలు గుప్పించినప్పటికీ ఏపీ, బిహార్‌లకు ఆర్థిక ప్యాకేజీ వల్ల ఈ ఏడాది ఖజానాకు కేవలం రూ.20,000–30,000 కోట్లు మాత్రమే ఖర్చవుతుందని బిజినెస్ స్టాండర్డ్ నివేదించింది. ప్రత్యేక ఆర్థికసాయం కింద బడ్జెట్ పద్దుల్లో కేవలం రూ.20 వేలకోట్ల మొత్తాన్నే చూపారు. ఈ మొత్తం కార్పస్‌ను రెండు రాష్ట్రాలకు మాత్రమే కేటాయించినా, ఇంకా వేలకోట్ల నిధుల గ్యాప్ ఉంటుంది. అలాంటప్పుడు బడ్జెట్‌లో ప్రకటించిన వాగ్దానాలు అమలయ్యేందుకు కొన్నేళ్లు పడుతుంది. వాగ్దానం చేసిన ప్రాజెక్టులకు నిధులను పూర్తిస్థాయిలో సమకూర్చే సమయానికి ఈ అస్థిర ప్రభుత్వం ఉండదు. ఈ వ్యవహారమంతా మహాత్మాగాంధీ 1942లో క్రిప్స్ మిషన్ గురించి చెప్పినట్లు 'క్రాష్ అవుతున్న బ్యాంకులో పోస్ట్ డేటెడ్ చెక్' వంటిదే అని ఆయన పేర్కొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదు

రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు



బీచ్‌రోడ్డు(విశాఖ తూర్పు): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయటం జరగదని రాజ్యసభ మాజీ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు స్పష్టం చేశారు. మంగళవారం బీచ్‌రోడ్డులోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ రెండు వారాల కిందట కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ మంత్రి స్టీల్‌ప్లాంట్‌ను పరిశీలించినట్లు తెలిపారు. మార్చిలో హై పవర్ కమిటీ పర్యటించి నివేదిక కూడా ఇచ్చినట్లు చెప్పారు. ఆ నివేదిక ప్రకారం స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తుందన్నారు. సుమారు రూ.3,100 కోట్ల పెట్టుబడులు పెట్టేలా కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు వర్కింగ్ క్యాపిటల్ సమస్య ఉందని, ఈ సమస్య పరిష్కారమైతే మూడో బ్లాస్ట్ ఫర్నేస్ కూడా పని మొదలవుతుందన్నారు. రాయబరేలి ప్లాంట్ రైల్వేకి అప్పగించినట్లు తెలిపారు. వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. ప్రజల సమస్యలపై పోరాటం చేయడానికి ప్రతిపక్ష హోదా అవసరం లేదన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేక తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని.. తాను ఎవరి వద్ద నుంచి వ్యక్తిగతంగా నగదు పొందలేదని స్పష్టం చేశారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పక్కా గృహాలు నిర్మించాలి

రాయచూరు రూరల్: మురికి వాడల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో దేవదాసి మహిళలకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని దేవదాసి మహిళ విమోచన వేదిక సంచాకురాలు పద్మ డిమాండ్ చేశారు.మంగళవారం కలెక్టరేట్ వద్ద ఆమె ఆందోళన చేపట్టి మాట్లాడారు. దేవదాసి మహిళలు నిలువ నీడ లేక అద్దె ఇళ్లలో ఉంటున్నారన్నారు. వారికి ఇళ్లు నిర్మించాలని, మురికి వాడల్లో మంచి నీరు, రోడ్లు, విద్యుత్ సదుపాయాలు కల్పించాలని ఒత్తిడి చేశారు. అనంతరం మురికి వాడల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ప్రసాద్ అబ్బయ్యకు వినతిపత్రం సమర్పించారు.

సేవలపై దృష్టి పెట్టాలి



జ్యోతి వెలిగిస్తున్న దయానంద అగసర్

రాయచూరు రూరల్ : విద్యార్థులు చదువుతో పాటు సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని కలబుర్గి విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ దయానంద అగసర్ అన్నారు. కలబుర్గి హైదరాబాద్ కర్ణాటక విద్యాసంస్థ వీరమ్మ గంగ సిరి జూనియర్ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చైతన్యం తేవాలన్నారు. ఎమ్మెల్సీ సుశీల్ నమోషి, శంకర్, సీమా, చంద్రపాటిల్ పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణపై ప్రజల్లో చైతన్యం తేవాలి



సదస్సును ప్రారంభిస్తున్న అధికారిణి డాక్టర్ కమలమ్మ తదితరులు

హొసపేటె: అంటు వ్యాధులను నియంత్రించాలంటే ప్రజల్లో చైతన్యం తేవాలని జాతీయ వ్యాధుల నియంత్రణ అధికారిణి డాక్టర్ కమలమ్మ సూచించారు. జాతీయ అంటువ్యాధుల నియంత్ర అధికారి కార్యాలయంలో జిల్లా స్థాయి జర్నలిస్టులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. జర్నలిస్టులు ప్రభుత్వ పథకాలను సమాజంలోని అట్టడుగు వర్గాల ప్రజలకు చేరేలా చేస్తున్నారని, అదేవిధంగా వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలను చైతన్యవంతులను చేయాలన్నారు. దోమలను అరికడితే వ్యాధులను నియంత్రించవచ్చని, ఆ దిశగా ప్రజలు తమ ఇంటి అవసరాలను శుభ్రంగా ఉంచుకునేలా చూడాలన్నారు. డెంగీ జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు. అధికారి డాక్టర్.బి.జంబయ్య నాయక్, భాస్కర్, దొడ్డమని తదితరులు పాల్గొన్నారు.

మరో ఇద్దరు ఏజెంట్ల అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

రాయచూరు రూరల్: దర్వేసి ప్రైవేట్ కంపెనీలో ప్రజల నుంచి రూ. 100కు 12–15 శాతం వడ్డీ చెల్లిస్తామంటూ కోట్లాది రూపాయలను దండుకొని అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలపై సీఐడీ అధికారుల విచారణలో మరో ఇద్దరిని మంగళవారం స్వాధీనంలోకి తీసుకున్నారు. ఇప్పటికే మహ్మద్ హుసేన్ సజా, బబ్లూ, అజర్, మోసిన్‌లను పోలీసులు విచారణ చేస్తుండగా మంగళవారం లాల్ బహద్దూర్ శాస్త్రి నగర్ వాసిం, అఖిల్‌లను అదుపులోకి తీసుకున్నారు.

భూగర్భ జలాలు పెంపొందించండి



చెరువును పరిశీలిస్తున్న మంత్రి బోసురాజు

రాయచూరు రూరల్: జిల్లాలో చెరువులను సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించాలని చిన్న నీటిపారుదల మంత్రి బోసురాజు అధికారులకు సూచించారు. మంగళవారం తాలూకాలోని పలు చెరువులను సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మలయాబాద్ చెరువుకు రూ.2 కోట్లు, దేవనపల్లి చెరువుకు రూ.4.50 కోట్ల నిధులను కేటాయించామన్నారు. దేవనపల్లిలో పాఠశాలలను సందర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థులను తమ కన్నబిడ్డల్లా చూసుకోవాలని ఆదేశించారు. అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని ఆరగించారు.

చివరి ఆయకట్టుకు నీరివ్వండి

ఎడమ కాలువ చివరి ఆయకట్టుకు సక్రమంగా నీరందాలంటే గేజ్‌ను అమర్చాలని రాష్ట్ర చిన్న నీటిపారుదల శాఖా మంత్రి బోసురాజు అధికారులను ఆదేశించారు. సోమవారం మాన్విలో పర్యటించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మైల్ నంబర్ 69 వద్ద నీటి నిర్వహణ గేజ్ సామర్థ్యాన్ని గురించి వివరిస్తూ ఆయకట్టు చివరి భూములకు నీరందించాలన్నారు. 47వ మైల్ వద్ద 7 అడుగులకు నీటి గేజ్ తగ్గడంతో నీరందడం లేదన్నారు.

సేంద్రియ సాగు.. లాభాలు బాగు


- ఆకుకూరలు, కూరగాయల సాగుతో అధిక దిగుబడి
- వ్యవసాయంతో ఆదాయం గడిస్తున్న చిన్నకారు రైతు



రైతు సాగు చేసిన దోసతోట



రైతు పండిస్తున్న వంగతోట



రైతు పొలంలో పండిన కొత్తిమీర

సాక్షి బళ్లారి: మారుతున్న కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు, వ్యవసాయ పద్ధతులు, విపరీతమైన రసాయనిక క్రిమిసంహారక మందుల వాడకంతో పొలాలను రైతులు ఓ వైపు నాశనం చేసుకోవడమే కాకుండా ప్రజల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపే విధంగా జరుగుతోంది. ఇటీవల కొందరు రైతులు సేంద్రియ ఎరువులతోనే పంటలను పండిస్తున్నామని అందులో కూడా రసాయనిక, క్రిమిసంహారక మందులను వాడుతూ కొంత మేర మోసగిస్తున్న సంఘటనలు కూడా వెలుగులోకి వస్తున్నాయి. అయితే కొప్పళ జిల్లా నిశాల గ్రామానికి చెందిన ఓ చిన్నకారు రైతు ఎలాంటి రసాయనిక, క్రిమిసంహారక మందులను వాడకుండా పశువుల పేడ, ఇతరత్ర సేంద్రియ ఎరువులను వాడుతూ ఆరోగ్యకరమైన ఆకు కూరలను, కూరగాయలను పండిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. నిశాల గ్రామంలో తనకు ఉన్న మూడు ఎకరాల లోపు పొలంలో కొత్తిమీర, సబ్బాక్సీ, మెంతి కూర, పలకలకూర తదితర ఆకు కూరలతో పాటు కూరగాయలను కూడా సాగు చేస్తూ ప్రతి రోజు ఆదాయం పొందుతున్నారు. ఆకు కూరలను సాగు చేయడం వల్ల ఆరోగ్యకరంగా ఉండేందుకు దోహదం చేస్తుందంటున్నారు. అందులో ఒక గ్రాము రసాయనిక ఎరువులు కానీ, ఒక చుక్క క్రిమి సంహారక మందులు కానీ వాడకుండా ఆకు కూరలను, కూరగాయలను సాగు చేసి అమ్మకాలు సాగిస్తున్నట్లు రైతు శరణప్ప, లక్ష్మమ్మ దంపతులు పేర్కొన్నారు.

రోజు వారి రూ.1500లకు పైగా ఆదాయం

మలబరీ సాగుతో పాటు ఆకు కూరలు, కూరగాయలు సాగు చేస్తున్నామన్నారు. ప్రతి రోజు ఆకు కూరలు తీసుకొని కొప్పళలో మార్కెట్ చేసుకోవడం వల్ల రోజు వారి ఆదాయం రూ.1500 వరకు వస్తుందన్నారు. తాను, తన భార్య లక్ష్మమ్మ ప్రతి నిత్యం పొలంలోకి వెళ్లి పనులను చేసుకుంటూ నెలకు కనీసం రూ.30 వేలకు పైగా ఆదాయం పొందుతున్నామన్నారు. రసాయనిక, క్రిమిసంహరక మందులు వాడకపోవడం వల్ల ఆకు కూరలు ఎంతో ఏపుగా పెరిగి కళకళలాడుతుంటాయన్నారు. తాము మార్కెట్‌కు వెళ్తె చాలా మంది వరుసలో ఉండి కొనుగోలు చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వస్తోందని గుర్తు చేశారు. ఆకు కూరలతో పాటు వంకాయ, దోసకాయ, తదితర కూరగాయలు కూడా సాగు చేశామని వాటి ద్వారా కూడా మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. దీంతో పాటు మలబరీ ప్రతి 45 రోజులకు ఒకసారి పంట చేతికి వస్తుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం ద్వారా తమ పొలం మరింత బలవర్ధకంగా మారుతోందన్నారు. విపరీతమైన రసాయనిక, క్రిమిసంహారక మందులకు స్వస్తి చెప్పి సేంద్రియ వ్యవసాయంపై ఆసక్తి చూపాలని రైతులకు శరణప్ప సూచిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించరూ



కొత్త ఎస్పీ శోభారాణిని అభినందిస్తున్న దృశ్యం


బళ్లారిఅర్బన్: ట్రాఫిక్ సమస్యలపై కొత్త ఎస్పీ శోభారాణి దృష్టి సారించాలని జిల్లా జనజాగృతి సంఘం అధ్యక్షుడు హుండేకర్ రాజేష్ విజ్ఞప్తి చేశారు. ఆయన మంగళవారం సంఘం ఆధ్వర్యంలో పలువురు సభ్యులతో కలిసి ఎస్పీ కార్యాలయంలోని ఎస్పీని కలిసి ఓ వినతి పత్రాన్ని అందజేశారు. నగరంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తీవ్రం అవుతోందని, స్థానికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా బెంగళూరు రోడ్డు, సంగం సర్కిల్, దొడ్డమార్కెట్, రాయల్ సర్కిల్ తదితర చోట్ల ట్రాఫిక్ సీసీలను నియమించాలన్నారు. రాత్రి వేళల్లో రైల్వే స్టేషన్, కొత్త బస్టాండ్‌లో పోకిరీలు మద్యం, గంజాయి సేవించి ప్రయాణికులను బెదిరింపులకు గురి చేస్తున్నారని, ఈ విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కళాశాల యువత ఇటీవల గంజాయి, మాదక వస్తువుల వ్యసనాలకు బలి అయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. వీటిపై అన్ని విద్యా సంస్థల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. అక్రమ మద్యం విక్రయాలు, గంజాయి, డ్రగ్స్ సరఫరా, క్రికెట్ బెట్టింగ్, జూదాలు, మట్కా, భూ కబ్జా వంటి సంఘ విద్రోహ పనులపై పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని మనవి చేశారు. రాత్రి వేళల్లో తగిన పోలీస్ సిబ్బందిని సిటీ రౌండ్స్‌కు నియమించాలని ఆయన ఆ వినతిపత్రంలో కోరారు.

నవలి నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం

- ఏపీ, తెలంగాణ ప్రభుత్వాల అనుమతి కోసం వేచిఉన్నాం
- 30 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మిస్తాం
- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వెల్లడి

సాక్షి,బళ్లారి: తుంగభద్ర జలాశయం కింద నవలి జలాశయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉపముఖ్యమంత్రి డీకే.శివకుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం విధాన పరిషత్ సమావేశంలో బళ్లారి ఎమ్మెల్సీ వైఎం సతీష్ లేవనెత్తిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ముందుగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంలో ప్రతి ఏటా వంద టీఎంసీలకు పైగా నీరు నది ద్వారా దిగువకు వృధాగా వెళుతోందన్నారు. అంతేకాకుండా డ్యాంలో పూడిక వల్ల నష్టపోయిన నీటిని ఉపయోగించుకునేందుకు సమాంతర జలాశయ నిర్మాణానికి చర్యలు తీసుకోవాన్నారు. ఈ సందర్భగా ముఖ్యమంత్రి డీకే. శివకుమార్ కలగజేసుకొని మాట్లాడుతూ తుంగభద్ర జలాశయ పరిధిలో నవలి వద్ద 30 టీఎంసీల సామర్థ్యంతో సమాంతర జలాశయాన్ని నిర్మించేందుకు 2021–22వ సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందన్నారు. డీపీఆర్ కూడా సిద్ధం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. అయితే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల అనుమతి కోసం నిరీక్షిస్తున్నామని గుర్తు చేశారు. రెండు రాష్ట్రాల అనుమతి లభించిన తర్వాత నవలి వద్ద జలాశయ నిర్మాణం చేపట్టడం ఖాయమన్నారు. రెండు రాష్ట్రాల అనుమతితో పాటు తుంగభద్ర మండలి కూడా ఆమోదం తెలపాలన్నారు. రాష్ట్రాలు చర్చించిన తర్వాత నవలి వద్ద జలాశయ నిర్మాణం చేపట్టడంలో ఎలాంటి అనుమానం లేదన్నారు. నవలి వద్ద జలాశయ నిర్మాణానికి రూ.15,601 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారన్నారు. ఇందుకోసం భూసేకరణకు కూడా చర్యలు తీసుకున్నారన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో నవలి జలాశయ నిర్మాణంపై చర్చించడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక పర్వదినం



అలంకరణలో కుమారస్వామి ఉత్సవమూర్తి



స్వామివారిని దర్శించుకొంటున్న భక్తులు

- భక్తులతో కుమారస్వామి ఆలయం కిటకిట

బళ్లారి రూరల్: ఆడికృత్తిక పర్వదినాన్ని మంగళవారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈసందర్భంగా నగరంలోని కుమారస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలోని కుమారస్వామి(సుబ్రమణ్యస్వామి) ఉత్సవ మూర్తిని పూలు, ఆభరణాలతో అత్యంత సుందరంగా అలంకరించారు. మహా పంచామృతంతో అభిషేకించారు. భక్తులు అర్చనలు, అభిషేకాలు, నామార్చనలు చేసి స్వామి వారిని దర్శించుకొన్నారు. అదేవిధంగా ఆలయ ప్రాంగణంలో ఉన్న వినాయకుడు, కాశీ విశ్వనాథుడు, ఆంజనేయుడు, సరస్వతి, నాగాలమ్మ విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు బి.విజయకుమార్, కార్యనిర్వహణాధికారి హనుమంతప్ప భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని రథంపై వందలాది భక్తుల సమక్షంలో ఊరేగించారు.

పలు కాలనీల్లో ఎమ్మెల్యే పాదయాత్ర

హుబ్లీ: హుబ్లీ ధార్వాడ సెంట్రల్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహేష్ టెంగినకాయి వివిధ శాఖల అధికారులతో కలిసి మంగళవారం వార్డు 48 పరిధిలోని పలు కాలనీల్లో పాదయాత్ర నిర్వహించి స్థానికుల నుంచి సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించారు. నేకార కాలనీ, గురుదత్త కాలనీ, విద్యావన కాలనీ, సిద్దేశ్వర పార్క్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పాడైపోయిన విద్యుత్ వైర్లు, స్తంభాలను తొలగించాలని, రోడ్లు, డ్రైనేజీలు తదితర సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. నేకార కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల మైదానానికి పేవర్స్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రాధాన్యత అనుసారంగా ఈ సమస్యలన్నిటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. చిత్తశుద్ధితో సమస్యల పరిష్కారానికి పాటుపడతానన్నారు. త్వరలోనే సీనియర్ అధికారులతో ఈ ప్రాంతంలో పర్యటించి ప్రజలతో సమావేశం నిర్వహించి యూజీడీ, వీధి దీపాలు తదితర వసతులను కల్పిస్తామన్నారు. స్థానిక ప్రముఖులు గోవర్ధన్‌రావ్, రమేష్, కృష్ణ ఉప్పేర, పరశురామ, సంగీత, జయశ్రీ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి



జాతాను ప్రారంభిస్తున్న జడ్జి సిద్ధరామప్ప

రాయచూరు రూరల్: జిల్లాలో మానవ అక్రమ రవాణా నియంత్రణపై ముమ్మర ప్రచార ఉద్యమం చేపట్టాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సిద్దరామప్ప పిలుపు ఇచ్చారు. మంగళవారం స్టేషన్ బజార్ ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన జాగృతి జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మగ, ఆడ అనే తేడా లేకుండా ఇతర ప్రాంతాలకు వారిని విక్రయించి డబ్బులు చేసుకొనే వారిపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరికీ గ్రామ స్థాయి నుంచి అవగాహన కల్పించాలన్నారు. అందరినీ ఏకతాటిపైకి తెచ్చి సమాజంలో నలుగురితో సమానంగా జీవించేలా చేయాలన్నారు. జాతాలో జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి చేతన్ కుమార్, జిల్లా బాల కార్మిక నిర్మూలన అధికారిణి ఆరతి, అధికారి మంజునాథ రెడ్డి, ముదుకప్ప, బీఈఓ చంద్రశేఖర్‌లున్నారు.

ఘనంగా రేణుకా యల్లమ్మ జాతర ఉత్సవాలు



రేణుకా యల్లమ్మ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బళ్లారిటౌన్: నగరంలోని సంగనకల్లు రోడ్డు శృంగేరి శంకర మఠం వెనుకభాగంలోని సుబ్బారావు క్యాంప్‌లో వెలసిన రేణుకా యల్లమ్మ దేవి ఆలయ మూడో ఏడాది జాతర ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పల్లకీ ఉత్సవాలు, కుంభోత్సవాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతేగాక ఆలయ కమిటీ ధర్మకర్త సభ్యులు జుమారి తాతకు అనేక మంది తులాభారాన్ని నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు వివిధ గ్రామాల నుంచి కూడా అనేక మంది భక్తులు పాల్గొన్నారు. భక్తుల కోసం మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఉత్సవాల్లో వివిధ కళా బృందాలు నిర్వహించిన నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మురికివాడల అభివృద్ధికి రూ.6170 కోట్లు



మాట్లాడుతున్న ప్రసాద్ అబ్బయ్య

రాయచూరు రూరల్: రాష్ట్రంలో మురికి వాడల అభివృద్ధికి ప్రభుత్వం రూ.6170 కోట్ల నిధులు కేటాయించినట్లు మురికి వాడల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ప్రసాద్ అబ్బయ్య పేర్కొన్నారు. ఆయన మంగళవారం జిల్లాధికారి కార్యాలయంలో విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 11,962 ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో 82 మురికి వాడలున్నాయన్నారు. 3948 మంది దేవదాసి మహిళలకు ఇళ్ల నిర్మాణంలో డబ్బులు తక్కువ మోతాదులో మంజూరు అయ్యాయన్నారు. నగరంలో 3770 ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ మూడేళ్లుగా పనులు చేపట్టక పోవడంతో బ్లాక్‌లిస్ట్‌లో చేర్చాలని కమిషనర్‌కు సూచించారు. నగర సభ, మురికి వాడల అభివృద్ధి మండలి అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అధికారులు మురికి వాడల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మురుగు కాలువల నిర్మాణాలు చేపట్టడంలో నిర్లక్ష్యం వహించడంపై ఆక్రోశం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన, తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. మురికి వాడల మండళి కార్యాలయంలో ఉన్న లోపాలను నెల రోజుల్లో సరిచేయాలన్నారు. సమావేశంలో జిల్లాధికారి కె.నితీష్, ఎస్పీ పుట్టమాదయ్య, కమిషనర్ గురుసిద్దయ్య, అధికారులు చేతన్ కుమార్, మహేష్‌లున్నారు.

ఇళ్ల నిర్మాణంలో లోపాలు తగదు

నగరంలో ఆశ్రయ కాలనీలో మురికి వాడల అభివృద్ధి మండలి నుంచి రూ.25 కోట్ల నిధులతో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనుల్లో లోపాలు తగదని మురికి వాడల అభివృద్ధి మండలి అధ్యక్షుడు ప్రసాద్ అబ్బయ్య సూచించారు. మంగళవారం ఆశ్రయ కాలనీలో ఇళ్ల నిర్మాణ పనుల పర్యవేక్షణలో లోపాలు కనిపించడంతో అధికారులపై చిందులు తొక్కారు. నగరంలో 3770 ఇళ్ల నిర్మాణంలో కాంట్రాక్టర్ పనులు చేపట్టక పోవడంతో అధికారులకు నోటీసులు జారీ చేయాలని మండలి కమిషనర్‌కు సూచించారు.

రైతు కుటుంబానికి మంత్రి పరామర్శ

హుబ్లీ: ధార్వాడ తాలూకా వెంకటాపుర గ్రామంలో తీవ్రమైన వర్షాలకు పక్క ఇంటి గోడ కూలి మృతి చెందిన రైతు యల్లప్ప ఇంటికి వెళ్లి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంతోష్లాడ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి సదరు కుటుంబానికి జిల్లాధికారి సూచన మేరకు అసిస్టెంట్ కమిషనర్, తహసీల్దార్ జాతీయ విపత్తు పరిహార నిధి ద్వారా రూ.4 లక్షలు, ముఖ్యమంత్రి పరిహార నిధి నుంచి రూ.1 లక్షతో కలిపి మొత్తం రూ.5 లక్షల పరిహారధనం చెక్కును మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి గ్రామంలోని సిద్దర సముదాయ భవనంలో ప్రారంభించిన గంజి కేంద్రాన్ని కూడా పరిశీలించారు. గోడ కూలిన ఘటనలో గాయపడిన మృతుడి భార్య హనుమవ్వ, కుమార్తె యల్లవ్వలను జిల్లా ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని మంత్రి సదరు జిల్లా ఆస్పత్రి సర్జన్ డాక్టర్ సంగప్పకు సూచించారు. జిల్లాధికారిణి దివ్యప్రభు, జిల్లా ఎస్పీ డాక్టర్ గోపాల బ్యాకోడ, ఏసీ సలాం హుస్సేన్, తహసీల్దార్ డాక్టర్ బీహెచ్ హుగార, గుణేదకొప్ప జీపీ అధ్యక్షుడు రమేష్ హొసమని, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, పీడీఓ నీలావతి, అరవింద చవాన్ పాల్గొన్నారు.

పాత్రికేయులకు నిబద్ధత అవసరం

దేశం, సమాజంలో మార్పు తేవడంలో పాత్రికేయుల పాత్ర ప్రముఖమని, పాత్రికేయులంతా నిబద్ధతతో విధులు నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంతోష్‌లాడ్ సూచించారు. స్థానిక దేశ్‌పాండే నగర సవాయి గంధర్వ హాల్‌లో జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్‌ల సంఘం ఏర్పాటు చేసిన పత్రికా దినోత్సవం, వార్షిక ప్రశస్తి ప్రదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అసంఘటిత కార్మికులందరూ కార్మిక శాఖ పరిధిలోకి వస్తారన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేసే విలేకరులకు రాబోయే రోజుల్లో సామాజిక భద్రత కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే విలేకరులకు ఇంటి స్థలం కేటాయింపులపై సీఎం, రాష్ట్ర గృహ వసతి శాఖా మంత్రితో చర్చిస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాగా ఈ సందర్భంగా పలువురికి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీసీ లోకేశ్ మాట్లాడుతూ సంఘం సభ్యత్వం ద్వారా రూ.65 లక్షలు సేకరించామన్నారు. విలేకరుల సంక్షేమ నిధికి దీనిని డిపాజిట్ చేశామన్నారు. విలేకరులకు పాస్‌లు, ఆరోగ్యకార్డుల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

శాంతిస్తున్న కృష్ణా, తుంగభద్ర

- ప్రధాన నదుల్లో తగ్గుముఖం పడుతున్న వరద
- ఆల్మట్టి నుంచి 3.5 లక్షల క్యూసెక్కుల విడుదల



టీబీడ్యాం నుంచి 10 గేట్ల ద్వారా వరద నీటి విడుదల

రాయచూరు రూరల్: మహారాష్ట్రతో పాటు కర్ణాటక పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణా, తుంగభద్ర నదుల్లో వరద తీవ్రత క్రమంగా తగ్గుముఖం పడుతోంది. మంగళవారం ఆల్మట్టి నుంచి కృష్ణా నదికి 3.5 లక్షల క్యూసెక్కులు, నారాయణ పుర డ్యాం నుంచి 3 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. అయితే ప్రధాన నదుల్లో వరద ఇంకా ప్రమాదకర స్థాయిలోనే కొనసాగుతున్నా వరద కొంత తగ్గుముఖం పట్టడంతో రైతులు, ముఖ్యంగా నదీ తీర లోతట్టు గ్రామాల ప్రజలు నిట్టూర్పు విడుస్తున్నారు. ఇప్పటికే బెళగావి, బాగలకోటె, విజయపుర, యాదగిరి, రాయచూరు జిల్లాల అధికార యంత్రాంగం వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపట్టారు. యాదగిరి జిల్లా సంగమ, రాయచూరు జిల్లా దేవదుర్గ తాలూకా హువిన హడగి వంతెనపై గుండా ఇంకా నీరు ప్రవహిస్తున్నాయి. దీంతో రాయచూరు, కలబుర్గి, విజయపుర జిల్లాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది.

తగ్గిన తుంగభద్ర వరద

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పలు జిల్లా ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయమైన తుంగభద్రలోకి ఎగువ నుంచి వస్తున్న వరద ఉధృతి కొద్దిగా తగ్గింది. మంగళవారం డ్యాంలోకి 86,327 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో డ్యాం వద్ద మొత్తం 33 గేట్లకు గాను 23 గేట్లను మూసివేసి కేవలం 10 గేట్ల ద్వారా మాత్రమే దిగువకు సుమారు 22,310 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1631.72 అడుగులకు, నీటినిల్వ 100.69 టీఎంసీలకు చేరుకొంది. డ్యాం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద యథావిధంగా కొనసాగుతోంది. డ్యాంకు దిగువ ప్రాంతాల్లో ఉన్న హంపీలోని అనేక మంటపాలు, స్మారకాలు జగదిగ్బంధం నుంచి బయట పడ్డాయి.

రౌడీషీటర్లకు కమిషనర్ క్లాస్

హుబ్లీ: నగరంలోని అతిధి గృహంలో రౌడీషీటర్ల సమావేశం నిర్వహించిన విషయమై తీవ్రంగా పరిగణించిన పోలీస్ కమిషనర్ ఎన్.శశికుమార్ సదరు సమావేశంలో పాల్గొన్న రౌడీషీటర్లకు సుతిమెత్తగా క్లాస్ తీసుకున్నారు. ఇక్కడి క్యాంప్ ఆఫీసుకు పిలిపించుకొని రౌడీషీటర్లను తీవ్రంగా మందలించిన కమిషనర్ ఇకపై ఏదైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో కనిపిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఆయన గతంలో ఎవరెవరు ఏం చేశారో డోషియర్ షీట్‌ను అప్‌డేట్ చేశామన్నారు. ఇటీవల అతిధి గృహంలో సమావేశమైన రౌడీషీటర్ల రాయబారం అంశంపై చర్చించారు. సదరు సమావేశం ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో బాధ్యులైన రౌడీషీటర్లను, ప్రముఖులను పిలిపించిన పోలీస్ కమిషనర్ తీవ్రంగా హెచ్చరించి పంపించారు. డీసీపీ మహలింగ నందబావి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ప్రమాద స్థలంలో మృతుడిని పరిశీలిస్తున్న పోలీసులు

బళ్లారిఅర్బన్: నగరంలోని మోతీ సర్కిల్‌లో ఆర్‌టీసీ బస్సు ఢీకొని ఓ పాదచారి మృతి చెందిన ఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. కౌల్‌బజార్ నివాసి రాజన్న(62) మృతుడు. కట్టడ కార్మికుడైన రాజన్న మోతీ సర్కిల్‌లో నడుచుకుంటూ వెళుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో బస్సు చక్రాల కింద చిక్కుకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. బళ్లారి ట్రాఫిక్ పోలీసులు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని పోలీసులు తెలిపారు. కాగా మోతీ సర్కిల్‌లో సిగ్నల్ ఫ్రీ చేయడం ద్వారా వాహనాలు అడ్డదిడ్డంగా సంచరిస్తూ ఇలాంటి ప్రమాదాలకు కారణం అవుతున్నాయని, ఇలా ప్రమాదాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చదువు ముద్దు.. మొబైల్ వద్దు



గ్రీన్ బోర్డును అందించిన సభ్యులు

రాయచూరు రూరల్: నేటి రోజుల్లో విద్యార్థులు మొబైల్ వినియోగం కన్నా విద్యాభ్యాసానికి ప్రాధాన్యత ఇవ్వాలని వాసవి మండలి, అఖిల భారత ఆర్యవైశ్య మహాసభ జిల్లా సంచాలకురాలు వీణ పేర్కొన్నారు. మంగళవారం దేవదుర్గ తాలూకా మసరకల్‌లోని మొరార్జీ దేశాయి గురుకుల పాఠశాలకు ఐదు గ్రీన్ బోర్డ్‌లు, 500 పుస్తకాలను అందించి ఆమె మాట్లాడారు. విద్యార్థులు ప్రభుత్వ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షురాలు శోభ, శరణ బసయ్య, గాయత్రి, మంజుల, సునీత, ప్రేమలత, లక్ష్మీనారాయణ, జయశ్రీ, సావిత్రి, శ్రీదేవి, పద్మలున్నారు.

జిల్లా జైలర్‌కు వీడ్కోలు

రాయచూరు రూరల్: ప్రభుత్వ ఉద్యోగంలో ఉంటూ పని చేసిన చోట నుంచి మరో చోటకు బదిలీలు సహజమని రామకృష్ణ పరమ హంస మఠాధిపతి వేణుగోపాల్ వెల్లడించారు. సోమవారం రాత్రి జిల్లా జైలులో విధులు నిర్వహిస్తున్న జిల్లా జైల్ అధికారి అందాని రాయచూరు నుంచి బెంగళూరు పరప్పన అగ్రహార జైలుకు బదిలీ అయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. పోలీస్ వృత్తిలో సమాజంలో శాంతిని కాపాడుతూ, బాధ్యతగా పని చేశానన్నారు.